
ఆంధ్ర ప్రదేశ్

అక్టోబర్ 1964


అశ్వయుజ - కార్తీక 1886 శా. శ.

సంపుటి 8 సంచిక 12





ఉహూఁ......నాదీ'



శతాబ్దాలుగా ఆవరించిన అంధకారాన్ని పటాపంచలు చేసి
నిద్రాణమైన జాతిని మేల్కొల్పిన స్వాతంత్ర్యోదయ భానుడు.”

ఆంధ్రప్రదేశ్

సంపుటి : 8 ప్రధాన సంపాదకుడు : టి. రామచంద్రరావు ఆశ్వీన - కార్తిక 1886 శకం

సంచిక : 12 సంపాదకుడు : కప్పగంతుల లక్ష్మణశాస్త్రి అక్టోబరు, 1964

విషయ సూచిక

ముఖచిత్రం : బ్రహ్మణ్యాధాయ కర్మాణి
సంగం త్యక్త్వా కరోతియః
లిప్యతే న సపాపేన
పద్మపత్రమివాంభసా.
(భగవద్గీతా - అధ్యా : 5, శ్లో : 6)

సంవత్సరం చందా – రు. 3–00

విడి ప్రతి రు. 0–25 నయాపైసలు

ముఖ్యమంత్రి లేఖ

ప్రియమైన చదువరీ,

మన రాష్ట్రంలో యిటీవల కురిసిన భారీ వర్షాలు మున్నెన్నడూ కనీ వినీ ఎరగనివి. విజయపురి వద్ద రోడ్డు వంతెనకు సంభవించిన ప్రమాదానికీ; మాచర్లలోనూ, యింకా యితర చోట్లా ఆస్థిపాస్తులకూ, ప్రాణాలకూ సంభవించిన నష్టానికీ నా మనసు ఎంతగానో పరితపిస్తున్నది. కృష్ణా బేసిన్‌లో వరి పంటకు అపారమైన నష్టం వాటిల్లింది అనేక వందల గ్రామాలు నీళ్ళల్లో మునిగి బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా పోయాయి. పూర్తి సర్వే కొనసాగితేనేగాని ఎంత నష్టం సంభవించిందీ యిప్పటిలో అంచనా వేయడం సాధ్యం కాదు.

ఈ వరదల వల్ల నష్టపడిన కుటుంబాల వారికి, శోకసాగరంలో మునిగిన వారికి నా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాను. వరద దెబ్బ తిన్న ప్రాంతాలలో అన్ని విధాలా సహాయపడడానికి ప్రభుత్వం పాటుపడుతున్నది. ఈలాంటి క్లిష్ట సమయంలో ప్రజల కష్టాలనుపాలుపంచుకున్నఅధికారులకు-చిన్నా పెద్దాఅన్న భేదం లేకుండా అందరికీ - నా కృతజ్ఞతల్ని అందజేస్తున్నాను. సహాయపడిన యితర వ్యక్తులకూ, అనధికార సంస్థలకూ కూడా నాకృతజ్ఞతల్ని వ్యక్తంచేస్తున్నాను.

ఆహార ధాన్యాల కొరత సమస్య - అది మరీ అంత ఎక్కువగా లేకపోయి నప్పటికీ - యీనాడు ప్రముఖ స్థాన మాక్రమించింది. ఇది సంధి కాలం. కొంతమంది మిత్రులు ప్రస్తుత పరిస్థితిని ఆసరాగా చేసుకుని ప్రజలను సమ్మెలకు పురికొల్పుతున్నారు. ఇది నిజంగా దురదృష్టకరమైన విషయం. ఈ పద్ధతుల వల్ల ఏ సమస్యా పరిష్కారం కానేరదు. ప్రస్తుత పరిస్థితిని ప్రజలు పూర్తిగా అర్థంచేసుకుని, యీ క్లిష్ట పరిస్థితులను అధిగమించడంలో అన్నివిధాలా ప్రభుత్వానికి తోడ్పడవలసివుంది.

1963 సంవత్సరం కొంత ఆందోళన కలిగించింది. ముఖ్యమైన ఆహార ధాన్యాలు — వరి, గోధుమ-యీ రెండు పంటలూ అననుకూల వాతావరణ పరిస్థితులు కారణంగా దిగుబడి తగ్గిపోయింది. దేశంలో కొన్నిచోట్ల వర్షాలులేక, మరికొన్ని చోట్ల అధిక వర్షాలవల్లా 1963-64 సం॥లో వరి పంట దెబ్బతింది. విత్తులు చల్లేప్పుడు వర్షం చాలక, ఆ తరువాత శీతాకాలపు వర్షాలు కురవక గోధుమ పంట కూడా దెబ్బతింది.

1963 సం॥లో భారత దేశం 183 కోట్ల రూపాయలు ఖరీదు చేసే ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకుంది. అంటే 1962 కన్నా 42 కోట్ల రూపాయలు అధికం అన్నమాట. మొత్తం దిగుమతి చేసుకున్న 45.6 లక్షల టన్నులలోనూ 40.73 లక్షల టన్నులు గోధుమలూ, 4.83 లక్షల టన్నులు బియ్యమూ వున్నాయి.

సరే. మరొక విషయాన్ని గూర్చి పరిశీలిద్దాం. కొన్ని అత్యవసర ఆహార పదార్థాల ధరలు పెరగడానికిగల అసలు కారణాలు ఏమిటి? అభివృద్ధి కార్యకలాపాలపై చేసే ఎక్కువ వ్యయమూ, పారిశ్రామిక కార్యకలాపాల విస్తృతీకరణ, ఆదాయాల్లో పెరుగుదల, ఉద్యోగావకాశాల విస్తరణ, జన సంఖ్య పెరుగుదల, పట్టణాల ఏర్పాటు - యివన్నీ మన అవసరాల్ని అధికం చేశాయి.

పెరుగుతున్న అవసరాలతో బాటుగా వ్యవసాయోత్పత్తి పెరగడంలేదు.

ఒక్క వరిపంటే కాదు గోధుమ, ప్రత్తి, చెరకు, జనుము-అన్నీ కూడా విదేశాలతో పోలిస్తే చాలా తక్కువే. మన ఉత్పత్తిని అమెరికా, జపాను దేశాల్లోని ఉత్పత్తి స్థాయికి పెంచడం సాధ్యం కాకపోవచ్చు. కాని, సరియైన పద్ధతులను అనుసరించి ఏటా ఎకరం రాలుబడిని తగినంతగా పెంచడం మాత్రం కష్టమైన పనేమీ కాదు.

ఈనాడు ఆహార ధాన్యాల ఉత్పత్తిని అధికం చేయాలంటే భారత దేశంలోని అన్ని ప్రాంతాల రైతులూ శాస్త్రీయ పద్ధతులను చేపట్టాలి.

వ్యవసాయదారులు అధునిక పద్ధతులను అమలుపరచాలి. మేలుజాతి విత్తనాలను, ఆధునిక ఉపకరణాలను, ఎరువులను వుపయోగించాలి.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికిగల ప్రాముఖ్యతను గుర్తించి, రాష్ట్రంలోని వ్యవసాయ కార్యకలాపాలపై వెచ్చించే ఖర్చును ప్రణాళికా కాలంలో పెంచడం జరిగింది. తొలి పంచవర్ష ప్రణాళికలో మొత్తంఖర్చు రూ. 96.78 కోట్లకూ 12.7 శాతం మేరకు - అంటే సుమారు రూ.12.30 - కోట్లు వ్యవసాయ కార్యక్రమాలమీద వెచ్చించడం జరిగింది. ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో అన్ని పథకాల మీదా వెచ్చించిన ఖర్చు రూ. 188.60 కోట్లలోనూవ్యవసాయ కార్యక్రమాలపై 19.7 శాతం మేరకు అంటే రూ. 37.14 కోట్లు వెచ్చించబడింది. తృతీయ ప్రణాళికలో వ్యవసాయానికి సంబంధించిన కేటాయింపు చాలా ఎక్కువే వుంది. సవరించబడిన ప్రణాళికా కేటాయింపు రూ. 312.66 కోట్లలో సుమారు రూ. 79.84 కోట్లు వ్యవసాయ కార్యక్రమాలకు కేటాయించబడ్డాయి. ప్రణాళికలోని మొత్తం పథకాలన్నిటికీ ఉద్దేశించిన కేటాయింపులో వ్యవసాయ కార్యక్రమాలకు ఉద్దేశించిన కేటాయింపు 25.5 శాతం వుంది. పై లెక్కలలో భారీ, మధ్యతరహా నీటి పారుదల ప్రాజెక్టులను చేర్చలేదు.

భారతదేశంలోని రైతుల్లో పదిశాతం కూడా యీనాడు ఎరువుల్ని వాడడంలేదు. దక్షిణాది రాష్ట్రాలలో నేయీ వాడకం

ఎక్కువగా వుంది. ఎరువుల వాడకం సమగ్ర కార్యక్రమాన్ని మనం చేపట్టవలసివుంది. ఆర్థికాభివృద్ధికి, ముఖ్యంగా వ్యవసాయానికి సంబంధించిన ఆర్థిక ప్రగతికి, ఎరువులు మిగుల దోహదకారులు. ఆధునిక శాస్త్రీయ వ్యవసాయానికి తగినంతగా సరియైన ఎరువులు వుండాలి. అవి లేకపోతే కేవలం విత్తనాలు, పరికరాలు, కార్మికుల శక్తి ఎంత ఉన్నత స్థాయికి చెందివున్నప్పటికీ గరిష్ఠ ప్రయోజనాలను సాధించడం సాధ్యంకాదు. భారతదేశపు రైతులు కొంతమంది ఎరువులను వుపయోగించడంద్వారా పంట దిగుబడిని ఎనిమిది రెట్లకు పెంచగలిగారు. అయితే ఆ విధమైన సంఘటనలు తరచుగా కనిపించవు. అరుదుగా చెదురు చెదురుగా అక్కడక్కడ జరుగుతాయి. ఇంతకూ చెప్పేదేమిటంటే అవసరంమేరకు ఎరువులను ఉపయోగించడం లేదని. రాష్ట్ర వ్యవసాయశాఖ, రైతులకు వ్యవసాయ విజ్ఞానాన్ని అందజేయడంలో కొంత పరిమితి మేరకు మాత్రమే వెళ్ళగలదు. ఆ తరువాత మిగిలిన భాగాన్ని రైతులే తమంత తాముగా పూరించుకోవలసి వుంది. తమకు కావలసిన ఎరువులను పొందే విషయంలో గ్రామ, సమితి, జిల్లా స్థాయిల్లో లభించే సౌకర్యాలను రైతులే వినియోగించుకోవాలి.

ఆంధ్రప్రదేశ్‌లో అన్ని పైర్లకూ సాలీనా దాదాపు 7,65,000 టన్నుల నత్రజని, 2,90,700 ఫాస్ఫోరిక్ ఆసిడ్, 7,97,000 పొటాష్ పోషక పదార్థాలు అవసరం అవుతాయని అంచనా వేశారు. అయితే యీ పోషక పదార్థాలుగల వివిధ ఎరువులు, 3,43,740 టన్నుల నత్రజని, 1,19,340 టన్నుల ఫాస్ఫోరిక్ ఆసిడ్, 2,04,000 టన్నులపొటాష్ యిప్పుడు లభ్యమవుతున్నాయని అంచనా వేశారు. భూసార గరిష్టస్థాయిని సంరక్షించడానికి ప్రస్తుతం సేద్యం పద్ధతిలో ఇతోధిక ఎరువులు అవసరం అవుతాయి.

అధికాహారోత్పత్తిని సాధించడానికి మరో పద్ధతి మేలురకం విత్తనాల వాడకం. యీ విధానంవల్ల 10 నుంచి 20 శాతం ఉత్పత్తిని ఎక్కువ చేయవచ్చు. కొన్ని సంవత్సరాలలో ఇంతకన్నా ఎక్కువ ఉత్పత్తిని సాధించవచ్చు. ప్రణాళికల అమలు ప్రారంభించిన తర్వాత మేలు రకం విత్తనాలు సరఫరా చేయడం, వాటిని తగు రీతిగా వాడాలని రైతులకు ప్రబోధించడం వంటి ప్రోత్సాహకరమైన చర్యలను రాష్ట్ర వ్యవసాయశాఖ తీసుకుంటున్నది. ఈ విషయంలో అభివృద్ధి బ్లాకులుకూడా చెప్పుకోదగిన కృషి చేశాయి. మూడవ ప్రణాళి కాలానికి మేలురకం విత్తనాల వాడకంద్వారా అదనంగా 3.6 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తిచేస్తారు.

భూమిపై ఎక్కువ పైర్లను పెంచడంతో వ్యవసాయ సమస్యలు పరిష్కారం కావనే విషయం తెలిసిందే. పంట బాగా వున్నప్పటికీ అనేక క్రిమికీటకాలు, తెగుళ్ళవల్ల అది దెబ్బతినవచ్చు. ఈ విధంగా సాలీనా క్రిమికీటకాలు, తెగుళ్ల వల్ల 10 నుంచి 20 శాతం పైర్లు దెబ్బతింటున్నాయని అంచనా వేశారు.

భారత వ్యవసాయ పరిశోధన సంస్థ కేంద్రబియ్యం పరిశోధన సంస్థవంటి అనేక పరిశోధనా సంస్థలను ప్రభుత్వం నెలకొల్పింది. పైర్ల తెగుళ్లను నిరోధించే శక్తిగల మేలురకం విత్తనాలను కనుగొనడం, క్రిమికీటక సంహారక మందులు, తెగుళ్ళ నివారణ మందులను కనుగొనడంలో పరిశోధనలను కొనసాగించడం యీ సంస్థలు నిర్వహిస్తున్నాయి. మూడవ ప్రణాళికాలానికి ఆంధ్రప్రదేశ్‌లో పైర్ల సంరక్షణద్వారా అదనంగా 1.63 లక్షల టన్నుల ఆహార ధాన్యాల్ని ఉత్పత్తి చేయవచ్చని ఆశిస్తున్నారు.

వచ్చే సంవత్సరం "లిఫ్ట్ ఇరిగేషన్" ద్వారా ఒక లక్ష ఎకరాల భూమిని సాగులోకి తెచ్చే రు. 5 కోట్ల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించింది.

ఆహారోత్పత్తిని అధికం చేయడానికి తీసుకుంటున్న, తీసుకోనున్న కొన్ని చర్యలను నేను వివరించాను. ఇక పంపిణీ విషయంలో పంపిణీ పద్ధతులు ఎంత సమర్థవంతంగా అమలు జరిపినప్పటికీ ఉత్పత్తి చేసినదాన్ని మాత్రమే ప్రభుత్వం పంపిణీ చేయగలుగుతుందని నేను చెప్పగలుగుతాను. ప్రస్తుత ఆహార క్లిష్ట పరిస్థితిని చక్కచేయడంలో వినియోగదార్ల, ఉత్పత్తిదార్ల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని ప్రతిపాదిత రాష్ట్ర ఆహార పదార్థాల ట్రేడింగ్ కార్పొరేషన్ తగిన చర్యలు తీసుకుంటుంది. ధాన్యాల వ్యాపారంపై కంట్రోలు నిర్వహిస్తూ, వ్యవసాయ ధరల కమిటీ నిర్ణయించిన ధరలకు ఎక్కువ మొత్తంలో ధాన్యాలను కొనుగోలు చేస్తుంది. 1957వ సం॥లో ఆహార ధాన్యాల పరిశీలనా సంఘం ఇలా అంది "టోకు వర్తకంపై సమాజం కంట్రోలు ఉండనంతవరకూ ఆహార ధాన్యాల ధరలను నిలకడగా ఉంచడం మనకు సాధ్యంకాదని యీ సందర్భంలో మేము నొక్కి చెప్పదలచాము." ఆహార రంగంలో స్పెక్యులేషన్ అంశాలను ఆహార ధాన్యాల కార్పొరేషన్ తొలగిస్తుంది. జా కమిటీ సిఫార్సుల ప్రాతిపదికపై ఖరీఫ్ పంట నిమిత్తం ఆహార ధాన్యాల ధరలను నిర్ణయించి 1964 అక్టోబరు 15వ తేదీలోగా ప్రకటించాలనికూడా భారత ప్రభుత్వం నిశ్చయించింది.

లభ్యమయ్యే ఆహార ధాన్యాలను తగిన విధంగా పంపిణీ చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నాయి. ఆందోళన చెందాల్సిన అవసర మేమీ లేదు.

రైతు, సమాజాభివృద్ధి అధికారి, విజ్ఞాన శాస్త్రజ్ఞుడు—ప్రతి ఒక్కరూ రానున్నకొన్ని సంవత్సరాలపాటు ఆహారోత్పత్తిపై తమ కృషిని కేంద్రీకరించాలి. అభివృద్ధేతర, ప్రతిఫలంలేని ఖర్చులను కనిష్ట స్థాయికి తగ్గించాలి.

నెహ్రూజీ మాటల్లో "వ్యవసాయం ఇప్పటికీ మనకు కీలక సమస్యే. ఈ విషయంలో మన కృషి యేమాత్రం సడలినా అది మన ప్రణాళికకు పెద్ద దెబ్బగా పరిణమిస్తుంది. వ్యవసాయ ఉత్పత్తులను అధికం చేయడానికి మనం చెమటోడ్చి తీవ్రకృషి చేయాలి. లేకుంటే ప్రణాళిక అమలు జరుపలేము. మార్గాంతరం కూడా లేదు. విజయం తప్పకుండా మన చేతిలో ఉంది"

భవదీయుడు,

బాపూజీ

కొత్త సత్యనారాయణచౌదరి

మోహనదాసుగాంధి జగమున్ నడపింపఁగ నేర్చి పెద్దగా
వ్యూహము వన్ని దేశముల కోరిమి నేర్పెఁ; బ్రపంచమెల్ల న
త్సాహముతోఁ బదింబదిగ సర్వవిధాలఁ దదీయసూక్తు ల
వ్యాహతి నాలకింపను బ్రియంపడి మ్రొక్క నుమూఁగునిచ్చలున్.

ఏఁబదియేండ్లు పాటువడి యీతఁ డొనర్చిన దేశసేవ సం
ఖ్యాబహుళంబుగా ఫలము లందఱ కన్నివిధాలఁ బంచె — నా
పై బలవంతులై వివిధవర్గము లొక్కటఁ గూడిమాడి గా
రాబును జూపనేర్చియు స్వరాజ్యము వొందిరి సౌమ్యపద్ధతిన్.

లాఁతివిలాతు లాక్రమణలన్ బొనరించి సమస్తహైందవ
వ్రాతము నూఁచముట్టుగ గరాసులు వోలె గ్రసింప - దేశ మీ
యాతనలో నహర్నిశ మనంతవిధాలఁ గృశించి నీతియున్
రీతియుఁ బాసె సంపదలు క్రిందయి మీఁదయి పల్లటిల్లగా.

చదువులు మాఱిపోయెఁ జవిసారములేని ప్రవర్తనంబులోఁ
గుదిరెను బుద్ధు — లంతవఱకుం గలధర్మము లెల్ల స్వామ్యమున్
బ్రిదిలి యపూర్వవైఖరులు రేఁగి స్వరూపము మార్చివైచె; ని
య్యదనునగాంధియుద్భవమునందెమహామహితాత్మమూర్తియై.

దేశము నాల్గువైపుల విదేశ్యపరిస్థితి వేరు దన్ని యా
కాశము నంటి, యావల వికావికలై బెగడొందు జాతికిన్
గ్లేశముఁ బెద్దగూర్చెఁ; బరికించెడి నాథుఁడు లేక జీర్ణప
ర్ణాశనులై వగర్చిరి ప్రజావళి యాలన లేని యేల్బడిన్.

తన భాషన్ గుఱుతింపనేరఁడు నిరాధారస్థితిన్ బ్రుంగి మ్రొ
గ్గినవాఁడై మొదలంట రూపఱి పరీక్షింపంగఁ బోఁ డిట్టి ద
య్యేను నాకంచును; భారతీయుఁడనుమాటేరోఁతగానాయె నే
మని వర్ణింపఁగవచ్చు నాటిదశ యేహ్యాం బన్నచోఁ జాలదా ?

ఒకనికిఁ గాళ్లు మ్రొక్కి సమయోచితవేషము వైచి పాపజీ
విక నడుపంగఁ బూనుచు వివేకముజోలియె యెత్తఁబోరు;పాం
దిక యగు వర్తనం బసలు దేశములోఁ గఱవాయె నన్న త్రో
వకుఁ గొనివచ్చి రన్యపరిపాలకు లియ్యెడఁ గాలు వెట్టుటన్.

ఎవనికి వాఁడు స్వార్థమునకే తలయొగ్గి పురాతనంపుఁ బ్రా
భవమును గోలుపోయె:-నది భావ్యము గాదనిమూదలించు మా
నవుఁ డొక ఛాందసుండయి కనంబడు; నింతకు నిట్టి దేశ మి
ట్లవునని యెవ్వఁడేనిఁ గలనైనఁ దలంపఁగఁబోవఁ డిమ్మహిన్.

మానసపుత్త్రులై యునికి మాఱి క్రమంబున విఱ్ఱవీఁగి యే
గానికిఁ గానివారె పయిగా దొరలై తమ సాటిజాతినే
బానిసజాతి యంచు నుడువందలపెట్టిరి ; దాని నూఁతగాఁ
బూని 'పరాయి' జాతి గఱపుల్ గఱపంగను జొచ్చి రిచ్చటన్.

ఎవఁడో చెప్పిన మాట వేదమయిపోయెన్-వేషభాషాది వై
భవముల్ క్రిందయిరూపుమాసె-ధనలాభంబొందుగాంక్షించి యు
క్కివులై పోయిరి యేలికల్ : ప్రజల కేకీభావమే వోయి శా
త్రవులం గూర్చె - సమష్టిజీవనము దూరం బాయె నీభూమిలో.

బురుజులు కోటగోడతలుపుల్ మెలపైన పదాతివర్గ మే
దైఱదుఱుసైన సైన్యము కడిందిచమూతుపలోలి స్వాస్థ్యముం
దొఱఁగి 'పరాయి' జీవికడ దోయిలి పట్టఁగసాగి; రిట్టి దు
ర్భరదురవస్థకున్ గతము భారతజాతి యనైక్యమే గదా!

పల్లెలు పత్తనంబులు విపర్యయ - దుస్స్థితి బ్రుంగి క్రుంగి రూ
పెల్లయు మాఱి యల్లరుల కిల్లయి పోయె నదేమికర్మమో !
కొల్లలుగాఁ గనంబడెడి కోట్లధనంబు 'పరాయి' చేతిలో
నిల్లడ యయ్యె; దేశమున కిట్టి పరిస్థితి రాక తక్కునా.

భారతరత్నగర్భ, పరిపాలకు లన్యులు గావుటన్ దిర
స్కారము లెన్నియో పడయసాగె; దరిద్రుల కాటపట్టులై
ఘోరవిచిత్రదుర్దశలఁ గుందు విలాతులు భాగ్యరాశి నిం
డారఁ దలిర్చె-నిందుఁ బరమార్థ మెఱుంగను బూనఁ డొక్కఁడున్.

కూటికి గుడ్డకై పరుల కొంపకుఁ బోవని 'భారతమ్మ' నా
నాఁటికి శోచనీయపరిణామము వొంది వగర్చె యొక్క తో
డ్పాటును లేక తాను నిలువంగల యోపిక లేక వట్టి యా
ర్భాటము వెల్వరించుచుఁ దిరంబగు దాస్యములోన మున్గినన్.

మనచరిత్ర-సంస్కృతి

ఆధునిక తెలుగు సాహిత్యం

—అమరేంద్ర

ఆధునిక రష్యా సాహిత్యం పుష్కిన్ కలంలోంచి జాలువారిందని చెప్తారు. అయితే అదే మాదిరిగా ఆధునిక తెలుగు సాహిత్య నేతృత్వాన్ని ఏ ఒక్క వ్యక్తికీ అంటగట్టడం అంత సమంజసం కాదు. సాహితీరంగంలో ఎందరెందరో ప్రసిద్ధ సాహితీద్రష్టలు ఆవిర్భవించారు. వారిలో కొందరు ఆధునిక తెలుగు సాహిత్యానికి కొత్తబాటలు వేశారు. కందుకూరి వీరేశలింగం పంతులుగారి సంస్కరణోత్సాహం, ఉద్యమనిర్మాణ దక్షత తెలుగు సాహిత్యానికి కొత్త జీవం పోశాయి. మూఢవిశ్వాసాలు, అజ్ఞానం, అలక్ష్యం, దుర్మార్గం, అవినీతి మొదలయిన వాటిని చీల్చిచెండాడడానికి చేపట్టిన పదునైన ఆయుధంగా సాహిత్యం ఆయనచేతుల్లో రూపొందింది. సాంఘిక దురాచారాలను తుడిచివేయడానికి కంకణం కట్టుకున్న వీరేశలింగంగారు ''జీవితంలోని ఉత్తమోత్తమ గుణాలను వెలికితీయడంలోనూ; సత్యాన్నీ, న్యాయాన్నీ అభిమానించడంద్వారా మొత్తంమీద జీవితంలోని మంచిపై మక్కువ కలిగించడంలోనూ సాహిత్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించారు. తొలిరోజుల్లో వీరేశలింగంపంతులుగారు సాంప్రదాయ సిద్ధమైన, పాండితీ ప్రకర్షతో కూడిన రచనలు చేసినప్పటికీ తర్వాత తర్వాత గద్యరచనలో సూటిగా చెప్పే ప్రయోజనాత్మకమైన శైలిని అవలంభించారు. ఆధునిక భావస్రవంతిని అడ్డగించడానికై తమ జీవితకాలమంతా హోరాహోరీగా పోరాడే పరమఛాందసులనూ, సనాతనులనూ తన ప్రహసనాల్లో అవహేళన చేశారు. ఆత్మకథలో ఎంతో యథార్థంగా తన మనోభావ పరిణామాలనూ, ఆత్మ వికాసాన్నీ వీరు పొందుపరిచారు. తెలుగులో ఆత్మకథలకు వీరేశలింగంగారే నాంది పలికారు. వీరి "సత్యరాజు యాత్రలు" పాఠకులను విపరీతంగా ఆకర్షించాయి. కొంతమంది పాఠకులు అందులోని నాయకునిపాత్ర వాస్తవ జీవితానికి సంబంధించిన వ్యక్తి జీవితమే అనే అభిప్రాయంతో, ఆ వ్యక్తి చిరునామా కావాలని పట్టుపట్టారట. వీరి సత్యవతి కథ ఎంతో ఆదర్శవంతంగా వుంది. కొంతమంది తల్లిదండ్రులు ఆ పేరును తమ కుమార్తెలకుకూడా పెట్టుకున్నారు. ఇంగ్లీషులో జాన్సన్ రచించిన విధంగా తెలుగులో వివిధ కవుల జీవితాలను, వారి కావ్యాలను గురించిన విమర్శతో సహా మొట్టమొదటిసారిగా రచించినది ఈయనే. కాళిదాసు రచనల్లో ఆణిముత్యం అనదగ్గ 'అభిజ్ఞాన శాకుంతలం,' నాటకాన్ని ఎంతో సమర్థవంతంగా అనువదించారు. దీనినిమించిన రచన యీ నాటికి కూడా రాలేదు. వివిధరంగాలలో వీరేశలింగం గారు నిర్విరామకృషి చేసి, అనేక ఘన విజయాలు సాధించారు. అధిక సంఖ్యలోని వీరి రచనలు, ఇతివృత్తాల్లోని వైవిధ్యం, వ్యక్తీకరణలో సూటిగా ఘాటుగా చెప్పేతీరు-వీటివల్ల వీరు గద్య తిక్కన బిరుదాంచితులయ్యారు. కామాలు, ఫుల్‌స్టాపులు లేక తెలుగు వచనరచన గజిబిజిగా అల్లుకుని వుండే రోజుల్లో అందంగా, క్రమబద్ధంగా పేరగ్రాపులతో కామా, ఫుల్‌స్టాఫ్, సెమికోలన్, కొటేషన్ ఆదిగా గల విరామ చిహ్నాలతో గద్యాన్ని చిన్నయసూరి తీర్చిదిద్దారు. ఆ గద్యానికి లాలిత్యాన్నీ, సొగసునూ, పటుత్వాన్నీ, ప్రయోజనాన్నీ కల్పించారు వీరేశలింగంపంతులుగారు. నిస్సందేహంగా వీరిని తెలుగుగద్యరచనా పితామహులు అనవచ్చు. ఇంగ్లీషు గద్యరచనలో వినుతికెక్కిన డ్రైడెన్‌తో వీరిని పోల్చవచ్చు.

గురుజాడ అప్పారావుగారు వ్రాసినది చాలా తక్కువే అయినా ఆయన ప్రభావం సాహిత్యంమీద విపరీతంగా పడింది. సుదీర్ఘమైన సమాసాలను ఒకదానితో ఒకటి కలుపుకుంటూ, పదకోశాల్ని తిరగేసే అవసరాన్ని కలిగిస్తూ తమ పాండిత్య ప్రకర్షను వ్యక్తం చేసుకునే సాహిత్యాడంబరుల సంస్కృత సమాస పదభూయిష్టశైలి వీరికి ఏవగింపు కలిగించింది. తెలుగు గద్యంలో అతిగా ఆడంబరంకోసం వేసే పాతబడిపోయిన సంస్కృత పదాలు ఉండకూడదనీ, వాడుకభాషకు అత్యంత సన్నిహితంగా వుండాలనీ, ఆ భాషే దానికి ఊపిరి పొయ్యాలనీ గట్టిగా వాదించారీయన. అప్పారావుగారి దృష్టిలో తెలుగు భాషంటే నిత్యజీవితంలో మనం వాడే భాష అని. ఈ భాషలో మన కష్టసుఖాల్ని వ్యక్తం చేసుకోవడానికి ఏమాత్రం మనం వెనుకాడడం లేదుగదా. శైలి అంటే బంధాలు కావాలనుకునే

వారిపైన సంప్రదాయం విధించిన ఒక విధమైన అంకుశం అని వీరి అభిప్రాయం. సంఘంలోని చీకటికోణాల్ని వెలుతుర్లోకి తెచ్చి చూపించి, నైతిక విలువల్ని పరిరక్షిస్తూ, వాటిని ఉన్నతస్థాయికి తీసుకురావడంకన్న మించిన ప్రయోజనం సాహిత్యానికి లేదన్న నమ్మకంతో వాడుక భాషలో 'కన్యాశుల్కం' అనే గొప్ప నాటకాన్ని వీరు వ్రాశారు. కవిత్వంలో కూడా వీరొక కొత్త మార్గాన్ని తొక్కారు. విజయనగర రాజాస్థానంలో ఆడంబరాలమధ్య, ఐశ్వర్యదేవత చల్లని చూపు క్రింద కాలం గడిపినప్పటికీ సామాన్యుని జీవితంలోంచే తన రచనలకు కథా వస్తువును ఎన్నుకున్నారు. అలా ఎన్నుకున్న వస్తువును సజీవమైన వాడుక భాషలో అందంగా మలచారు. వర్డ్స్‌వర్తు లాగే వీరు కూడా హృదయాన్ని కదిలించివేసే తన కథలకు నాయికా నాయకులుగా అతి నిరాడంబరులు, వినయశీలురు అయిన సామాన్యులను ఎన్నుకున్నారు. పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, కన్యక, లవణరాజు కలలోని నాయికా సామాన్య కుటుంబాలలోనుండి వచ్చిన వారే. అణగారిపోయిన జీవితాలపై వీరి సానుభూతిని వ్యక్తం చేసే పాత్ర మధురవాణి. వస్తువులో, శిల్పంలో గురజాడ అప్పారావుగారి కవిత వర్డ్స్‌వర్తు పద్యాలను పోలివుంటాయి. పాతకాలపు వర్ణనల్నీ, నిజమైన కవితావేశాన్ని అణగద్రొక్కేసే కొరుకుడుపడని శైలిని వీరు వదిలివేశారు. వీరి కవిత హృదయాంతరాళంలోంచి పెల్లుబికి వచ్చినట్లుంటుంది. సులభంగా పాఠకుడి హృదయాన్ని ద్రవింపజేస్తుంది. వస్తువును వాస్తవ జీవితంలోంచే ఎన్నుకున్నప్పటికీ దానికి వీరు ఊహల కుంచెలతో రంగులు అద్దుతారు. వీరి కవిత్వం సర్వమానవ సంక్షేమ భావాలను ప్రకటిస్తుంది. స్నేహసౌహార్ద్ర పరిమళాలు గుబాళించే వసుధైకకుటుంబం ఏర్పడాలన్నది వీరి ఆకాంక్ష. గతకాలపు ప్రాభవాలను నెమరువేసుకుంటూ కూర్చోవడం మాని, వినాశకరమైన దుష్టశక్తుల కౌగిట్లోంచి బైటపడి, మానవత్వపు విలువలు, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు వర్ధిల్లుతాయనే కొండంత ఆశతో, ఆత్మవిశ్వాసంతో భవిష్యత్తులోకి దృష్టి సారించారు. భవిష్యత్తును గురించి మధురమైన కలలు కంటూ, జారిపోయిన పూర్వౌన్నత్యాలకు మళ్ళీ రంగులు పులమకుండా ఆ రెండింటినీ కలిపే పాత కొత్తల మేలు కలయికనే వీరు మనసారా కోరారు. వీరి రచనల్లోని వస్తువు, శైలి, శిల్పం—అన్నీ అక్షరాలా ఆధునికములే. హృదయాన్ని స్పందింపజేసే సజీవమైన తెనుగు పదాలను గౌరవించే కవితా ప్రియులందరూ లలిత సుందరఝరీ సదృశమైన జానపద లాలిత్యపు సొగసులు వెల్లివిరిసే వీరి 'ముత్యాల సరా'లను అభిమానిస్తారు. వర్డ్స్‌వర్తువలెనే యీయన కూడా మాటల గారడీతో, కృత్రిమ సాంప్రదాయాలతో చేసే కవిత్వపు సాము గరిడీలకు దూరంగా తప్పుకొని, నిరాడంబరమైన, వాస్తవికమైన ఒక కొత్త దృక్పథానికి వైతాళికుడైనారు. మనం కలలుగన్న భారతదేశానికి రూపకల్పన చేసే నిర్మాణాత్మక కృషిని ప్రబోధిస్తూ వీరి "దేశభక్తి" గేయం ఉత్తేజోత్సాహాలను కల్పించింది.

"కృత్రిమమైన ఎల్లలతో ఖండ ఖండాలుగా విభజింపబడని" ఉజ్జ్వలమైన వసుధైక కుటుంబాన్ని రూపొందించే ప్రజల కృషినీ, దాని గొప్పతనాన్నీ వీరు ఆకులందున అణగిమణగి గళమెత్తి శ్రావ్యంగా గానం చేసే కోకిలమ్మవలె గొంతెత్తి పాడారు.

తొలి ఆంధ్ర ఆస్థానకవి చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారూ, వారి సహచరులు తిరుపతిశాస్త్రిగారూ ఆశువుగా చెప్పే 'అవధాన' ప్రదర్శనల ద్వారా కవిత్వాన్ని విరివిగా ప్రచారం చేశారు. సరళంగా, సులభగ్రాహ్యంగా పద్యరచనచేసి, కవిత సామాన్యుడికి కూడా అర్థమయ్యేట్టు చేశారు. కవిత్వపు పరిధిని విస్తృతపరిచి, కవితావస్తువులో వైవిధ్యాన్ని చూపించి, విద్యావంతులైన వారిలో సాహిత్యం మీద అభిరుచినీ, ఆసక్తినీ కలిగించారు. వీరి రచనల వల్ల ప్రజల దృష్టి తెలుగు సాహిత్యంలోని నిగనిగల సొంపువైపు మళ్ళింది.

పద్యరచనలో వీరికిగల అద్వితీయమైన ప్రతిభ, భావ ప్రకటనలోగల అసాధారణ నైపుణ్యం అనేకమంది పండితులను, కవులను ఆకర్షించాయి. వారి పద్యాలతో ప్రభావితులై ఎంతోమంది కవులూ, పండితులూ తెలుగు సరస్వతి కంఠసీమను క్రొంగ్రొత్త సాహితీ కుసుమాలతో అలంకరించారు. వీరి ఇతివృత్తమూ, శైలీ సంప్రదాయ పద్ధతులనే ఆశ్రయించినప్పటికీ నిజానికి, వీరి రచనలు ప్రజలలో సాహితీ పిపాసను రేకెత్తించి, ఆధునిక భావ భాగీరథీ శుభ్రజలాలతో తెలుగు గడ్డను పునీతం చేయడానికి దోహదకారులయ్యాయి.

పద లాలిత్యాన్నీ, అర్థగౌరవాన్నీ శ్రావ్యమైన శైలినీ, సుందరమైన భావాలనూ చొప్పిస్తూ రాయప్రోలు సుబ్బారావుగారు నిష్కామ ప్రేమ యితివృత్తంగా తీసుకుని ఖండకావ్యాలు వ్రాశారు. ప్రేమ భావాన్ని శృంగారంతో ముడిపెట్టే సంప్రదాయ విధానాన్ని తప్పించి, ఆదర్శ ప్రేమ తత్త్వంవైపు మొగ్గుచూపారు. స్వర్ణయుగంగా వెలిగిన ఆంధ్రుల చరిత్రను జ్ఞప్తికి తెస్తూ దేశభక్తిని పురికొల్పుతూ వీరు వ్రాసిన పాటలూ, పద్యాలూ ప్రతి తెలుగువాని హృదయంలోనూ ప్రతిధ్వనించాయి. "చావలేదు చావలేదు ఆంధ్రుల మహోజ్జ్వల చరిత్ర హృదయములు చీల్చి చదువుడోయి..." అంటూ ఎలుగెత్తి చాటారు యీయన. పండితుల ఆక్షేపణలనూ, వ్యతిరేక భావాలనూ

గణించక ముందుకు పోయి ఒక సరికొత్త రచనా విధానానికి ఆద్యులైనారు. ఆదర్శవాద ధోరణినీ, గేయమార్గన్నీ మేళవించి ఒక కొత్త సొగసునూ, లాలిత్యాన్నీ తెలుగు పద్యానికి సంతరింపజేసి, అపురూప లావణ్యాన్ని ఆవిర్భవింపజేశారు.

తరువాత కాల్పనికోద్యమం ప్రారంభమయ్యింది. ఇంగ్లీషు కాల్పనిక కవుల రచనల ప్రభావం, గురుదేవ్ ఠాగూర్ రచనల ప్రభావం, బౌద్ధపురాణ గాథల ప్రభావం, జాతీయోద్యమ ప్రభావం మన కవులపై బాగా పడింది. ఈ కాల్పనికోద్యమ కవులు ఆత్మాశ్రయకవితా పద్ధతిలో హృదయాంతరాళాలలోకి చొచ్చుకుపోయే, గాఢమైన అనుభూతిని కవిత్వంలో ప్రకటించారు. వీరు ఆదర్శ ప్రేమ భావాన్ని ప్రవచించారు. సృష్టిని రసమయ జగత్తుగా, సౌందర్యరాసిగా దర్శించారు. కవితా గుణాలను వెనుకకు నెట్టివేసే అలంకారాది యితర ప్రక్రియలకంటే ఎక్కువగా హృదయావేశానికే, అనుభూతికే ప్రాధాన్యం యిచ్చారు. కాల్పనికోద్యమ కాలంలో ఎన్నో కొత్త గొంతులు వినిపించాయి. తెనుగు కవితలో కొత్త ఫణితులు కనిపించాయి.

స్వామిశివశంకరశాస్త్రి సాహితీ సమితిని ప్రారంభించడంతో క్రొత్త దృక్పథానికి ప్రోత్సాహం లభించింది. ఆయన "హృదయేశ్వరి" పూర్వ కవితా పద్ధతుల సొగసును ప్రదర్శించడమేగాక కాల్పనికరచనాశైలిని అభివ్యక్తం చేసింది. కాల్పనికోద్యమంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి ఒక పరిమళభరిత పుష్పం. గేయరచనా సౌందర్యం, పదలాలిత్య సౌరభం ఆయన సొమ్ము.

ఆయన "కృష్ణపక్షం" "ఊర్వశి" "ప్రవాసం" కావ్యాలలో అస్పష్టమైన వేదనామాధుర్యం నిండి ఉన్నది. లలితంగాఉండి హృదయాన్ని స్పందింపజేసే గేయాలను రచించడంలో ఆయనను మించినవారు లేరు. పుష్పం తన పరిమళ మాధుర్యాన్ని వెదజల్లినట్లు గేయకవితలో ప్రతి పలుకులో రసాస్వాదన చేయించే "స్వచ్ఛమైన కవి" ఆయన. కాల్పనిక యుగానికి ఆయనే నాయకుడు. బాధలు, వేదనలు, కన్నీళ్ళు, నిట్టూర్పులు ఆయన కవితావస్తువులు. ఆయన కిరీటధారియై ఉద్వేగపూరితమైన తన గేయాల రెక్కలతోఎగిరి, భగవంతుని సన్నిధి చేరే నిమిత్తం కన్నీటి కెరటాల వెన్నెలలతో తన కవితాగుణాలను పోషించుకున్నాడు. ఆవేదనాంధకారం నుంచి మానవతావాదిగా, ఆశావాదిగా బయల్పడి దైవత్వాన్ని, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని చాటి చెప్పాడు. ఆత్మాశ్రయమైన భావ వ్యక్తీకరణతో పరిపూర్ణత కారణంగా కాల్పనికోద్యమ కవిత్వంలో వేదుల సత్యనారాయణ శాస్త్రిగారి "దీపావళి" ప్రముఖస్థానం వహించింది. పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావుగార్లు "తొలకరి" "సౌందరనందం" ద్వారా సాహిత్యసరస్వతిని ఆరాధించారు. గాంధీతత్వ ప్రభావంవల్ల వారు వ్యక్తిగత ప్రేమాన్వేషణను త్యజించి, బుద్ధుడు ప్రవచించిన విశ్వమానవ ప్రేమను కథావస్తువుగా స్వీకరించారు. ఆ కాలంలోని కవితా ఖండికలమాదిరి గాక అన్నిటా అంతటా ప్రేమామృతాన్ని వెదజల్లిన సంపూర్ణకావ్యంగా "సౌందరనందం" సృష్టి అపూర్వమైంది. పవిత్రప్రేమ ప్రవాహం తన సంకుచితమైన హద్దులను అధిగమించి, మానవ బాధలను విముక్తి చేసి తద్వారా ప్రపంచం అంతా ప్రవహించి నిండిపోవాలనే ప్రత్యేక సందేశాన్ని తమ కళాసృష్టిద్వారా యీ కవులు అందజేశారు. దువ్వూరి రామిరెడ్డిగారి 'కృషీవలుడు' సామాన్య మానవులపట్ల, వారి సమస్యల పట్ల ఆందోళనను వ్యక్తం చేస్తుంది. కాల్పనికరచనలో ఇదొక ముఖ్యలక్షణం.

జానపదకవితా సౌరభానికి కొత్తజీవం పోస్తూ కాల్పనికోద్యమకాలంలో 'గేయం' అభివృద్ధి పొందింది. బసవరాజు అప్పారావుగారి ప్రేమగీతాల్లోని ఊహామాధుర్య లహరి మనలను మంత్రముగ్ధులను చేస్తుంది. అడవిబాపిరాజుగారూ, వీరూ కుడిభుజం ఎడంభుజంగా వుంటారు. భావ తీవ్రత, జానపద ధోరణులను సంతరించుకున్న కారణంగా నండూరి సుబ్బారావు గారి "ఎంకిపాటలు" అత్యద్భుతమైన విజయాన్ని సాధించాయి. ఆయనను అనుసరించేవారు చాలామంది ఉన్నా కొనకళ్ళ వెంకటరత్నంగారి "బంగారు మామ" గేయాలలో కొన్ని చాలావరకు ఆ స్థాయి అందుకోగలిగాయి. భావుకత, శ్రావ్యత చిందులు వేసే "కిన్నెరసాని పాటలు" రచనలో యీ శైలిని ఉపయోగించి విజయం సాధించిన ఘనత విశ్వనాథ సత్యనారాయణగారికి దక్కుతుంది. పుట్టపర్తి నారాయణాచార్యులు గారు తమ "శివతాండవం"లో శివుని లయబద్ధమైన నృత్యాన్ని వర్ణించడంలో "గేయాన్ని" కడునేర్పుతో నడిపించారు. సి. నారాయణ రెడ్డిగారి "నాగార్జునసాగరం" "కర్పూర వసంత రాయలు" "విశ్వనాథనాయుడు" కావ్యాలలో యీ గేయశైలిని ఉపయోగించి సాహిత్యానికి ఒక విశిష్టతను, భావ గాంభీర్యాన్ని కలిగింపజేశారు. ఆయన నాటకానికీ, నృత్తానికీ, వర్ణనాత్మక చిత్రీకరణలకూ, కథా కథనానికి 'గేయాన్ని' శక్తివంతమైన సాధనంగా రూపొందించారు.

చాలామంది కవుల హృదయాలలో జాతీయతా భావాలు ఉరకలు వేసి ప్రాచీన భారత ఔన్నత్యాన్నీ, ఆంధ్రరాష్ట్ర నిర్మాణం పట్ల ఆందోళననూ రేకెత్తించాయి. రాయప్రోలు సుబ్బారావుగారు

"ఆంధ్రావళి," విశ్వనాథ సత్యనారాయణగారు "ఆంధ్రప్రశస్తి", తుమ్మల సీతారామమూర్తిగారు "రాష్ట్రగానం" కావ్యాలద్వారా జాతీయోద్యమ శంఖారావాలను పూరించారు. గరిమెళ్ళ సత్యనారాయణగారి గేయం "మా కొద్దీ తెల్లదొరతనం", త్రిపురనేని రామస్వామి చౌదరిగారి "స్మృతవీరులకు శ్రద్ధాంజలి", బసవరాజు అప్పారావుగారి "గాంధీజీ ప్రశస్తి", వడ్డాదివారి "భారతమాత గేయాలు" జాతి ఔన్నత్యపు విలువలను చాటాయి. హైద్రాబాదు రాష్ట్రాన్ని విభజించి విశాలాంధ్రను ఏర్పాటు చేయాలనే ఉద్యమంలో దాశరథి, కాళోజి, నారాయణరెడ్డిగార్ల గేయాలు ప్రముఖపాత్ర వహించాయి. పైడిపాటి సుబ్బరామశాస్త్రిగారి గేయాలు ప్రగాఢ జాతీయ భావాలను, ఆంధ్ర సంస్కృతిపై అభిమాన, ఆదరణలను వ్యక్తం చేశాయి.

జాషువా కవివంటి కొందరు వ్యక్తిత్వ భూషితులు కాల్పనికోద్యమానికి దూరంగా వున్నారు. మానవతావాదం, విశ్వమానవ సౌభ్రాతృత్వలక్ష్యాలనుపూర్వ పద్ధతి పద్యరచనల ద్వారానే అందించారు. సంఘంలోని వెనుకబడినవారిజీవన పరిస్థితులను సంస్కరించడంలోగల ఉత్సాహం జాషువాగారి కవిత్వంలో అభివ్యక్తమయి ఇతరఅనేక యువరచయితలకు ప్రోత్సాహం కలిగించింది. ప్రకృతి శోభను భగవంతుని సృష్టిలోని మహా సౌందర్యరాసిగా ఆయన దర్శించి వర్ణించారు. విశ్వనాథ సత్యనారాయణగారు తాను రచనలు చేసిన మొదటిరోజుల్లో కాల్పనికి పద్ధతిలో ప్రేమగీతాలు వ్రాశారు. అయితే ఆ తర్వాత గట్టి సంప్రదాయ వాదిగా అనేక క్రొత్త భావాలను వ్యతిరేకించారు.

"ఆస్థానకవి"

తమ్మల సీతారామమూర్తిగారి గాంధీజీ "ఆత్మకథ" పద్యకావ్యంతో పాటు ఇతర రచనలుకూడా సర్వోదయ సిద్ధాంతాలను చాటేవిగా వుండడంవల్ల ఆయన గాంధీజీ సిద్ధాంత వ్యాఖ్యాతగా ప్రసిద్ధి చెందారు. అందుకే గాంధీ తత్వానికి ఆస్థానకవిగా ఆయున పరిగణింపబడ్డారు. జాతీయ భావాలు, దేశభక్తి, జాతీయనాయకుల చరిత్రలతో పద్యకావ్యాలను ప్రభవింపజేశాయి. గడియారం వేంకటశేషశాస్త్రిగారి 'శివభారతం' జాషువాగారి 'నేతాజీ', మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి "ఆంధ్రపురాణం" రచనలు యీ ధోరణికి చెందినవి. వివిధ రంగాలలోని జాతీయనాయకుల జీవిత చరిత్రలను మహాకావ్యాల రూపంలో వ్రాయడం ప్రారంభమైంది.

కృష్ణశాస్త్రి, మల్లవరపు విశ్వేశ్వరరావు, రజనీకాంతరావుగార్ల గేయాలలో టాగూరు ప్రభావం కనిపిస్తుంది. అబ్బూరి రామకృష్ణారావు, నాయని సుబ్బారావుగార్ల రచనలు కాల్పనికోద్యమకాలపు శృంగార రసాన్ని సంతరించుకుని వారికి కాల్పనిక కవులలో మొదటి తరంవారిలో విశిష్ట స్థానాన్ని సాధించాయి.

అభ్యుదయ కవిత్వం జీవితంలోని కఠోరసత్యాలకు దూరమై కాల్పనికోద్యమం స్వయంగా నిర్మించుకున్న ఆకాశహర్మ్యాలనుండి క్రిందికి దిగిరావడానికి నిరాకరించడంతో అవతలివైపు నుండి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది.

శ్రీశ్రీ యీ వుద్యమానికి తలమానికమై అభ్యుదయ కవితా పద్ధతికి నాయకుడయ్యాడు. మార్క్సభౌతిక వాదంతో ప్రభావితుడై, పీడిత వర్గాలు తమ ఆర్థిక, దాశ్యశృంఖలాలను త్రెంచుకుని స్వేచ్ఛా జీవితం అలవర్చుకునేందుకు పురోగమించాలని ఆయన తీవ్రంగా ప్రచారం చేశారు. ఆయన "మహాప్రస్థానం" సుఖమయమైన నూతన జీవితాన్ని దర్శించి చిత్రించింది. 'ఫ్రీవర్స్' వచనపద్యాలను ప్రారంభించి వాల్ట్‌ఎట్మన్‌వలె శ్రీశ్రీ అగ్ని పర్వత విజృంభణలాశక్తివంతంగా తన ఆదర్శాలను ప్రబోధించాడు. ఆరుద్ర, అనిశెట్టి, కుందుర్తి, రమణారెడ్డి వంటి చాలామంది యువకులు ఆ రోజుల్లో తమ ఆలోచనా రితిలోనూ, భావవ్యక్తీకరణలోను ఆయనను అనుసరించారు. శ్రీశ్రీ చేతిలో "గేయం" వివిధ భంగిమలను సంతరించుకుని, గతాన్ని తెంచుకుని ఆనందమయ భవిష్యత్తును నిర్మించుకోడానికి శంఖారావాన్ని పూరించింది.

'కుందుర్తి' సంప్రదాయ పద్ధతిలోని కవిత్వపు మెరుగులను పూర్తిగా త్యజించి స్వయంగా వచనగేయ పద్ధతిని రూపొందించారు. ఆదర్శ వాదోత్సాహము, కొట్టవచ్చినట్లు పెల్లుబికివచ్చే ఊహాచిత్రాల పరంపరతో యీ వచనగేయ కవితా పద్ధతి అభ్యుదయోద్యమానికి శక్తివంతమైన రూపంగా అభివృద్ధిజెందింది.

ఆరుద్ర, రామదాసు, పి. యస్. ఆర్. ఆంజనేయశాస్త్రిగారలు కూడా వచన పద్యశైలిలో సిద్ధహస్తులు అయితే యీ పద్ధతిలో రచయితలోని ఉత్సాహం, ఊహాశక్తి ఏమాత్రం సడలినా యిది తక్కువ స్థాయికి దిగజారే ప్రమాదం ఉంటుంది.


నినాదాలు ఎంతటి ఉత్సాహాన్ని కలిగించేవిఅయినా వాటిలో రాజకీయ సిద్ధాంతాలు మొలకలెత్తుతాయే కాని కవిత్వపు పంటలు పండవు. సామాన్య మానవుల క్షేమంకోసం ఎలుగెత్తి చాటి చెప్పే పద్ధతి ఒక సంప్రదాయంగాకూడా యిప్పుడు రూపొందింది.

యువతరం కవులలో జీవితపు శాశ్వత విలువలనుఅన్వేషించేప్రయత్నంప్రారంభమైంది. కొందరు సంప్రదాయకవిధానాల వైపుకు మరలడం ప్రారంభించారు. యీ క్రొత్త దృక్పథాన్ని అనుసరించేవారిలో భోయి భీమన్న, నారాయణరెడ్డి,

(మిగతా 79 వ పేజీలో)



గుక్కెడు అమృతం



ప్రతినైషధము

ఈయుణ్ణి వేంకట వీరరాఘవాచార్యులు

'కావ్యే నైషధనామ్ని ధామ్నిసుబృహ-
త్యర్థస్య ముక్తావధే-
ర్భావాన్ దూరనిగూహితాన్ కథమహం
సర్వాన్ ప్రమాతుం క్షమః,
ఏతస్మిన్ ద్యుతిమంతి సంతి సుబహూ-
న్యేతాని మధ్యే భువః
సాకల్యేన లభేత కోఽపి ఖనితా
వజ్రాణి వజ్రాకరేః- (గదాధరస్య)

ప్రపంచముననే కాక సాహిత్య ప్రపంచమునందును స్పర్ధ ప్రాచీనకాలము నుండియు కనఁబడు చున్నది. సుప్రతిష్ఠితుఁడగుమహాకవికావ్యము ననకరించుట అనుసరించుట, అనువదించుట సంస్కృత సారస్వతమున విశేషముగా కన్పట్టును. ప్రజ్ఞోపజ్ఞలు లేని సామాన్యరచయిత ప్రతిభానిధి యగు పూర్వకవిశేఖరుని బానిసవలె, ఛాయవలె ననుకరించుట (Slavish imitation) దోష మగును గావి, ప్రజ్ఞానిధి, పూర్వమహాకవితో స్పర్ధ వహించి కావ్యనిర్మాణము చేయ యత్నించుట గుణమే యగును. యూధనాథుఁడు చవిన మార్గముననే గున్నయేనఁగు లరుగునట్లు తాను మహాకవుల పథము ననుసరించియే కావ్యమును రచించుచుంటి నని చంద్రప్రభచరితమున జైన సంస్కృతకవి వీరనంది వక్కాణించి యున్నాఁడు.

[1]కవికులగురువగుకాళిదాసు — రఘువంశమునకు ప్రతిద్వంద్వులు : ప్రతిరఘువంశము. అశ్మకవంశము, మూషకవంశము, భృగువంశము, యదువంశము (= యాదవాభ్యుదయము) [2]కుమారసంభవమునకు ప్రతిస్పర్ధి జైన కుమారసంభవము; [3]మేఘదూతకు ప్రతిద్వంద్వులు పవన-హంసదూతాదులు పరశ్శతములు. [4]కవిరాజురాఘవపాండవీయము ననుసరించి జైనధనంజయాదులా పేరుతోడనే కావ్యముల రచించిరి. [5] జయదేవుని గీతగోవిందము ననుసరించి అభినవగీతగోవిందము, గీతగౌరీపతి మొదలగు కావ్యము లనేకములు బయలువెడలినవి, [6]భట్టబాణుని కాదంబరి ననుసరించి అభినవకాదంబరి, పద్యకాదంబరి, [7]సుబంధువివాసవదత్త ననుకరించి అభినవవాసవదత్త, [8]యశోవర్మ రామాభ్యుదయము ననుసరించి అభినవరామాభ్యుదయము, [9]భోజుని చంపూరామాయణము ననుసరించి అభినవ చంపూరామాయణము [10]అనంతభట్టు చంపూ భారతమును బోలి అభినవభారతచంపువు[11]అభినవకాళిదాసుభాగవతచంపువు ననుసరించి(అవసరాల పద్మరాజుది) భాగవతచంపువును బయలుదేరినవి, రామాయణచంపువునురచించినభోజుఁడు క్షత్రియుఁడు; తానో వర్ణాధికభోజుఁడు —(అంభోజుఁడు బ్రాహ్మణుఁ డగుటచే తా నగ్రకులజుఁడ నని, 'అం' అనువర్ణ మధికముగాఁ గల భోజుఁడ నని - తాను పద్మనామకుఁ డగుటచే-)పద్మరాజు చమత్కరించెను. [12]కృష్ణమిశ్రుని ప్రబోధచంద్రోదయమును జూచి వేదాంతదేశికులు సంకల్ప సూర్యోదయమును [13]వేదాంతదేశికులపాదుకాసహస్రమునుజూచి వేంకటాధ్వరి లక్ష్మీసహస్రమును, బొమ్మకంటి నరసింహశాస్త్రి తిలకసహస్రమును రచించిరి. కవితాసాదృశ్యము, కవితానుకరణము, కవితాహరణమును సాహిత్యసాగరమందరము లగుఆనందవర్ధనుఁడు, రాజశేఖరుఁడు మొదలగు వారెందఱో తమగ్రంథములందు చర్చించి, పైవానిలో నేది ఉపాదేయమో, ఏది పరిహరణీయమో నిర్ణయించియే యున్నారు.

క్రీ. శ. 17వ శతాబ్దమున మహారాజ కరణసింగు, ఆయనతరువాత ఆయన తనయుఁడు అనూపసింగును బికనేర్-స్థానమును పరిపాలించిరి. నాటి రాజపుత్ర స్థానమున వివిధ సంస్థానముల నేలిన మహారాజులలో పై యిరువురును చాల ప్రఖ్యాతులు. అనూపసింగు రాజ్యకాలమున బికనేర్-కోటలో నొక లిఖిత గ్రంథాలయము స్థాపింపఁ బడెను. ఇందు రమారమి పదివేల లిఖితగ్రంథములు కలవు. గ్రంథ సంఖ్యను బట్టియే కాక, అపూర్వ గ్రంథములను బట్టి చూచినను భారతీయ భాషాసారస్వతములకు -సంబంధించిన లిఖిత గ్రంథ నిలయములలో ఇది ఉత్తమశ్రేణికి చెందినవానిలో నొకటి యనక తప్పదు.

ఈ గ్రంథాలయము నందలి అశ్రుతపూర్వము లగు గ్రంథములలో ప్రతినైషధ మను మహాకావ్య మొకటి. హర్షనైషధము వలెనే ఇందును 22 సర్గములు కలవు.

హర్షనైషధమున కావ్యచిహ్నము * 'ఆనంద' పదము; ప్రతినైషధమున 'సుధాధార.' కావ్యమును. 'భావార్థ విద్యోతన' మను వ్యాఖ్యతో రచించిన విద్వత్కవి నందనందన కవి. షాజహాన్ సార్వభౌముని రాజ్యపాలన కాలమున ఈ మహాకావ్యము నిర్మింపఁబడెను. (సంవత్: 1708)- క్రీ. శ. 1652. బికనేర్ కోటయందలి గ్రంథాలయమున మణిరామ-దీక్షితులు, నాఁడు యావద్భారతఖ్యాతి నందిన యతిశేఖరుఁడు సర్వవిద్యానిధాన-కవీంద్రాచార్య సరస్వతియు సంపాదించిన లిఖిత గ్రంథములు పరశ్శతముగా కలవు.

'సర్వ విద్యావిధాన- కవీంద్రాచార్య సరస్వతీనాం ప్రతినైషధ పుస్తకమ్'-
అని గ్రంథముపై స్పష్టముగా వ్రాయఁబడి యుండుటచే ఈప్రతి కవీంద్రాచార్య సంపాదితమని తెలియుచున్నది. ఈ ప్రతిలోని మొదటిపత్రము త్రుటిత మగుట వలన మొదటి శ్లోకములు కొన్ని దెబ్బతిన్నవి. 88-90 పత్త్రములు మూఁడును పోయినవి. సంఖ్యలను గుర్తించుటలో పొరపాటువల్ల 189 వ కమ్మకు పిమ్మట 180 వది కలదు.

మొగల్ చక్రవర్తి-షాజహాన్ రాజ్యపాలన కాలమున (సంవత్: ౧౭౦౮) క్రీ. శ. 1652 వ వత్సరమున విద్యాధర-లక్ష్మణు లనుకవులు ప్రతినైషధమును రచించినట్లు డాక్టర్ కృష్ణమాచార్యులవారు లౌకికసంస్కృత వాఙ్మయ చరిత్రమున (185 పు.) వ్రాసియున్నారు. ఈయంశమునకు భండార్కర్ పండితుని లిఖితగ్రంథ నివేదిక (2వ భాగము) ఆధారము. ( )

నైషధీయ చరిత్రమునందు వలెనే ప్రతినైషధమునను ప్రతిసర్గాంతమునను కవి తన వృత్తాంతమును, సర్గసంఖ్యాదివిషయములను శ్లోకరూపమున తెలిపెను. ఈ విషయమును నైషధమునకుఁ బిమ్మట రచింపఁబడిన సంస్కృతకావ్యము లెన్నియో అనుసరించినవి. ఆముక్తమాల్యదయందు కూడ ఈ విలక్షణత కానఁబడుచున్నది

ప్రథమసర్గోపసంహారశ్లోకము :

'యం కృష్ణా సమజీజనద్ బుధకవిం
నందాభిధం చార్జునాద్
విద్వద్బృందకిరీటవంద్యచరణ-
ద్వంద్వాత్ సుతం భర్తృతః,
తేనాస్మిన్ నిషధేంద్రసుందరకథా-
ఖ్యాలంకృతేఽయం మహా-
కావ్యేఽగాత్ ప్రథమః శుభార్థసుభగ-
శ్లోకోఽథ సర్గో మహాన్!'

ప్రథమసర్గాంతపుష్పిగ :

'ఇతి శ్రీనందనందన కవికృతౌ నైషధ (మహా)కావ్యే ప్రథమః సర్గః!''

ప్రథమ సర్గవ్యాఖ్యోపసంహారపుష్పిక :

'ఇతినందనందనకవివిరచితే భావార్థవిద్యోతనే హంసమోక్షో నామ ప్రథమ స్సర్గః!'

పై నుదాహరింపఁ బడినశ్లోకమును బట్టి విద్వత్కవి నందనందనుని జనని కృష్ణాంబ యనియు, జనకుఁడు విద్వద్బృందకిరీట వంద్యచరణద్వంద్వుఁ డగుఅర్జునపండితుఁ డనియు తెలియుచున్నది.

కావ్యమున ఆయాసర్గము లందలివిషయములను తెలుపు శీర్షికలు సర్గనామములుగా ప్రతిసర్గముచివర నొసఁగబడెను:

సర్గము :

౧. హంసమోక్షము
౨. ?
౩ హంసదూతము
౪ భైమీవర్ణనము
౫ శచీశానవ్యాజము
౬ భైమీదార్ఢ్యవర్ణన
౭ భైమీవర్ణన
౮. (గ్రంథపాతము–) సర్గాంతము లుప్తము
౯ భీమజా – నల సంవాదము
౧౦. స్వయంవరాడంబరవర్ణన
౧౧. నైషధవర్ణన
౧౨. రాజవర్ణన
౧౩ పంచనళీ – నిరూపణము
౧౪. దేవవరదానము
౧౫. నలభీమజామండనము
౧౬. రాజధర్మనిరూపణము
౧౭ కలియుగప్రవేశము
౧౮. భీమజాసంభోగము
౧౯. సూర్యోదయనిరూపణ
౨౦. ఋతువర్ణన
౨౧. విపదాగమము
౨౨. నిషధవత్యుల్లాసము

తృతీయసర్గాంతగద్యమును బట్టి ప్రతినైషధము 'సుధాధారాంక' మని తెలియుచున్నది.ϕ

---

* ఇట్టి కావ్యచిహ్నములు ౩౮ నాకులభించినవి. ఆ కావ్యములను, ఆ యా చిహ్నములను, తత్తత్కవులను గూర్చి నేను రచించిన వ్యాసము కాలాంతరమునఁ బ్రకటింపఁబడును. 'ద్వ్యర్థిత్ర్యర్థి కావ్యములను' గూర్చి నేను కూర్చిన వ్యాసమున 19 కావ్య చిహ్నములు మాత్రముదాహరింప బడినవి. (p. 53 of no. 2 of Vol. 24 of the Journal of the Telugu Academy – 1935.) యువ-జ్యేష్ఠాషాఢములు.

() నందనందన కవిరచించిన ప్రతినైషధమే పొరపాటున విద్యాధర – లక్ష్మణకవుల కృతిగా పేర్కొనఁబడి యుండును.

ϕ 'ఇతి శ్రీ నందనందనమహాకవివిరచితే ప్రతినైషధే మహాకావ్యే సుధాధారాంకే హంసదూతనామా తృతీయః సర్గః!

కావ్యోపసంహారము:

'యత్తాతోఽర్జునసంజ్ఞకో, మధుభిదో
భక్తో, విరక్తో, వశీ
కృష్ణా యజ్జననీ, వినీతవిదుషా
తే నైష సర్గో మహాన్,
ద్వావింశః కవిపండితేన రచితే
నందేన యాతో మహా –
కావ్యేఽస్మిన్ నను పూర్ణతాం నిషధపో
ల్లాసాభిధ స్తన్మయే.' 2

'ఏత ద్వై ప్రతినైషధాభిధమహా –
కావ్యం మయా బాల్యతో
నందాఖ్యేన కృతం, ప్రపంచరహితం
పశ్యంతు సంతో బుధాః,
అంగీకృత్య పఠంతు, కించన మయా
యద్దుష్ట మ త్రేరితం
త త్తేఽర్హంతి గభీరచి త్తచరితాః
క్షంతుం దయా రాశయః.' 3

'వందేఽహం ప్రథమం ఖలం భయవశాద్
దోషార్జనే కోవిదం,
పశ్చాద్ సజ్జన మా నమామి శిరసా
ప్రీతః ప్రతీతార్థినమ్,
దోషోత్సారణతత్పరం, పరగుణా
దానోద్యతం సర్వదా
సాధు ర్భూతలపాలనందన ఇతి
ఖ్యాతాభిధానో భువి' 4

'శ్రీమత్ సాహజహాభిధాననృపతౌ
భూమీతలం శాసతి
శ్రీమద్విక్రమభూపరాజ్యసమయాద్
వస్వభ్రహర్యచ్యుతైః (?)
గత్యేఽబ్దే, మకరస్థితే దినకరే,
శుక్లే చ పక్షే తిథౌ –
షష్ఠమ్యాం, రవివాసరే విరచితం
నందేన కావ్యం త్విదమ్.' 5

'బ్రహ్మాశాక్షిమితైః శతైః శుభలస –
న్నానావిధార్థై రిదం
పద్యానాం సహితం, మనోజ్ఞ విషయైః
సర్గై స్తథా భూషితమ్,
ద్వావింశ ప్రమితై ర్నలీయచరితై
సంవేష్టితం మంజులం
కావ్యం శ్రీప్రతినైషధాభిధ మలం –
కారం విధత్తాం సతామ్.' 6

భావార్థవిద్యోతనవ్యాఖ్య :

'గిరిపతితనయాంఘ్రౌ భక్తి భావోద్భ
వాచ్చా
దితిజనరసిరోఽవచ్ఛేదవిచ్ఛేదదక్షా.
నిజపదుపనతాలీ కామనాపూ ర్తినీతి–
ర్గణపనయనయోస్సాపాతు నఃకాఽపి
రీతిః

తరువాత రెండుశ్లోకములకు పిమ్మట వ్యాఖ్య ప్రారంభ మగును – 'అ థాత్ర ప్రథమతో గ్రంథకారో మహాకవిః శ్రీమన్నందనందనాభిధానః శిష్టాచారపరంపరాప్రసంగ సంగతం, నిరంతరాయగ్రంథసమాప్తిప్రచార కారణీభూతం, శిష్యశిక్షానిమిత్తకం, మహా కావ్యలక్షణీభూతం చ, త్రివిధం మంగళ ముప – దర్శయతి – "అ థాపి" –ఇత్యాదిభి స్త్రిభిః పద్యైః.'

మూల – వ్యాఖ్యానములు రెండును నంద నందనకవికృతములే యని ఇదివఱకే సూచింపఁబడెను. వ్యాఖ్య బహువిపులముగా నున్నది. ఇందు సుసూక్ష్మము లగు – శాస్త్ర మర్మములు, సంప్రదాయములును విస్తారముగా వివరింపఁబడినవి. కావ్య – వ్యాఖ్యానములు రెండును కవికిఁ గల అఖండప్రతిభను, అపారశాస్త్రవైదుష్యమును విశదీ–కరించు చున్నవి. అక్షరముల, హర్షనైషధమునకు ప్రతినైషధము ప్రతిస్పర్ధి యనుట నిర్వివాదము.

శ్రీహర్షప్రశంసాత్మక మగు నీక్రింది శ్లోకముతో ఈవ్యాస ముపసంహరింపఁ బడును :

శా. 'జాయంతే కతి. జజ్ఞిరే కని. జని–
ష్యంతే క తీహ క్షితౌ
స్రష్టారో నితరా మిదం తు కవిభి
ర్నిర్మత్సరైః కథ్యతామ్.
అపూర్వాపరదక్షిణో త్తరహరిత్–
సాహిత్యసింహాసన–
స్వైరారోహపరాక్రమం భజతుకః
శ్రీహర్షసూరేః పరః'
—(విశ్వేశ్వరభట్టస్య)

అనుబంధము-1

సంస్కృతకవులు (హిందువులు, జైనులు) రచించిన నలచరిత్రాత్మకము లగు ఈః క్రిందికావ్య ప్రక్రియలను బట్టి కలికల్మషాపహ మగు నలదమయంతుల చరిత్ర పండితప్రపంచమున నెంత ఆమోదము నందెనో తెలియఁగలదు:

I గద్యము: (మొత్తము 2)

౧. దమయంతీ ప్రబంధము (కవి?– జైనుఁడు)
౨. నలచరిత్రము (గుణవిజయగణి– నేమినాథచరితమున– జైనము)ముద్రితము–

II చంపువు: (2)

౩. దమయంతీపరిణయము (కవి?)– అముద్రిత.
౪. నలచంపువు (= దమయంతీకథ;– త్రివిక్రమభట్టు లేక సింహాదిత్యకవి) ముద్రిత.

III పద్యకావ్యము–(32)

౫. అబోధాకరము(త్రిర్థకము. ఘనశ్యామ కవి; అముద్రిత)
౬. ఆర్యానైషధము (ఏ. వి. నరసింహా చార్యులు)
౭. ఉత్తరనైషధము (16 సర్గములు; వందారుభట్టకవి) అముద్రిత,

౮. కవి విడంబనము (నారాయణశాస్త్రి; అముద్రిత.)

౯. కల్యాణనైషధము (7 సర్గలు; కవి? అముద్రిత.)

౧౦. దమయంతీకథ (శుభశీలగణి; భారతేశ్వర బాహుబలివృత్తి యందు; ముద్రిత; జైన.)

౧౧. దమయంతీ కల్యాణము (నల్లాన్ చక్రవర్తి-శఠకోపాచార్య; ముద్రిత)

౧౨. దమయంతీ పరిణయము (= భైష్మీ పరిణయ-చక్రకవి-అముద్రిత.)

౧౩. దమయంతీ పరిణయ (మృత్యుంజయ స్వామి; అముద్రిత)

౧౪-౧౫. ,, (కవులపేళ్లు తెలియవు అముద్రితములు)

౧౬. దమయంతీ ప్రబంధ (కవి?) జైనము

౧౭. దవదంతీచరిత్ర (వినయచంద్రసూరి-మల్లినాథ మహాకావ్యము నందలిది. ముద్రితము) జైన.

౧౮. దవదంతీ కథ (సోమతిలకసూరి-శీలోపదేశమాలా వృత్తి యందు; ముద్రిత) జైన.

౧౯. దవదంతీకథ (జినసాగరసూరి-కర్పూర ప్రకరటీకయందు; ముద్రిత; జైన.)

౨౦. నలకథార్ణవ (కవి? - అముద్రిత.)

౨౧. నలకీర్తికౌముది (అగస్త్యకవి; దొరకిన సర్గములు 2, 4 ముద్రితములు)

౨౨. నలచరితము (ఆచార్య హేమచంద్రుని త్రిషష్టిశలాకాపురుష చరితమున- VIII ౩.) ముద్రిత. జైన.

౨౩. నలచరిత. (కవి?) అముద్రిత.

౨౪. నలయాదవ - పాండవ - రాఘవీయ. (=నలయాదవ - రాఘవ - పాండవీయ) కవి? అముద్రిత.

౨౫. నలరామాయణ (రాజశేఖరకవి) అముద్రిత.

౨౬. నలవర్ణనము. (లక్ష్మీధరుఁడు) లుప్తము

౨౭. నలహరిశ్చంద్రీయము (గతప్రత్యాగత కావ్యము. కవి? అముద్రిత)

౨౮. నలాభ్యుదయ (వామన భట్టబాణ; దొరకిన సర్గములు 1-8; ముద్రితము)

౨౯. నలాయన (= కుబేరపురాణ; సంస్కంధములు, 100 సర్గములు; మాణిక్యసూరి; అముద్రిత. జైన.)

౩౦. నలాయని చరిత (నారాయణభట్టపాద; అముద్రిత.)

౩౧. నలోదయ (కేరళ కవి వాసుదేవ కృతము; 4 సర్గలు - ౨౧౭ శ్లో. ముద్రిత.)

౩౨. నలోపాఖ్యాన (దేవప్రభసూరి - పాండవ చరితాంతర్గతము; ముద్రిత;) జైన.

౩౩. (అ) నైషధ పారిజాతీయము (కృష్ణాధ్వరి)

ఇది ఆంధ్రద్వ్యర్థికావ్యము కానిసంస్కృత ద్వ్యర్థి కావ్యముకాదు. డాక్టర్ కృష్ణమాచార్యులవారు తమ సంస్కృత వాఙ్మయ చరిత్రమున (236 పు. ౧౫౩ పేరా) వ్రాసినది పొరపాటు.)

౩౩. (అ) నైషధానంద (శ్రీనివాసదీక్షిత) అలబ్ధము.

౩౪. నైషధీయ చరిత (శ్రీహర్ష, ముద్రిత)

౩౫. (అ) నై. చరితసార (కృష్ణరామ కవి; ముద్రిత.)

౩౫. (అ) ప్రతినైషధము (నందనందన కవి; అముద్రిత.)

IV నాటకము; (20)

౩౬. అనర్ఘనల చరిత్ర (మహానాటక; సుదర్శనాచార్య; ముద్రిత.)

౩౭. దమయంతీ కల్యాణ (అసమగ్ర; కవి? అముద్రిత.)

౩౮. నలచరిత (దేవీప్రసాదశుక్ల, ముద్రిత)

౩౯. న. చ. నాటక (నీలకంఠ దీక్షిత; ముద్రిత.)

౪౦. నలదమయంతీ (కాలీపాద తర్కాచార్య, ముద్రిత.)

౪౧ నలభూమిపాలరూపక (కవి? అముద్రిత)

౪౨. నలవిక్రమ (కర్త? 8 అంకములు. అలబ్ధము)

౪౩. నలవిలాస (7 అం; రామచంద్రసూరి ముద్రిత. జైన.)

౪౪. నలానందనాటక (7 అం. జీవవిబుధ అముద్రిత)

౪౫. నలాభ్యుదయ (తంజావూరు రఘునాథ భూపాల, అముద్రిత.)

౪౬. నైషధానంద (క్షేమీశ్వర, ముద్రిత.)

౪౭. " (కర్త? 7అం. అముద్రిత)

౪౮. పుణ్యశ్లోకోదయ (దేవీశరణకవిచక్రవర్తి. ముద్రిత)

౪౯. భైమీపరిణయ (రత్నఖేట - శ్రీనివాస దీక్షిత, అముద్రిత.)

౫౦. " (రాజచూడామణిదీక్షిత అముద్రిత.)

౫౧. " (మండికల్ రామశాస్త్రి ముద్రిత. 10 అం)

౫౨. " (వేంకటాచార్య, అముద్రిత)

౫౩. భైమీపరిణయ (శఠకోపాచార్య, అముద్రిత.)

౫౪. మంజులనైషధ (మహామహోపాధ్యాయ పరవస్తు వేంకటరంగాచార్యులు; 2 సారులు ముద్రితము; ఆంధ్రీ కృతము)

(మిగతా 13 వ పేజీలో)

రణవిజయం

శీలం రాజేశం

దేశమును నీ దేహమనుకో
వేషములు ఇక మానుకోవోయి
కదలకుంచిన నీదు కండను
పదునుపట్టి కదలిరావోయి.

సడలించవోయి దుర్గతులు
సవరించవోయి సద్గతులు.
ఓర్వలేని చైన భాయిలు
ఐశ్వర్యరాసుల రాల్చబూనిరి.

పొంచి పొంచి బుసలుకొట్టె
బుద్ధిముఖపు చైన ప్రబుద్ధులు
చిచ్చుపెట్టే కొండముచ్చులు
చచ్చునట్లు అట్టెపట్టి నలచిపారేయ్.

కదంత్రొక్కి కదలవోయి,
హృదయ మెంతో చూపవోయి,
కలం, హలం కలసి కదిపిన
కరువే మన కిక వుండదోయి.

రణభూమి హడలిపోవ
హలమెత్తి కదలవోయి
వొడలు వంచి సడలిపోక
వోర్మితోడ వురకలేయి.

వుండరోయ్ ఇక వుండరు
చైన చిచ్చు మొఖరెలు.
పచ్చని మనతల్లికి మెప్పైన పుత్రులం
శత్రువులను హతమార్చ ముందంజ వేయవోయి

"దరిద్రుల" మని చెప్పలేక, ధనాశకులోనై
దాగిదాగి మనపైనే! రయమున దండెత్తిరోయి.
భయములేక జంకకుండ దద్దరిల్ల
గొరిల్లవోలె తొక్కదీసి చక్కబెట్టు.

తొత్తువెధవ లెందరైన
తోడు కలసి వచ్చినా
చిత్తైతే చేయగలం
మొత్తైతే వదలగలం.

హలంతోనే మా విజయం.
కలంతోనే తుదివిజయం.
స్నేహంబుతోనే ఘనవిజయం.
సాగునోయి శాంతితోనే రణవిజయం.

(12 పేజీ తరువాయి)

౨౨ పధివిలసత (కర్త ? అలబ్ధ.)

అనుబంధము - 2

(ఉపజీవ్య గ్రంథముక్తావళి)

Bibliography


1. *Second Report on the Search for Sanskrit Manuscripts in the Bombay Presidency*—By Dr. R. G. (A.D. Bhandarkar, M.A.,Ph.D. 1907)
2. '*History of Classical Sanskrit Literature*'—By Dr. M. Krishnamachariar, M. A., M. L., Ph. D. (1937)
3. '*Anup Sanskrit Library in the Bikaner Fort*'—ByDr. C. Kunhanraja, M. A., D. Phil. (The Adyar Library Bulletin—Vol. IV. (May, part 2; pp. 53-56) 1940)
4. '*A Critical Study of Sriharsa's Naisadhiyacaritam*'—By Dr. A. N. Jain, M. A., Ph. D. (1957)

ఏలేశ్వర పురావస్తుశాల:

నల్లగొండజిల్లా యందలి దేవరకొండ తాలూకాలో ప్రవహించు కృష్ణానది కెడమ వొడ్డున, విఖ్యాత బౌద్ధ నాగార్జునకొండ కెదురుగ నున్న ప్రసిద్ధ ఏలేశ్వరమునందు 1960 క్రీ. శ. లో భారీ ఎత్తున త్రవ్వకములు ప్రారంభింపబడినవి. ఈ త్రవ్వకములు క్రీ. పూర్వము మూడవ, రెండవ శతాబ్దములనుండి నున్న రాతియుగము నుండి నేటి వరకు గల ఆరు నాగరికతా సంస్కృతులను వెల్వరించుటలో చాల యుపయుక్తములైనవి. మూడు త్రవ్వకాల ఫలితముగ, ఒకదానిపై నొకటి నావరించుకొన్న వివిధ స్థాయీ సంస్కృతులు ఆరు ప్రకాశితమైనవి. అమూల్యములగు పురావస్తువులు, శిల్పకళా ఖండములు, కాల్పుడు చిత్రములు, విగ్రహములు, మట్టిపాత్రలు, పూసలు, నాణెములు, లోహపరికరములు, ముద్రలు, స్టక్కోముక్కలు మున్నగు పురావస్తు విశేషములు లభ్యమైనవి. తుద త్రవ్వకాలలో పురా మధ్యరాతి యుగము నాటి పరికరములు దొరికినవి. ఇవి ఏలేశ్వరపు పరిసర సానువులలో పూర్వరాతి యుగము నుండియే మానవుని ప్రవేశమును ధృవపరచుచున్నది. పురావస్తుశాఖవారు తమ కార్యాలయావరణములో ముప్పది మూడు వేల రూపాయల వ్యయముతో ఏలేశ్వర మంటపమును నిర్మించినారు. అందు సుందర పాదపీఠికలు, మరియు ప్రదర్శన పేటికలు నిర్మించి ఏలేశ్వరపు త్రవ్వకములలో బయల్పడిన పురావస్తువుల నత్యంత శాస్త్రీయ పద్ధతులపై పండిత పామర జనాకర్షణీయముగ ప్రదర్శించి విజ్ఞాన వికాసమునకు దోహద మొనర్చినారు. భారత ప్రభుత్వము వారు మూడవ ప్రణాళికా కాలములో "వస్తు ప్రదర్శన శాలలపునర్వ్యవస్థీకరణ మరియు అభివృద్ధి" పథకము క్రింద సహాయముగ నివ్వనున్న రూ. 75,000లతో ఏలేశ్వర మంటప విస్తరణ పథకము రూపొందనున్నది.

సమకాలిక కళామంటపము:

ప్రస్తుత మున్న పురావస్తు ప్రదర్శన భవనములో ఆధునిక కళాకారుల యమూల్య కళాఖండముల ప్రదర్శనకు తావులేదు.



అందువల్ల మూడవ ప్రణాళిక క్రింద భారత ప్రభుత్వమువారు ఇందుకొరకు కేటాయించిన 1.75 లక్షల వ్యయముతో ప్రస్తుత ప్రదర్శనశాల కనుబంధముగ నొక కళా మంటపము నిర్మించునభిప్రాయమున్నది. భారత ప్రభుత్వపు ఉక్కు, గనుల మంత్రి శ్రీ. డా. నీలం సంజీవరెడ్డిగారిచే పదవ జూలై 1964న దీనికి శంకుస్థాపన జరుపబడినది. నిర్మాణశాఖ దీని నిర్మించు పనికి బూనుకొనుచున్నది.

ప్రభుత్వోద్యానవనమందలి అజంతా మంటపము:

ముందు దీని గోడలపై అజంతా భిత్తికల తైలవర్ణరూపముల ప్రతులు ప్రదర్శింపబడుచుండెను. అయితే అజంతా నాటినుండి నేటివరకు చిత్రకళా రంగమున కలిగిన అభివృద్ధిని ప్రేక్షకలోకమునకు కలరూపును ప్రదర్శించు నభిప్రాయముతో నీ భవనమును రూ.16,500ల వ్యయముతో వివిధ భాగముల క్రింద విభజించి అందు పాదపీఠికలు, ప్రదర్శన పేటికలు నేర్పరచి వివిధస్థాయీ, రీతులు వర్ణచిత్రములు ప్రదర్శింపబడుచున్నవి. కళారాధకులకీ ప్రదర్శన పద్ధతి ఆకర్షవంతముగ నున్నది. వివిధకాల, రంగముల యందు తైలవర్ణచిత్ర ప్రపంచమందు జరిగిన అభివృద్ధిని సాకల్యముగ, సవిమర్శకముగ పరిశీలించు నవకాశ మీ విధముగ ప్రేక్షకలోకమునకు కల్పించబడినది.

గోలకొండలోని ఖజానా భవన మందలి ప్రదర్శనశాల:

పురా వస్తుశాఖ వారిచే సేకరించబడిన తూర్పు పడమర చాళుక్య, కాకతీయ, మరియు విజయనగర రాజులకాలపు నాటి శిల్ప, శిలాఖండము లనేకము లిందు భద్రపరచబడి ప్రదర్శింపబడుచున్నవి. ఈభవనము కుతుబ్షాహీల నాటిది. ప్రేక్షకులకు ఇందలి విషయములు విడమరచి చెప్పుటకు నొక సాంకేతిక నిపుణుడు నియమితుడై యున్నాడు.

విక్టోరియా రజితోత్సవ ప్రదర్శనశాల, విజయవాడ:

కృష్ణాజిల్లా పరిషత్తువారి యాజమాన్యము నుండి దీనిని పురావస్తు శాఖవారు తీసుకొనినారు. దీనిని అధునాతన పద్ధతులపై

వ్యవస్థీకరించి హైద్రాబాదులో కొన్ని పురావస్తువుల ప్రతిరూపము లిందు చేర్చు ప్రయత్నము జరుగును. సాంస్కృతీ సమ్మేళనములు, కళాకారుల కళా ప్రదర్శనములు మున్నగువాని కనువుగ నుండునట్లు, దీని ఆవరణ మందొక సువిశాల భవన నిర్మాణ మాలోచనయం దున్నది. కార్యాలయము, మరియు వస్తు సంచయరక్షణ కనువుగ రెండు గదులు, నీ సభా భవనమునకు అనుబంధముగ నిర్మింపబడును. స్త్రీ, పురుష యాత్రికుల కవసరమగు మరుగుదొడ్లు, స్నానపాన సౌకర్యములు గూడ వేర్వేరుగ సంతరించబడగలవు. పురావస్తు శాఖవారికి పరిశోధనయందు కృష్ణా గోదావరి మండలములలో దొరికిన శిల్ప కళాఖండము లిందు జేర్చబడి దీని నితోధికముగ నభివృద్ధి చేయు నుద్దేశ్యము కలదు. కొద్దికాలము క్రిందటనే డచ్చివారి సమాధి శిలాఫలకము లిందు జేర్చబడినవి. అవి 16, మరియు 17వ శతాబ్దములలో నీ ప్రాంతమందు డచ్చివారి పాత్రను ప్రకాశిత మొనర్చును.

రాజమహేంద్రవరమందలి ప్రదర్శనశాల:

పండితుడు, సంస్కారి, వదాన్యుడును నగు కీ॥ శే॥ శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారి జ్ఞాపకార్థము రాజమహేంద్రవరములో నొక ప్రదర్శనశాల నేర్పరిచి అందు శ్రీ పంతులుగారి ప్రచురణలు, పత్రములు, వాడుకున్న వస్తువులు, ప్రదర్శింపబడును. ఇదియునుగాక నీ జిల్లాలో పురావస్తుశాఖవారికి లభ్య మగు పురాతన శిల్ప శిలా ఖండములు చరిత్రాత్పూర్వపు పరికరములు ఆయుధములు, మృణ్మయ పాత్రలు, భిత్తికలు ఇందు ప్రదర్శించబడగలవు. ఈ కార్యక్రమము నాచరించు నుద్దేశ్యముతో, శ్రీ వీరేశలింగంగారి సమాధి నానుకొనియున్న వారి భవనమును స్వాధీన బరచుకొన నున్నారు. ఈ కార్య సాధనకు నాల్గవ ప్రణాళికా కాలమందు ప్రభుత్వము వారు ధనమును ప్రత్యేకింప నున్నారు.

హష్మత్ పేట:

సికింద్రాబాదునకు సమీపములో నున్న హష్మత్ పేట యందలి సుప్రసిద్ధ మెగాలితిక్ ప్రదేశమందు పురావస్తుశాఖవారాధీనములో నున్న నొక భవనమం దొక ప్రదర్శనశాలను నిర్మించి, అందు మెగాలితిక్ కాలమునకు సంబంధించిన లోహయుగమునాటి సంస్కృతీ అవశేషముల ప్రదర్శించు సంకల్పము ప్రభుత్వమునకు గలదు. ఈ ఏర్పాటు చరిత్ర పరిశోధకులకు, పురావస్తువేత్తలకు, నితర పండితులకు నీ సంస్కృతి యొక్క ముఖ్యవైశద్యములను నొకేచోట పరిశీలించు నవకాశము కలుగును.

గోలకొండయందలి ఖుతుబ్షాహీసమాధులు:

ఈ సమాధులు ఘనత వహించిన నైజాం ప్రభువుగారి స్వంత ఆస్థులు. వాని జాతీయ ప్రాముఖ్యతను గమనించి భారత ప్రభుత్వమువారు వానిని స్వాధీనబరచుకొన నిర్ణయించినారు. కాని సుదీర్ఘ చర్చ యనంతరము శ్రీ నైజాముగారు మరియు భారత ప్రభుత్వము వారు వీనిని ఆంధ్ర ప్రభుత్వ పురాశాఖవారి కొప్పగించుట కంగీకరించినారు. అట్టి ప్రకటన వెల్వడిన తదుపరి ఖుతుబ్షాహీల నిర్మాణ రీతులపై తోటలు, సిస్టన్సు, కాస్కేట్సు, జలయంత్రములు మున్నగునవి నిర్మించి, నీ ప్రదేశమును రమ్యముగను యాత్రికులకు నాకర్షవంతముగను, నిత్య నూత్న శోభల పునరుజ్జీవితముగ నొనరించబడును. ఇచ్చట నొక విశ్రమారామము, సభాస్థలి, ఈతకొలను, ఖుతుబ్షాహీ, విజయనగర రాజుల నాటి చారిత్రక పురావస్తువుల ప్రదర్శన కొక మందిరమును నిర్మించు సంకల్పమును కలదు. ఈ ప్రణాళికపై నగు వ్యయము, తాజమహాలు, అజంతా మరియు గోల్ కొండలందు ప్రేక్షకులనుండి సేకరించు నామమాత్రపు ప్రవేశ పన్నుల వంటి పన్ను నుండి సులభముగానే రాబట్టుకొనవచ్చును. ఈ కార్యక్రమమునకు రూపకల్పన చేయు పద్ధతులు వెంటనే ప్రవేశపెట్టబడును.

శాసనములు:

ఆంధ్ర తెలంగాణా ప్రాంతములందు లభ్యమగు శిలాశాసనముల సేకరించు నభిప్రాయముతో, ప్రభుత్వమువారు "శాసన సంగ్రహ శాల" నిర్మాణమునకు అనుమతించినారు. ఇందలి యుద్యోగులు, దేవాలయములందు, పురాతన కట్టడములందును, మరియు నితరత్రా లభ్యమగు శాశసనముల ముద్రలు సేకరించి పరిష్కరించి సరియగు పాఠములు ప్రచురింతురు. ఇది ఆంధ్ర చరిత్రలో గల లోటులను సవరించుటలో శోధక పండితులకు సాయపడుటయేగాక నాటి సమాజ మత ఆచార వ్యవహారములు మున్నగు వానిని ప్రకాశిత మొనరించును. ఈ యోచన నారు లక్షల వ్యయంతో, నాలుగు సంవత్సరములలో పూర్తి కాగలదు. ఇది నాలుగవ ప్రణాళిక యందు జేర్చబడును. 1964-65 వ సంవత్సరము నందు దీనిపై 1,08,000 రూప్యములు వ్యయపరచదగు ప్రణాళికను ప్రభుత్వమువారికి 30-5-64 ఆర్. సి. నెం. 3274 న సమర్పించబడినది.

కార్యాలయపు నావరణములో నున్న ఏలేశ్వరము మంటపము నానుకొనియున్న భవనమును శాసన శోధక బృందము కొరకు సేకరించబడనున్నది. ఈ బృందములో నొక ఉప డైరెక్టరు, ముగ్గురు సహాయ డైరెక్టరులు, ఆర్గురు శాసన శోధక సహాయకులును

(మిగతా 18 వ పేజీలో)

రవీంద్ర కవీంద్ర ప్రశంస

చింతలపూడి సన్న్యాసిరావు

దిగ్వితానమ్ము తేజః ప్రదీప్తమ్మయ్యె
సరస హృన్నీరజాకి జాగరితమయ్యె
కవిరవీ ! ప్రాచ్యదిగ్భాగగర్భమందు
ధన్యతను గన్న నీ శుభోదయమువలన.

అసదృశగతి వాసించెను
రసికాదృతిఁ దృన్మనోజ్ఞ రసవత్కావ్య
ప్రసవామోదము యావ
ద్వసుగర్భపయిన్ రవీంద్ర ! వరకవిచంద్రా !

విశ్వకవీంద్ర సద్బిరుద విభ్రాజిత
జగదేక సత్కవీశ్వరుఁ డటంచు
నురుకీర్తి 'నోబెల్' బహూకృతి స్వీకృత
ప్రాజ్ఞాభినుత బుధేశ్వరుఁ డటంచు
బ్రాజ్ఞ లోకాధ్యక్ష భద్రాసనాసీన
ధన్య విద్వాంస మూర్ధన్యుఁ డనుచు
సర్వతోముఖలసత్సాంద్ర విజ్ఞాన సు
స్థిర రాజ్యపట్టాభిషిక్తుఁ డనుచు
సూరివర ! నిన్ను గనినట్టి భారతాంబ
శశ్వదానంద పారవశ్యము వహించె
ధీరవర ! నిన్ను గనుటచే భారతాంబ
విశ్వధాత్రీసతీ శిరోవీథి నిలిచె

గురుఁ డంచు న్నిరవద్య హృద్యకవితా కూలంకషప్రౌఢినీ
శ్వరుఁడంచున్ బహుసత్కళావిభవతత్త్వజ్ఞానపూర్ణాగ్రసో
దరుఁడంచున్ సకలావనీతల బుధేంద్రవ్రాత నక్షత్ర భా
స్కరుఁడంచుం బరమప్రమోదభరితస్వాంతాబ్జులై నిన్ భజిం
చిరిసద్భక్తి రవీంద్ర సత్కవి! యశస్వీ! భారతీయానుజుల్.


జనలోకస్తవనీయ నవ్యకవితా సామ్రాజ్యధౌరేయ ! ధీ
ధన వాక్పాటవధిక్కృతామర మహాధ్యక్షప్రియాచార్య! స
జ్జన వర్గాదరణీయ నీతినిలయా ! సంధించి తుద్యత్ప్రభా
వని రూఢిన్ రసికాగ్రణుల్ బళియనం బ్రాచీప్రతీక్షమా
ఘనవిజ్ఞానసుధాస్రవంతుల సమైక్యస్ఫూర్తిఁ బెంపొందఁగన్

భరతక్ష్మాచిరపారతంత్ర్యదళనప్రజ్ఞాప్రపూర్ణుండు మే
దురసౌహార్ద వినీతివృత్త జనసందోహప్రపూజ్యుండు సా
దరభంగిన్నిను గౌరవించుబుధమూర్ధన్యుండు గాంధీమహా
పురుషుం డామహనీయుఁ గూడి నిరతంబు న్నందనా
రామసుం
దర చింతామణి వేదికాస్థలుల విద్వద్గోష్ఠిఁ గావింతువే !
దివిజకవివరు గుండియల్ దిగ్గు రనఁగ
స్వర్గమున కేగె మా కవి సార్వభౌముఁ
డా మహాత్మునితోఁ జెల్మి నవధరించి
హస్తములు పట్టి నందనోద్యానసీను
రహివిహారం బొనర్తువే రవికవీంద్ర !


చతురబ్ధ్యావృత మేదినీవలయ విజ్ఞ ప్రాజ్ఞ విద్వద్గణా
తతభక్తి ప్రవణానురాగయుత తాత్పర్య ప్రయత్నప్రక
ల్పిత యుష్మచ్ఛత వార్షికోత్సవ శుభశ్రీయజ్ఞ సంభారభా
స్వత పుణ్యోదిత సౌహృదప్రచుర సౌభాగ్యప్రభావంబుసం
తతభద్రాంచిత శాంతి సంపదలు సంధానించు విశ్వంభరన్.

విశ్వకవి ! రవి సత్కవీశ్వర !
శాశ్వతము త్వత్స్వర్గ సౌఖ్యము
విశ్వమున త్వత్కీర్తి చంద్రిక
శాశ్వతంబుగ నిల్చుటన్.


బీభత్సమైన వరదలు




గుంటూరు జిల్లాలో వరద నీటిలో మునిగిన పొలాలు - విమానం మీదనుంచి తీసిన ఫొటో




వరదల్లో విజయవాడ బ్యారేజి, రైలు బ్రిడ్జి




కృష్ణా జిల్లాలో వరదల్లో మునిగిన గ్రామాలూ, వరిపొలాలూ.




కృష్ణానది వరదలవల్ల కొన్ని గ్రామాలు నీటమునిగి మిగిలిన ప్రపంచంతో సంబంధం లేకుండా పోయాయి. ఐ. ఎ. ఎఫ్. డకోటా విమానంలోంచి కృష్ణాజిల్లాలోని ఒక గ్రామం కనిపిస్తున్న తీరు.



మాచర్ల పాలిటి శోక దేవతఅయిన చంద్రవంక వాగుకు యిటీవలవచ్చిన వరదలవల్ల కొట్టుకుపోయిన 2 ఫర్లాంగుల రైలురోడ్డు దృశ్యం




మాచెర్లలో ప్రజల కష్టగాథల్ని వింటున్న ముఖ్యమంత్రి. కేంద్ర ఉక్కుగనుల మంత్రి.




వైద్యసహాయాన్ని అందజేయడానికై అక్టోబరు ౨౪ తేదీన ఒక విమానం హైదరాబాదు నుంచి బయలుదేరింది. రెవెన్యూ మంత్రి, ప్రధాన కార్యదర్శి స్వయంగా దగ్గరుండి మందుల్ని పంపడం చూడవచ్చు.




కృష్ణాజిల్లాలో నీట మునిగిన వరిపొలాలు



నాగార్జునసాగర్ దగ్గర వరదల ఉధృతాన్ని తిలకించడానికి ఘోషాస్త్రీలు కూడా ఉత్సకతతో వచ్చి చూస్తున్న దృశ్యం




మాచర్లలో ఆహారపదార్థాలను, మందులను పంపిణీచేసే విషయమై చర్చిస్తున్న రాష్ట్రముఖ్యమంత్రి, రెవెన్యూమంత్రి, వ్యవసాయమంత్రి, కేంద్ర ఆహార, నీటి పారుదల శాఖా మంత్రులు.




ముఖ్యమంత్రి, రెవెన్యూమంత్రి, కేంద్ర ఆహార, నీటిపారుదల శాఖామంత్రులు నాగార్జునసాగర్ వద్ద పరవళ్ళుతొక్కుతున్న వరదనీటిని చూస్తున్న దృశ్యం.



వరదనీరు తీసిన తరువాత మాచర్లలోని ఒక కుటుంబం తమ సామాన్లు శుభ్రపరచుకొంటున్న ఒక హృదయవిదారక దృశ్యం



ముఖ్యమంత్రి, కేంద్ర ఆహారమంత్రి, పి. డబ్ల్యు. డి. అదనపు కార్యదర్శి, ఛీఫ్ ఇంజనీరు (నాగార్జునసాగర్ ఆనకట్ట వద్ద)



పశ్చిమగోదావరిజిల్లాలో వేలకొలదీ ఎకరాలు వరదల్లో మునిగిపోయిన దృశ్యం



మరెవరూ కాదు, విమానంలోంచి యీ ఫొటోలన్నీ తీసిన శ్రీ డి ఎస్. నాయుడు

ఆదికవిస్తుతి

బొడ్డు బాపిరాజు

ఆదికవిరాజ ! భవదు
త్పాదిత కవితామృతస్రవంతిక తెలుగుం
గేదారంబుల రసికా
మోదస్ఫుట కావ్యసస్యములు పండించెన్.

శ్రీ వాణీ గిరిజాధినాథ పదరాజీవార్చనాస్నిగ్ధ వా
గ్వైదగ్ధ్యము, భారతావతరణాశాస్యంబు చాళుక్యభూ
దేవేంద్రాభిమతంబుదీర్చి చిరకీర్తిజ్యోత్స్న లూరించె, నిన్
భావింపంగల మస్మదాంధ్ర సుకవిప్రాచేతసున్ నిత్యమున్

వేదవ్యాసమునీంద్ర సాంద్రకవితాపీయూషముల్ తెన్గు మ
ర్యాదల్ పాదులుగట్టి నింపితి వనల్పప్రౌఢి, వీణా సము
న్నాద శ్రావ్యము నీదు కావ్యము నవామ్నాయమ్ముగా
జేయుధీ
వైదుష్యంబులనన్య పాలితయశః ప్రాగ్భారధౌరేయముల్.

ప్రభువు భూదేవదేవ సేవాపరుండు,
తత్కులబ్రాహ్మణుండు సత్కవివరుండు;
అడిగె రారాజు, కవిరాజు తొడగె కృతికి;
వెలయదే యది పంచమవేద మగుచు ?

వాణీ కరాబ్జాత వీణా సముద్భూత
సంగీత వాహినుల్ పొంగివచ్చి
గౌతమీ ధమ్మిల్ల కల్హార మకరంద
బిందుసందోహముల్ చిందివచ్చి
మహిత మార్కండేయ మంది రాంగణ సాంధ్య
కర్పూరహారతుల్ కదలివచ్చి
విష్ణువర్ధన ధరావిభుని భారతకథా
శ్రవణ కుతూహలాశయమువచ్చి
నిత్యసత్య నివాసమ్ము నీ యెడంద
పాద మిడి కావ్యరచన కుపక్రమించు
గడియ గంటమ్మునుండి వెల్వడిన వాక్కొ ?
ఆంధ్రుల యదృష్టరేఖ విప్పారెనేమో !

తియ్యని తెన్గు భాష యొకతీరును తెన్నును లేక యేశిలా
శయ్యనొ కన్ను మోడ్పుల వెసన్ వసివాడుచునున్న వేళ నీ
నెయ్యము సేదదేర్చి కమనీయ మృదూక్తుల దిద్దితీర్చు మే
లయ్యెను లెమ్ము భావికవియాత్రిక కోటికి రాచబాటగా.

రంగద్గాంగధు నీపునీతమగు ధారావేగముల్, కిన్నరీ
సంగీత స్వరవీచికా విశదవాచా వైభవమ్ముల్, రసో
త్తుంగ ప్రోజ్జ్వల సత్కథాకథన మాధుర్యమ్ము లొప్పారు స
త్సంగంబైన త్రివేణి సర్వకవి తీర్థక్షోణి నీ వాణియున్.

సన్నుత ధర్మశీలురకు సంహిత, సత్కవిరాజికిన్ రసా
భ్యున్నత కావ్య, మార్యతతి కుజ్జ్వలమై తగునీతిశాస్త్రమి
ట్లన్ని తెరంగులం గెరలు నక్షరసారములా కవిత్వ సం
పన్నయ నన్నయార్య ఋణభారము లెన్ని యుగాలు
తీర్చునో !

సుందర సంస్కృతాంధ్ర పదశోభిత మంజులశైలి, వెన్నెలల్
చిందులుదొక్క పాల్కడలి చిమ్మిన కమ్మని పూలజల్లుగా
విందులుసేయ, కావ్యవనవీధుల నవ్యవసంత సంతతా
స్పంద పరిమళంబులయి సాగులు నేటికి నీయశశ్ఛటల్ !

గురుపత్ని కీప్సిత కుండలంబు లొసంగు
నల యుదంకు ననన్య సులభశక్తి,
అమ్మ దాస్యవిముక్తి కమృతంబు సాధించు
వినతాత్మజుని దేవవిజయదీక్ష,
తన వయస్సంపద తండ్రికి నెరవిచ్చు
పూరుని యశ్రుత పూర్వగరిమ,
సతి సభాక్షితి వియద్వాణి సాక్ష్యము గూర్చు
చెలి శకుంతల భర్తృశీల మహిమ,
అదిగ మనోహరమ్ములైనట్టి కథలు
కావ్యరసవాద కాంచనాగములు సేసి
మాకిడిన సూక్తినిధి నిన్ను మరవగలమె
సన్నుత స్నేహ గుణధుర్య ! నన్నపార్య !

నీయెద నెంత తియ్యమును నెయ్యము నించినవాడో తాను నా
రాయణభట్టు, బుద్ధికి బృహస్పతికిం బ్రతివచ్చు నీకు ఆ
సాయమదెంత సూక్తి ఘనసారరజస్సముదారమౌ యశః
కాయ మొసంగినావతనె, కాతడు నెంతయదృష్టశాలి యో!

వాగనుశాసన ప్రతిభ, భారత కావ్యగుణ ప్రశస్తి, క
ల్పాగమువంటి భూవరుని ప్రాపును నీపయి నీసుగూర్పగా
ప్రోగులు వెట్టు నింద లవి పో చిరుమబ్బులు, కప్పునే సుధీ
భోగకవిత్వ తత్వ పరిపూర్ణ సుధానిధి ! నీయశఃప్రభల్ ?

శారదరాత్రులం దెలమి సాగెడు నీ కవితా వియర్ఝురీ
ధారల నడ్డగించెనుగదా త్వదమంగళ మృత్యుశైల; మా

ధారము లేని భారతలతన్ గొనసాగగ జేసి వాసి పెం
పారుట తిక్కనాదులు భవత్ కరుణాపరిణామముల్ సుమీ.

సారమతుల్ నుతింపగ ప్రసన్న కథాకలితార్థయుక్తి వి
స్తారముగాగ భారతము సర్వము నీవయి పల్కియున్నతత్
శారద చంద్రికా తుహినసారములన్ వికసించి మా మనః
కైరవముల్ ప్రమోద మధుగంధములన్ పులకించిపోవవే!

ఆంధ్ర కవితా సరస్వతి యంఘ్రిపీఠి
నీవు పెట్టిన దీపిక నిండు కాంతి
దాటివచ్చి శతాబ్దంపు ద్వారసీమ
లిపుడు వెల్గించు మా తెల్గు హృదయవీధి

(15 వ పేజీ తరువాయి)

మరియు నితర అవసరమగు సిబ్బందియు నుందురు. దీనికిని సమావేశ ప్రదర్శనముల కును అనువగు భవనము నిర్మించుపని ప్రభుత్వావస్తుశాఖాధిపతి కప్పగింపబడినది.

ఏలేశ్వరము త్రవ్వకములలో దొరికిన పురావస్తు ప్రదర్శన కనువగు నొక మంది రమును నాగార్జునకొండపై కేంద్ర ప్రభుత్వమువారి ప్రదర్శనశాల సమీపమున నిర్మించు నభిప్రాయము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమునకు గలదు. అందువలన కేంద్ర ప్రభుత్వమువారిచే ప్రదర్శిత మగు నాగార్జున కొండయందలి బౌద్ధ నాగరికతా శిల్పములను, సమకాలీనములగు ఏలేశ్వర మందలి లభ్యమైన పురావస్తు సంచయము నోత్పత్తిగ, సవివరముగ పరిశీలించు నవకాశము శోధకులకు పండిత పామరులకు లభ్యము కాగలదు. అయితే నాగార్జున కొండపై మరొక ప్రదర్శనశాల నిర్మించు నవకాశము, కేంద్ర ప్రభుత్వమువారి యోచన ప్రకారము సాధ్యపడదు. అందు వల్ల ప్రభుత్వ వసతి గృహ మగు "విజయ విహార్"ను నానుకొని నాగార్జున సాగరము నుపలక్షించు కృష్ణవేణీనామ తటిని విజయపురిలో వేరొక స్థల మిందుకు నిర్ణయించ బడినది. ఈ స్థలసేకరణ జరిగిన తదుపరి, ఏలేశ్వరమందు లభ్యమైన పురావస్తువులప్రదర్శించుట కొక మందిరము నిర్మించబడును.

ముందు రానున్న ప్రణాళిక కాలములో, కర్నూలు, కడప, అనంతపురము, నెల్లూరు, నిజామాబాదు, వరంగల్ మున్నగు ప్రముఖ జిల్లా కేంద్రములలో ప్రదర్శనశాల లేర్పాటగును.

ప్రజా సమూహమునకు మన సంస్కృతి యొక్క భూతకాలమందలి వివిధ ఛ్ఛాయలు జూపి, వానియం దభిరుచి గల్పించి జాతి, మత, కుల, వర్గరహితముగ, మనపూర్వీకు లెట్లు మెలగిరో ప్రదర్శించి, వారిలో పరస్పర సౌహార్ద సానుభూతి గల్పించి భావ సమైక్యత, జాతీయతకు దోహదమొన రించు నభిప్రాయముతో పై యోచనలను ప్రభుత్వము జొప్పించుచున్నది. ఇట్టి సమైక్యతా భావన, మరియు జాతీయత, సౌభాగ్యమునకు పురోభివృద్ధికి అత్యంతావసరములగు పునాదులు.

పరిచురణలు:

1960-61 నుండి నేటివరకు ఈ శాఖవారి ప్రచురణలు ఇరువదియారు. నేటి వరకు పురావస్తుశాఖకు సంబంధించినవి 18 ప్రచురణలు, ప్రదర్శనశాలకు సంబంధించినవి 8 ప్రచురణలు జరిగినవి. ఇందుకైన 70,600 రూప్యములలో కేంద్ర ప్రభుత్వము 18,000 సహాయముగ భరించినది. ముందు ప్రణాళికా కాలములలో 1.5 లక్షల వ్యయముతో సుమారు నలుబది గ్రంథముల ప్రచురించు నభిప్రాయము గలదు.

బొమ్‌డిలాకు పదిమైళ్ళ దూరంలో-

హిందీమూలం: ప్రాణనాథ్ సేఠ్ **అనువాదభారతి** ఆంధ్రానువాదం: దండమూడి మహీధర్

పాత్రలు :

జయతుంగ్	...	నేఫా ప్రాంతపురైతు
జన్మూ	...	జయతుంగ్ భార్య
చింగ్-పో	...	చైనా సార్జెంటు
లీ-చున్	...	చైనా సైనికుడు
దేవసింహ	...	భారత సైనికుడు

[బొమ్‌డిలాకు పదిమైళ్ళ దూరంలో ఒకచిన్న గ్రామం. చెక్కలతో కట్టబడిన ఇంటిలో ఒక సాధారణమైన రైతు కుటుంబం. ఇంటి ముందు వసారా! వెనుక పక్క వంటయిల్లు, దానికి ఆనుకొని మరొక చీకటి గది ఉన్నాయి. ఆగదిలో కట్టెలూ, పిడకలూ, తవుడు, తదితర కొయ్య సామానులూ నిండుగా ఉన్నాయి. వంట యింట్లో పాత్రలు చెల్లాచెదురుగా పడివున్నాయి.....

... సమయం: రాత్రి పదిగంటలు. తెర లేవగానే విచార వదనంతో వసారాలో బల్లమీద కూర్చున్న జయతుంగ్ కన్పిస్తాడు. వయస్సు దాదాపు 60 సంవత్సరాలు. వంటయింట్లో నుంచి లైటు వెలుతురు అస్పష్టంగా కన్పిస్తున్నది. జయతుంగ్ భార్య జన్మూ వంటయింట్లో పొయ్యిమీద ఉన్న పాత్ర మూత తీసి చూస్తుంది.]

జన్మూ : (కోపంగా) ఈ చైనావాళ్ళకు ఏం పొయ్యేకాల మొచ్చిందో ఏమో – బాగా పెరిగిన పంటపొలాలను ధ్వంసం చేశారు. చెట్లూ చేమల్నీ నేలమట్టం చేశారు. పెరటిలోని కూరగాయల్నికూడా కొల్లగొట్టుకొని వెళ్ళారు. మనం ఏం తిని బతకాలో ఏమిటో పాలుపోవడంలేదు!

జయతుంగ్ : ఏమిటి తినేది ? ఇక మనం పస్తులుండవలసిందే! అంతకుమించి మరొక మార్గ మేమీ కన్పించడంలేదు. ఈ ప్రాంతం ఎంత ప్రశాంతంగావుండేది! ఎంత సంతోషంగా కాలం గడుపుతూ వుండేవాళ్ళం! ఇప్పు డేముంది – ఆయుధాల మోతలతో చెవులు దిబ్బళ్ళు పడిపోతున్నాయి. ఈ హిమాలయ పర్వత ప్రాంతాల ప్రశాంత వాతావరణంలో ఒక్కసారిగా కల్లోలం చెలరేగింది. మన పంటపొలాలూ, ఇళ్ళూ, పిల్లలూ, మనమతం అన్నీ ప్రమాదస్థితిలోవున్నాయి. ఇదంతా ఏమిటో, ఎందుకో అర్థం కాకుండా వున్నది!

జన్మూ : ఆ చైనా దోపిడిమూకల్ని అడుగు! మన దేశంమీద ఎందుకు దాడి జరపవలసివచ్చిందో, అన్నెం పున్నెం ఎరగని గ్రామస్థుల్నే యిలా ఎందుకు పీడిస్తున్నారో – అడిగి తెలుసుకో!

జయతుంగ్ : అడిగాను – మన పొలంలోనికి ప్రవేశించి జబర్దస్తీగా పంటను దోచుకొనడానికి పూనుకున్న చైనీయుల దళాన్ని అడిగాను. మా తిండికి కొంచెం మిగిల్చి వెళ్ళమనికూడా వేడుకున్నా; దానికి సమాధానం ఏం చెప్పారో తెలుసా ? "మేము మీ సోదరులం! మీకు విముక్తి కలిగించడానికి మే మిక్కడికి వచ్చాం." అని అంటూ – వికటాట్టహాసం చేశారు. ఒకడు తుపాకిని నా రొమ్ముకు గురిపెట్టాడు! "కాల్చు! మాపంటలను ఎలాగూ దోచుకున్నారు; ఆకలితో అలమటించేకంటే యిలా చావడమే మంచిది," అని నిలబడ్డాను. కాని వాళ్ళ సర్దారు వారించాడు. "వీ డెవడో వట్టి

పిచ్చివాడివలె ఉన్నాడు ! చావంటే భయపడడంలేదు ! వది లెయ్యండి !" అని అన్నాడు.

జన్మూ : ఆ వెధవల చేతుల్లో చావడానికి ఎందుకు సిద్ధపడ్డావు ?

జయతుంగ్ : ఇదిగో, జన్మూ , పిరికి వాళ్ళవలె జీవించడం కంటే– ధైర్యంగా చనిపోవడమే మేలనిపించింది. లేకపోతే మన మీద జబర్దస్తీ చేస్తాడా ? మన పొలాలను కొల్లగొడతాడా ? ఇటువంటి దోపిడిమూకలముందు మన పూర్వులు ఎప్పుడైనా తలవంచారా ?

జన్మూ : అవునుగాని – ఈదుర్మార్గులు మన పవిత్ర భారత భూమిని వదిలి ఎప్పుడు వెడతారో ?

జయతుంగ్ : మంచి ప్రశ్నే నీది ! దోపిడి మూకలకు, దొంగల ముఠాలకు నీతి, నిజాయితీ, ధర్మం, అధర్మం – అనే జ్ఞానం వుండదు ! అటువంటి దుర్మార్గులు మన భారత భూభాగం మీది నుంచి వెళ్ళిపోవాలీ అంటే – ఒకటే ఉపాయం వున్నది – ధైర్యంగా నిలబడి మన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించాలి. అప్పుడే వాళ్ళను మనం యిక్కడినుంచి తరిమివేయగలం !

జన్మూ : నా కెందుకో చాలా భయంగా వున్నది. ఆ చైనా వాళ్ళ కళ్ళల్లో కనిపించే క్రౌర్యం, రాక్షసత్వం, నన్ను భయపెడుతూ వుంటాయి.

జయతుంగ్ : పిచ్చిదానా ! భయ మెందుకు ? మనం మృత్యువుతో కూడా ధైర్యంగా పోరాడతాం. ఈ నీచ చైనా మూకల్ని ఎలా తరిమికొట్టాలో మన భారతీయ జవానులకు చాలా బాగా తెలుసు !......అవునుగాని – ఏమిటీ పొయ్యిమీద ?

జన్మూ : అట్లా అడవివైపుకెళ్ళి ఏవో ఆకులు తెచ్చాను. వాటినే పొయ్యిమీద పెట్టాను. ఆకలి తీరాలంటే ఏదో ఒకటి కావాలిగా !...కాని ఇంట్లో వుప్పులేదు.

జయతుంగ్ : ఏమైంది వుప్పు ?

జన్మూ : ఆ చైనావాళ్ళు పట్టుకెళ్ళారుగా! ఆ వంటగదిలో సామాన్లు ఎలా చిందర వందరగా పడివున్నాయో, చూడు! అంతా వాళ్ళ చలవే !

జయ : (వ్యగ్ర భావంతో) మళ్ళా వచ్చారా ఆ నీచులు ? ఎప్పుడొచ్చారు ?

జన్మూ : నువ్వు కట్టెలకోసం అడవికి వెళ్ళినప్పుడు వచ్చారు.

జయ : ని న్నేమయినా అన్నారా ?

జన్మూ : ఏమీ అనలేదు "ముసలిదానవని వదిలేస్తున్నాం" అని మాత్రం అన్నారు. మన పక్కింటివాళ్ళ పిల్ల లేదూ – లామో – ఆమెనుకాస్తా బలవంతంగా తీసుకెళ్ళిపోయారు.

జయ : ఏమిటీ ? లామోను బలవంతంగా తీసుకెళ్ళారా ?

జన్మూ : అవును – పెళ్ళి అయి ఆరు మాసాలన్నా గడవలేదు. పైగా కడుపుతోంది పాపం ! కొంచెం అందంగా వుంటుందేమో – కిరాతకులకు కన్ను కుట్టింది.

జయ : ఈ రాక్షసులు ఎంతటి దురాగతానికి పాల్పడ్డారు ! తలుచుకుంటే కడుపు తరుక్కుపోతున్నది !

జన్మూ : నాకు మాత్రం చాలా భయంగా వున్నది. అడవుల్లోకి పారిపోయి తల దాచుకుందాం. ఏమంటావు ?

జయ : ఈ రాత్రికి ఎలాగో యిక్కడే గడిపి రేపు వుదయం వెళ్ళిపోదాం.

జన్మూ : ఈ రాత్రికి నాకు నిద్రపట్టదు.

జయ : విచారించకు : బుద్ధభగవానుడు మనల్ని రక్షిస్తాడు.

జన్మూ : ఆ వుడకబెట్టిందే కొంచం వడ్డించనా ?

జయ : నాకు ఆకలిగాలేదు. నువ్వుతిను.

జన్మూ : ఉప్పులేని చప్పిడిదే తిందాం, లే! ఉదయం లేచి మళ్ళా నడిచిపోవాలిగా !

[జన్మూ పొయ్యిమీదినుంచి పాత్రను కిందికి దించుతుంది. పళ్ళెములో వడ్డించబోతూవుండగా బయట బూట్లచప్పుడు విన్పిస్తుంది. ఆ వచ్చిన వాళ్ళు – చైనావాళ్ళని – వాళ్ళ మాటల్నిబట్టి తెలుస్తుంది.]

జన్మూ : చైనావాళ్ళు ! చైనావాళ్ళు మళ్ళీ వచ్చారు.

జయ : వస్తే రానివ్వు. మన దగ్గిర ఇప్పుడు ఏముంది గనుక దోచుకుంటారు? రెండు ముసలిప్రాణాలున్నాయి. కావాలంటే ఆ ప్రాణాల్నే అప్పగించుదాం. మన రక్తంతో వాళ్ళ దాహం తీరుతుందేమో పాపం ! జన్మూ ! భయపడకు ! ధైర్యంగా వుండు. మృత్యువుకూడా మన వుభయుల్నీ వేరు చేయలేదు.

[తలుపు తట్టిన చప్పుడు. తలుపు తెరవడం కొంచెం ఆలస్య మయ్యేటప్పటికి తుపాకి మడిమలతో గట్టిగా తలుపు కొడతారు.]

సార్జెంటు చింగ్–పో : తలుపు తెరవండి. లేకపోతే వీటిని విరగ్గొడతాం. ఈ ఇంటిని నేలమట్టం చేస్తాం. ఇంట్లోని వాళ్ళ శవాలు బయట పడతాయి ?

జన్మూ : (తలుపు తెరుస్తుంది) ఏమిటి నాయనా? ఎందు కలా తలుపులు బాదుతారు? మేము మిమ్మల్ని ఏం చేశామని యిలా హింస పెడుతున్నారు? ఏదో ఈ భూమిని దున్ను కొని మా బతుకు మేం బతుకుతున్నాం. దీన్ని నమ్ముకుని మా పూర్వీకు లంతా యిక్కడే వున్నారు. మేము ఏం చేశామని మీరీ దౌర్జన్యానికి పూనుకున్నారో మా కర్థం కావడం లేదు. మీకు పుణ్య ముంటుంది — మమ్మల్ని వదిలెయ్యండి.

[సార్జెంటు చింగ్-పో తుపాకి ఆ వృద్ధురాలికి గురిపెట్టి లోనికి వస్తాడు. అతని వెంట చైనా సైనికుడు — లీచున్ రైఫల్‌తో నడుస్తున్నాడు.]

చింగ్-పో : ఏయ్! ముసలి పీనుగా! ఏదీ అతగాడు? చూపించు, ఎక్కడున్నాడో?

జన్మూ : ఎవరూ? ఎవరిని గురించి మీ రడిగేది? అసలు విషయ మేమిటి?

చింగ్-పో : ఒరేయ్ లీ-చున్, ఆ విషయ మేమిటో ఈ ముసలి దానికి చెప్పు. అసలు ఈ ముసలి పీనుగకు ప్రాణాలమీద తీపి వున్నదేమో అడుగు. సార్జెంటు చింగ్-పో గారికి మహా కోపమని చెప్పవోయి! (వికటాట్టహాసం చేస్తాడు)

లీ-చున్ : ఇదుగో ముసలమ్మా! మీ ఇంట్లోకి ఒక భారతీయ జవాను వచ్చాడు. వాడు మా కళ్ళల్లో కారం కొట్టి మరీ వచ్చాడు. వాడికి తుపాకిగుండు దెబ్బ తగిలింది. తల మీద బాగా గాయం కూడా అయింది. రక్తం ధారలు కట్టి ప్రవహిస్తున్నది — వాడు మమ్మల్ని ముప్పుతిప్పలు పెట్టాడు. ఇద్దరు చైనా సైనికుల్ని కొండలోయలోకి బంతిని విసిరినట్టు విసిరాడు. ఇద్దర్ని ప్రవహిస్తున్న నదిలోకి నెట్టేశాడు— అటు సూర్యుడు ఇటు పొడిచినా సరే — ఆరు నూరయినా సరే — ఆతగాణ్ణి పట్టి బంధించి తగిన బుద్ధి చెబుతాం. మాకు తెలుసు — ఆతగాడు మీ ఇంట్లో దూరాడు. ఎక్కడున్నాడో చెప్పు! చెప్పకపోయావంటే — నువ్వు తాం... నిల్చున్న పళంగా నేల కూలతావు!

చింగ్-పో : ఇదుగో ముసలిదాదా! ఈ సార్జెంటు వున్నాడే — వీడికి మహా కోపం! మహా దుష్టుడు కూడాను. తెలిసిందా! ఆ జవానుగాణ్ణి మాకు అప్పగిస్తావా — అప్పగించు లేకపోతే — ఈ ఇంటికి నిప్పంటిస్తాం. నీ మొగుణ్ణి — నీ ముందరే యమలోకానికి పంపిస్తాం, చెప్పానుకదూ? ఈ సార్జెంటు వున్నాడే — వాడు మహా దుర్మార్గుడు! తెలిసిందా? చెప్పు!

జన్మో : అయ్యా, నేను ఎవర్నీ చూడలేదు; ఇక్కడకు ఎవరూ రాలేదుకూడాను.

చింగ్-పో : అయితే, మీయింట్లో వున్నవాళ్ళందర్నీ తీసుకొచ్చి నాముందు హాజరుపెట్టు; వాళ్ళ-దర్నీ అడిగిచూస్తాను.

జయతుంగ్ : సార్జెంటుగారూ! మాకుటుంబంలో-మేమిద్దరం తప్ప మరేవ్వరూలేరు! మాకున్న పశువుల్ని కాస్తా మీరే తోలుకెళ్ళి తినేశారు. మాపంటలు దోచుకెళ్ళారు. మా యిళ్ళను కొల్లగొట్టారు. మా ఉప్పంతా పట్టుకెళ్ళారు. ఇంకేమీ మిగిలి వున్నాయి? ఆఁ...మాప్రాణాలు రెండు మిగిలాయి. కావాలంటే వాటినికూడా తీసుకెళ్ళండి.

చింగ్-పో : (కొంచెం శాపీగా) మేము మీ ముసలి ప్రాణాలను తీసుకెళ్ళడానికి రాలేదు, తెలిసిందా? మీరూ మేమూ సోదరులం! 'చీనీ హిందీ భాయీ భాయీ!' మే మున్నామే చైనీస్ సైనికులం—మాకు బుద్ధ భగవానుడంటే అమిత భక్తి వున్నది. మీకూ బుద్ధుడంటే భక్తి వున్నది. అసలు మే మిక్కడకు వచ్చింది మిమ్మల్ని రక్షించడానికే సుమా! భారతీయ జవాను మామీద విరుచుకుపడ్డాడు, మావాళ్ళను ముప్పుతిప్పలు పెట్టాడు. అతగాణ్ణి మేము క్షమించలేం. వాణ్ణి శిక్షిస్తాం. వాణ్ణి మా కప్పగించు.

జయతుంగ్ : అయ్యా! ఇక్కడి కెవరూ రాలేదు. మే మెవరినీ చూడనుకూడాలేదు.

జన్మూ : మమ్మల్ని వదిలెయ్యండి. మా కేమీ తెలియదు.

చింగ్-పో : తెలియదూ? సరే—మీకు మాటలతో చెబుతూంటే అర్థం కావడంలేదు. దెబ్బకు దయ్యం దిగొస్తుంది... [ముసలిదాన్ని తుపాకి మడెంతో వెనక్కు తోస్తాడు. ఆమె కింద పడిపోతుంది.]...నువ్వట్లా పడివుండు!...మమ్మల్ని మోసం చేస్తావా? అంత వెదికి చూసి వాణ్ణి పట్టి బంధించి తీసుకెడతాం — నీముందే! ఆ జవాన్ - ఇవ్వాళ్ళ నలుగుర్ని చంపాడు, అంతకుముందు మరొక ఆరుగుర్ని తన పొట్టన బెట్టుకున్నాడు. వాణ్ణి నువ్వు ఎక్కడో దాచివుంచావు. ఏయ్! లీ-చున్!

లీ-చున్ : ఎస్, సర్!

చింగ్-పో : నువ్వు తుపాకి పుచ్చుకొని యిక్కడే నిలబడు. ఒకవేళ ఆ జవాను కన్పిస్తే వెంటనే కాల్చివెయ్యి. ఈ ముసలి వాళ్ళిద్దర్నీ కూడా ఇంట్లో బెట్టి, ఇంటికి నిప్పంటించుదాం.

(జయతుంగ్‌తో) ఏయ్ ! ముసలోడా ! ఆ లైటు తీసుకొని యిలా నాతో రా.

(జయతుంగ్ లైటు తీసుకొని వసారాలోకివస్తాడు)

చింగ్_పో : ఈ పెద్దపెద్ద పెట్టెలేమిటి ?...ఏమున్నాయి దీంట్లో ?

జయతుంగ్ : ఏమీలేవు. ఖాళీవే !

చింగ్_పో : ఖాళీవేనా ? ఖాళీ పెట్టెలు ఎందుకున్నాయి ?

జయతుంగ్ : వీటిలో ధాన్యం వుండేది !

చింగ్_పో : ధాన్యమా : అయితే ఇప్పు డేమయినట్టూ ? బహుశా మీ భారతీయ జవాన్లకు పంచిపెట్టి వుంటావు. అంతేనా ?

జయతుంగ్ : (వ్యంగ్యంగా) ఉహుం — మన చీనీ భాయీ లున్నారే - వారు - పట్టపగలు దోచుకున్నారు. బుద్ధ భగవానుని పరమ భక్తులు ! (నవ్వుతాడు.)

చింగ్_పో : [తుపాకిని నేలమీద కొట్టి] ఏయ్ ! ముసలోడా ! మాటలు జాగ్రత్తగా రానియ్ !...నీ అధికప్రసంగం కట్టిపెట్టి వంటయింటి వెనకపక్కగది చూపించు !

జయతుంగ్ : అలాగే చూపిస్తా !

చింగ్_పో : ఈ వంటయింట్లో సామాన్లన్నీ ఇలా చిందరవందరగా పడివున్నా యెందుకు ?

జయతుంగ్ : అలా చిందర వందర చేశారు మరి !

చింగ్_పో : ఎవరు ?

జయతుంగ్ : ఇంకెవరు ? మన చైనా సోదరులే !

చింగ్_పో : ముసలోడా ! నోర్ముయ్; జేనెడు పిట్టకు మూరెడు తోకన్నట్టు - మనిషి ముసలాడివే అయినా మాటలు మాత్రం మహా పౌరుషంగా మాట్లాడుతున్నావు.

లీ_చున్ : (బిగ్గరగా) సార్జెంట్‌గారూ ! సార్జెంట్‌గారూ !

చింగ్_పో : ఏమిటోయ్ ?

లీ_చున్ : ఆ భారతీయ జవాను ఈ యింట్లోనే దూరివుంటాడండి ! ఎందుకంటారా — అక్కడ బయట నెత్తురు చుక్కలు కన్పించాయండీ ! ఈ ఇంట్లోనే వుండివుంటాడు.

చింగ్_పో : (కోపంగా) ఏయ్ ముసలమ్మా ! ఇప్పటిదాకా నంగనాచిలాగా మాట్లాడావుకదూ ? అసలు విషయం యిప్పుడు బయటపడింది. ఇప్పటికి మించిపోయిం దేమీలేదు — నిజం చెబితే వదిలిపెట్టేస్తా — చెప్పు ! ఆ జవానును ఎక్కడ దాచిపెట్టావు ? నీకు తెలియదేమో - మా చైనా సైనికులకు కనికరం అంటే ఏమిటో తెలియదు !

జన్మూ : అయ్యో! నిజం చెబుతున్నాను-మాయింట్లో ఎవరూలేరు?

జయతుంగ్: ఇదిగో సార్జెంటూ ! ఈ యింటిని మీ ఇష్టం వచ్చినట్టు తనిఖీ చేసుకోండి. అంతకంటే ఇంకేం చెప్పమంటారు ?

చింగ్_పో: ఏయ్ ! నువ్వు మాట్లాడకు ముసలోడా !

లీ_చున్: ఆ వెనక గదిలో ఏమున్నాయి ?

జయతుంగ్: ఏమున్నాయో చూస్తే మీకే తెలుస్తుంది — కట్టెలూ పిడకలూ, తవుడూ, పనికిరాని కొయ్య సామాన్లూ-అటువంటివే ఏవేవో వున్నాయి !

జన్మూ : ఈ గదిని ఎప్పుడూ మూసేసి వుంచుతాం. ఈ గదిలోకి ఎవ్వరూ వెళ్ళలేదు. మే మిక్కడే వున్నాం.

చింగ్_పో : ఏయ్ వోల్డువుమన్ ! చుప్‌రహో ! ఈ గదిని మేము పరీక్షించిచూడాలి.

జయతుంగ్: అలాగే చూడండి. మా కెటువంటి అభ్యంతరమూ లేదు.

(జన్మూ ముందు నడుస్తుంది, వెనుక యిద్దరు చైనా సైనికులు గదిలోపలికి నడుస్తారు. గది చీకటిగా వుంది. భరించరాని దుర్గంధ మేదో గదిలోనుంచి వస్తున్నది. చైనా సైనికు లిద్దరూ ముక్కులు మూసుకున్నారు.)

చింగ్_పో: ఏయ్ ముసలీ ! లాంతరు చూపించు !

(జయతుంగ్ లాంతరు తెస్తాడు. చింగ్_పో గదిలోని సామాన్లని అటూ ఇటూ కదిలించి చూస్తాడు.)

ఏమోయ్ లీ_చున్ !

లీ_చున్: ఎస్ సర్ !

చింగ్_పో: ఈ గదిలో ఎవరూ లేనట్టున్నది. అయితే అతగాడు ఎటు వెళ్ళినట్టు ?

లీ_చున్ : మనల్ని చూసి పారిపోయి ఉంటాడండీ !

చింగ్_పో: అయితే ఇప్పు డేమిటి చేయడం?

లీ_చున్ : సర్ ! ఈ చీకటిలో మనం ఎక్కడని వెదుకుతాం ? ఏ గోతిలోనో నక్కివుంటాడు. ఎముకలు కొరికే ఈ చలికి చస్తాడులెండి ! పైగా గాయపడ్డాడుకూడానేమో !

చింగ్_పో: అయితే, వాణ్ణి మనం రేపు ఉదయం వెదుకుదాం. ఇక్కడ విశ్రాంతి తీసుకుందాం ఈ రాత్రికి !

లీ_చున్ : సర్ ! మీకు ఆకలిగా వున్నదేమో ?

చింగ్_పో : ఆకలిగానే వున్నదోయ్ ! (జన్మూతో) ఏయ్ ముసలమ్మా ! ఏమి టా పొయ్యిమీద ?

జయతుంగ: గడ్డి !

చింగ్‌పో : ఏయ్ ! నోర్ముయ్ ! ఈ చైనా సార్జెంటుకు కోప మొస్తే మనిషి కాదు ! తుపాకితో పిట్టను పేల్చినట్టు పేల్చిపేస్తా.

జయతుంగ్ : మా మాటలమీద మీకు నమ్మకం లేకపోతే- స్వయంగా వెళ్ళి చూసుకోండి, మీకే తెలుస్తుంది. మా ఇళ్ళలోని ధాన్యం దోచుకొన్నారు, కూరగాయల తోటల్ని

నాశనం చేశారు! ఇక మేము గడ్డితినక ఏం తింటాం మరి? ఈ పొట్టకు ఏదో ఒకటి కావాలిగా!... గడ్డి తయారుగా వుంది. భోంచేస్తారా మరి?

చింగ్–పో: ఒరేయ్ లీ! వెళ్ళిచూడవోయ్–పొయ్యిమీదఏమున్నదో?

లీ–చున్: (వెళ్ళి చూస్తాడు.)

చింగ్–పో: ఏమున్నదోయ్ ఆ పాత్రలో?

లీ–చున్: పచ్చిగడ్డి ఫలహారం సార్! (బిగ్గరగా నవ్వుతాడు)

చింగ్–పో: ఈ ముసలివాళ్ళిద్దరూ చాలా దుర్మార్గుల్లాగా కన్పిస్తున్నారు.

[జన్మూతో] ఏయ్ ముసలీ! మాకు వరి అన్నం కావాలి! వరి అన్నం! తెలిసిందా? వెంటనే వండిపెట్టు! [చింగ్–పో తన వీపు మీద నుంచి బియ్యం తీసి జన్మూకు అందిస్తాడు. చేతిలోని తుపాకిని పొయ్యికి దగ్గరగా పెడతాడు. ఆ దగ్గర్లో వున్న బల్లమీద పడుకుంటాడు.]

జన్మూ: పొయ్యిలో నిప్పులేదు.

చింగ్–పో: ఆ గదిలో ఉన్నాయిగా కట్టెలు! తెచ్చి త్వరగా వండిపెట్టు! ఏమోయ్ లీ–చున్! జాగ్రత్తగా చూస్తూ ఉండు. నేను ఈ బల్లమీద పడుకొని ఒక కునుకు తీస్తా. రెండు రోజుల్నుంచీ నిద్రే లేదు.

[జన్మూ లాంతరు తీసుకొని – కట్టెలు తీసుకరావడానికి వెనుక గదిలోకి వెడుతుంది. ఆమె కట్టెలు తీస్తువుండగా ఒక్కసారిగా ఎవరో ఆమె నోటిని మూసేస్తాడు.]

దేవసింహ: (నెమ్మదిగా) అమ్మా! భయపడకు, నేను భారతీయ జవాన్‌ను. ఈ చైనా కిరాతకులు నన్ను గాయపరచారు. ఎలాగో వచ్చి యిక్కడ దాక్కున్నాను.

జన్మూ: (వణుకుతూ) నువ్వు యిక్కడే వున్నావా? ఆ రాక్షసులు ఇంట్లోనే వున్నారు. నువ్వు కన్పిస్తే కాల్చివేస్తారట! మమ్మల్నికూడా వదిలేట్టులేరు! ఇంటికి నిప్పంటిస్తారట! ఏమిటి మార్గం?

దేవసింహ: అమ్మా! గాభరాపడకు! ఈ నీచులకు గుణపాఠం ఎలా చెప్పాలో మనకూ తెలాసును! అమ్మా! నాకు చాలా దప్పికగా వున్నది, కొంచెం మంచినీళ్లు తెచ్చిపెడతావా?

జన్మూ: బాగా దప్పికగా వుందా బాబూ?

దేవసింహ: అవునమ్మా!

జన్మూ: అలాగే తెచ్చిపెడతాను, జాగ్రత్తగా వుండు!

చింగ్–పో: (కోపంగా) ఏయ్ ముసలిదానా! ఎందుకింత ఆలస్యం చేస్తున్నావు? ఆకలేస్తున్నది త్వరగా రా!

జన్మూ: వస్తున్నా.

[జన్మూ వచ్చి కట్టెలు పొయ్యిలో పెడుతుంది. కొంచెం ఆగి—తనలో తాను] ఉహూ, ఈ కట్టెలు మరీ పెద్దవయినాయి. చిన్నవి తీసుకొస్తాను!

చింగ్–పో: ఆ (కళ్ళు మూసుకునే) తొందరగా కానివ్వు.

[జన్మూ చాటుగా మంచినీళ్లు తీసుకుని ఆ గదిలోకి ప్రవేశిస్తుంది.]

జన్మూ: (నెమ్మదిగా) బాబూ! ఇవిగో మంచినీళ్ళు.

దేవసింహ: అమ్మా! నీ మేలు మరచిపోలేను. నాలో కొత్త ఉత్సాహం ప్రవేశించింది. ఇక్కడి నుంచి వెళ్ళి నేను వంద మంది చైనా ముష్కరులను చంపి మరీ నేను చస్తాను.

జన్మూ: బాబూ! నీకు విజయం సిద్ధిస్తుంది. నువ్వు మా కోసం పోరాడుతున్నావు. మా ప్రాణాలను, మా పొలాలను రక్షించడానికి పోరాడుతున్నావు. భారత భూభాగాన్ని ఈ దోపిడి ముఠాల నుంచి రక్షించడానికి పోరాడుతున్నావు. ఈ దుర్మార్గులకు ధర్మాధర్మ వివక్షత లేదు. వీళ్లు మూర్ఖులు! ఎదుటి వాళ్ళను ఎలా గౌరవించాలో తెలియని పశువులు!

దేవసింహ: అమ్మా! ఇక నువ్వు వెళ్ళిపో! లేకపోతే ఆ దుర్మార్గులు అనుమానపడతారు.

జన్మూ: [కొన్ని కట్టెలు తీసుకొని] బాబూ! నువ్వు బయటికి రావడానికి ప్రయత్నించకు! సమయం చూసి నేనే వచ్చి నిన్ను బయటికి పంపించే ఏర్పాటు చేస్తా! అందాకా రావద్దు నాయనా!

దేవసింహ: అలాగే నమ్మా! నా కెటువంటి ప్రమాదమూ సంభవించదు.

[జన్మూ వంటఇంట్లోకి వెళ్ళిపోతుంది. పొయ్యి రాజేయడంలో నిమగ్న మవుతుంది.]

చింగ్–పో: (కళ్లుతెరచి) లీ–చున్! జాగ్రత్తగా ఉండు. భారతీయ జవాన్లు చావుకు భయపడరు. ఎంతటి సాహసానికైనా పాల్పడతారు. వాళ్ళు అకస్మాత్తుగా వచ్చి దాడి చెయ్యవచ్చు కొంచెం కనిపెట్టి వుండు.

లీచు–న్: ఎస్‌సర్! నేను చాలా జాగ్రత్తగా కాపలాకాస్తున్నా. మీరు విశ్రాంతి తీసుకోండి. ఏమీ ఫరవాలేదు. (లీ–చున్ తన తుపాకిని గోడకు ఆనించి కూర్చుంటాడు. కొంచెంసేపు గడిచిన తరువాత–) ముసలమ్మా! ఈ దగ్గర్లో మంచిపిల్ల ఏమైనా దొరుకుతుందా?

జన్మూ: ఏమన్నావు? మంచిపిల్ల కావాలా నీకు? ఎందుకూ?

లీ–చున్: ఇక్కడ ఆడపిల్లలు చూడడానికి అందంగా వుంటారు! వీళ్ళంటే నాకు చచ్చేప్రేమ! యౌవనంలోవున్న ఒక పిల్లను

చూసిపెడుదూ? ఆ పిల్లను నేను ప్రేమిస్తాను! మా చైనా దేశం తీసుకెడతాను. మేము చైనీయులం — మీరు భారతీయులు — 'హిందీ చీనీ భాయీ భాయీ!' (నవ్వాడు).

జన్మూ : అయితే నాయనా! మీ దేశంలో సోదరుడు తోబుట్టువుల్ని భార్యలుగా తీసుకెళ్ళే పరిపాటి ఏదైనా వున్నదా? మా పక్కింటిపిల్లను — ఒక చైనావాడు బలవంతంగా తనతో తీసుకెళ్ళబోయాడు. ఆ పిల్ల పైగా గర్భవతికూడాను. అయితే మీ రంతా అటువంటివాళ్ళేన న్నమాట! ఒకరికొకరు తీసిపోరు!

లీ-చున్ : ఏయ్ ముగ్గుబుట్టముసలీ! ఎక్కువగా మాట్లాడావంటే ఈ తుపాకీతో పేల్చివేస్తాను. మా చైనావాళ్ళు మహామంచివాళ్ళు! మా దేశం మహా మంచిదేశం! అసలు మేము ఇక్కడకు మీకు స్వాతంత్ర్యం యివ్వడానికి వచ్చాం. తెలుసునా? మీ మేలు కోరి మేము వస్తే — మమ్మల్నే నువ్వు నానామాట లంటావా? ముసలిముండా! (లేవబోతాడు)

జన్మూ : జాగ్రత్త! నన్ను ముసలిముండా అంటావా? నేను వయస్సులో నీ తల్లితో సమానమైనదాన్ని! నన్ను నువ్వు ముండ అని తిడతావటయ్యా?

లీ-చున్ : ఏడ్చావు!.. ఒక్కసారికాదు వందసార్లంటాను-ముసలిముండా అని! అసలు మీ భారతీయులు అంతే! వట్టి కుక్కలు! వట్టి పశువులు!!

జన్మూ : (కోపంతో లేచి తుపాకి పుచ్చుకుని లీ-చున్‌కు గురిపెట్టి) ఏమన్నావురా? మే మంతా కుక్కలమా? పశువులమా? అయితే చూడు...

(తుపాకి మోగుతుంది. లీ-చున్ తుపాకి గుండుతగిలి అక్కడే పడిపోతాడు. చింగ్-పో గాంభీరంగా లేచి తన తుపాకి అందుకోబోతాడు. కాని జన్మూ మరొకగుండు పేలుస్తుంది. అతనుకూడా కింద పడిపోతాడు.

దేవసింహ : (వెనుక గదిలోనుంచి పరుగెత్తుకుంటూ వచ్చి) అమ్మా! ఎంతసాహసం నీది! సాక్షాత్తు నువ్వు దుర్గామాతవు! నీచులకు తగినట్టుగా, బుద్ధిచెప్పావు. మన దేశ గౌరవాన్ని నిలబెట్టావు తల్లీ! నీవంటి మాత లున్న ఈ భారతదేశం ధన్యమైంది! నీ పాదధూళిని నా శిరస్సున ధరిస్తాను తల్లీ!... నీవంటి మాత ధైర్యసాహసాలకు నేనెంతో గర్వపడుతున్నాను. నీ వీరగాథను దేశం యావత్తూ వేనోళ్ళ కీర్తిస్తుంది! దేశంకోసం పోరాడుతున్న జవానులకు నీ సాహసకృత్యం నూతనోత్సాహాన్ని కలిగిస్తుంది!

(తెర పడుతుంది)

తెనాలి రామకృష్ణుని హాస్యప్రియత

— ఉత్పల సత్యనారాయణాచార్య

తెనాలి రామకృష్ణకవిని గూర్చి ఆంధ్ర దేశమందంతటను పెక్కు కథలు ప్రచారమం దున్నవి. జను లీ కవిని గూర్చి చెప్పుకొన్నంతగా తదితర కవులను గూర్చి చెప్పుకొనుట అరుదు. చిత్ర విచిత్రమైన కథలతో ఈకవి జీవితము నిండియున్నది. శ్రీకృష్ణదేవరాయలకును, ఆతని ఆస్థాన విద్వత్కవులకును సంబంధించిన యీ గాథలు ప్రాచీనులగు పండితుల వలననే బహుళవ్యాప్తికి వచ్చినవి. ఆధునిక చరిత్రజ్ఞులుమాత్ర మీ కవిని రాయల యనంతర కాలమునకు నెట్టి, అష్టదిగ్గజ కవులం దీతని స్థానము దొలఁగించి, సాహిత్య చరిత్రాధ్యేతలకు కొంత నిరుత్సాహము గలిగించినవారగుట నిజము. రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యమును లెస్సగా పరికించిన నీతడు పెద్దనాదులతో మెలఁగినవాఁడనియు, నీతనిగూర్చి చెప్పుకొను కథ లన్నియును పుక్కిటి పురాణములు గావనియును తెల్లము గాక మానదు. రామకృష్ణుడు వక్రోక్తి నిపుణుఁడు; హాస్యప్రియుఁడు; అపార పాండిత్య వైభవుఁడు. పద్యరచనయందు సిద్ధహస్తుడై 'పాండురంగ సుకవి పద్యంబు హరువు'' అను ప్రఖ్యాతి కెక్కిన ప్రౌఢకవి. ఈతని కవిత్వము సంస్కృతమున మురారి కవిత్వమువలె ప్రౌఢతరమై విద్వజ్జనశ్లాఘ్యమైనది.

''ఆంధ్ర భూమీ కుచాగ్ర హారాభమైన
శ్రీ తెనాల్యగ్రహార నిర్ణేత వగ్ర
శాఖికా కోకిలమ వీవు సరసకవివి,
రమ్యగుణ కృష్ణ! రామయ రామకృష్ణ!''

ప్రబంధ కవులం దెవ్వరును తమ పుట్టిన చోటును మెట్టినచోటును రామకృష్ణునివలె నింత గర్వముగా చాటుకొన్నవారరుదు. అంకితము గొను నాపేక్షగల రాజులు కవులను పిలిచి సన్మానించి, కొనియాడుటలయందు మాత్ర మా కవుల చరిత్రాదికము కొంత తెలియ వీలగుచున్నది. కృత్యాదినిట్టి సదవకాశమును గల్పించుటయందు గూడ నన్నయ భట్టారకుఁడే ఆద్యుడు. పంపా తుంగభద్రా నదులను రసోదంచితముగా వర్ణించి తా మెట్టిన చోటునకు అసాధారణ గౌరవమును చేకూర్చిన విద్యానగర కవులలో రామకృష్ణుఁడే ప్రథముఁడు.

రామకృష్ణకవి తన గ్రంథావతారికయం దిట్లు వ్రాసికొనెను.

నను రామకృష్ణకవిఁ గవి
జన సహకారావళీ వసంతోత్సవ సూ
క్తినిధిఁ బిలిపించి యర్థా
సనమునఁగూర్చుండఁబనిచిచతురతననియెన్

'కవిజన సహకారావళీ వసంతోత్సవ సూక్తినిధి' కవు లనెడు తియ్యమామిడిచెట్ల చాలునకు వసంతకాలము వలె మంచి మాటలకు నిధియైనవాఁ డని యర్థము. 'కవిజన సహకారావళీ' యనుటవలన పెద్దనాద్యష్టదిగ్గజకవులీతని సమకాలికులేకాక సన్నిహితులైనట్లు తోపకమానదు. రాయల యాస్థాని జరిగిన వని ప్రచారమం దున్న చిత్రవిచిత్ర కథలు చమత్కార సమస్యా పూరణములు కాక యధార్థములే యను భావము 'వసంతోత్సవ సూక్తినిధి' యను విశేషణమువలన స్ఫురింపక మానదు.

విరూరి వేద్రాది మంత్రి తన నిట్లు శ్లాఘించినట్లు కృతి ప్రశంసయందితఁడు జెప్పుకొనెను.

"తగ సంస్కృతము తెనుంగుగఁ జేయఁ దెనుఁగు సం
స్కృతముగఁ జేయంగఁ జతురమతివి
నలుదెఱంగుల నెన్నఁగల కావ్యధారల
ఘనుఁడ వాశువునందుఁ గరము మేటి
వఖిలభూమీపాలకాస్థాన కమలాక
రోదయ తరుణ సూర్యోదయుఁడవు
శైవ వైష్ణవ పురాణావళి నానార్థ
రచనా పటిష్ఠైక రమ్యమతివి"...

పై నాలుగు పాదములందును రామకృష్ణుని దశలు గానవచ్చుచున్నవి. తొల్తటి రెండు పాదములు రాయల వారి భువన విజయ కవితా గోష్ఠులను, తక్కిన రెండు పాదములు రాయల యనంతర మాతని కవితా జీవితమును సూచించుచున్నవి. సంస్కృతమును తెనుఁగుగను, తెనుఁగును సంస్కృతముగను జేయఁగల ప్రజ్ఞ యాతనికే యున్నది. తిమ్మని బ్రహ్మ చేయఁగలవాడవనిన బాగుండును. పాండురంగ మాహాత్మ్యము రచించునప్పటికి రామకృష్ణకవి పరిణత హృదయుఁడు. వైష్ణవ మత ప్రవిష్టుఁ డగుటయు, చేపట్టినది

పరమ పవిత్రక్షేత్ర చరిత్ర మగుటయు నాతఁడు తన చతురోక్తుల గొంత యడఁచు కొనవలసినవాఁ డయ్యెను. మనుచరిత్రము నందలి మాయా ప్రవరునికివలె "పొడము రసావేశమున వచ్చు నర్మోక్తు లొదవి నాలుకకు రాకుండ గ్రుక్కు" కొనవలసిన యవస్థ కొంత యాతని కీ గ్రంథ రచనా సందర్భమునఁ బట్టినది. అట్టి యవస్థ పట్టి నను తన సహజ హాస్యప్రియతను, వక్రోక్తులను వదలిపెట్టినవాఁడు కాఁ డీతఁడు.

స్వభావ విరుద్ధముగా వికటముగ పలికి నప్పుడే ఆనందము గలుగు ననియు, ఆ వికటోక్తియే వక్రోక్తి యనియు, అలంకారము లెల్ల వక్రోక్తులే యనియు భామ హాదులు భావించి, వక్రోక్తియే కావ్య జీవిత మని సిద్ధాంత మొనర్చియుండిరి. అట్టి వక్రోక్తుల నాదరించిన యాంధ్రకవులలో రామకృష్ణుఁడే అగ్రగణ్యుడు. వక్రోక్తి ఆనందమును గలిగించుటయే కాక హాస్యమును గూడ జనింపఁజేయును.

కాశీ క్షేత్రమున కాలధర్మ మొందిన వాఁడు శివసారూప్య మొందు నను విషయమును రామకృష్ణకవి యిట్లు వర్ణించినాఁడు.

ఒకనాఁడుఁ దీర్థోపయోగి కాని శరుండు
నౌఁదల ధరియించు నభ్రగంగ
నాప్రొద్దు పొయి రాఁజనట్టి నిర్భేదయు
భోగించు నైశ్వర్యము లెనిమిదియు
పుష్కరాఖల పొంతఁ బోని వర్షధరుండు
దేహార్ధమునఁ దాల్చుఁ దీగఁబోఁడి
నాయుధప్రభఁగాంచి యలఁగుభీరువుఁ బూను
వాటి ముమ్మోముల వేఁడి యలుగు
మలినవర్తనుఁడు సుధాలలితమూర్తి
మించి వర్తించు; మతిలేని మేదకుండు
మౌనివర్యులఁ జదివించు మట్టిసీడఁ
బంచముఖు వీట మే నోసరించెనేని.

ఈ వర్ణనము రామకృష్ణుని భావ వైచిత్ర్య వక్రతకు నిదర్శనము. విశిష్టాద్వైతి యగు రామకృష్ణుఁ డీ సందర్భమున ఒకిరిని నొప్పింపక తా నొవ్వక హాస్యగర్భితము గావించి యథార్థమునే చెప్పినవాఁ డయ్యెను.

పెరిగిన త్రివిక్రమేశ్వరు
చరణతులాకోటి యతఁడు సంహృతదేహ
స్ఫురణుం డగునపు డూడిన
కరణిం బురికోట యొప్పుఁ గనకమయం బై

వామనుఁడు త్రివిక్రముఁడై పెరిఁగి మరల సంహృతదేహుఁ డగునప్పు డూడి నేల పైఁ బడిన యాతని బంగారు టందెలాగున నున్నదట కాశీపురికోట! ఈ కల్పితోపమాలంకారముగూడ వక్రోక్తి సంబంధియే. దశావతారములను వర్ణించుటలో ప్రబంధకవు లందఱు తమ కవితా పాటవమును, పాండిత్య ప్రకర్షను చూపించినవారే. పాండురంగ మాహాత్మ్యమునందలి దశావతార వర్ణనము రామకృష్ణుని అసామాన్య కవితా ప్రౌఢిమకు సముచితోదాహరణము, ఆ వర్ణనమందు నాతఁడు తన హాస్య ప్రియతను వక్రోక్తిని వదలినవాఁడు గాఁడు. అతుల నిష్ఠతో తపస్సుచేసిన పుండరీక మహాముని, తనకు భగవంతుఁడు ప్రత్యక్షము కాఁగా దశావతారముల స్తోత్రము గావించుచు బౌద్ధావతారము నిట్లు స్తుతించెను.

ప్రతిదిన కేశలుంచనపు
రాయిడి నెట్టన బట్ట కట్టి పైఁ
బుతపుత మంచు నున్న కుఱు
బోదతలన్ ధరియింప నోడియున్
సత మగు సొమ్ముగాన విడఁ
జాలవుగా శిఖిపింఛవల్లి, సౌ
గతమతధుర్య! దానిఁ గటిఁ
గట్టుము పుట్టము మిన్న కేటికిన్.

నెమిలిపింఛము శ్రీకృష్ణునకు విడువరాని శిరోభూషణము, బౌద్ధావతార సమయమున బట్ట కట్టి నున్ననైన బోడతలపై దానిని ధరింప నెట్లును వీలు లేదు. సతమగు సొమ్మును వీడుటకును వలనుపడదు. కావున వస్త్రమును దాల్చుట మాని పింఛమునే కట్టు కొమ్మని బుద్ధునికి బోధించినాఁడు రామకృష్ణుఁడు. "జంభాపహ రాజ్యలక్ష్మి వెరవాఱగఁ దేల్పవె యీఁతకాయరూపై పృథు కర్పరం బమర నాశ్రితరక్షణ దక్షిణేక్షణా!" అని కూర్మావతార వర్ణనము. ఇందు 'ఈఁత కాయ' యనుట కవి చమత్కృతికి ప్రౌఢోక్తికి నిదర్శనము

పాండురంగ మాహాత్మ్యమునందు రాధా వర్ణనము అత్యద్భుతము స్త్రీ వర్ణనమునకు చాలినన్ని కవిసమయము లుండుటచే కవుల కికఁ దడవుకొను నవసరము లేక వాని యందే వారు కాలక్షేపము చేయుచు నందు తమ చామత్కారమును, అప్రతిమాన మగు ప్రతిభను ప్రదర్శించియుండిరి.

మానవతీలలామ తను
మధ్యమ మన్ గజవైరి కుల్కి త
ద్యాన మరున్మదావళము
యౌవనపుం బొదరిల్లు దూఱఁ బైఁ
గానఁగ వచ్చు కుంభములు
కావుగదా కుచకుంభయుగ్మకం
బౌ; నటులైన వల్లభన
ఖాంకుశరేఖలు గల్గ మీఁదటన్

నడుమునకు సింహ సామ్యము కవిసమయ సిద్ధము. "రాధాదేవి నడుమనెడు సింహమునకు భీతిల్లి ఆమె నడక యను దేవగజము (ఐరావతము) యౌవన మను పొదరింట ప్రవేశింప నా మీఁద బయటకుఁ గనిపించు గజకుంభము లేమో! ఆమె స్తనములు. అటులైన నికమీఁదట వల్లభ నఖాంకుశ రేఖలు తప్పవు పొమ్మ" అని భావము. నిగమశర్మోపాఖ్యానమున పఠు విశసనమైన జాతరను బ్రహ్మ సభతో పోల్చుట

ప్రబంధ వక్రతయే యగును. ఆ వర్ణనము నిక్కమగు విరోధాభాసమునకుదాహరణము. ఆ జాతర "అజ ప్రధాన మగుట విబుధ సభం బోలియు మహా సురోద్ధారంబును". శ్లేషాను ప్రాణితమైన యిట్టి విరోధాభాసాలంకారము భారతాది పర్వము ద్వితీయాశ్వాసమునందు సముద్రమును వర్ణించు ఘట్టమున వచనమునందుఁ గాన్పించును. ఇట్టి యలంకారమునకు నన్నయ పెట్టిన యొరవడి రామకృష్ణుని యెడ మిక్కిలి రాణించినది. ఈ కవి తన గ్రంథారంభమునఁ గవిస్తుతి చేయుచు నాంధ్ర కవులలో నొక్క నన్నయభట్టారకునే పేర్కొనుట గమనింపఁ దగియున్నది.

ఇచట వర్ణనీయము శివుని కావాస మగు మహోన్నత కైలాసము, నందీశ్వర సంచార ప్రదేశము. ఇఁక రామకృష్ణుని యూహాశక్తిఁ బరికింపుఁడు.

"నీలగళవాహ రింఖా ఖనిత్ర నిహతి
నింగి కెగసిన వెండిరానేల దుమ్ము
ప్రాంత వర్తిష్ణు సప్తర్షి పరివృఢులకు
నొసఁగు నిర్యత్న భసిత విలసిత మచట."

నందీశ్వరుని గిట్టలవలన నాకాశమున కెగసిన వెండిరాళ్ళ దుమ్ము దగ్గఱనున్న సప్తర్షులకు నిర్యత్న భస్మధారణ మొసఁగెనట! ఆలోచించిచూడ హాస్యము. పైకిఁ జూడఁ బ్రౌఢిమ గల నిట్టి వర్ణన లెన్నియో యీతనికృతి నామూలాగ్రముగా పరిశీలించిన వారి కవగతము లగును.

శ్రీకృష్ణ రాయబార సందర్భమున భీష్ముడు ధృతరాష్ట్రునకు జెప్పిన

హిత బోధ

— దీక్షితుల విశ్వనాధశర్మ

వంచనబుద్ధి నీ సుతుడు పాండుతనూజు వినోదరీతిగా
నెంచియు జూదమందు హరియించె సమస్తము నాడు నీ
వెంచితివొక్క ధర్మమని ఏగిరి కానకు, నేడు సంధి గా
వించుకొనంగ కోరునెడ బ్రీతిని జూపుము కౌరవేశ్వరా ! 1

బాంధవ ధర్మదృష్టి నిడి పాండవసూతి యజాతశత్రుడే
సంధిని గోరి పంపెనిటు సాధువచస్కుని కృష్ణునే జగ
ద్బాంధవు నీ హితంబు గని మానసమందున నీతి గొమ్ము గ
ర్వాంధులు నీదు పుత్రులు దురాగ్రహశీలురు, కౌరవేశ్వరా ! 2

కన్నులులేవు చూచుటకు, కాదనరాని వయస్సు, రాజ్య సం
పన్నత నింతకాలమున బాధగ నేలితివయ్య, ఇంక నీ
పన్నను లెక్కపెట్టని దురాశ వశాత్ములు నీ కుమారు లా
పన్నులు పాండుపుత్రకుల బ్రాపె హితం బని సంధి జేయుమా. 3

సూతజునమ్మి నీ సుతుడు జొప్పడు సంధికి తోడు తమ్ములన్
కాతరబుద్ధి బల్కెదరు, కౌరవనాధ ! పరాక్రమమో
పేతులు పాండుసూనులు నుపేక్ష తలంపరు సంధి గానిచో
నీతితలంచి ధర్మము నిల్పుము. శాశ్వతకీర్తి గల్గగాన్ 4

నీతినిబట్టి పాండవులు నిండుగ ద్వాదశ వత్సరంబు ల
జ్ఞాతముగాగ వత్సరము సల్పిరి, కూర్మినిగోరి సంధికై
దూతగ ధర్మపాలికునితో యజనాభుని కృష్ణు బంపి రీ
రీతిని జూడ నీకు మది బ్రేమ జనింపదె కౌరవేశ్వరా ! 5

గడచిన కాలమే శుభముగాగ దలంపుము ధర్మబుద్ధిచే
గడపిరి. పాండుసూను లటు కాననసీమను నింతదాక నే
ర్పడగను వారి రాబనిచి భాగము నిచ్చి యశంబు నొందు మీ
ఎడ ఇది నీకు భావ్యము గ్రహింపుము ధర్మము కౌరవేశ్వరా ! 6

భయపడి సంధి గోరి రని భావన జేయకు. మొన్న ఆజిలో
దయ గని అర్జునుండొకడె తద్దయు ప్రాణము నిల్పెగాని ని
ర్భయముగ నిల్చిరే సుతులు, ప్రల్లద మాడెడువారెగాని ని
శ్చయముగ పాండుసూనులకు చాలరు. నీదుకుమారు లెప్పుడున్ 7

బకుడు మహాబలుండనని బారలు చాచిన యేమి య య్యె. కీ
చకుడును వాని తమ్ములను చావగ తక్కరె భీముచేత లె
క్కకు గొనకుండ నీ సుతుడు కయ్యము జేసినయేమి యౌనా నీ
వికమదియోజజేసి గ్రహియింపుము, సంధిని కౌరవేశ్వరా ! 8

కలసి స్వరాజ్యపాలనము గాగ జెలింగిన మేలు మీకు. లో
కులు ముద మొంది నిన్ను కడుకూర్మిని చూతురు గౌరవింత్రు స
త్కులము యశోవిశాల మయి తోరముగాగ వెలుంగు కానిచో
చులుకనకాదె నిందలకు చూడుము సంధియే మేలు భూవరా ! 9

తలపగ మూల కారణము తద్దయు నీవయకాదె, నాడు నీ
వెఱవి నుపేక్ష జేయుటయె ఇంతలు పుట్టెను, స్వార్ధబుద్ధియే
తలచితిగాని నీతియును ధర్మము జూడగజాల వైతి త
త్ఫలమును జెందుకాలమును వచ్చెను వో ధృతరాష్ట్రభూవరా 10

ఎంచి సమైక్య భావమున ఇద్ధచరిత్రుని పాండుసూను రా
వించి, సుయోధనుఁబిలచి ప్రేమ జనింపగ సంధి గొల్పి నీ
వంచిత కీర్తి గొమ్ము, మనుజాధిప నీవు ధరిత్రి నేలుమా
మంచిదికాదే ! అందరకు, మాన్యత కాదొకొ కౌరవేశ్వరా ! 11

కన్నులు లేవు చూచుటకు కాని, మనంబు విమర్శ జేయ లే
కున్నదె, సత్యధర్మమును నొప్పిద మౌనటు జేయబూని పే
రన్నది నిల్పుకొమ్ము, ప్రజలందరు మెచ్చి హితాభిలాషులై
మన్నన జేయుచుండుదురు, మానవనాథ పరార్థ మెంచుమా. 12

జూదములోన సర్వమును చూరకొనంగుటె గాక కొల్వులో
సాధుగుణాలవాల పరిచారికగాగ తలంచె ద్రౌపదిన్
కాదనకుండ పాండవులు కన్నుల జూచియు నోర్చి. ధర్మ సం
పాదనబుద్ధి కానలకు పొల్పడిరే ! నృప ! నీ వెరుంగవే. 13

జూదములోన ఈ శకుని జూపె జయంబు. రణంబె గల్గుచో
కాదనకుండ నిల్చి తద క్షాత్రము జూపి, జయంబు నిచ్చుచో
కాదనలేరు, కాని, అది కానిది. పాండవశౌర్యమేడ ! ఈ
జూదరి యేడ యుద్ధ మది శూరులసొమ్ము జయమ్ము భూవరా ! 14

వరుసగ నీ కుమారలను వాయుసుతుండొకడే జయించు, త
క్కొరుల సలీల నర్జునుడు ఊర్జిత తేజుడు గెల్చునయ్య ! నే
నెరుగుదు వారి దోర్బలము నింతకు నింతకు హెచ్చుచుండు నో
నరవర సంధి జేసికొన న్యాయము నీకె శుభంబు భూవరా ! 15

సంధియె కానిచో రణము సల్పుట తప్పదు దానిచేత నీ
బంధువులెల్ల చచ్చెదరు పౌరుషవంతుడె రాజ్యమేలు నీ
వంధుడవై తపించుతరి ఆదరమెవ్వరు జూపరయ్య. ఈ
సంధికి బూని భావి శుభసంగతి సల్పుము కౌరవేశ్వరా !

క్రీడాభివృద్ధి - ఆవశ్యకత

మానూరు వేంకట చక్రపాణిరావు

నాల్గవ ప్రణాళికాకాలంలో విద్యకై కేటాయించిన నూరు కోట్ల రూపాయల మొత్తంలో కొంత క్రీడాభివృద్ధికై వెచ్చింపబడుతుందనే విషయాన్ని పత్రికాముఖంగా తెలిసికొని నప్పుడు, క్రీడాపరులకు, క్రీడాభిమానులకు మిక్కిలి సంతోషం కలిగింది. ఈ ప్రణాళికాకాలంలో, రాష్ట్రంలో క్రీడాభివృద్ధి త్వరితగతిని జరుగగలదని జాతీయ, అంతర్జాతీయ క్రీడారంగాలలో ఆంధ్రప్రదేశ్ ప్రముఖపాత్ర వహించగల దనే ఆశను వ్యక్తపరచటం అత్యంత సముచితం.

ఆత్యవసర పరిస్థితి అములులోనున్న ఈ కాలంలో జరిగే క్రీడాభివృద్ధికి ఒక ప్రత్యేకత వుందని భావించవచ్చు. ఎందుకంటే క్లిష్ట పరిస్థితులలో వున్న మనకు ఇప్పుడూ మరెప్పుడూ కూడ వాటి నెదుర్కొనవలెనంటే, క్రమశిక్షణ, సంఘీభావము, నాయకత్వం అవసరము. ఈ ఉత్తమ లక్షణాలన్నీ క్రీడలద్వారా అలవడతా యనటానికి సందేహం లేదు. సాధారణంగా చూస్తే క్రీడలు శరీరారోగ్యం పెంపొందించటం దగ్గరనుంచి జాతీయ అంతర్జాతీయ స్నేహ, సహకార, సౌభ్రాతృత్వాలను పెంపొందించటం వరకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో తోడ్పడుతాయి.

మన రాష్ట్ర ప్రభుత్వం, నిజానికి, క్రీడావసరాలను గుర్తించటం గాని, క్రీడాభివృద్ధికై కృషి చేయటం గాని ఇప్పుడే కొత్త అంటూ ఏమీలేదు. ప్రభుత్వం రాష్ట్ర క్రీడా మండలి ఆధ్వర్యాన జిల్లా క్రీడా మండలులు మొదలైనవాని ద్వారా క్రీడాభివృద్ధికై చేస్తూవస్తున్న కృషి ప్రశంసనీయం. ఈ కృషి యొక్క ప్రత్యక్ష స్వరూపాలే జిల్లా క్రీడోత్సవాల నిర్వహణోద్దేశ్యాన్ని వివరిస్తూ - బాల బాలికలకు (ముఖ్యంగా బాలికలకు) క్రీడల పట్ల అత్యంతాసక్తిని కలుగజేయటమనీ, వారిలో దాగియున్న క్రీడాసక్తులను వెలిదీయుటయనీ చెప్పియున్నారు

నిజానికి మన దేశంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో బాలబాలికలకు అధిక సంఖ్యలో క్రీడాభిరుచిని కల్గించి, (ఆటల) పోటీలలో పాల్గొనునట్లు చేయటమనేది ఒక సమస్యగా తయారైంది. ఇందుకు సంబంధించిన వారు (ప్రభుత్వము, క్రీడా సంస్థలు, ప్రజలు) చేయు కృషిపైననే యీ సమస్యా పరిష్కారం, ముస్ముందు జాతీయ అంతర్జాతీయ రంగాలలో ఘన కీర్తిని ఆర్జించి పెట్టటమనేది, ఆధారపడి వుంటుంది. అయితే ఇట్టి కృషి ఏ స్థాయి నుండి జరుగుతే బాగుండు ననేది ప్రశ్న. ఇందుకు సర్వవిధములా తగియున్నది మాధ్యమిక విద్యాకాల మని నా అభిప్రాయం.

ప్రస్తుతం మాధ్యమిక పాఠశాలలు, (సంస్థలు మొదలగునవి) బాల బాలికలను క్రీడాభిముఖులుగా చేయుటలో ఎంతవరకు కృతకృత్యు లయిన వన్న విషయమును అట్లుంచగా, ఇంక ఎట్టి కృషిని చేయవలయునన్న సంగతి ప్రస్తుతాంశంగా తీసికొనినచో ఈ క్రింది విషయములను దృష్టియందుంచుకొనిన బాగుండును.

1. పాఠశాలల ఆటల పోటీలలో పాల్గొన్న బాలబాలికలకు వారి వారి అర్హతలను బట్టి, పాఠశాల రుసుము మొదలగు వానియందు మినహాయింపులు, ఉపకార వేతనములు మొదలగు సౌకర్యములు కలుగజేయవలెను.

2. వ్యాయామ శాస్త్రాధ్యాపకుని సలహా ప్రకారము వారి వారి క్రీడా నైపుణ్యము ననుసరించి సంవత్సర పరీక్షలలో కొంత శాతమంటూ మార్కులు కలుపవలెను.

3. పాఠశాలలలో క్రీడాభివృద్ధికై వలయు సకలసదుపాయములు కలుగజేయవలెను. అవి బాలబాలికలను అధికసంఖ్యలో ఆకర్షించునట్లుగా వుండవలెను. పాఠశాలలకు సంబంధించినవరకు బాలబాలికలు అధిక సంఖ్యలో పాల్గొనుట మనునది చాలమటుకు వ్యాయామ శాస్త్రాధ్యాపకుల నిరంతర కృషిపై ఆధారపడివుంటుంది. బాలబాలికలను ఉత్సాహపరిచే విధంగా కొత్త ఆట పరికరాల మొదలు అధునాతన పద్ధతులలో తర్ఫీదు నిప్పించేంతవరకూ శ్రద్ధవహించాలి. వారు ఆడు ఆటలను కడుశ్రద్ధతో పరిశీలించి వారి పొరపాట్లను అప్పటికప్పుడు సరిదిద్దగలిగి యుండవలెను. ఇట్లు చేసినయెడల యీ స్థాయినుండే దోషరహితముగా ఆడి ముస్ముందు ఉత్తమ క్రీడాపరులు కాగలరు.

కనుక వ్యాయామ శాస్త్రోపాధ్యాయుడు వివిధ క్రీడలలో మార్పులను ఎప్పటికప్పుడు గ్రహించగలిగి యుండవలెను. ఈ విషయములను సంప్రదించుటకై (కనీసం) స్థానిక వ్యాయామ శాస్త్రోధ్యాపకులు తరచు సమావేశములు జరుపుచుండవలెను.

4. బాలబాలికలను వయస్సుకన్నా శారీరక ప్రామాణ్యమునుబట్టి తరగతులుగా నిర్ణయించవలెను. ఇట్టినిర్ణయముల ననుసరించి క్రీడల జాబితాను తయారు చేయవలెను. నిర్ణయింపబడిన క్రీడలు వారివారి ఉత్సాహమును శక్తియుక్తులను వెలిదీయునట్లుండవలెను.

5. పాఠశాలల ఆటల పోటీలలో 'ఛాంపియన్ షిప్'లను సాధించిన బాలబాలికల పేర్లను ఒక ఫలకముపై వ్రాయబడి చూడ యోగ్యముగా నుండవలెను. ఇవి ముందు తరములవారిని ఉత్తేజ పరుచగలవు.

6. పాఠశాలల్లో జాతీయ అంతర్జాతీయ క్రీడోత్సవములను చలనచిత్రముల రూపంలో చూపించాలి.

7. బాలబాలికలకు క్రీడలలో వారు చూపిన ప్రావీణ్యము ననుసరించి ముమ్ముందు ఉద్యోగనియమాల్లో, ఉన్నత విద్యావకాశాలలో ప్రాధాన్యమివ్వనున్నట్లు తెలియజెప్పాలి. ఆవిధంగా ఇవ్వాలి.

8. జిల్లా క్రీడోత్సవాలకు, పాఠశాలలు బాలబాలికలను అధికసంఖ్యలో పంపగలిగి వుండాలి. ఆ పోటీలకు ముందునుంచీ మంచి తర్ఫీదు నిప్పించాలి.

9 జిల్లా క్రీడోత్సవాలలో ఏర్పాటు చేయబడే ఆటల పోటీలు ముఖ్యంగా బాలబాలికలకు ఉద్దేశించినవై వుండాలి. అందులోను బాలికలకు సంబంధించిన ఆటల పోటీలు అధికంగా వుంటే మంచిది. ఇట్టి క్రీడోత్సవాలలో పాల్గొనిన ప్రతిఒక్కరికీ, జయాపజయాలతో నిమిత్తం లేకుండా, పాల్గొనినట్లు Certificate ను ఇవ్వాలి. ప్రత్యేక సంచికలను ప్రచురించి విజేతల ఫోటోలతోసహా ముద్రింపించాలి.

10. పాఠశాలల్లో ప్రత్యేకంగా Play Festivals ను జరుపాలి. ఈ ఉత్సవాలకు తల్లితండ్రులను అధికసంఖ్యలో ఆహ్వానించి, అందులో కొందరినైనా పాల్గొనేటట్లు చేయాలి. ఇట్టి ఉత్సవాలలో బహుమతిప్రదానం మొదలైనవి ప్రభుత్వోద్యోగులచేగాక, గ్రామ, పురప్రముఖులచే జరుపించాలి.

11. ఆటలలో గెలుపొందిన బాలబాలికలకు ఇవ్వబడే బహుమతులు అత్యంతాకర్షణీయంగా, ప్రోత్సాహకరంగా వుండాలి.

12. పాఠశాలలలోని బాలబాలికలకు కూడ శిక్షణావకాశాలను విస్తృతంచేయాలి. ఈ సందర్భంలో ప్రభుత్వ క్రీడాసంస్థలు, కళాశాలలయొక్క సహాయ సహకారాలను పాఠశాలలు అపేక్షించటం తగును.

13. క్రీడాభివృద్ధికి మొదటి మెట్టయిన ఆటస్థలాలను, పాఠశాలలకు తగినంతగా ఏర్పాటు చేయించాలి. ఈ సందర్భంలో అఖిలభారత క్రీడావిచారణాసంఘం చేసిన ఈ క్రింది సూచనలను దృష్టిలో వుంచుకోవటం మంచిది..."500—1000 మంది విద్యార్థులు కలిగివున్న పాఠశాలలకు అయిదారు ఎకరాలభూమి. 200—500 మంది విద్యార్థులు గల మాధ్యమిక పాఠశాలలకు మూడునుంచి అయిదుఎకరముల భూమిని ఆటస్థలంగా ఇవ్వాలి." ఇకముందు అదనంగా కేటాయించబోవు ఆటస్థలాలు పాఠశాలలకు తగినంత దగ్గరలో వుండాలి.

14. క్రీడామండలులలో స్త్రీలకు తగినంత ప్రాధాన్యము ఉండాలి. బాలికల క్రీడాభివృద్ధిని పరిశీలించే సందర్భంలో వారి సహాయ సహకారాలను, సలహాలను పొందాలి.

15. క్రీడామండలులు, సంస్థలు, పాఠశాలలనుండి ప్రముఖులనుండి సూచనలను, సలహాలను సహృదయతతో స్వీకరించి, వానిఆచరణయోగ్యాన్నిగూర్చి ఆలోచించాలి.

16. బాలబాలికలకు యోగ్యమైనశైలిలో ప్రత్యేకించి క్రీడలపై ఇంకా పత్రికలు, పుస్తకాలురావాలి. ఇట్టివానికి ప్రభుత్వము, క్రీడాసంస్థలు ఇతోధిక ప్రోత్సాహ మివ్వాలి.

17. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికై తగిన సూచన లివ్వటానికై కేంద్రప్రభుత్వం నియమించినట్లుగా రాష్ట్రప్రభుత్వంకూడా క్రీడా విచారణా సంఘాన్ని నియమించాలి.

పాఠశాలల స్థాయినుంచి జరిగే క్రీడాభివృద్ధికి అత్యంత ప్రాముఖ్యత వుంది. ఏమంటే, యీ స్థాయిలోని బాలబాలికల వయస్సు సుమారు 10 సంవత్సరముల నుండి 16 సంవత్సరములవరకు వుంటుంది. కనుక వారు వారి శరీరాన్ని కోరినవిధంగా వంచగలరు. కనుకనే యీ కాలంలో వారికివ్వబడేశిక్షణకు విశేష ప్రాధాన్యత నిస్తారు. అదీగాక పిన్నవయస్సులోవారు నేర్చిన ఉత్తమ క్రీడాపద్ధతులు ముమ్ముందు వారు గడింపబోవు నేర్పునకు వన్నె తేగవు. కాగా వారు దీర్ఘకాలం క్రీడారంగానికి యథోచితంగా సేవచేయగలుగుతారు. తద్వారా జాతీయ, అంతర్జాతీయ క్రీడారంగాలలో ఆంధ్రప్రదేశ్ కీర్తి సుప్రతిష్ఠించగలరు. తథాస్తు.

పరిదేవనము

ముప్నంగి క్రీస్తుదాసు

అంధతమంపు రాసులు వి
    హాయస వీధిని గ్రమ్మ, లోకమే
బంధుర వేదనాభరిత
    మానసమై విలపించుచుండ మా
సుందర భారతాభ్యుదయ
    శోభల దీరిచి నీవు కృంగితో
వందితదివ్య రూపగుణ
    భాస్కర ! జహ్వార ! పశ్చిమాంబుధిన్.

రణపిపాసోదగ్ర రాజ్యంబు లోకవంక
        మారణాస్త్రంబులన్ నూరుచుండ
మంచుకొండలమీద పొంచియుండిన "చీన"
        కయ్యంబునకు కాలు కదుపుచుండ
సుందర కాశ్మీర నందనోద్యానాలు
        కబళింప తురకలు కదలుచుండ
పాలక పాలిత వర్గాంతరాళలో
        సమరసభావంబు సమయుచుండ

అండగా నీవు మా కుండ కొండవోలె
గుండె నిబ్బర ముబ్బగ యుండినార
మవుర ! యింతలో మము వీడి అమరలోక
మరుగు టెటు లొప్పె హృదయాల నార్తి నింపి ?

కలుపుంగోలుతనంబులే కెలమి సం
    గ్రామాభిలాళన్ వృధా
తలపున్ జేసెడి మూర్ఖులన్ గదిసి అ
    న్నా ! మాను డీఘోరపుం
గలహంబుల్ దగ వెల్ల రొప్పిమను టే
    శాంతింపుడం చెవ్విధిన్
పలుకుం దేనెల శాంతిదూతవయి
    బ్రహ్మాండంబు నూగించితో.

'వసంత వర్ణనం' - 'మధుని పాత్ర'

వాటికి కాళిదాస, శ్రీనాథ, నన్నెచోడులు దిద్దిన మెఱుగులు

ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులు

లలిత పదసముదాయం; రమణీయ భావ సౌకుమార్యం; అన్యూనాతిరిక్తవర్ణనం; కాళిదాసుని కమనీయ కావ్యసృష్టిలో ప్రముఖపాత్ర వహించాయి. రమణీయ సన్నివేశాలకు తోడు-పాఠకుల భావనా బల పరిణతికి తగిన ప్రాతినిధ్యాన్నిచ్చే విధానం కాళిదాసుని ప్రత్యేకతకు ప్రబల నిదర్శనం, కావ్య లక్షణాలను, కావ్య శిల్పానుగుణంగా గ్రహించి, కావ్యానికి వన్నెచిన్నెలు దిద్దడంలో ఇతని కితడే సాటి అందువల్లనే "కనిష్ఠికాధిష్ఠిత కాళిదాసు కవిసముదాయంలో ప్రథముడుగా; మహాకవిగా పేరొందాడు. కుమార సంభవ కావ్యంలో హరసమాధిని భగ్నం చెయ్యడానికిన్నీ; దేవేంద్రుని ఆజ్ఞాపాలనానికిన్నీ; మదనుని కన్నివిధాల చేయూత నిచ్చిన మాధవ విజృంభణం-తీర్చి దిద్దడంలో కాళిదాస, శ్రీనాథ, నన్నెచోడులు తీర్చిన, కూర్చిన మెఱుగులు మిక్కిలి పరాకాష్ఠ నందాయి. రసజ్ఞుల మన్నన లందాయి. ఆ మెఱుగు లెంత సువాసన లిచ్చాయో దిఙ్మాత్రంగా పరిశీలించడమే ప్రకృత వ్యాసలక్ష్యం.

అచంచల దీక్షతో, తపోనియమాన్ని; పాలిస్తూన్న హరుని మనోగతిని మార్చాలి. శైలనందనపై హరున కనురాగం కూర్చాలి. ఆ అనురాగ బీజాన్ని కిసలయ, పత్ర, పుష్ప, ఫల, శోభితవృక్షంలా పరిణతి నందచేయాలి. ఇప్పుడే దేవకార్యం నిర్వర్తిత మవుతుంది. ఒకేదానిమీద లగ్నం చెయ్యబడిన దృష్టిని మరోవైపు మరల్చాలంటే దానికి తగ్గ సన్నివేశ కల్పనంలో కవి విజ్ఞానం తేటతెల్లమౌతుంది. అట్టి సన్నివేశ నిర్మాణంలో మాధవుడు ప్రధాన పాత్ర వహించగా, మదనుడు నిమిత్తమాత్రు డవుతాడు. ఆ సన్నివేశం కూడా అసాధారణం; అనూహ్యం అయి విలసిల్లాలి.

ఏ కార్యక్రమాన్ని సాధించడానికైనా కాలం ముఖ్యం. కార్యసఫలతకైనా, విఫలతకైనా వాతావరణం యొక్క అనుకూల్య ప్రాతికూల్యాలే ప్రబలకారణాలు, మొదట్లోనే ఆయా పరిస్థితులు పొడచూపినా, చివరవరకూ ధైర్యంగా నిలబడడం అత్యంత ప్రధానం. ఏదో ఒక విధానాన్ని, ఆచరణీయమైన దాన్ని ప్రబోధించడమే కావ్య ప్రయోజనం. అందుకనే మహాకవి కాళిదాసు హర సమాధి భగ్నంచేసే సందర్భంలో మదనుని పాత్ర; ఆ మదనుని పాత్రకి లోటు రానీయని మధు విజృంభణం అత్యుత్తమంగా చిత్రించాడు.

ఆ తీరు :—

"సమాధవే నాభిమతేన సఖ్యా,
రత్యాచ, సాశంకమనుప్రయాతః
అంగవ్యయ ప్రార్థిత కార్యసిద్ధిః
స్థాణ్వాశ్రమం హైమవతంజగామ."

ఇష్టకార్య సిద్ధికి అనుకూల వాతావరణం కల్గించే ప్రియాతిప్రియుడైన మాధవుడు తన వెంటే వున్నాడు. స్థిరచిత్తుడైన హరుని మదనుడు జయిస్తాడా! అనే శంకగల రతీదేవిన్నీ వెనువెంట నడుస్తోంది. హిమప్రాంతాన ఆశ్రమం ఉండడంవల్ల వాతావరణంలో ఎంత మార్పు కలిగినా, పూర్వమున్న వాతావరణచ్ఛాయ పూర్తిగా మారదు. ఒకవేళ మనోవికారాన్ని కల్గించినా, వెంటనే అణుచుకోగల స్థిరత్వం హరునిలో వుంది. అందుచేతనే రతీదేవి కాశంక కలిగింది. ఎంత నిరాశాపూరిత వాతావరణమున్నా మదనుడు మాత్రం "అంగవ్యయప్రార్థిత కార్యసిద్ధి" నాశిస్తూనే దృఢనిశ్చయంతో ఉన్నాడు. ఈ విధమైన ప్రారంభం రాబోయే ఫలితం చూచాయగా సూచింపబడింది. అనుకోని విధంగా "మధువిలాసం" వ్యాపించింది. రతీదేవి శంక కూడా నిజమైంది. మదనుడు అనంగుడున్నూ అయాడు.

ఈ రమణీయ సన్నివేశాన్ని శ్రీనాథ నన్నెచోడు లెలా వర్ణించారో చూద్దాం.

కుమారసంభవానికి స్వేచ్ఛానువాదంగా సాగిన "హరవిలాసం"లో శ్రీనాథుడు కాళిదాసు చెప్పిన రతీదేవి శంకను పూర్తిగా విడచినాడు. "మన్మథుండు మధుసహాయుండై హిమవత్పర్వతంబు సేరంజనియు నా సమయంబునందు" అని చిన్న వాక్యంలో కాళి

దాసుని భావా న్నిమిడ్చాడు. అందువలన మదనుడు •సామాన్యుడుగానే చిత్రింపబడినాడు.

కాని యీ సందర్భంలో నన్నె చోడుడు కాళిదాసుని భావాలను క్లుప్తపరచకుండా, ఉజ్జగించకుండా వర్ణించినాడు. శంకతో రతీదేవి మదను ననుసరించడానికి ముందు రతీమన్మథుల సంభాషణము - హరుని మహామహిమత్వము - కథోపయోగంగా ప్రవేశపెట్టబడినాయి. రతీదేవికి శంక కల్గడానికి కారణాలు పాఠకులే ఊహించుకొనేట్టు కాళిదాసు కథ నడుపగా, ఆ కారణాలనుకూడా చిత్రించడం నన్నెచోడుని ప్రజ్ఞకు నికషోపలం.

"అతని శరాసనమ్ము గన
కాచల మిమ్ముశరాసనంబు నీ
కతనికినమ్ము పాశుపత
మంటినఁ గందెడు పువ్వులమ్ము నీ
కతడు పురాపహారి విర
హాతుర పాంథజనాపహారి నీ
వతనికి నీకు హ స్తిమశ
కాంతర మెమ్మెయి నెన్నిచూచినన్."

హరుని శరాసనము కనకాచలము....నీ శరాసన మిక్షుఖండము....అతని అమ్ము పాశుపతము .... చేత్తో తాకితే కందే పూలు నీ బాణాలు....అతడు పురాపహారి....నీవు విరహాతుర పాంథజనాపహారివి....ఎల్లా చూసినా నీకు ఆయనకు హస్తిమశకాంతర ముంది. ఈ విధమైన శంక ఆమె హృదయకుహరంలో నిండి వుంది. ఎన్ని నమ్మికలు చూపినా ఆమె శంక తొలగలేదు. శంకాకులితస్వాంతంతోనే తన ప్రియునివెంట బైలుదేరింది. సన్నిహితుడైన మాధవుడు పూలతేరు నిర్మించి కుసుమాయుధాలుయుద్ధసన్నద్ధం చేసి, ఆ తేరునకు తానే సారథ్యము వహించి మదనుని ముందు నిల్పుతాడు. మదను డా తేరుమీద రాజఠీవితో తపోవనం ప్రవేశిస్తాడు. లోకోత్తర శక్తియుక్తుడైన హరునిమీదకు మన్మథుడు సామాన్యుడుగా వెళ్ళడంకంటే రాజుగా వెళ్ళడమే మిన్నగా వుంటుందని రాజఠీవిని కల్గింపచేయడంలో మాధవునిచేత తేరుని తెప్పించడం, కుసుమాయుధాలు సమకూర్చడం వంటివి కవి చిత్రిస్తాడు. మదనునిలో ధైర్యాన్ని, కార్యదీక్షను ఇనుమడింపజేస్తాడు.

మధు విజృంభణా వర్ణనంలో కాళిదాసు వర్ణించిన తీరు:—

"తస్మిన్ వనే సంయమినాం మునీనాం
తపస్సమాధేః ప్రతికూలవర్తీ
సంకల్పయోనేరభిమానభూతం
ఆత్మానమాధాయమధుర్జజృంభే."

ఆ తపోవన ప్రవేశానంతరం నియమవంతులైన మునిశ్రేష్ఠులకు ప్రతికూలమై, సంకల్పమాత్రంచే సాక్షాత్కరించే మదనునికభిమానుడైన మధురాజు మదనునికి నచ్చేరీతిగా రూపు దాల్చి వనమంతటా విజృంభిస్తాడు. మదనుని మనోభావాన్ని గుర్తించి, అతని కార్యము సానుకూలం కావడానికి తా నెల్లా మారాలో అతడే గుర్తించినట్లుగా మధురాజు సృష్టి జరిగింది.

ఈ విజృంభణా న్నె కొంత వివరిస్తూ శ్రీనాథుడు హరవిలాసంలో వర్ణించిన విధానం సహృదయుల హృదయంగమం.

"సకలవనంబులందుఁ గల.
సంయమికోటి తమస్సమాధి ని
ష్ఠకుఁ, బ్రతికూలవర్తియయి,
షట్పద, కోకిలరాజ కీరజా
లకములతోడఁ గూడ ఝష
లాంఛను నెచ్చెలికాడు వచ్చె; వా
రక మధుమాసరాజు నవ
రాగ సరమంచిత పల్లవాస్త్రుఁడై."

కాళిదాసునిభావా లున్నవున్నట్టుగా గ్రహించి; వాటికే మెఱుగులు దిద్ది రామణీయకతను పెంపొందించాడు. పలుతావులలోనియమంగా తపోనిష్ఠ ననుభవించే మునీంద్రులకు ప్రతికూలుడై, అళిసమూహము .... కోయిలలు .... చిలుకల గుంపులు.... వెంటరాగా, మాధవుడు క్రొంగ్రొత్త అరుణిమములతో విరాజిల్లే పల్లవచయం అస్త్రసముదాయంగా గ్రహించి, మదనునికి సహాయంగా వచ్చాడట! సఖుడు కాబట్టి సఖునికి సహాయం చెయ్యడానికి వచ్చాడు. హార్దికమైన స్నేహం మనస్సున పీఠం వేసుకోవడం చేత మదనుని అభిప్రాయం గ్రహించి అతనిచే చెప్పించుకోకుండానే అనుకూల వాతావరణం సృష్టించి మాధవుడు కాళిదాసుని కుమారసంభవంలోకంటె మెరుగుగా హరవిలాసంలో కనిపిస్తాడు.

ఈ సందర్భంలోనే నన్నెచోడుని పాత్రచిత్రణం కాళిదాసు భావానికి మరింత గాంభీర్యాన్ని కల్గించినట్లున్నది. 'సంయమికోటికిఁ బ్రతికూలవర్తి" అని చెప్పక ప్రతికూల వాతావరణమైన "వసంత విలాసాన్నే" ఉజ్జ్వలంగా వర్ణించాడు. మధురాజును ఆజ్ఞాపాలితానుచరునిగా సృష్టించాడు.

"వలరాజామనిఁ బిల్చి వేగమెయి నీ
వాసంతి కానంద దో
హల మీ కాననలక్ష్మి కిమ్మనుడు నా
హ్లాదంబుతో నెయ్య మ
గ్గలమైయుండ వసంతకుండు దమపైఁ
గన్నిడ్డఁ గారాకుఁ గెం
దలి రాకయ్యెనొనాఁదలి ల్చె పడిఁగాఁ
తారాంతరోర్వీజముల్."

"దిగ్దక్షిణగా గన్ధవహం" అనే శ్లోకాన్ని ఆధారంగా గ్రహించి "మలయానిల వర్ణనం" అత్యుత్తమంగా సాగింది.

వేదన విరహులు సేదలు సెడి సంధు
లెడలంగఁ బల్లాకు లెడలెఁ దరుల
రాగిల్లు కవలమే దీగలఁ బులకంబు
లంకురింపఁగఁ దరు లంకురించె
సమ్మదంబునఁ గామిజనుల చిత్తంబులు
చిగురొత్తఁ దరులందుఁ జిగురులొత్తె
రతిదోహలముల దంపతుల ముఖాబ్జముల్
విలసిల్ల వికసిల్లె విరులదరుల
నెలమిఁజిలుక పిండుదొలు మేనఁ జేసిన
తపము పండఁబండె తరువనంబు
లు వితలింపు మిగుల నూయలపాటలు
పొడ మసుమదమునఁ బాడెనలులు.

ఎండుటాకులు రాలుట .... అంకురములంకురించుట.... చిగుళ్ళు వేయుట. . విరులతో తరులు వికసించుట ... చిలుకల గుంపు పూర్వజన్మలో చేసిన తపము పండినట్లుగా తరువనము పండుట .... ఇంపు కులికే ఇంతులు సొంపునాపే యూయల పాటలు పాడుట ... అలులు ఇంపైన ధ్వనులతోఁ బాట పాడుట.... ఈ విధంగా క్రమాభివృద్ధి; దానివలన ప్రాణికోటి పొందే రమ్యానుభూతి సంయమికోటికి ప్రతికూల వాతావరణ సృష్టిలో ముఖ్యమైనాయి. ఈవిధంగా "వసంత వర్ణనం" ప్రతికూల వాతావరణ సృష్ట్యనుగుణంగా వివరంగా వర్ణింపబడింది. అటువంటి వర్ణనలో కూడా నన్నెచోడుని "హరభక్తి" పరాకాష్ఠనందింది. హరుని ఆకారము రూపొందినట్లుగా వెలసిన "సహకారము" దాని సొగసు గమనిద్దాం.

పలకెడు కారాకు లలితాస్థిచయముగా
సోలు కొమ్మలు పలు కేలుగాఁగ
బాలపల్లవములు వ్రేలు కెంజడలుగాఁ
బెనఁగు తీఁగలు దొడ్డ ఫణులుగాఁగఁ
గలకంఠ నికరంబు గళమున కప్పుగాఁ
బుప్పొడి మేని విభూతిగాఁగ
ఫలములు వరదాన ఫలములు గానవి
మాలికల్ రుద్రాక్షమాలికలుగ
శంభుమూర్తిఁ దాల్చి సహకార భూరుహ
చక్రవర్తి నవవసంత వేళ
నతిశయిల్లుచుండె నక్కడఁ గని మది
నుదరిపడి మనోజుఁడోసరింప.

లలితాస్థిచయము; కెంజడలు; దొడ్డ ఫణులు; గళమున కప్పు; విభూతి; వరదాన ఫలములు; రుద్రాక్షమాలికలు; శంభుమూర్తియందు కన్పట్టు విశేషములు. ఇచ్చట కారాకు లలితాస్థిచయమైనది. బాలపల్లవములు కెంజడలు. తీగలు దొడ్డ ఫణులు; కలకంఠచయము గళమున కప్పయింది. పుప్పొడి మేని బూదిగా తయారైనది. సహకార ఫలములు వరఫలములయాయి అళిమాలికలు రుద్రాక్షమాలికలయాయి.

రమ్యోపమానంతో శంభుమూర్తిని సహకారంలో ప్రస్ఫుటింపచేయడం కవి ప్రతిభా నిదర్శకం. వసంతవర్ణనాసంవిధానంలో నన్నెచోడుని విధానానికి క్రింది పద్యాలు మచ్చుతునుకలు.

మలయసమీరమర్ది సుకు
మార లసత్సహకార నందనా
వలి వడిఁ జొచ్చుఁ జుట్టుకొని
వచ్చుఁ గుజాలికి మెచ్చు నీరిక
ల్వలుపొనరించుఁ గెందలిరు
వెంచుననల్ విరియించుదాని న
ర్మిలిఁ గబళించు నాదటర
మించుఁదమిన్ విహరించునామనిన్
అలు లొడగూడుఁ బిండు గొని
యాడు మృదుధ్వనిఁబాడు నోలిదొం
తులు గొనిపాఱు జొంపములు
దూఱు సుగంధము మీఱుఁ బువ్వుగు
త్తులపయి మూవుఁ బుప్పొళుల
ద్రావు; వడిం దనివోవు మంజరుల్
వెలువడఁ దేఁగు దర్పమున
వీఁగు మదిన్ నలిరేఁగు నామనిన్
చెలఁగుచుఁ బాటి యొక్కొకటఁ
జీరువనంబులు తూటి చిల్కపిం
డెలఁ బొఱఁ ద్రొక్కి కెందలిరు
లెక్కి కొలంకులు నిక్కి మాచి కా
యలు గని మ్రానిపండ్ల రస
మాని ముదంబున నూని పల్కు మున్
పొలుపడరంగ దంపతులు
వొంగ వియోగులు గ్రుంగనామనిన్

ఈ విధంగా కాళిదాసుని వసంత వర్ణనాన్ని వన్నెచిన్నెలతో దిద్ది రమణీయ సన్నివేశాన్ని చిత్రించడం ముదావహం. ఈ వసంతావిర్భావానికే కాళిదాస, శ్రీనాథ నన్నెచోడులు, కూర్చిన రమణీయత, చేసిన మార్పు, ఆ మార్పు యొక్క సమంజసధోరణి, స్పృహణీయంగా వున్నాయి. అవి చూద్దాం.

కాళిదాసు :—

"మధు ద్విరేఫః కుసుమైకపాత్రే
పపౌ ప్రియాం స్వామనువర్తమానః.
శృంగేనాచ స్పర్శనిమీలితాక్షీం
మృగీమ కండూయత కృష్ణ-సారః"
"దదౌ రసాత్పంకజరేణుగంధి
గజాయ గండూషజలం కరేణుః
అర్థోపభుక్తేన బిసేన జాయాం
సంభావయా మా సరథాంగనామా"

ఈ శ్లోక భావములనే శ్రీనాథ మహాకవి:—

"మదనుండు సమారోపిత పుష్ప చాపుఁడును, మధుకరంబులు కుసుమపాత్ర ప్రపూర్ణ మధురస గండూష సముజ్జ్వలిత ప్రియా సందోహములును,

(మిగతా ౩౬ వ పేజీలో)

పదినేముత్యాలు

బుద్ధులు మౌల్యవంతుఁ డొగిఁబోలగఁజెప్పిన మండి నీ వసం
బద్ధపుమాట లాడిన నృపాలతనూభవ నేను బుత్తునే
యుద్ధమొనర్తుగా కనుచు నుద్ధతుఁడై యత డున్న వాడు స
న్నద్ధపదాతివాజిరథనాగసమాకులసైన్యకోటితోన్.

బ్రహ్మాంబేయని చూడ వీడు కుహనాపారీణుఁ డేదిక్కునన్
బ్రహ్మాండంబున డాగినాడో తెలియన్ రాదింక నీ లంకకై
బ్రహ్మాస్త్రం బడరించి పింఛ మడఁతున్ రాతించరశ్రేణి నా
బ్రహ్మాదుల్ వెనుకైన నే నని సుమిత్రానందనుం డన్నతోన్.

అమితబలాఢ్య నీకు విజయంబు నిజం బటుగాక నీదుచి
త్తమున నజయ్యులాన్నృపులుతారనియున్న మదీయ
బాహుశౌ
ర్యము గడుఁదూల వారికి ఖరాదుల చావులు దక్కిపోవఁగ
ష్టమునకు నోర్చి సంధికి నొడంబడఁ జెప్పిన నట్ల చేసెదన్.

నిను నీవ పొగడుకొనియెదు
ఘను లాత్మస్తుతికి నన్యగర్హకుఁ జొర రే
ధనువు గొనియుండ రజ్జుల
పని యేటికి వత్తుఁగాక బవరంబునకున్.

వీఁడు గుంభకర్ణుఁడు సుమ్ము విక్రమంబు
దూల నీచేతఁ బడ విరాధుండు గాఁడు
ఖరుఁడు గాఁడు మారీచుఁడు గాఁడు మనుజ
వర కబంధుండు గాఁ డల్ల వాలి గాఁడు.

—హుళక్కి భాస్కరుడు—యుద్ధకాండం

పతియెడ రెండులేక కులభామలు తా రతఁ డెట్టిడైన స
న్మతి జరియించు టొప్పుననినం గమనీయచరిత్రుడుం గృపా
నిత్యుఁడు జితేంద్రియుండు నతినిర్మలధర్మయుంతుడు
సూనృతో
క్తితుడును రాము డీరఘువరేణ్యుని నేగతి గొల్చుటొప్పదే.

తమ్ముఁడు దాను నొంటిబడి తాపసులై వనభూమి నుండగా
నిమ్ములఁగిట్టి పట్టి వధియింపఁగఁ బోవుచు నున్న వాఁడ నా
యమ్మకుఁ బుట్టినాఁడ వఁట యక్కట నీతలఁ పేమిసెప్ప ని
న్నిమ్మొనతోడఁ బోవిడుచునే గుహుఁ డిప్పుడు నూడు
మంతయున్.

కులపాంస్య విను సగరుఁడు
కులనాశకుఁ డైనయట్టి కొడుకుఁ గనఁగ దా
నిలలోన నుండనీయక
నిలయము వెడలంగ నడిచె నిశ్చయబుద్ధిన్.

చెప్పిన పువ్వుబోడులకుఁ జీక్కనిహారము లంబరంబులున్
గప్పురవీడెముల్ మిగుల గాంచనరత్నసుగంధమాల్యముల్
దెప్పలుగాఁగ నిచ్చిమదిఁ దేకువ సంతసమంది విఘ్నముల్
చొప్పడకుండ దేవతలసొంపునఁ బూజలు సేసె వేడుకన్.

—కుమారరుద్రుడు: రామాయణ భాగం

'ఒకానొక రాజొకనాఁడు పీటపైఁగూర్చుండి యభ్యంగనము జేసికొనుచుండెనఁట ! అపు డా మార్గమున బారుగట్టి పోవుచున్న చీమల గుంపునకు రాజు కూర్చుండిన పీటకొ డడ్డముగా నుండెనట! అది చూచి, ముందు నడచుచున్న చీమ తటాలున వెనుకకుఁ దిరిగి తన వెనుకవచ్చు ప్రతి పిపీలికకు నా సంగతిని తెలుపుచుఁ బోయి కడపట నున్న గండుచీమ కా విషయము నెఱింగించెను. ఈ పిపీలికాసైన్యమున కధికారి యగు నా పెద్దచీమ "మన కంటె రా జెవ్వఁడు? మీ రందఱును బట్టి యా పీటను లాగి వేయుఁ"డని యుత్తరు విచ్చెను. సేనాధిపతి యాజ్ఞాను సారముగ నా చీమ లన్నియుఁ గోడు చుట్టును జేరి పట్టు బట్టినవి. కాని పీటను గదల్చలేకపోయినవి. ఈ సంగతిని మఱల నా పెద్దచీమకుఁ జెప్పగా నది "అట్లయినచో నా మార్గమును దప్పించి నడువుఁ"డని యాజ్ఞాపించెను. అవి

యశ్లే తమ మార్గమును దప్పించి మఱల బారుగట్టి పోవుచుండెను. చీమల భాష నెఱింగిన యా రాజు చీమల ప్రయత్నమును తుదకుఁ దప్పించుకొని పోవుటయుఁ జూచి నవ్వుకొనియెను. అతఁడు నవ్వుటయు నాతని భార్య యచ్చటకు వచ్చుటయు నొక్కసారిగా జరిగినవి. రాజు ఎందులకో తనను జూచి నవ్వుచున్నాఁడని యనుమానపడి హాసకారణమును జెప్పుమని భర్తను నిరోధించెను. రాజునకు బిబీలికా భాష నుపదేశించినగురు "రహస్యము నెవ్వరికైన జెప్పితివేని నీ తల రెండు వ్రక్కలగు"నని యాదేశించి యుండెను. ప్రాణభయముచే రా జీకథను రాణికిఁ జెప్పక "ఏమి లేదు. ఏమి లేదు" అని మఱపింపఁజూచెను. రాణి కనుమానము మెండై "హాసకారణమును సరిగాఁ జెప్ప రేని ఇదిగో ఈ వజ్రపుటుంగరముచే నిప్పుడే నా తనువును విడచెదను. ఇది నిశ్చయము" అని రాజునకు విన్నవించెను. రాజునకు నిజము చెప్పక తప్పదయ్యెను. ఆ సందర్భమున రాజు రాణితో ననిన మాటల నీపద్యములోఁ గవి రచించి యుండెను.

చెప్పకున్న నీవు జీవంబు విడుతువు
చెప్పినపుడు తనకు జీవహాని
చెప్పి మున్న నీకు జీవంబు విడిచెద
నీవు చన్న వెనుక నిలువలేను.

ఆ రాజు భార్యకు నిజము చెప్పెను. అతని తల వ్రక్కలయ్యెను. రాణి చిన్నఁబోక యా రెండువ్రక్కల నదిమిపట్టి "ఏను పతివ్రతనైతినేని యివియతుకుకొని నా భర్త జీవించుఁగాక" యని భర్తను బ్రతికించుకొనియెను.

—కవి భల్లటుడు—విక్రమార్క చరిత్ర

(34 వ పేజీ తరువాయి)

మృగంబులు మృగీ కండూయన పరాయణంబులును నై యుండిరి. వెండియు.

"పంకజరేణుగంధి యగు
పల్వలవారిఁ గరేణు విచ్చె ని
శ్శంక మదావళంబునకు
గంధగజంబును బద్మినీ మృణా
లాంకుర మర్ధభుక్తము ని
జాంగనకుం బ్రియమార నిచ్చెనా
వంక తపోధనుల్ హృదయ
వత్సలతన్ బ్రియమంది చూడఁగన్."

పరస్పర ప్రేమానురాగపూరిత మైన ద్వంద్వముల సన్నివేశాలు కల్పించడానికి తగిన "ఆకాలిక మధుప్రవృత్తి;" దానివలన కల్గిన చిత్త వికారమాచికో లేని జంటల చేష్టలు సంయమివరులు ధైర్య బంధాల్ని విడగొట్టాయి. కరేణువు గంధ గజానికి గండూష జలాన్ని య్యడం దానికి ప్రత్యామ్నాయంగా, అనురాగ సూచకంగా గంధగజం కరేణువుకి బిసఖండాన్ని య్నడం; కాళిదాసుని శ్లోకానికి కొంచెం మార్పు చేసిన విధానాన్ని సూచించాయి. చక్రవాకము అర్ధభుక్తమైన బిసఖండాన్ని న్నియ్యడం కంటె, అర్ధభుక్త బిసఖండం గంధగజానిక రేణు వియ్యడం పరస్పర ప్రేమ సూచకంగా కనిపిస్తోంది. ఈసన్నివేశ చిత్రణంతోనే తపోవన ప్రాంతం, ప్రాణికోటి యొక్క రమ్యానుభూతి; పరస్పరానురాగ ద్యోతక చేష్టలు; విస్పష్టమయేలా, చిత్రార్పితములుగా, కానవచ్చే నన్నెచోడుని ఈ సీసపద్యం చూడండి :—

కరి యిచ్చె నరమేసి కరిణికి సల్లకీ
పల్లవ ముల్లంబు పల్లవింప
మృగమర్ధిఁ గబళించి మృగికిచ్చెనంచుద
ర్భాంకురంబులు చిత్త మంకురింప
హంస మక్కువ నిచ్చె హంసికి నోర్నోర
నెలఁదూడు మొగముల నెలమిమిగుల
భృంగము ద్రావి తోభృంగికి దయ నిచ్చె
మధుధార ముఖరాగముదముదలఁకఁ
గిన్నరుండు గ్రోల్చెఁ గిన్నరి వీనుల
రాగరసము మేన రాగమెసఁగ
మధువిడం బనమున మగలును మగువలు
నిరవిగొనిరి మదన పరవశమున

ఈ విధంగా పరస్పరానురాగానుభూతిలో ద్వంద్వముల సృష్టిమూలాధిక శోభనుగల్గ జేస్తోంది. కాళిదాసుని భావాలున్న వున్నట్టుగానే ప్రతి శ్లోకం సాధ్యమైనంతవఱకు అనువదిస్తూ సన్నివేశ కల్పనం చెయ్యవలసిన చోట సముచిత రీతి రచన సాగించిన శ్రీనాథుని రచనా వైదగ్ధ్యం అసమానం. అనుపమానం. కాళిదాసుని భావాల నూతగొని స్వల్ప[illegible]తైన మార్పులు చేసి మహోజ్జ్వలంగా వసంత విజృంభణాన్ని వర్ణించడంలో నన్నెచోడుని కమనీయ కావ్యశిల్పం అమందానందదాయకం.

ఈ విధంగా కాళిదాస, శ్రీనాథ, నన్నెచోడుల వర్ణనా విధానములు పాఠక మనఃఫలకాలలో కమనీయ సన్నివేశ రూపకల్పన చేస్తాయనడంలో అతిశయోక్తి యుండదు. ★

భారతదేశంలో అత్యధికంగా
అమ్మకం జరుగుతున్న సిగరెట్టు
ఆంధ్రప్రదేశ్ లో ఉత్పత్తి అవుతున్నది



A product of

THE VAZIR SULTAN TOBACCO COMPANY LTD.

HYDERABAD-DECCAN



వర్తమానంలో స్త్రీలు - వారి బాధ్యతలు

వి. వి. హనుమాయమ్మ

పూర్వము అనగా సుమారు యిరువది సంవత్సరముల క్రిందటికంటె నేటి స్త్రీలలో చదువుకున్నవారు అసంఖ్యాకులయినారు కాలక్రమేణా దేశము అనేక నూతనపద్ధతులలో పురోభివృద్ధి చెందుట చేతనూ, మన ప్రభుత్వముగూడ పెక్కు వసతులు సహాయములు గల్పించుచూ స్త్రీ విద్యకు హెచ్చుప్రోత్సాహమిచ్చుట చేతనూ, స్త్రీలు కూడ "ముదితల్ నేర్వగ రాని విద్య గలదే ముద్దారనేర్పించినన్" అన్నట్లు నేడు పురుషులతోపాటు దాదాపు సమానస్థాయి నందుకొనుచున్నారు.

ఎందరో విద్యార్థినులు విద్యార్థి దశయందు తమ భావిజీవితముగురించి ఎన్నో అగణ్యమయిన ఆలోచనా తరంగాలలో నోలలాడుదురు. అమితమయిన వూహాసౌధాలను నిర్మించుకొని విజ్ఞాన కాంతిలో వెలగాలని జ్ఞానజ్యోతితో తమ జీవితములను మేడమ్‌క్యూరీలాగ చిరస్థాయిగా చేసుకోవాలని అనుకుంటారు. కాని అవి అనేక మందిలో చివరికి వూహాసౌధాలయి తీరని కోరికలుగా వుండిపోతాయి. నిర్మించుకున్న గమ్యస్థానాలు చేరలేక భిన్నగతులతో, విభిన్న బాటలలో, క్రొత్తరీతులతో భావి జీవితమును గడుపుచున్నారు.

ఉన్నతవిద్యల నభ్యసించి వర్తమానములోని విద్యావంతులయినందున సాధించుచున్న దేమిటి? అనే ప్రశ్న వుదయించుచున్నది. వారు నేర్చువిద్య కేవలము విద్య కొఱకేనా? (Education for education sake) లేక సంస్కారముకొఱకా? లేక వుద్యోగములు చేసి ద్రవ్యమును సంపాదించి ధనవంతులుగా అగుటకా? అనే ప్రశ్నలకు జవాబు బహుకొద్దిమంది ధనవంతులు, వుత్సాహవంతులు మాత్రమే విద్యను విద్యకొరకు అభ్యసించుచున్నారు. పోతే సంస్కారము కొఱకు అంటే యెవరయినా సంస్కారవంతులుగా అవాలంటే విద్య నభ్యసించుట వలననే సంస్కారవంతులు కానక్కరలేదు. చదువుకు సంస్కారమునకు యెట్టిపరస్పర సంబంధము లేదంటే అది అతిశయోక్తి కాదనుకుంటాను.

అంటే విద్యవల్ల స్త్రీలకుగాని మరెవరికీ కాని యెట్టిలాభములేదని కాదు. "విద్య నిఘూడవిత్తము" అనే భర్తృహరి సుభాషితము యెక్కువపాలు మహిళలలోనే సత్యమనిపిస్తుంది. కాని మనము సంపాదించిన విద్య నిత్యజీవితములో మనకు మనవారికి మన దేశమునకు యెంతవఱకు యెట్లుపయోగ పడుచున్నది? అనేదే సమస్య.

విద్యావిహీనులైనను వున్నత విద్యల నభ్యసింపకపోయినను యెంతో సంస్కారము కలిగినవారు చాలామంది గలరు. మెరుగు పెట్టిన బంగారమునకు తుది మెఱుగు (Finishing polish) పెట్టినట్లే, వస్తుతః జన్మసంస్కారము వున్నవారికి విద్య కేవలము తుదిమెఱుగులాగ పనికి వచ్చునేగాని విద్యవల్లనే సంస్కారవంతులు కానేరరు, విద్య, సంస్కారము రెండునూ వున్నచో మణులను బంగారములో పొదిగినట్టు ద్విగుణీకృతముగ ప్రకాశింతురు.

విద్య వుద్యోగముకొఱకా, లేక వుద్యోగములు విద్యావంతులకా అనేదే సమస్య. విద్యావంతులందరూ వుద్యోగములు చేయుటలేదు. తక్కువచదువు చదువుకున్నవారు యేదో వొక వుద్యోగము చేయకమానరుకదా! విద్యవుద్యోగముకొఱకు అనే విషయమును స్థిరపఱచు కొందము. నేడు అనేకమందిస్త్రీలు విద్యావంతులయి

ననూ యే కొద్దిశాతమో తమ విద్యను వుద్యోగము కొఱకు వుపయోగించుచున్నారు.

అనేకమంది స్త్రీలు వివాహితులు కాగానే వారికి వీలుకలుగకనో లేక వారిభర్తలకు యిష్టము లేకనో వుద్యోగములు చేయుటలేదను విషయము సువిదితమే! విద్య నెవరెందుకు అభ్యసించినప్పటికీ పై మూడు కారణ ప్రయోజనములు లేనప్పటికి విద్యవల్ల పురుషులకంటె స్త్రీలు సాధించగల వుత్కృష్ట ప్రయోజనము కలదు. ఏ కొద్దిమంది ఆడువారినో మినహాయిస్తే బహుసంఖ్యాక స్త్రీలు గృహిణీలు కావలసిందే. ఆనాడు విద్యావంతురాలయిన గృహిణి మిగిలిన వారికంటె (విద్యను వుద్యోగముకొఱకు వినియోగించేవారికంటే) కడు ప్రయోజనము సాధించగల్గి దేశ సౌభాగ్యమునకే వొక బురుజు కాగల్గి దేశ సుస్థిర సౌభాగ్యమునకు, వెన్నెముకవంటిది కాగలదు. గృహిణి అయినా కాకపోయినా, వుద్యోగము చేసినా చేయకపోయినా ప్రతి మహిళ తనకుటుంబమునకు లేదా యింటికి యజమానురాలవక తప్పదు. కుటుంబము లేదా గృహముయొక్క సౌభాగ్యమునకు కీర్తి ప్రతిష్ఠలకు ఆర్థిక సుస్థిరత్వమునకు తన్మూలముగా దేశ సౌభాగ్యమునకు రాజ్య సుస్థిరతకు కూడా యెక్కువగా స్త్రీలదే. అందునా విద్యావతులైన స్త్రీలదే అంటే సందేహాశ్చర్యములు కలుగనక్కరలేదు.

కారణ మేమన దేశసౌభాగ్యము, సంపద, దాని స్థిరత్వము దాని ప్రజలమీద నాధారపడి వుందను విషయము నిర్వివాద మయినది. ప్రజల సంపదే దేశ సంపద, ప్రజల నైతిక శక్తి దేశమునకు కీర్తి; ప్రజల ఐక్యతే దేశము ముందుకు వచ్చుటకు కారణము: ప్రజల వీరోచిత సామర్థ్యములే రాజ్య సుస్థిరతకు మూలములు. కాన అట్టి పౌరులను తయారు చేయగల్గినవారు వొక్క స్త్రీలుమాత్రమే.

నేటి బాలబాలికలు భావిపౌరులు గృహిణులు. అట్టి నేటి బాల బాలికల జీవితాలను వీరశివాజీ తల్లివలెనే వీరగాథలను చెప్పుచు విజ్ఞాన విషయములను వుగ్గుపాలతో నేర్పుచూ సార్థకం చేయు బాధ్యతభారము స్త్రీదే అయివున్నది. కుటుంబములోని పురుషులు వుద్యోగములకు తల నమ్ముకొని వుద్యోగము చేయుటయే జీవిత సమస్యగా, సాధనగా వారికాలమును యెక్కువగా వినియోగింతురు. అట్టి సమయమునందు కుటుంబములోనివారందరికి ఆ గృహిణియే సంరక్షకురాలు. ఆ కుటుంబమునకు వచ్చు ఆదాయమునుబట్టి ఆ కుటుంబమునకు సాధ్యమయినంతవఱకు యెటువంటి లోపములు లేకుండా, కుటుంబపోషణ జరుపుకొనుచు పిల్లలను క్రమశిక్షణలో పెంచి, వారిని విద్యావంతులను చేయుటలో ప్రతిస్త్రీ తన కర్తవ్యముగా భావించి నిమగ్నురాలు కావలెను. పురుషులు కేవలము "కుమ్మరికి సారె" లాంటివారు. కుండ తయారుచేయుటకు సారె సాధనమైనప్పటికి దానిని కావలసిన తీరులోనికి మలచుకొనుటకు (Mould) వేరొక రెట్లుండవలెనో అట్లే ప్రతి కుటుంబపు టౌన్నత్యమునకు స్త్రీదే ముఖ్యపాత్ర.


గత చరిత్ర రాణీ రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయిలాంటి వీరవనితలు రాజ్యపాలన గావించిన సంగతి నాయకురాలువంటి ధీమంతులు మంత్రిత్వము సహితము నెరిపిరన్న విషయము కలముపట్టిన మొల్ల భాషాజ్ఞానమును చాటిచెప్పుచున్నది. నేడు మనలో చాలమంది పైనుడివిన వీరనారీమణుల గాథలను వినుచూ తాత్కాలికానందముతో కాలమును గడుపుచున్నారేగాని వారి నాదర్శప్రాయముగా నుంచుకొని తద్రీతులలో మన బాధ్యతలను నిర్వహించుకొనలేకపోవుట మిక్కిలివిచారము. తమపిల్లలకు ఆడపిల్ల అయిన ఝాన్సీ అని, మొగశిశువునకు శివాజీ అనియో లేక వివేకానందుడనియో అదీకానిచో ఠాగూర్, సుభాస్‌బోసు అనో గొప్పగొప్ప వారి పేర్లను యెంచి పెడుదురు. కాని వారిని సార్థక నామధేయులుగా అగుటకే మాత్రము ప్రయత్నించరు. బంగారు పిచ్చుక నేతిబీరకాయవలె నామమాత్రావశిష్ఠులగుచున్నారు. పేరు చూడబోయిన శివాజి. వానికి పిల్లిని చూసినపలాయనము చిత్తగించును. మరికొంతమంది పేరుకు ఠాగూరు. చూస్తే నిరక్షరకుక్షులు. మఱికొందరు పిల్లలు గడుగ్గాయలైపోతే రాబర్టు క్లైవులాగ పట్టరాని అల్లరిచేస్తాడు అంటారు. వాడి కా తెలివితేట లుండవు సరి కదా హక్కులకోసం పేచీలు.

దీనికి బాధ్యత పురుషులది యిరువది పాళ్ళు, స్త్రీలది యెనుబదిపాళ్ళు అని అనక తప్పదు. అందులో చదువుకున్న స్త్రీఅయితే యింకా యెక్కువశాతమే బాధ్యత వహించవలసివున్నది. అటువంటి అప్రయోజకులనే "తల్లిలేనిబిడ్డా లేక తండ్రిపెంచినబిడ్డా" అనే నానుడితో అపహాస్యము చేస్తూండటము మనము నిత్యమూ వింటూనే వుంటాము. మనలో చాలమంది జీవయాత్రను యంత్రకాలముగనుక యాంత్రికముగా (Machanical) జరుపుచూ, పిల్లలకు విద్యావయస్సు వచ్చినది కనుక వాళ్ళని నిర్బంధ విద్య కొఱకు యేదో పాఠశాలలో జేర్పించిన వారి బాధ్యత తీరినట్లు భావింతురు. ఆ పిల్లలు సక్రమముగా పాఠశాలలకు వెళ్ళుచున్నారా? పాఠశాలలో వారు నేర్చినవిద్య నెంతవఱకు అవగాహన చేసుకొనుచున్నారు? బోధించు విద్య ఏరీతిగానున్నది? యింటికి రాగానే సక్రమముగా చదువుచున్నారా? అనే జీవి


తాంశ విషయములను యెంతమంది తల్లులు తమ బాధ్యతగా గుర్తించి గమనించుచున్నారు? ఆ విధముగ అందఱు తల్లులు తమ ముఖ్యవిధిని పాటించినచో తన్మూలముగా దేశము సర్వవిధాలా సుభిక్షముతో శోభిల్లదా? ఎవరైనా ఏమమ్మా చదువుకున్నదానివి నీవుకూడ పిల్లల చదువు విషయములో కొంచమైనా శ్రద్ధ చూపకపోతే ఎలా? అని ప్రశ్నిస్తే దానికి వచ్చేజవాబు అఁ! ఏం చేస్తాం వాళ్ళఖర్మ యెలావుంటే అలా జరుగుతుంది. వెధవ చాకిరీ; యింటెడు చాకిరీ చేసుకుంటూ వీళ్ళసంగతికూడా చూడమంటే ఓపిక యెవరికి యెందాక చస్తాము! అని అంటారు కాని "పుత్రోత్సవము తండ్రికి...జను లా పుత్రుని గనుగొని పొగడగఁ బుత్రోత్సాహంబునాడు" అను విషయమును గమనింపరు.

ప్రపంచములో స్త్రీ సహనమునకు మారు పేరు అని అంటారు. ముఖ్యముగా ప్రతీ చదువుకున్న స్త్రీలోనూ సహనము, శాంతము, కార్యదీక్ష, దక్షత యెక్కువగా వుండితీరాలి. ఈ శక్తులను సంపాదించిననాడే ముఖ్యముగా స్త్రీలు చదువుకున్నందుకు తగిన ఫలితము, విలువ వుంటాయి. అలా కానినాడు నేర్చిన విద్య నిష్ఫలితమే. చదివిన కాలమును వమ్ము చేసినవారే అవుతారేమో అనిపిస్తున్నది. ప్రతివొక్క స్త్రీ, అందునా విద్యావంతురాలయిన గృహిణి తన బాధ్యత తన చదువు సక్రమముగా వినియోగించాలి అందుకు సాధ్యమైనంతవఱకు తన పిల్లలకు కుటుంబములో చిన్నవారికి క్రమశిక్షణ నేర్పాలి. వారికి ఆదర్శమైన వీరోచిత గాథలను చెప్పాలి. సత్య అహింసలు బోధించాలి. సత్ప్రవర్తనను ఐకమత్యముగా మసలుకొటను నేర్పాలి. పఠనాంశములను వారికి నేర్పుచూ చక్కగా విద్యావంతులు, ధైర్యవంతులుగా నగునట్లు తయారు చేయవలెను. మిగిలిన తీరిక సమయములందు సంఘశ్రేయస్సుకు తమకు తోచినరీతిలో యథాశక్తిగా తోడ్పడాలి. ప్రతి యింట నిరక్షరాశ్యతను నిర్మూలించి చక్కని ఆరోగ్యములను బోధించుచూ వాటి నందఱి చేత పాటింపచేయవలెను. ఈ విధముగ మన జీవిత కర్తవ్యమును నెఱవేర్చుకొనినచో యెవరికివారు తన్మూలముగా దేశము ధన్యత చెంది దినదిన ప్రవర్ధమానముతో శోభాయమానముగా భాసిల్లకలదు. అయితే ఇటువంటివి వొక్కరివల్ల వ్యక్తిగతంగా సాధించేవికావు. "little drops of water" అన్నట్లు దేశములోని ప్రతివొక్క కుటుంబము గృహిణిలు తమ పిల్లల భవిష్యత్తు గురించిన బాగువోగులు చూసిననాడే దేశము కూడ వున్నతస్థితికి రాగలదు. మన యింటిబాగోగులు దేశ ఔన్నత్యానౌన్నత్యములకు బాధ్యత నా వొక్కదానిదేనా? అంటే కారకులు యెవరు యెంతవఱకు అనే తర్కమునకు వచ్చేజవాబు శూన్యము. అలా కాకుండా మన కందుబాటులో వున్న స్వల్పకాలవ్యవధిని (constructive work) క్రింద వినియోగించితే సత్ఫలముల నాశింపవచ్చు. మన ఒక్కరిదే బాధ్యత కాకపోవచ్చు. మనబాధ్యతలను మనము అనగా ఎవరికి వారు తమకు తగినంతగా నెఱవేర్చుకుంటే చాలు. దానివల్ల లాభశాతము మెండుగానే యుండుననుటలో సందేహములేదు. ఇంటి మంచి చెడ్డలు గౌరవము యింటిలోనివారిపై వున్నట్లే దేశముయొక్క మంచిచెడ్డలు దేశౌన్నత్యము దేశములోని ప్రతివొక్క వ్యక్తిపైనా ఆధారపడియున్నది.


కావున ప్రతి స్త్రీ అందునా ముఖ్యముగా చదువుకున్న స్త్రీ ప్రతి వొక్కరూ కూడా తమకు తోచిన యథోచిత రీతిని యథాశక్తిగా తన విద్యా, విజ్ఞానము సర్వమును ధారపోసి తన కుటుంబ ఔన్నత్యమునకూ తన్మూలకముగా సంఘ శ్రేయస్సుకూ దేశ శ్రేయస్సుకూ పాటుపడుట అభిలషణీయము. ఆనాడు మనలను యే శత్రువులు యేమీ చేయలేరు. సకల విజయములు మన వనుట తథ్యము. ఆ విధముగ స్త్రీలు తమ పిల్లలను క్రమశిక్షణలో భావిపౌరులుగా తయారు చేయుటకు భగవంతుడు తోడ్పడుగాక! ★



అమెరికా రాయబారి శ్రీ చెస్టర్ బౌల్స్, ఆయన సతీమణి 64 ఆగస్టు 10 వ తేదీన బేగంపేట విమానాశ్రయంలో దిగినప్పుడు తీసిన చిత్ర



ఆంధ్రప్రదేశ్ గవర్నరు, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో క్రొత్తగా నిర్మింపబడిన ప్రార్థనహాలుకు, 1964 ఆగస్టు 3 వ తేదీన ప్రారంభోత్సవం చేశారు.




శ్రీ చెస్టర్ బౌల్స్ హైదరాబాదు రాజ్‌భవన్‌లో ఆగస్టు 10 వ తేదీన గవర్నరును కలిశారు.



అమెరికా రాయబారి శ్రీ చెస్టర్ బౌల్స్ సతీసమేతంగా 1964 ఆగస్టు 10 వ తేదీన హైదరాబాదుకు వచ్చారు. ఆర్థికమంత్రి డా. చెన్నారెడ్డి, హైదరాబాదు మేయర్, చీఫ్ సెక్రెటరీ, విమానాశ్రయంలో వారికి స్వాగతం చెప్పారు.




సెప్టెంబరు 18 వ తేదీన ఆర్థికమంత్రి డా. చెన్నారెడ్డి జకోస్లేవేకియా వెళ్ళనున్న సందర్భంలో



"కొంతకాలం తర్వాత బహుశా మనం కుర్రవాళ్ళకు భూగోళం పాఠాల్ని యీ విధం చెప్తామేమో."


— సోవియట్ భూమి సౌజన్యంతో



ఆస్ట్రేలియా హైకమీషనరుతో ముఖ్యమంత్రి

పాఠ్యపుస్తక ముద్రణశాలలో మోనోటైపు పద్ధతికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.






1964 ఆగస్టు 12 వ తేదీన హైదరాబాదులోని రాష్ట్ర సమాచార కేంద్రంలో పాఠశాలపిల్లలకు వ్యాసరచనపోటీ జరిగింది.

స్వాతంత్ర్య దినోత్సవ పెరేడులో పోలీసు కానిస్టేబుల్‌కు
ముఖ్యమంత్రి పతకాన్ని అలంకరిస్తున్న దృశ్యం





1964 ఆగస్టు 15 వ తేదీన సికింద్రాబాదులో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవం పెరేడ్‌లో దిగువవారికి అవార్డులను ఇచ్చారు
(ఎడమ నుంచి కుడికి)

(1) శ్రీ మహ్మద్ జాఫర్, పోలీసుకానిస్టేబుల్, నెం 4310, హైదరాబాదు సిటీపోలీసు — ధైర్యసాహసాలకు పతకం

(2) శ్రీ గూటి హనుమంతనాయుడు, ఐ. పి. ఎస్., పోలీసు సూపరింటెండెంటు, కృష్ణా — ప్రత్యేక సర్వీసుకు, పోలీసు, ఫైర్ సర్వీసుల ప్రెసిడెంటు పతకం.

(3) శ్రీ కోర్ని భీమశంకరరావు, డిప్యూటి పోలీసుసూపరింటెండెంటు స్పెషల్ బ్రాంచి, సి. ఐ. డి., హైదరాబాదు — ప్రశంసార్హమైన సర్వీసుకు పోలీసు మెడల్.

(4) శ్రీ కోకా రంగారావు, డిప్యూటీ పోలీసు సూపరింటెండెంటు విశాఖపట్నం (దక్షిణ) — ప్రశంసార్హమైన సర్వీసుకు పోలీసు మెడల్

(5) శ్రీ ఖాజా అల్తాఫ్ అహమద్, డిప్యూటీ సూపరింటెండెంటు, కర్నూలుజిల్లా — ప్రశంసార్హమైన సర్వీసుకు పోలీసు మెడల్

(6) శ్రీ దొరవారి వెంకటరమణప్ప, అవినీతి నిరోధకశాఖ ఇన్స్పెక్టరు అనంతపురంజిల్లా — ప్రశంసార్హమైన సేవకు పోలీసుమెడల్

(7) శ్రీ రామారావు, పోలీసు ఇన్స్పెక్టరు, అనంతపురంజిల్లా — ప్రశంసార్హమైన సేవకు మెడల్.

(8) శ్రీ నారాయణ చెన్నయ్య, పోలీసు సబ్-ఇన్స్పెక్టర్, హైదరాబాదు — ప్రశంసార్హమైన సేవకు మెడల్

(9) శ్రీ ఇబ్రాహిం (10) శ్రీ కె. సి. మహ్మద్ — వరసగా ఒకటవ శ్రేణి, రెండవ శ్రేణి జీవనరక్ష పతకాలు

ప్రభుత్వ నిర్ణయాలు

* భద్రాచలం దేవాలయం "గర్భ గుడి" పురాతన కొలత ప్రమాణాలను కొనసాగించాలని ప్రభుత్వం శ్రద్ధగా పరిశీలించిన తర్వాత నిశ్చయించింది.

* పశుగ్రాస పరిశోధన సంస్థ తాలూకు కేంద్ర ప్రాంతీయ స్టేషన్ను నెలకొల్పే నిమిత్తం గచ్చి బావులీ క్షేత్రంలోని 250 ఎకరాల విస్తీర్ణాన్ని భారత ప్రభుత్వానికి కౌలుకు ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది.

* రాష్ట్రేతర ప్రాంతాల నుంచి మొలాసెస్ పొందడానికి అయ్యేరవాణా ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ అల్కాహాల్ ఫ్యాక్టరీకి రు. 4.5 లక్షలు కేటాయించాలని ప్రభుత్వం నిశ్చయించింది.

* నల్లగొండజిల్లా దేవరకొండ తాలుకాలోని మల్లారెడ్డి గ్రామం, ప్రస్తుతం పల్లం ప్రాంతంలో ఉన్న కారణంగా గ్రామం వద్ద ఉన్న 20 ఎకరాల భూమిని గృహ స్థలాల నిమిత్తం రిజర్వులో ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

* అసాధారణ ప్రశంస, ప్రత్యేక కేసుల సందర్భాలలో ఉపాధ్యాయుల రిటైర్మెంటు వయస్సును 58 నుంచి 60 సంవత్సరాలకు పెంచాలని నిశ్చయించడం జరిగింది.

* 1962 నవంబరు 24వ తేదీ తర్వాత సైన్యంలో చేరిన మాజీ సైనికుల నిమిత్తం వివిధ జిల్లాలలో తగినంత భూమిని రిజర్వులో ఉంచిన తర్వాత మిగిలిన ప్రభుత్వ భూములను ఇతరులకు ఇవ్వడంపై ఉన్న నిషేధాన్ని తొలిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు 6 నుంచి 7 లక్షల ఎకరాల భూమి పంపిణీకై లభిస్తుంది. దీనిని సాధారణ భూమి దఖల్ నియమాల క్రింద భూమిలేని ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుంది.

* వర్తమాన సంవత్సరంలో రు. 191 లక్షల ఖర్చుతో తెలంగాణా ప్రాంతంలోని 30 పట్టణ మునిసిపాలిటీలలో రక్షిత మంచి నీటి సరఫరా పథకాలను చేపట్టాలని ప్రభుత్వం నిశ్చయించింది. యీ మొత్తాన్ని తెలంగాణా ప్రాంతీయ నిధి నుంచి భరిస్తారు. 1965-66 వ సంవత్సరంలో రు. 207 లక్షల ఖర్చుతో అదనంగా ఇటువంటి 28 పనులను చేపట్టాలని కూడా ప్రతిపాదించారు.

* తెలంగాణా ప్రాంతంలోని వైద్యకళాశాలలో ప్రవేశానికి సంబంధించిన నియమ నిబంధనలను సడలించాలని ప్రభుత్వం నిశ్చయించింది. ఇంతకు పూర్వం నిబంధనలను అనుసరించి వైద్య కళాశాలలో ప్రవేశం కోరే విద్యార్థులు డొమిసిల్ సర్టిఫికెటునూ, తెలంగాణాలో విద్యాభ్యాసం చేసిన విద్యా సర్టిఫికెటునూ దాఖలు చేయాల్సి ఉంది. అటువంటి విద్యా సర్టిఫికెటును దాఖలు చేయడానికి సంబంధించిన నియమావళిని ప్రభుత్వం ఇప్పుడు సడలించింది.


దోంకోసం
కప్పగంతుల
మల్లికార్జునరావు

దీక్షితులుగారితో నాకు పరిచయమై యిప్పటికి సరిగ్గా రెండు సంవత్సరాలయింది. యీ రెండు సంవత్సరాల్లో ఆయన్ను నేను కల్సుకొంది మూడుసార్లు మాత్రమే. ఆయనతో మాట్లాడింది తక్కువే. కన్పించినప్పుడల్లా ఆయనే మాట్లాడేవాడు. మొదట్లో పరిచయం కూడా ఆయనే చేసుకొన్నాడు.

ఆ రోజు-అప్పటికింకా చైనా భారత దేశంపై దురాక్రమణ సాగించలేదు. సరిహద్దు సమస్యలను సామరస్యపూరకమైన చర్చలద్వారానే నిర్ణయించుకోవాలన్న స్థాయిలో వుంది వ్యవహారం.

ఎన్నాళ్ళుగానో మనసులో మెదులుతున్న వో భావనకు నవలా రూపకల్పన చేద్దామన్న సంకల్పంతో పార్కు కెళ్లాను. పార్కంతా సందడిగా వుంది. కొందరు పిల్లలు తొట్టి వుయ్యాలల్లో వూగుతున్నారు. జారుడు బండలమీద కేరింతాలుకొట్టూ జారుతున్నారు. మరికొందరు వేరుశనక్కాయలు, బఠానీలు అమ్ముకొనే కుర్రాళ్ళు గుంపులు గుంపులుగా కూర్చున్న జనంవద్దకెళ్ళి వాళ్ళను వూరించే విధంగా అరుస్తున్నారు.

ప్రశాంతంగా వున్న వో మూల కెళ్ళి పచ్చగడ్డిపై కూర్చున్నాను. నాకు కాస్తంత దూరంలో, లైటు వెలుగులో పేపరు చదువుకొంటున్న వొక్క వ్యక్తి మాత్రమే అక్కడున్నాడు. కూర్చున్న కాస్సేపటికే ఆలోచనలో మునిగిపోయాను.

'యివాళ చైనావాడేమన్నాడో విన్నావా నాయనా?'

వ్రాయబోయే నవలను గురించి ఆలోచిస్తున్న నేను వులిక్కిపడి పక్కకి చూశాను. యిందాక పేపరు చదువుకొంటున్న వ్యక్తి నిలబడివున్నాడు. నేనేం మాట్లాడలేదు. నే నాయనవైపు చూడటాన్నే 'ఏమన్నాడూ?' అన్న ప్రశ్నగా భావించాడేమో మరి, ఆయనే చెప్పటం సాగించాడు.

'మితిమీరిన మంచితనాన్ని అభినయించేవాడెప్పుడూ కొంపలు కూలుస్తాడు నాయనా! ఆ చైనావాడూ అంతే. తప్పుడు కూతలు, తప్పుడు కొలతలు, తప్పుడు మ్యాపులు, యిక నాలుగురోజులు పోతే దేశమంతా నాదే నని వచ్చినా రాగలడు. పాలు తాగి రొమ్ములు గుద్దే చేష్టలు కాకపోతే ఏమిటిది చెప్పు? నిన్నటిదాకా 'భాయ్ భాయ్' శాంతి శాంతి' అని ధర్మపన్నాలు వల్లించాడా, యిప్పుడు చర్చ లనేసరికి మల్లగుల్లాలు పెడ్తున్నాడు. రేప్రొద్దున దురాక్రమణకే సిద్ధపడ్డా ఆశ్చర్యపోనక్కర్లేదు-'

అదీ ఆయనతో నాకు పరిచయమైన తీరు! నేను ఆశ్చర్యపోయాను! అంతలోనే ఆయన మాటలు నిజమే ననుకొని ఆనందించాను కూడా!

'శాంతి శాంతి అని అంటున్నారు కదా, బెదిరిస్తే ఏం చేస్తారో చూద్దామని వాడభిప్రాయంలా వుంది. మన సంగతి వాడి కింకా తెలియదు-' అని కాస్సేపాగి నిట్టూర్చాడాయన. 'అయినా పాపం పెరిగిపోతోందండీ ప్రపంచంలో. యిక యీ కొట్లాటలతో, యుద్ధాలతో వల్లకాదు కావల్సిందే!' అంటూనే లేచాడాయన.

వినటం తప్ప ఏం మాట్లాడాలో నాకు తోచలేదు.

'వస్తా న్నాయనా, పనుంది యింకా. పైగా అమ్మాయి వొంటరిగా వుంటోందా? పెందరాడే యింటి కెళ్ళాలి-' అంటూనే చేతిలోని పత్రికలను జాగ్రత్తగా పట్టుకొని చకచకా నడిచి వెళ్ళిపోయాడాయన. నోట మాట రాక నిలబడిపోయాన నేను.

ఆరు నెలల తర్వాత తనుకొంటా, అదే పార్కులో, అదే స్థలంలో మళ్ళీ ఆయన కన్పించాడు. అప్పటికి వ్రాస్తున్న నవలకో రూపం వచ్చింది. ముగింపు ఎంత ఆలోచించినా తృప్తికరంగా రావటంలేదు.

ఆలోచిస్తూ నా స్థలంలోకి పోతున్న నన్ను 'ఏమయ్యా మిస్టర్' అని పిల్చాడాయన. ఆశ్చర్యపోయాను! ఆరు నెలల క్రితం చూచిన నన్నింకా ఆయనకు జ్ఞాపకం వుందాని! వెళ్ళేను.

'నిన్నటి వార్తలు చూశావా నాయనా! చైనావాడు దురాక్రమణకు సన్నాహాలు చేస్తున్నట్లు అభిజ్ఞవర్గాల వూహాలట. ఆ విషయం నే నేనాడో చెప్పలేదూ? "గొర్రె గొంతుకోసే కసాయివాణ్ణితప్ప నమ్మదన్నట్లు" మనం వాడిని నమ్మట మేమిటి, మన పిచ్చికాకపోతే? పాకిస్తానువాడేమో కాశ్మీరంటూ మొరాయిస్తున్నాడు. క్యూబా విషయంలో అమెరికాకు రష్యాకు ఏ క్షణంలోనైనా యుద్ధం రావచ్చు. లావోస్‌లో పరిస్థితి భీకరంగానే వుంది. నాగరికత పెరిగే కొద్దీ ఆఫ్రికాలో రంగుభేదం ఎక్కువవుతోంది-'

అలాగే చెప్పుకుపోతున్నా డాయన- మొరార్జీ పన్నుల పెంపకాన్ని గురించీ, కృపలానీ వోటమిగురించీ, కజగంతో రాజాజీ బంధుత్వాన్ని గురించీన్నూ!

ఆయన ధోరణి నాకు వింతగా తోచింది. ఆ వెంటనే ఆయనంటే జాలీ కలిగింది.

పాపం - రాజకీయాలంటే విపరీతమైన పిచ్చిలాగుంది. కాని, పార్కులో వో మూల కూర్చొని ప్రపంచ రాజకీయాలను పర్యావలోకనంచేస్తే వచ్చేలాభమేమిటో నాకు బోధపడలేదు. బహుశా ఆయన కది ఆనందాన్నిస్తున్నదేమో?....ఏమైనా ఆయనకు రాజకీయ పరిజ్ఞానం బాగా వుందన్నది స్పష్టమే!

రాజకీయాలంతా చెప్పి కాస్సేపాగి చివరి కన్నాడు, 'వొకసారి మా యింటికి రాకూడదుటోయ్? మా అమ్మాయి ఎంతో సంతోషిస్తుంది. ఎమ్మే చదువుతోందిలే. అది చాలా తెలివైన పిల్ల. బి. ఎ. లో యూనివర్సిటీ ఫస్టు-'

ఏం జవాబు చెప్పాలో తెలీక మాట్లాడకుండా నిల్చున్నాను.

'వస్తావుటోయ్, వెళ్దాం-'

'అలాగే. పదండి వెళ్దాం.' అనుకోకుండానే అనేశానలా.

'పోనీ యీతడవ వద్దువుగానిలే. యింగ్లీషు వార్తలొచ్చే వేళయిందిపుడు. నే వెళ్తాను. అమ్మాయి నాకోసం ఎదురుచూస్తూంటుంది యింటిదగ్గర. పెందరాడె భోంచేసే అలవాటు దానికి-' అంటూనే వెళ్ళేడు జవాబుకోసం ఎదురు చూడకుండా.

మొదటిసారి పరిచయమైనప్పుడే ఆయన నాకు విచిత్ర వ్యక్తిలా కన్పించాడు. యిప్పుడా అభిప్రాయం స్థిరపడటమే కాకుండా, ఆయన్ను గురించి తెల్సుకోవాలన్న ఆసక్తి కలిగింది.

విచారించగా ఆయన్ను గురించి తెల్సిన వివరాలివి ఆయన పేరు దీక్షితులు. ప్రతిరోజూ అక్కడికి అదే స్థలంలోకి, దినపత్రికల బొత్తి పట్టుకొని సాయంకాలం కాగానే వస్తుంటాడు. యివాళ పట్టుకొచ్చే పత్రికలన్నీ నిన్నటివి. యివాళటివి రేపు. అలా వొకరోజు వెనుకటి పత్రికలు యింగ్లీషు తెలుగు భాషల్లో రకరకాలివి పట్టుకొచ్చి మొదటినుంచి చివరిదాకా చదువుతూ కూర్చుంటాడు. ఎవరితోనూ సాధారణంగా మాట్లాడడు. ఎప్పుడైనా మాట్లాడితే రాజకీయాలను గురించి, తన కూతుర్ని గురించి తప్ప మరోటి మాట్లాడడు. ఆయన పిచ్చివాడని కొందరన్నారు. కాదు మంచి తెలివితేటలుగల వ్యక్తని మరికొందరన్నారు. యింతకన్నా ఆయనకు సంబంధించిన వివరాలు నాకు తెలియలేదు.

వ్రాస్తున్న నవలకు ముగింపు దొరకలేదు. యీలోగా ఆస్తిగొడవల్లో స్వగ్రామం వెళ్ళాల్సి వచ్చింది నేను. తిరిగి రాగానే యిక్కడ ఆఫీసులో పేరుకు పోయివున్నాయి అర్జంటు కాగితాలు. వీటితో క్షణం తీరిక లేకపోయింది. అయినా యిన్ని పనులమధ్య దీక్షితులుగారు ఎప్పుడూ మనసులో మెదుల్తూనే వున్నారు.

తీరిక చేసుకొని వోరోజు కాస్త వూపిరి పీల్చుకొందామని పార్కు కెళ్లేను. దీక్షితులుగారు తన మామూలు ప్రదేశంలో కూర్చొని పేపర్లు చదవటంలో లీనమై వున్నారు. నా రాక ఆయన గమనించలేదు.

వెళ్ళి నేనే పలకరించాను. ఆయన తల ఎత్తి నా వైపు చూచారు కాని మాట్లాడలేదు. ఆయన మొహంలో ఏదో ఆదుర్దా, ఆందోళనా కన్పిస్తోంది. ఒక్క నిముషం నావైపలాగే చూచి, తిరిగి తల వంచుకొని నిశ్శబ్దంగా చదువుకోసాగేడు.

ఆయన చూపువల్ల నన్ను గుర్తుపట్టలేదన్నది స్పష్టమే. కాని గుర్తు చెయ్యాలంటే ఏమని చెప్పాలి? మా పరిచయం అసాధారణమైనది. నే నెవరో ఆయనకు యింతక్రితం మాత్రం తెలుస్తేగా?

అలాగే నిల్చున్నాను కాస్సేపు. పేపరు చదవటం అయిపోయినట్లుంది, మడిచేస్తూ భారంగా నిట్టూర్చి నా వైపు చూశారు.

'చూశావుటయ్యా మిస్టర్' ఆ పాకిస్తానువాడి దురాశ. కాశ్మీరం కావాలంటున్నాడు-నిన్నటి పేపర్లో! నాకు తెలీకడుగుతాను, వాడి దేశానికి వాడు నియంతకాని, మనమీద వాడి నియంతృత్వ మేమిటయ్యా! ఆఫ్రికాలో నల్లవాళ్ళ నింకా వెలివేస్తున్నారా? నలుపు తెలుపు — వాడి పిండాకూడు! తరతరాలుగా వస్తున్న తెగులయ్యా అది! వొక వైపు చైనావాడు, మరోవైపు పాకిస్తాన్‌వాడు దొంగల్లా పొంచివున్నా, మనవాళ్ళేమో యింకా "శాంతి, సహజీవనం"అంటూ మంచితనాన్నే పట్టుకొని వున్నారు చూశావా? బాపూజీ మన కాశాంతి మంత్రాన్ని నూరిపోసేడయ్యా! ఆయన కేం తెల్సు యీ చైనా దుండగులున్నారని? వాళ్ళెప్పుడో గజదొంగల్లా వస్తారూ, మన జాగ్రత్తలో మనం వుండటం మంచిదయ్యా అంటే నా మాట వినే నాథుడే లేడే? ఎవరి గోల వారిదే!'

చెప్తుండటం ఆయన వంతైతే, నిరుత్తరుడనై వింటుండటం నా వంతు!

'అన్నట్లీ మధ్య బొత్తిగా కన్పించడం లేదేమిటోయ్?' ఎన్నో ఏళ్ళ పరిచయస్తుడిని, బంధువుని అడిగినట్లడిగారాయన. 'అమ్మాయికూడా అడిగింది చాలాసార్లు - నిన్ను పిల్చుకొని రమ్మని! నీ సంగతి చెప్పలేదు దానికి!' అంటూ

ఆయన ఛటుక్కున ఆగేడు; ఆ య న మొహంలో విచారం పులుముకొంది.

'అసలు విషయం చెప్పటం మర్చిపోయానోయ్! అమ్మాయి యిక్కడ లేదిప్పుడు అత్తారింటి కెళ్ళింది. కనటాని కొస్తుందో రాదో మరి!' అంటుంటే ఆయన గొంతులో హృదయవిదారకమైన జీర కన్పించింది. అంతలోనే తనను తాను వోదార్చుకొంటున్నట్లు అన్నాడు. 'నా పిచ్చి కాని రా కెక్కడికి పోతుందయ్యా! దానికి నేనంటే ఎంత ప్రేమనుకొన్నావ్? వస్తుంది నాయనా....నా తల్లి నా దగ్గరకు తప్పకుండా వస్తుంది మళ్ళీ. రాగానే చెప్తాగా నీకు-' యిక నిలువలేనట్లు గబగబా పెద్దపెద్ద అంగలేసుకొంటూ వెళ్ళిపోయా డాయన.

అంతా అయోమయంగా తోచింది. ఆయన చెప్పేదంతా నిజమా అబద్ధమా అన్న సందేహమూ వచ్చింది. అమ్మాయి పేరుతో నన్ను పిచ్చివాడికింద జమకట్టి తమాషా చేస్తూ ఆనందించటం లేదుకదా అన్న ఆలోచనా వచ్చింది! కాకపోతే, కూతురు ఎమ్మే చదువుతున్నట్లు క్రితం సారి ఆనందంగా చెప్పినాయన యిప్పుడిలాగ అనట మేమిటి?....ఆలోచించగా, ఎవరో అన్నట్లు ఆయ నో పిచ్చివాడు కాదుగదా? కాని రాజకీయాల విషయంలో అంతా వాస్తవమే చెప్తున్నాడే మరి?....ఏమిటో సందేహా లనేకం.

అదే ఆయన్ని ఆఖరిసారి కల్సుకోవటం. ఎప్పుడన్నా పార్కు కెళ్ళినా ఆయన కన్పించేవాడుకాదు. క్రమంగా ఆయన విషయంలో నా కిదివరకున్న ఆసక్తి తగ్గిపోసాగింది. సందేహాలుమాత్రం అలాగే వుండిపోయాయి-తీరకుండా!

* * *

భారతదేశంపై చైనా దురాక్రమణ చేసింది. దేశాన్ని కల్లోలపరచిం దావార్త.

తపోనిష్టలోవున్న మహామునిపై మట్టిగడ్డ విసిరినట్లయింది!

భారతీయులు శాంతి కాముకులు. శాంతి నినాదంతో, అహింసా సిద్ధాంతంతో, మూడువందల ఏళ్ళ బానిస శృంఖలాలను తెంచుకొన్నారు. స్వరాజ్యాన్ని సముపార్జించుకొన్నారు.

పదిహేనేళ్ళ నిర్విరామ కృషి వల్ల దేశం ప్రగతిమార్గాన పరుగెత్తుతోంది. గమ్యం చేరువలోనే వుంది. అయితే అభివృద్ధి అనంతం!

పొరుగువాడని గౌరవించింది చైనాను. కాని గౌరవం యిచ్చి పుచ్చుకోవాలన్న మర్యాద తెలుస్తేగా వాళ్ళకు?

''భాయ్, భాయ్'' అంటూనే కళ్ళు పొడిచే ప్రయత్నాని కొడిగట్టేరు.

అది అవినీతి, అన్యాయం. ధర్మ విరుద్ధం, దురాక్రమణ వీటిని సహించి పూరుకోలేదు భారతజాతి. యిది కర్మ భూమి. ధర్మదేశం.

ప్రజలంతా ఏకమయ్యారు. జాతి మత భేదాలను విస్మరించారు. అంతస్తు, స్థాయీ భేదాలను మర్చారు. సర్వశక్తులను దేశంకోసం, ధర్మంకోసం త్యాగం చేయటానికి ముందుకొచ్చారు.

'దురాక్రమణ....యుద్ధం; యుద్ధం....దురాక్రమణ..'ఎవరినోటవిన్నా ఆమాటే.

యుద్ధమంటే భారతీయుని కసహ్యం. కాని రెచ్చగొత్తే చేసేదేముంది? ఆత్మ వినాశనంకన్న ఆత్మ సంరక్షణ ముఖ్యం గదా?

రేడియోలదగ్గర తండోపతండలుగా ప్రజలు కూడుతున్నారు. పత్రికలు చేతులు మారుతున్నాయి.

యుద్ధాలు జరిగినట్లు, దేశపెద్దల ద్వేష హోమాల్లో సాధారణ ప్రజలు సమిధలయినట్లు చరిత్రలో చదివేం. యుద్ధం ప్రజల్లో రేపే అలజడిని, కల్లోలాన్ని, భీతిని గురించి విన్నాం కూడా!

కాని యిప్పుడు భారతీయుల్లో ఆ అలజడి, భీతి లేవు. యిది ధర్మయుద్ధం. జాతి శ్రేయస్సుకోసం. దేశ సంరక్షణకోసం చేసే పోరాటం. అందుకే వుత్సాహం, పట్టుదల, ఆత్మస్థైర్యం వెల్లువలా వురకలు వేస్తోంది : తివాడిలో.

యుద్ధమని దీనికి పేరు పెట్టకపోవచ్చు. కాని సరిహద్దున మరతుపాకులు పేలుతుంటే, సైనికుల తలలు తుంటలై ఎగిరిపడ్తుంటే, తెల్లటి మంచు శిఖరాలపైనుంచి ఎర్రటి రక్తం ఏరులై పారుతుంటే, అది యుద్ధంకాక మ రేమవుతుంది?

జరిగేది వందల, వేలమైళ్ళ దూరాన్నే కావచ్చు కాని సరిహద్దులే కదా దేశ భద్రతకు పట్టుగొమ్మలు? ఆ సరిహద్దు వద్ద పోట్లాడుతున్నది మన సోదర సైనికులు-భారతదేశ వీరులు!

వారు ప్రాణాన్ని పణంగా వొడ్డి తుపాకుల కెదురు నిల్చింది తమకోసం కాదు. తమ దేశంకోసం. జాతికోసం, ప్రజా శ్రేయస్సుకోసం-

యీ భావన ప్రతి భారతీయుడి హృదయాంతరాళాలలో మార్మ్రోగుతోంది. వెల్లుబికివస్తున్న ధైర్యస్థైర్యాల కీ భావనే ఆలంబన!

యీ ఆలోచనల్లోవున్న నాకు దీక్షితులుగారు గుర్తుకొచ్చారు ఛటుక్కున! దేశంకోశం అంతగా తాపత్రయపడే ఆయన యిప్పు డేం చేస్తుంటారో?

ఆ సాయంకాలం ఆయనకోసం పార్కు కెళ్ళేను. ఆయన తన మామూలు ప్రదే

శంలో లేరు. నిరాశతో వెనక్కి తిరిగి నడుస్తున్నాను. రేడియో సరిహద్దు సమర వార్తలు చెప్తోంది-

అనుకోని వుపద్రవానికి తట్టుకోలేక భారతసైన్యం కొన్నిచోట్ల పరాజయాన్ని పొందినమాట వాస్తవమే! అయితే పట్టుదల వుంటే, ఎంతకాలం యీ పరాజయం? ధైర్యంగా నిలబడి పోరాడుతున్నారు మన సైనికులు.

ప్రపంచంలోని చాలా దేశాలు భారత దేశానికి అండగా నిలబడుతున్నాయి. చైనా చేసింది తప్పుపనని గొంతెత్తి ఘోషిస్తున్నాయి. భారతదేశానికి సహాయం చేయటానికి ముందు కొస్తున్నాయి.

పార్కు దాటి యివతలి కొచ్చి పేవ్‌మెంటు మీద నడుస్తున్నాను. నా కెదురుగా హడావిడిగా వస్తున్న ఆ వ్యక్తిని చూచి ఛటుక్కున ఆగేను. సందేహం లేదు. ఆయన దీక్షితులుగారే! కాని అదేమి టలాగయిపోయారు? అసలే ఏభై ఏళ్లు పైబడ్డ మనిషాయన. పైగా సన్నగా, బలహీనంగా వుండేవాడు. యిప్పుడు మరీ సన్నగా, ప్రాణంలేని వ్యక్తిలా గున్నడాయన. తెల్లటి గడ్డం దుబ్బుగా పెరిగి వుంది. వున్నకాస్త జుట్టు చిందర వందరగా వుంది. కళ్లుసొరంగాల్లా లోపలికి పీక్కుపోయున్నాయి.

నేనే పలుకరించాను. కళ్లు చికిలించి వోక్షణం చూచా రాయన.

'ఓ! నువ్వుటయ్యా మిస్టర్?' అన్నాడు నెమ్మదిగా. వెనుకటి కీపీ, వుత్సాహం, నమ్మకం లే దాయన గొంతులో. నిరాశ, విచారం, బలహీనతా ధ్వనిస్తోంది.

'నేను చెప్పినంతా జరిగింది చూచావా నాయనా? వాడు-ఆ చైనావాడు యుద్ధానికి సిద్ధపడ్డాడు. నమ్మించి గొంతులు కోసేరకమండీ వాడిది-' ఉద్రేకం విచారం మిళితంకాగా ఆయ నన్నాడు.

ఒక్క క్షణం వూరుకొని తిరిగి ఆయనే చెప్పసాగేడు. 'ఏమో నాయనా; దేశానికెప్పు డేం వుపద్రవ మొస్తుందోనని నాకు భయంగావుంది. నోరెత్తకుండా జైళ్లలో లాఠీదెబ్బలుతిని సంపాదించిన స్వాతంత్ర్యం నాయనా మనది. చూడు....ఆనాటి లాఠీ దెబ్బలు మచ్చ లింకా మాయలేదు వంటి మీద. ఆనాడు కళ్లతో ఎంద రెందరి కష్టాలనో చూచిన ఆ స్మృతులింకా మనో ఫలకంపైనుంచి చెరిగిపోలేదు....' బాధతో అంటూ తన మోకాళ్లు మోచేతులు, విరిగిన వేళ్ళు, గుంటలు పడ్డ నెత్తి చూపించాడు. నాకళ్ల వెంట నీళ్ళు తిరిగేయి గిర్రున. అంతలో ఆయనే తిరిగి ఆవేశంతో, ధృడతర నిశ్చయంతో మొదలు పెట్టేడు'

'వీడికి-యీ చైనా దుండగీడుకి జడిసి, స్వాతంత్ర్యాన్నొదులుకోం నాయనా మనం. మనమంతా ప్రతిజ్ఞ చేయాలి. గడచిన గాథలను తలచుకొని కన్నీళ్లుకార్చటం కాదు నాయనా నువ్విప్పుడు చేయాల్సింది. యువకుడివి. కదన రంగంలోకి దూకు. మనం యీధర్మ పోరాటంలో ప్రాణాలనైనా వొదులుతాం కాని, మోసగాళ్లను, బందిపోటులను యీ పవిత్ర భూమిపైకి అడుగు పెట్టనియ్యం-' ప్రతిజ్ఞ అది. ప్రళయావేశం వల్లనేమో, అంత సన్నని బలహీనమైన ఆయన ప్రళయకాల పర్జన్యునివలె కన్పించాడు నాకు.

వొళ్లు గగుర్పాటు చెందింది నాకు. ఆవేశం, వుత్సాహం పొంగింది. యిన్నాళ్లుగా ఆయన మాట్లాడిన మాటల ధోరణి కర్థం తెలిసింది. పిచ్చివాడుగా కన్పించే యీాయన యిన్ని బాధల ననుభవించాడా దేశంకోసం? అన్ని వుడిగిపోయిన ఆ యీడులో ఎంతటి వుత్సాహం ఆవ్యక్తికి? గౌరవం వెల్లువికిందాయనపట్ల.

'ఎక్కువ మాట్లాడె వ్యవధి లేదు నాయనా! వస్తాను—'

'యింటికేనా?'

ఆయన వొక్కనిముషం మాట్లాడ లేదు. ఏదో ఆలోచిస్తున్నట్లు వోనిముషం ఆగి ఆకాశంవైపు చూస్తూ అన్నాడు: 'అవున్నాయనా! అమ్మాయి పురిటి కొచ్చిందా? ఏ నిముషాన నొప్పు లొస్తాయో ఏమో? నేను తొందరగా యింటి కెళ్లొద్దామని?'

నాకాయన యింటిని,ఆయన కూతుర్నీ చూడాలని, ఆయనతో మరికొంత సేపు మాట్లాడాలని కోరి కృలిగింది.

'నేనూ వస్తాను మీతోపాటు మీయింటి కివాళ-'

'నీవా?!' ఆయన ఆశ్చర్యపోతూ అడిగాడు. 'ఎందుకు?'

'మీ అమ్మాయిని చూడటానికి రమ్మన్నారుగా చాలాసార్లు, యివాళ వస్తాను—'

ఆయన మొహంలో వేదన వ్యక్తమయింది. ఆవేదనతో అన్నాడు: 'లేదు నాయనా ...వద్దు....నువ్వు రావద్దు, నా మాట లన్నీ మర్చిపో—'

మొదట్లో ఆయన మాటల కాశ్చర్యపోయినా, ఆయన యిల్లు చూడాలన్న పట్టుదల పెరిగింది. నాకాయన మాటలతో. ఎలాగైతేనేం చివరి కాయన్ని వొప్పించి ఆయన వెంట నడిచాను.

అదో చిన్న యిల్లు. యింటిముందు కొద్దిగా ఖాళీస్థళం వుంది. ఆఖాళీస్తలంలో

విరిగిపోయి శిథిలావస్థలో వున్నవో పందిరి వుంది పండిపోయిన కాకర పిందెలు వెలాడుతున్నాయ్ ఆ పందిరికి !

ఆ యింటి వాతావరణం ప్రశాంతంగా వుంది. ఎవరూ వున్నట్లు లేదు.

'కూర్చో నాయనా కూర్చో.... అమ్మాయి వస్తుంది లే ...కూర్చో....' తీరని బాధను మనసులోనే అణుచుకొంటున్న వాడిలా అనేసి ఆయన గబగబా లోపలి కెళ్లేడు.

చుట్టూ చూచాను. గోడలకు, దండేల మీద ఖద్దరు బట్టలు వ్రేలాడుతున్నాయ్. కొన్ని చినిగి, చీలికలు పేలీకలు అయ్యాయికూడా.

ఓ ఫోషాణం పెట్టె క్రింద పాత పత్రికలున్నాయి. ఎంత పాతవో మరి....కావి రంగు పట్టి తాకితే తుంపు లయ్యే లాగు ఉన్నాయ్!

పది నిముషాలు దాటింది. ఆయన రాలేదు. ఎవరు వచ్చిన జాడా కన్పించలేదు.

అంతలోనే వొక ముసలామె వచ్చింది లోపల్నించి. ఆమె వణుకుతోంది. కళ్లు పూర్తిగా కనబడవేమో లాంతరు కళ్లకు దగ్గిరగా పెట్టుకుని, దగ్గరగా వచ్చి చూచింది నన్ను.

'ఎవరు నాయనా ?' వణుకుతూ వణుకుతూ, నూతిలో నుంచి వచ్చినట్లున్న దామె గొంతు.

"దీక్షితులుగారితో...."

'మా అబ్బాయే నాయనా వాడు. వాడితో వచ్చావా ఏమిటి ?'

ఏమిటీ! యీమె దీక్షితులుగారి తల్లే ?

'అవును మామ్మగారూ ! అమ్మాయి నన్ను చూడాలంటోందని ఎప్పుడూ అనేవారు. ఆమె ప్రసవించటాని కొచ్చిందని యివాళ చెప్తేనూ....'

ఆమె కళ్లల్లో నీళ్లు నిల్చాయి. బొటబొటమని నాలుగు బిందువులు రాలి పడ్డాయి. కొంగుతో కళ్లు వొత్తుకొంటూ అంది. 'రా నాయనా....లోపలికిరా....'

ఆమె వెంట నడిచాను నేను; దొడ్లోకి తీసికెళ్లింది.

'చూడు నాయనా....అటు చూడు—'

చూచి కొయ్యబారి పోయాను. దీక్షితులుగా రోమూల కూర్చొని రెండు కాళ్లమధ్య మోహం పెట్టుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు-నిశ్శబ్దంగా! నేనాయన దగ్గరికెళ్లబోయాను. ఆ ముసలామెనా చేయి పట్టుకొని యింట్లోకి తీసికెళ్లింది.

'ఏడవనియ్ నాయనా! వాడి నలా ఏడవనియ్. కాస్సేపు ఏడిస్తే కాని మళ్ళీ మనిషి కాడు వాడు-'

అంతా వింతగా వుంది నాకు! వున్నట్లుండి ఆయనిలా ఏడవటమేమిటి? పురిటి కొచ్చిన కూతురు కన్పించదేం ?....అదే అడిగా నామెను.

ఆమె భారంగా నిట్టూర్చి అంది : 'చాలా రోజుల క్రితం నాయనా !.... పురిటి కని పుట్టింటి కొచ్చిన పిల్ల వుత్తి ఫుణ్యానికి పోయింది, వొక్కగా వొక్క పిల్ల. అందం, తెలివితేటలు కలది. కొడుకైనా కూతురైనా అదొక్కతే నన్నట్లు పెంచాడుదాన్ని. అసలే స్వరాజ్యంరోజులప్పుడు లాఠీ దెబ్బలు తగిలి మెదడు దెబ్బతింది. దానికి తోడు యీ వుపద్రవం వచ్చిపడింది. అప్పటినుంచీ యిదే వరస వీడు. పిచ్చివాడిలాగయి పోయాడు. చెట్టంతకొడుకు పిచ్చివాడిలా గయిపోతే చూచి ఏడవటానికే నన్నట్లు యిన్నేళ్ళొచ్చి యింకా బ్రతికివున్నాన్నేను. వాడేనాయనా నా ఆశ. వాడికి పిచ్చెలా తగ్గుతుందో తోచకుండా వుంది నాకు....

ఆమె యింకా చెప్తూనేవుంది నెమ్మదిగా. నే నక్కడ నిలవలేకపోయాను. నా తల తిరిగిపోతోంది. ప్రశ్నలతో బరువెక్కిపోతోంది.

ఆవయసులో ఆముసలమ్మకు కొడుకు మీద యింకా ఎంత మమకారం ? ఎంత ఆశ ? పిచ్చివాడుగా పరిగణించబడ్తున్న, బలహీనుడైన ఆ దీక్షితులుగారికి దేశంపై ఎంత ప్రేమ, భక్తి? ఎప్పుడో చనిపోయిన కన్నకూతురికోసంయింకా ఎంత వేదన? అస లింతకీ ఆయన పిచ్చివాడా ? ....ఏమో ?....అలాగని చాలామంది అనగా విన్నాను. కాని నేను మాత్రం నమ్మను. ఆయన నిజమైన మనిషి. నీతి, నిజాయితీ, త్యాగం, ధర్మం, ప్రేమ వాత్సల్యం, మమతా, మానవత్వాలూ అన్నీ మూర్తీభవించిన మహా మనీషి !

వారం రోజుల క్రితం మళ్ళీ కన్పించినప్పుడు ఆయన అన్నమాటలివి : 'దుర్మార్గులు అందితే జుట్టు, అందకపోతే కాళ్లు పట్టుకొంటారు. చైనావాడు యిప్పుడు చేసినపని అదే. వెనక్కి పోయాడుకదాని మనం ఏ పొరపాటులో వుండకూడదు. బందిపోటు పక్క యింట్లో వున్నట్లు మనం తగిన జాగ్రత్తలో వుండాలి. యిక నాకు భయంలేదులేనాయనా. మనవాళ్లు సమయానికి మంచి నేర్పు చూపించారు. మన మంచితనం, ధర్మదీక్షే మన కండగా నిల్చింది. యిక మన న్నెవరూ ఏమీ చేయలేరు. మనం అజేయులం—' వుత్సాహం ఆయన కంఠంలో వెల్లివిరుస్తోంది.

'అమ్మాయి యిక్కడికి రాదుట నాయనా ! నన్నే తన దగ్గరికి రమ్మని కబురు పంపించింది. ఎప్పుడైందీ యింకా నిర్ణయించుకోలేదు కాని, త్వరలో నేనే వెళ్లా లనుకొంటున్నాను అమ్మాయి దగ్గరకు. దేశం కోసం యిక్కడే వుండాలని వుంది కాని, నన్నొదిలి అమ్మాయి వొంటరిగా వుండలేదు నాయనా. మరి! వస్తాన్నాయనా....ఏనుంది—' యీ మాటలను కూడా ఆయన వుత్సాహంతోనే అన్నాడు.

గాలిలో తేలుతూ చకచకా నడిచిపోతున్న ఆయన వంక చూస్తూ నిల్చోటం మినహా నేను చేయగలిగిందేముంది?





అభ్యుదయం

నీటి పారుదల

పబ్లిక్‌వర్క్సుశాఖ క్రింద చిన్నతరహా నీటి పారుదల పథకాలకై 1964-65 వ సంవత్సరానికి రు. 385 లక్షలు కేటాయించా లని ప్రతిపాదించారు. పి. డబ్ల్యు డి. క్రింద చిన్నతరహా నీటి పారుదల పథకా లకై కేంద్ర సహాయంనుంచి అదనంగా మరో రు. 80.00 లక్షలు కేటాయించా లని సంయుక్త కేంద్ర బృందంవారు వచ్చిన సందర్భంగా 1964 మే 19వ తేదీన జరిగిన సమావేశంలో నిర్ణయించారు. తీవ్రతర వరి సేద్యానికి సెలక్టు చేసిన ప్రాంతాలలో యీ అదనపు రు. 80.00 లక్షల మొత్తాన్ని ఖర్చుచేయాలని ప్రతిపాదించారు. యీ విధంగా చిన్నతరహా నీటి పారుదల పథ కాల ఖర్చుకై మొత్తం రు. 465.00 లక్షలు ఖర్చుచేయ నున్నారు. అనేక పథకాలు మంజూరీకై సిద్ధంగా ఉన్నాయి.

పాలవాగు ప్రాజెక్టు

(మధిర తాలూకా, ఖమ్మం జిల్లా)

1964 ఏప్రిల్ 23వ తేదీన ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవం జరిగింది. కృష్ణానదికి ఉప నది అయిన వైర విభాగంలోది ఒకటి ఈ పాలవాగు. ప్రతిపాదిత స్థలం క్రొత్తవంగ వీడు గ్రామానికి ఆగ్నేయదిశలో మైలు న్నర దూరంలో ఉంది. యీ ప్రాజెక్టు ద్వారా 830 ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం లభిస్తుంది. వీర్‌తోకలుపుకుని మట్టికట్టపొడువు 4600 అడుగులు ఉంటుంది. 415 ఎకరాలకు నీటి పారుదల కల్గించే 2 అడుగుల వ్యాసం కల రెండు హ్యూమ్‌పైప్ తూములను రెండువైపులా నెలకొల్పా లని ప్రతిపాదించారు. వంగవీడు, మునగాల గ్రామాలలోని గ్రామసమితి, పైరీ పేటు వారికి సంబంధించిన దాదాపు 200 ఎకరాల భూమి నీటిలో మునిగిపోతుంది. యీ ప్రాజెక్టు నిర్మాణం ఖర్చు మొత్తం రు. 4.22 లక్షలకు ఉంటుంది.

కట్టలేరు ఆనకట్ట

(మధిర తాలూకా, ఖమ్మం జిల్లా)

కృష్ణానదికి ఉపనది అయిన వైరానది యొక్క ప్రధాన ఉపనది యీ కట్టలేరు. వైరా రిజర్వాయరుకు క్రింది భాగంలో వైరా నదిలో కట్టలేరు కలుస్తుంది. మధిర తాలూకాలోని గార్లవిపాడు గ్రామానికి దక్షి ణంలో ½ మైలు దూరంలో ఒక ఆనకట్ట నిర్మించా లని ప్రతిపాదించారు. దీని వల్ల 3100 ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం లభిస్తుంది. ఆనకట్ట పొడవు 850 అడు గులు. ఆనకట్ట రెండువైపుల వరదకట్ట పొడువు 6359 అడుగులు ఉంటుంది. యీ కాలువ రెండు వైపులా 2′ × 2.5′ నిడివిలో రెండు తూములు నిర్మించా లని ప్రతిపాదించారు. దీని వల్ల ఇరువైపుల 1550 ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం లభిస్తుంది.

యీ పథకం ఖర్చు అంచనా రు. 8.75 లక్షలు.

బేతనపూడి ప్రాజెక్టు

(ఇల్లెందు తాలూకా, ఖమ్మం జిల్లా)

1964 మే 24వ తేదీన యీ ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం జరిగింది.

ఇది బేతనపల్లి గ్రామానికి ఈశాన్యంలో 1½ మైళ్ళ దూరంలో గుట్టలచెర్వు అనే ఒక గండి పడిన పురాతన చెర్వు. రెండు కొండల మధ్య నుంచి స్థానికంగా ప్రవ హించే సెలయేరు ప్రాంతంలో యీ చెర్వు స్థలం ఉంది. ఇదివరకే నిర్మింపబడిన వాగ్దేవు ఆనకట్ట కొనసాగింపే యీ ప్రస్తుత పథకం కూడా. యిరుకైన ప్రదేశం నుంచి ప్రవహించే స్థలంలో 20′ × 10′ సైజులో 2 తూములతో కూడిన రెగ్యు లేటర్‌ను నిర్మించా లని ప్రతిపాదించారు. రెండువైపులనుంచి రెండు కాలువల ద్వారా 1950 ఎకరాలకు నీటి పారుదల సదుపాయం ఉంటుంది.

దాదాపు 50 గుడిసెలు ఉన్న రాళ్ళపాడు అనే గ్రామం, 350 ఎకరాల మెట్ట భూమి నీటిలో మునిగిపోతాయి. ఈ పథకం మొత్తం ఖర్చు రు. 11.06 లక్షలు.

వరదల నిరోధన

ఇంజనీరింగ్ పరిశోధనతోసహా భారీ మధ్యతరహా వరద నిరోధక పథకాల

అమలుకై ప్రభుత్వం అంతిమంగా రు. 456 50 లక్షలమొత్తానికి నికరంచేసింది. అదనంగా 1.25 లక్షల ఎకరాల భూమికి నీటి పారుదల సౌకర్యం లభిస్తుం దని ఆశిస్తున్నారు.

ప్రస్తుత 1964-65 సంవత్సరం కాలంలో ప్రణాళికా సంఘం సాంకేతికంగా అనుమతించిన మరియు ప్రభుత్వ పరిపాలనకు సంబంధించిన మంజూరీ లభించిన క్రొత్త పథకాలు, గత సంవత్సరంలో ప్రారంభింపబడి యీ సంవత్సరం కొనసాగించబడుతున్న దిగువ తెల్పిన పథకాలు అమలు జరుప బడుతున్నాయి.

స్పిల్ ఓవర్ పథకాలు :

(1) వరాహా రిజర్వాయర్ - విశాఖ పట్నం జిల్లా.

(2) నల్లవాగు ప్రాజెక్టు - మెదక్ జిల్లా.

క్రొత్త పథకాలు:

(1) ఒట్టిగడ్డ ప్రాజెక్టు - శ్రీకాకుళం జిల్లా.

(2) కోటిపల్లివాగు ప్రాజెక్టు - హైద్రాబాద్ జిల్లా.

(3) లంకసాగర్ ప్రాజెక్టు - ఖమ్మం జిల్లా.

1964 ఏప్రిల్ 24వ తేదీన లంకసాగర్ ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం జరిగింది.

కృష్ణా బేసిన్‌లోని మున్నేరుకు ఉపనది అయిన కట్టలేరు అని పిలువబడే కొండల నుంచి ప్రవహించే వాగు నీటిని ఉపయోగంలోకి తేవడానికి యీ లంకసాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రతిపాదించారు. ఖమ్మం జిల్లా, మధిర తాలూకా రాజగూడెం గ్రామం వద్ద యీ డాం స్థలం ఉంది. హైద్రాబాద్, రాజమంద్రి రోడ్డులో 164/0 మైలుపై ఉన్న లంకపల్లి ఇర్రిగేషన్ బ్రాంచికి దక్షిణాన దాదాపు $4\frac{1}{2}$ మైళ్ళ దూరంలో యీ స్థలం ఉంది. నదీగర్భంలో 7206 అడుగుల పొడవు మట్టికట్టను యీ పథకం క్రింద నిర్మిస్తారు. ఇరువైపులా రెండు కాలువలను త్రవ్వుతారు. నీటి ద్వారా అరసలపాడు. రామన్నపాలెం, పాటి చిన్నమ్మగూడెం, కోనౌరపాడు మొదలైన గ్రామాలలోని 5100 ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం లభిస్తుంది.

ఈ ప్రాజెక్టు నిర్మాణం ఖర్చు అంచనా రు. 38.45 లక్షలు. ఈ ప్రాజెక్టు వల్ల అదనంగా 3800 టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చెయ్యవచ్చు.

మొత్తం 1090 ఎకరాల భూమి నీటిలో మునిగిపోతుంది.

పల్లెవాడ గ్రామం మొత్తం ఈ ప్రాజెక్టు వల్ల మునిగిపోతుంది. అవసపు అలుగునీరు వల్ల రాజగూడెం గ్రామానికి దెబ్బ తగులుతుంది.

రాకపోకల సౌకర్యాలు

పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు తూర్పు వీపద్రురోడ్డు 4/2 మైలులో నర్సాపూర్ ముఖ్యకాలువపై నిర్మించబడిన 1964 మే 4వ తేదీన రాకపోకలను ప్రారంభించారు. ఈ వంతెనకు 42 అడుగుల 2 స్పాన్లు ఉన్నాయి. ఈ వంతెన నిర్మాణం ఖర్చు రు. 2 66 లక్షలు.

నల్లజర్ల, పోతవరం రోడ్డులో ఎర్ర కాలవపై వంతెన నిర్మాణానికి 1964 మే 22వ తేదీన పునాదిరాయి వేశారు. ఈ వంతెన పొడవు 100 అడుగులు. దీని నిర్మాణానికి రు. 6 27 లక్షలు ఖర్చు అవుతాయి.

మచిలీపట్నం, విజయవాడ రోడ్డుపై చలివేంద్రపాలెం (కృష్ణా జిల్లా) వద్ద పుల్లేరు కాలువపై ఆర్. సి. సి. టి. బీమ్ వంతెనను మే 22వ తేదీన ప్రారంభించారు. ఈ వంతెన పొడవు 127 అడుగులు; నిర్మాణం ఖర్చు రు. 1.53 లక్షలు.

చిలకంపాడు వంతెన నిర్మాణానికి మే 23వ తేదీన పునాదిరాయి వేశారు. కోడేరు, నల్లజర్ల రోడ్డులో మార్టేరువద్ద వంతెనను అదేరోజున ప్రారంభించారు. చిలకంపాడు వంతెన నిడివి 76 అడుగులు ఉంటుంది. దీని ఖర్చు రు. 3.35 లక్షలు. మార్టేరు వంతెన నిడివి 87 అడుగులు, దీని ఖర్చు రు. 3.08 లక్షలు.


తూర్పు గోదావరి జిల్లాలోని కె. యన్. యఫ్. రోడ్డుపై కొత్రిపూడి వద్ద వంతెనను మే 24వ తేదీన ప్రారంభించారు. ఈ వంతెన పొడవు 138 అడుగులు నిర్మాణం ఖర్చు రు. 3.15 లక్షలు.

కాకినాడ, యానం మధ్య రోడ్డులో గోరింగకాలువపై వంతెన నిర్మాణానికి మే 24వ తేదీన పునాదిరాయి వేశారు. యీ వంతెన నిడివి 300 అడుగులు. యీ వంతెన నిర్మాణం ఖర్చు అంచనా రు. 12.80 లక్షలు.

జి. యన్. టి. రోడ్డుపై ఏలూరువద్ద ఒక బ్రిడ్జికి మే 25వ తేదీన పునాదిరాయి వేశారు. అప్రోచ్‌లతోసహా యీ ఓవర్ బ్రిడ్జి పొడవు 50 అడుగులు. నిర్మాణం ఖర్చు రు. 8.50 లక్షలు.

జగ్గయ్యపేట, ముత్యాల మధ్య రోడ్డులో పాలేరునదిపై ఉన్న కాజ్‌వేపై 1964 ఏప్రిల్ 26వ తేదీన రాకపోకల సౌకర్యం కల్పించారు. యీ కాజ్‌వే పొడవు 227 అడుగులు. దీని నిర్మాణం ఖర్చు రు. 3 75 లక్షలు.

విజయవాడ వద్ద యన్. హెచ్. 5 మళ్ళింపులో బందరుకాలువపై నిర్మించబడిన వంతెనపై 1964 మే 26వ తేదీన రాకపోకలను ప్రారంభించారు. యీ వంతెనను వలయాకారంలో నవీనపద్ధతిలో నిర్మించారు దీని నిడివి 240 అడుగులు ఉంది. యీ రోడ్డుమలుపుల్లో వెడల్పు 26 అడుగులు ఉంటుంది. రెండువైపులా 5 అడుగుల వెడల్పుదారి ఉంటుంది. యీ వంతెన మొత్తం నిర్మాణఖర్చు రు. 6.50 లక్షలు.



చిత్తూరు జిల్లా

భూమి అభివృద్ధి :

జూలై నెలలో మదనపల్లి పంచాయతీ సమితిలో యాభై ఎకరాల భూమిని బాగుచేసి సేద్యయోగ్యం చేశారు. 448 మణుగుల మేలుజాతి వరి విత్తనాలను, 581 మణుగుల మేలుజాతి వేరుశెనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు.

కడప జిల్లా

స్టేడియం :

ఆగస్టు 3వ తేదీన రెవెన్యూమంత్రి కడపలో స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

గుంటూరు జిల్లా

వరిసాగు :

జూలై నెలలో మంగళగిరి పంచాయతీ సమితిలో అభివృద్ధి కార్యక్రమం క్రింద జపాను వరిసాగు పద్ధతిన నారునాటారు.

పాఠశాల భవనం :

ఆగస్టు 17వ తేదీన పబ్లిక్‌వర్క్సు శాఖామంత్రి అగ్రహారంలో పురపాలక సంఘోన్నత పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు.

కీలక గ్రామీణ కేంద్రం :

ఆగస్టు 22వ తేదీన పబ్లిక్‌వర్క్సు శాఖామంత్రి కరుమండులో కీలక గ్రామీణ కేంద్రానికి శంకుస్థాపన చేశారు.

మేలుజాతి విత్తనాల పంపిణీ :

ఇప్పూరు పంచాయతీ సమితిలో జూలై నెలలో వివిధ రకాలకు చెందిన 331 మణుగుల మేలుజాతి విత్తనాలను, 98 మణుగుల రసాయనికపు ఎరువులను పంపిణీ చేశారు.

హైదరాబాదు జిల్లా

సంగీత, నాటక సమ్మేళనం :

జూన్ 28, 29వ తేదీన హైదరాబాదులో హైదరాబాదు మండల సంగీత నాటక సమ్మేళనం జరిగింది. ఆ సమ్మేళనం ఫలితాలు యివి :

ఉత్తమ ప్రదర్శన :

"జయం మనదే," కొడుమూరు జిల్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.

ద్వితీయ ఉత్తమ ప్రదర్శన :

"సమైక్యత" నల్గొండజిల్లా హుజూర్ నగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల.

ఉత్తమ నటుడు :

వి. భాగయ్య—'శ్రేయోరాజ్యం'లో జగన్నాధం పాత్ర. మెదక్‌జిల్లా, రామాయంపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల.

ఉత్తమ నటి :

యశోద—'జయం మనదే'లో శాంతి. కర్నూలుజిల్లా కొడుమూరుజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల;

ఉత్తమ రచన ;

'జయం మనదే'. కర్నూలు జిల్లా, కొడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.

కన్సొలేషన్ బహుమతి :

బి. మల్లయ్య, హుజూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల.

కరీంనగర్ జిల్లా

విద్యుచ్ఛక్తి సౌకర్యం :

కరీంనగర్ జిల్లాలో పెద్ద గ్రామ పంచాయతీ గ్రామం అయిన కోరొట్లలో ఆగస్టు 16వ తేదీన విద్యుద్దీపాల్ని వెలిగించారు.

క్రొత్త ప్రాథమిక పాఠశాలలు :

జగిత్యాల పంచాయతీ సమితిలోని రాజనగర్, ఆలూరు, జగిత్యాల గ్రామాల్లో మూడు ప్రాధమిక పాఠశాలలు ప్రారంభించబడ్డాయి.

ఇనుపనాగళ్ళ పంపిణీ :

భీమదేవరపల్లి పంచాయతీ సమితిలో జూలై నెలలో రైతులకు అయిదు ఇనుపనాగళ్ళను, 175 మణుగుల మేలుజాతి విత్తనాలను, 283 మణుగుల రసాయనిక ఎరువులను పంపిణీ చేశారు.

సహకార వ్యవసాయం :

మానకొండూరులో గ్రామ సేవకుల కేంద్రంలో సహకార సంఘాలకు సంబంధించిన వ్యక్తులకు నాల్గురోజులపాటు శిక్షణశిబిరం నిర్వహించబడింది.

నెహ్రూ ప్రదర్శన :

ఆగస్టు 8వ తేదీన కరీంనగర్ జిల్లా కలెక్టరు నెహ్రూ ఫొటోగ్రాఫుల ప్రదర్శనానికి ప్రారంభోత్సవం చేశారు.

ప్రగతి పథంలో

నల్గొండ జిల్లా

అప్రోచ్ రోడ్డు :

చింతపల్లి పంచాయతీ సమితిలో ఆగస్టు 7వ తేదీన చింతపల్లి—వరకల్ అప్రోచ్ రోడ్డుకు ప్రారంభోత్సవం జరిగింది.

శిక్షణ శిబిరం :

మునుగోడు పంచాయతీ సమితిలోని కొంపల్లి గ్రామంలో జూలై 28 వ తేదీనుండి 30 వ తేదీవరకు వ్యవసాయంలో గ్రామసహాయకుల ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించబడింది. కొంపల్లి, చీకటిమామిడి, కిష్టాపూర్, పలివెల గ్రామాలకు సంబంధించిన 56 మంది గ్రామ సహాయకులు ఈ శిక్షణ శిబిరానికి హాజరయ్యారు.

నిజామాబాదు జిల్లా

నిజామాబాదులో దంపుడు బియ్యంపై సదస్సు (తెలంగాణా ప్రాంతం)కు రాష్ట్రి రెవెన్యూ మంత్రి ఆగస్టు 20వ తేదీన ప్రారంభోత్సవం చేశారు.

శ్రీకాకుళం జిల్లా

బొబ్బిలి రాజాకళాశాలలో ఆగస్టు 22వ తేదీన ప్రణాళికా సంఘం ప్రారంభించబడింది.

విశాఖ జిల్లా

రేవు కార్మికుల నిమిత్తం ఒక క్రొత్త వైద్యశాలకు విశాఖపట్నంలో ఆగస్టు 3వ తేదీన ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు,

వరంగల్లు జిల్లా

మేలుజాతి విత్తనాల పంపిణీ:

పరకాల పంచాయతీ సమితిలో జూలై నెలలో 504 మణుగుల మేలుజాతి విత్తనాలను పంపిణీ చేశారు. 8,388 మణుగుల రసాయనికపు ఎరువుల్ని కూడా పంపిణీ చేశారు.


గ్రామీణ పనుల కార్యక్రమం :

పైలట్ పథకాలకు సంబంధించిన గ్రామీణ పనుల కార్యక్రమం క్రింద ములుగు పంచాయతీ సమితిలో జూలై నెలలో 12 నీటిపారుదల పనుల నిర్మాణం పూర్తి చేశారు.

భారీ విద్యుత్ పరికరాల ప్రాజెక్టు

తృతీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో, భారత - జకోస్లవేకియా దేశాల ఆర్థిక సహకార కార్యక్రమం క్రింద ప్రారంభించబడే నాలుగు భారీ పారిశ్రామిక ప్రాజెక్టులలో హైదరాబాదు సమీపంలో రామచంద్రాపురం వద్ద స్థాపించిన భారీ విద్యుత్ పరికరాల ఫ్యాక్టరీ ఒకటి. ప్రస్తుత కార్యక్రమం ప్రకారం ఇది 1965 సెప్టెంబరునుంచి ఉత్పత్తి ప్రారంభిస్తుంది. ఇక్కడ ఈ ప్రాజెక్టు స్థాపనవల్ల రాష్ట్రంలో సత్వర పారిశ్రామికాభివృద్ధికి మరింత అనుకూల పరిస్థితి ఏర్పడింది.

భారత దేశంలో విద్యుదుత్పాదకశక్తి మొదటి రెండు ప్రణాళికా కాలాలలో గమనించదగినంతగా పెరిగింది. ప్రథమ పంచవర్ష ప్రణాళికారంభంలో దాదాపు 2.3 మిలియన్ కిలోవాట్లు వున్న విద్యుదుత్పాదక శక్తి రెండవ ప్రణాళిక ముగింపునాటికి సుమారు 4.7 మిలియన్ కిలోవాట్లకు పెరిగింది. మూడవ ప్రణాళికలో దీనిని దాదాపు 7.4 మిలియన్ కిలోవాట్లకు హెచ్చించటానికి ప్రతిపాదించారు. ఈ లక్ష్య సాధనకై నాలుగు సంవత్సరాల కాలంలో దేశంలో ఉత్పాదకశక్తిని రెట్టింపు చేయవలసి వుంటుంది.




ఫ్యాక్టరీ 'లే ఔట్'

నాలుగవ ప్రణాళికా కాలంలో విద్యుచ్ఛక్తి అవసరం ఇంతకంటే అధికంగా పెరిగే అవకాశంవుంది. ఉక్కు, ఇనుము, అల్యూమినియం, సిమెంటు, ఎరువులు, రసాయనికాలవంటి పరిశ్రమలు దేశమంతటా శీఘ్రంగా పెంపొందేసూచనలుండటమే దీనికి కారణం. ప్రాథమిక అంచనాలనుబట్టి చతుర్థ పంచవర్ష ప్రణాళికలో అదనంగా సుమారు 9.6 మిలియన్ కిలోవాట్ల మేరకు స్థాపిత విద్యుదుత్పత్తిశక్తి అవసర మవుతుందని తెలుస్తున్నది.

ఉత్పాదకశక్తి

గత 15 సంవత్సరాల కాలంలో విద్యుదుత్పాదకశక్తిలో సత్వర అభివృద్ధి ఏర్పడడంవల్ల విదేశాలనుంచి, భారీ ఉత్పాదక యంత్రాలను దిగుమతి చేసుకోవలసి వచ్చింది. ఇందుమూలంగా మన విదేశ మారకం వనరులపై అధిక భారం పడింది. అత్యవసరమైన ప్రధాన ఉత్పాదక యంత్రాలను తయారు చేయవలసిన అవసరాన్ని ప్రథమ పంచవర్ష ప్రణాళికారంభంలోనే గుర్తించడం జరిగింది. దేశంలో భారీ విద్యుత్ పరికరాల ఫ్యాక్టరీ నొకదానిని స్థాపించడానికి 1955వ సంవత్సరంలో ప్రభుత్వం నిశ్చయించింది. దీనికి ఉపక్రమణికగా, రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో, ఇంగ్లాండుకు చెందిన మెసర్స్ ఎసోసియేటెడ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్ వారి సాంకేతిక సహాయంతో భూపాల్‌లో భారీ



నివాస గృహాల దృశ్యం

విద్యుత్ పరికరాల యూనిటును నెలకొల్పడం జరిగింది.

ఈ ఫ్యాక్టరీకి, 1960 నవంబరు 6వ తేదీన అప్పటి ప్రధాని లాంఛనప్రాయంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాట్లు పూర్తిగా ముగిసినప్పుడు ఇక్కడ 150,000 కి. వా.ల యూనిటు పరిమాణంతో గరిష్ఠ స్థాయి వరకూ హైడ్రాలిక్, స్టీమ్ టర్బైన్లూ, జనరేటర్లూ, 150,000 కె.వి.ఏ.ల గరిష్ఠ యూనిటు పరిమాణంగల ట్రాన్స్‌ఫార్మరు, స్విచ్‌గేర్, ట్రాక్షన్, పారిశ్రామిక మోటార్లు మొదలైనవి ఉత్పత్తి అవుతాయి. భూపాల్‌లో నెలకొల్పిన ఈ యూనిటువల్ల ఏటా రూ. 30 కోట్లు మొదలు 50 కోట్ల వరకు విదేశ మారకం ఖర్చు తప్పుతుంది.

మరో 3 యూనిట్లు

మనకు అవసరమైన సమస్త భారీ విద్యుత్ పరికరాల ఉత్పత్తిలో దేశాన్ని స్వయం సమృద్ధం చేయాలన్న ప్రభుత్వ విధానాన్ని పురస్కరించుకొని మరో మూడు యూనిట్లను స్థాపించడానికి నిశ్చయించారు. హైద్రబాదు సమీపంలో రామచంద్రాపురం వద్ద భారీ విద్యుత్ పరికరాల కర్మాగారాన్ని తిరుచిరపల్లి వద్ద హైప్రెషర్ బాయిలర్ ప్లాంటునూ, హరిద్వార్ రాణీపూర్ వద్ద భారీ విద్యుత్ పరికరాల ఫ్యాక్టరీని నెలకొల్పుతున్నారు. హైద్రాబాదులో స్థాపించే కర్మాగారంలో అధికశక్తిగల ఆల్టర్‌నేటర్లు; స్టీమ్, హైడ్రోటర్బైన్లను ఉత్పత్తి చేస్తారు. మనదేశ పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన భారీ విద్యుత్ పరికరాలన్నీ దేశంలోనే తయారు కావడానికి వీలుగా ఈ యంత్రాగారాలు బహుశా తృతీయ పంచవర్ష ప్రణాళిక ముగింపునాటికి ఉత్పత్తి ప్రారంభిస్తాయి.

మూడవ ప్రణాళికా కాలంలో భారత - జకోస్లవేకియా దేశాల ఆర్థిక సహకార కార్యక్రమం క్రింద పారంభించబడిన నాలుగు ప్రధాన పారిశ్రామిక ప్రాజెక్టులలో రామచంద్రపురంలోని భారీ విద్యుత్ పరికరాల యూనిటు ఒకటి. ఈ భారీ విద్యుత్ పరికరాల ప్రాజెక్టును రామచంద్రపురంలో నెలకొల్పడానికి భారత ప్రభుత్వం 1961 సెప్టెంబరులో అంగీకారం తెలియజేసింది. దాదాపు ఇదే సమయంలో, భారీ విద్యుత్ పరికరాల కర్మాగారం నిమిత్తం సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేసేందుకు, మెసర్స్ స్కోడా ఎక్స్‌పోర్ట్ వారితో ఒక ఒడంబడిక కుదుర్చుకోవడం జరిగింది. ఈ సంస్థవారు కర్మాగారం డిజైను లేఔట్ విషయంలో సలహాదార్లు, జకోస్లవేకియా నుంచి అవసరమైన పరికరాలను సరఫరా చేయడానికీ, స్టీమ్ టర్బైన్లు, టర్బో ఆల్టర్ నేటర్లు, పంపుల డిజైను, ఉత్పత్తిలో మనకు సాంకేతిక విషయాలలో తోడ్పడడానికీ వీరు అంగీకరించారు.

సమగ్ర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయడంలో పాల్గొనడానికీ, ఇలాంటి పనుల్లో అనుభవాన్నీ, పరిజ్ఞానాన్నీ గడించడానికి భారతీయ ఇంజనీర్ల బృందా న్నొకదానిని జకోస్లవేకియాకు పంపించడం జరిగింది. సమగ్ర పాజెక్టు నివేదిక 1962 సెప్టెంబరు 19వ తేదీన చేరింది. 60 మె. వా. వరకు విద్యుదుత్పాదక యూనిట్లను ఉత్పత్తి చేయడానికి 12, 25 మె. వా యూనిట్లతో ఉత్పత్తి ప్రారంభించడానికి వీలుగా కర్మాగారాన్ని రూపొందించడానికి మొదట ఉద్దేశించారు. కాని తరువాత 100 మె. వా.ల శక్తి వరకు స్టీమ్‌టర్బైన్లు, టర్బోఆల్టర్‌నేటర్లను ఉత్పత్తి చేయడానికి అనువుగా యంత్రాగారం డిజైనును తగువిధంగా మార్చారు. డిజైను మార్పువల్ల ప్రాజెక్టుపనులను కొంతకాలంవరకు నిలిపివుంచి ఆరంభించవలసివచ్చింది.

హైద్రాబాదు సమీపంలో రామచంద్రపురం వద్ద నెలకొల్పుతున్న కార్మాగారంలో 12, 25, 55, 100 మె. వా.ల యూనిట్ల స్టీమ్ టర్బైన్, టర్బో ఆల్టర్ నేటర్లను ఉత్పత్తి చేస్తారు. వార్షిక ఉత్పత్తిశక్తి సుమారు 800 మె. వా. లు పైన పేర్కొన్న ప్రధాన ఉత్పత్తి కార్యక్రమంతో పాటు ఈ కర్మాగారం, కండెన్సేట్ పంపులు, కూలింగ్


వాటర్ పంపులు, ఎయిర్ జెట్ పంపులు, ఫీడ్‌వాటర్ పంపులు మొదలైన పరికరాలను కూడా ఏటా సుమారు 590 టన్నుల వరకు ఉత్పత్తి చేస్తుంది. కర్మాగారంలో వున్న పోతయినుము ఫౌండ్రీలో ఏటా సుమారు 3,000 టన్నుల మేరకు ఉత్పత్తి జరుగుతుంది. దీనిలో 2,000 టన్నులకు పైగా రామచంద్రపురంలోని కర్మాగారంలోనూ, తిరుచిరపల్లిలోని హైప్రెషర్ బాయిలర్ యంత్రాగారంలోనూ వినియోగించబడుతుంది. మిగతా సరుకు మార్కెటులోకి విడుదల చేయబడుతుంది. ఒక నాన్‌ఫెర్రస్ మెటల్ ఫౌండ్రీకూడా వుంది. ఇది ఏటా 200 టన్నుల మేరకు అల్యూమినియం అల్లాయ్ కాస్టింగ్స్‌ను, 80 టన్నుల మేరకు కాపర్ అల్లాయ్ కాస్టింగ్స్‌ను ఉత్పత్తి చేస్తుంది.

ఈ కర్మాగారంలో, స్టీమ్ టర్బైన్లు, టర్బో ఆల్టర్ నేటర్లు, పంపులు, ఫౌండ్రీ, కాస్టింగ్ క్లీనింగ్ షాపులు, ఫోర్జ్ హీట్ ట్రీట్మెంటు కొరకు 10 భారీ ఉత్పత్తిషాపులు, ఎలక్ట్రో ప్లేటింగ్ షాపులు, ఆగ్జిల్యరీ వర్క్‌షాపు, వెల్డింగ్‌షాపు, పాటర్న్ షాపు, టెస్టు గదులు మున్నగునవి వుంటాయి. ప్రథమ దశలో కర్మాగారం సుమారు 1.73 లక్షల చదరపు మైళ్ళకు రెండవ దశలో సుమారు 3.53 లక్షల చదరపు మైళ్ళకు తన పరిధిని విస్తరింపజేస్తుంది. ఈ కర్మాగారానికి ఆక్సిజన్, అసెటిలెన్, ప్రొడ్యూసర్ గ్యాస్, బాయిలర్ ప్లాంట్లవంటి సహాయక సర్వీసు యూనిట్లుకూడా వుంటాయి. ఈ కర్మాగారం సగటుపొడవు సుమారు 6,725 అడుగులు, వెడల్పు దాదాపు, 1,875 అడుగులు. దీనికై సుమారు 300 ఎకరాల విస్తీర్ణంలో చుట్టూ రాఫెన్సింగ్ చేశారు.

ప్రస్తుత అంచనాలనుబట్టి ఈ కర్మాగారం స్థాపనకు రూ. 27.5 కోట్లు ఖర్చవుతుంది. దీనిలో రూ. 9.00 కోట్లు నిర్మాణానికీ మిగతా మొత్తం యంత్రసామాగ్రి కొనుగోలుకు, స్థాపనకు వ్యయమవుతుంది.


నివేశనస్థలం విశిష్టత

భారీవిద్యుత్ పరికరాల కర్మాగారంకొరకు



ప్రీకాస్టు స్తంభాలు.

ఎంపికచేసిన నివేశస్థనలం, హైద్రాబాదుకు 17 మైళ్ళదూరంలో రామచంద్రపురం వద్ద వుంది. హైద్రాబాదు నగరానికి దగ్గరలో వున్నందువల్లనూ, రైలుమార్గం ఇక్కడికి సుమారు $1\frac{1}{2}$ మైళ్ళ దూరంలోనే (లింగంపల్లి రైలుస్టేషను) వున్నందు వల్లనూ, ఫ్యాక్టరీకి అవసరమైన నీటిని ప్రస్తుతం నిర్మాణంలో



నాలుగు భాగాలుగా నిర్మించిన భవనాలు

నున్న మంజీరా నీటి సరఫరాపథకం నుంచి పొందడానికి వీలుగా వున్నందువల్లనూ ఈ స్థలాన్ని ఎన్నిక చేశారు. విద్యుచ్ఛక్తిని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌నుంచి తీసుకుంటారు.

సర్వతోముఖ సహకారం

ఈ ప్రాజెక్టుకు అధికార్ల సర్వతోముఖ సహకారం లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ కర్మాగారానికై 6000 ఎకరాల స్థలాన్ని ఉచితంగా ఇవ్వడం ద్వారానే కాకుండా నీరు విద్యుచ్ఛక్తిని లభింపజేయడం ద్వారా కూడా పూర్తిగా సహకరించింది. ఇంతేగాక ప్రాజెక్టుపనులకై రాష్ట్ర ప్రభుత్వం తన సాంకేతికోద్యోగుల సేవలను కూడా లభింపజేస్తున్నది.

ఫ్యాక్టరీ స్థలానికి మంచి రవాణా సౌకర్యాలుకూడా వున్నాయి. హైద్రాబాదు, సికింద్రాబాదు నగరాలనుంచి పాక్షికంగా నిపుణతగల పనివారలు తగినంత మంది లభిస్తున్నారు. ఇక్కడి శీతోష్ణ పరిస్థితులు అనుకూలంగా వుంటాయి. శీతాకాలంలో సగటు ఉష్ణోగ్రత 34 డిగ్రీలు సెంటిగ్రేట్ వుంటుంది. ఈ నేల చాలాగట్టిది. అందుచేత వర్క్‌షాపులోని భారీయంత్రాల స్థాపనకు పునాదులు తీయడానికీ 100 టన్నులవరకూ బరువు ఎత్తేశక్తిగల క్రేన్‌తోకూడిన వర్క్‌షాపు ప్రధాన కట్టడాల పునాదికీ అనుకూలమైనది.

హైద్రాబాదు - బొంబాయి బ్రాడ్‌గేజ్ మార్గంపైగల లింగంపల్లి నుంచి కర్మాగారం వరకు రైలుమార్గం వుంది. అన్ని ప్రధాన భవనాలకూ రవాణాకు వీలు కలుగజేస్తూ ప్రాజెక్టు బ్లాకుల పొడువునా రైలులైను వుంది. ఫ్యాక్టరీ లోపలనే రైలుమార్గం నిడివి $3\frac{3}{4}$ మైళ్ళు వుంది. ఫ్యాక్టరీకి స్వంత మార్షలింగ్ యార్డ్ లొకోమోటివ్ షెడ్ కూడా వున్నవి.

ఫ్యాక్టరీకి రోజుకు సుమారు ఒక మిలియన్ గ్యాలన్ల నీరు అవసరమవుతుంది. ఫ్యాక్టరీ వాయువ్య భాగంలో ఒక్కొక్కటి ఒకలక్ష గ్యాలన్ల నీరు పట్టే రెండు తటాకాలు వుంటాయి. ఫ్యాక్టరీకి అవసరమైన

నీటిని, మంజీరా నీటి సరఫరా మెయిన్ల నీరు ఈ తటాకాలలోకి తెస్తారు.


ఫ్యాక్టరీ పనులను త్వరితంగా, అమలు పరచడానికి చేపట్టిన ప్రాథమిక చర్యలన్నింటి లోనూ, ఇంజనీర్లు, సిబ్బంది శిక్షణకొరకు ఏర్పాట్లు చేయడం ఒకటి. నలుగురు నిపుణులు గల బృందం సహాయంతో 54 మంది ఇంజనీరు శిక్షితుల తొలిజట్టు భూపాల్‌లో పునశ్చరణ శిక్షణ పొందింది. వీరు డిజైనింగ్‌లోనూ, స్టీమ్ టర్బైన్లు, టర్బో ఆల్టర్నేటర్లు, పంపులకు సంబంధించిన సాంకేతిక విషయాలలో పునశ్చరణ కోర్సు శిక్షణ పొందారు. జెక్ భాషకూడా వీరికి బోధించబడింది. ఈ పునశ్చరణ కోర్సు శిక్షణ పూర్తయ్యాక 54 ఇంజనీర్ శిక్షితుల మెదటి బృందం, ఉత్పత్తి, డిజైనింగ్ విషయాలలో ప్రత్యేక పనులకు సంబంధించి ఉన్నత శిక్షణ పొందే నిమిత్తం జకోస్లవేకియాకు బయలుదేరింది.

సిబ్బంది శిక్షణ

మన దేశంలో, నిపుణత గల సాంకేతిక పనివారల కొరత వున్నందువల్ల, సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి మూడు కొత్త ప్రాజెక్టుల వద్ద శిక్షణ పాఠశాలలు నెలకొల్పారు. రామచంద్రపురం, తిరుచిరపల్లి, రాణీపూర్‌లలో ఇటీవల ప్రారంభించబడిన నూతన శిక్షణ పాఠశాలలలో ఒక్కొక్క షిఫ్టులో సుమారు 400 మందికి శిక్షణ ఇస్తారు. నూత్న యంత్రాలను నడిపేందుకుగాను ఈ పథకంద్వారా సిబ్బందికి శిక్షణ ఇవ్వడానికి ప్రతిపాదించారు.

రామచంద్రపురంలోని శిక్షణ పాఠశాల రెండంతస్తుల భవనంలో వుంది. భవనం అడుగుభాగం విస్తీర్ణం 29,500 చదరపు మీటర్లు. దీనివిలువ సుమారు రూ. 6 లక్షలు వుంటుంది. ఈ భవనంలో తరగతిగదులు, లెక్చర్ హాల్, డ్రాయింగ్ స్టూడియో, మోడల్ రూమ్, ఆఫీసులకు వసతి వుంది. రూ. 40 లక్షలు ఖరీదుచేసే యంత్రాలు ఇతర సాధన సామగ్రిని తెప్పించి వర్క్ షాపులో నెలకొల్పారు. వీటిలో చాలా యంత్రాలు మనదేశంలోనే తయారు చేయబడినవనే విషయం గమనించదగినది.

అప్రెంటీస్‌లకు మెకానిస్టులు, ఫిట్టర్లు, టర్నర్లు, ఎలక్ట్రీసికులు, వెల్డర్లు, షీట్ మెటల్ వర్కర్లు, మౌల్డర్లు. డ్రాఫ్టుమన్‌గా



ఆర్. సి. సి. ప్రీకాస్టు స్తంభాలు.

18 మొదలు 20 నెలలవరకు శిక్షణ ఇస్తారు. శిక్షణ ముగిశాక వారిని ఎంపికచేసి 'బి' గ్రేడు ఉద్యోగులుగా ఫ్యాక్టరీలో నియమిస్తారు. శిక్షితుల తొలిజట్టుకు శిక్షణ సమాప్తికావడం, ఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభం కావడం 1966వ సంవత్సరంలో ఒకేసారి జరుగుతుంది. ఈ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడానికిగాను, 1962 నవంబరులో బోధకుల బృందాన్ని ఎంపికచేసి ఆయా పనులలో వారికి బోధకుల శిక్షణ గరపడం జరిగింది. శిక్షకులకు వసతిసౌకర్యాలు కల్పించేనిమిత్తం, 400 మంది నివసించడానికి అవకాశం వున్న రెండు హాస్టలు బ్లాకులను రూ. 12.10 లక్షల వ్యయంతో నిర్మించబడింది. శిక్షణ పాఠశాలకు మద్రాసు ముఖ్యమంత్రి, 1963 జూలై 8వ తేదీన లాంఛన ప్రాయంగా ప్రారంభోత్సవం చేశారు.

ఈ కర్మాగారం ఉత్పత్తికై అన్నిరకాల ఉద్యోగులు కలిసి సుమారు 3,555 మంది అవసరమవుతారు. కాగా వీరిలో ఉత్పత్తి పనివారలు 2,000 మంది వుంటారు. ఇటువంటి భారీ ప్రాజెక్టుకు ఫ్యాక్టరీ సమీపంలోనే సమస్తహంగులుగల ఆధునిక నివాసగృహాల పేట వుండటం అవసరమవుతుంది. ఫ్యాక్టరీ, నివాసగృహాలప్రాంతం అభివృద్ధికి సంబంధించి పట్టణ ప్రణాళికా కర్తల కమిటీ ఒకటి సలహాలిచ్చింది. నివాస గృహాలపేటను ఏర్పరిచే పని ఇదివరకే ప్రారంభమైంది. పలురకాల నివాసగృహాలు 300 నిర్మాణంలోవున్నాయి. ప్రారంభంలో 4000 మంది నివసించడానికి వీలుగా పాఠశాలలు, ఆటమైదానాలు, అంగళ్ళు, సహకార విక్రయశాలలు, వైద్య సదుపాయాలు, బ్యాంకు, తపాలాఫీసు, పోలీసుస్టేషను మున్నగు అన్ని సౌకర్యాలతో నివాస గృహాల పేట నొకదానిని పెంపొందించడానికి తలపెట్టారు.

ఉత్పత్తికొరకు ప్రతిపాదించబడిన యూనిటు పరిమాణాలలో మార్పులు చేసినందువల్ల ప్రాజెక్టును ఆలశ్యంగా ప్రారంభించవలసివచ్చింది. ఈ ప్రాజెక్టును భారత ప్రభుత్వం 1963 జులై ఉత్తరార్ధంలో మంజూరుచేసింది.

ప్రాజెక్టుకు ఆలశ్యంగా మంజూరీ లభించినప్పటికీ, పనులను ఆలశ్యంగా

ప్రారంభించినప్పటికీ మొదట నిర్ణయించిన లక్ష్యాలమేరకు కార్యక్రమం కొనసాగేందుకై సమగ్రమైన అంచనాలను, స్పెసిఫికేషన్లను రూపొందించడానికి తక్షణచర్యలు తీసుకున్నారు. సివిల్ ఇంజనీరింగ్ పనుల డిజైనింగ్‌కు సంబంధించిన పనులన్నింటినీ రెండునెలల వ్యవధిలోనే పూర్తిచేయడం జరిగింది.

సాధనసామగ్రి కొనుగోలు

ఫ్యాక్టరీ పునాదులు, కట్టడాలు, (సుమారు 17000 టన్నుల ఉక్కువినియోగంతో), వివిధఫ్యాక్టరీ బ్లాకుల ఫ్లోరింగులను స్థిరీకరించి 1962 అక్టోబరులో గాంట్రాక్టులు ఇవ్వడం జరిగింది. ఇతర అనుబంధ భవనాల నిర్మాణం ఇప్పుడు చేపట్టబడింది. సాధనసామగ్రిలో అధిక భాగాన్ని జకోస్లవేకియానుంచి కొనుగోలు చేయడానికి 1963 జులైలో ప్రతిపాదనలు స్థిరీకరించడం జరిగింది. జకోస్లవేకియా మినహా ఇతరదేశాలనుంచీ, స్థానిక మార్కెటునుంచీ కొనవలసిన ఇతర సాధన సామగ్రి, యంత్రపరికరాలకై స్పెసిఫికేషన్లను రూపొందించడం, దాదాపుగా ఆర్డర్లన్నింటినీ పంపడం పూర్తయింది.

ప్రస్తుత కార్యక్రమం ప్రకారం ఈ కర్మాగారం 1965 సెప్టెంబరు నుంచి ఉత్పత్తి ప్రారంభిస్తుంది. హర్ద్వార్‌లోని రాణీపూర్ ప్రాజెక్టు నిమిత్తం 12 మె. వా. ల మొదటి యూనిటు 1966 మార్చి నాటికి సిద్ధం కాగలదని ఆశించబడుతున్నది. ఈ విధంగా ఇది తృతీయ పంచవర్ష ప్రణాళికా కాలంలోనే ఉత్పత్తి సాగించగలదని తలంచబడుతున్నది, ఫ్యాక్టరీ 800 మె. వా. ల. గరిష్ట ఉత్పత్తి స్థాయికి 1970 వ సంవత్సరం నాటికి చేరుకోగలుగుతుంది. ఈ ఉత్పత్తి దశల పరిమాణాలు దిగువ పేర్కొనబడినవి:—

సంవత్సరం	మె. వా. ఉత్పత్తి	మె. వా. పరిమాణం
1966	24	12
1967	98	12, 25
1968	308	12, 25, 55
1969	503	12, 25, 55
1970	800	100

ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరంలో భారీ విద్యుత్ పరికరాల ప్రాజెక్టు నెలకొల్పబడటం ఈ రాష్ట్రానికి ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగించింది.

ఇది, ఈ ప్రాంతంలో పరిశ్రమల సత్వర అభివృద్ధికి పరిస్థితులను మరింత అనుకూలం చేయడమేకాక ఆంధ్రప్రదేశ్‌కు భారతదేశపు పారిశ్రామిక పటంలో స్థానం కల్పించిందికూడా.

పట్టిక

రామచంద్రపురంలోని భారీ విద్యుత్ పరికరాల ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్యతేదీలు :—

(1) 1961 సెప్టెంబరులో, ఈ ప్రాజెక్టును రామచంద్రపురంలో నెలకొల్పడానికి భారతప్రభుత్వం ఆమోదం తెలిపింది.

(2) 1962 సెప్టెంబరులో ఈ ప్రాజెక్టు సమగ్ర నివేదిక చేరింది.

(3) 1963 జులై 8 వ తేదీన రామచంద్రపురంలో శిక్షణ పాఠశాలకు అప్పటి మద్రాసు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు.

(4) 1965 సెప్టెంబరులో బహుశా కర్మాగారం వుత్పత్తి ప్రారంభిస్తుంది.

ప్రశ్నోత్తరావళి

శ్రీ లక్ష్మీనరసింహారావు, పంటలవారిగూడెం, కృష్ణాజిల్లా.

ప్ర: రాష్ట్రంలో డ్రాయింగ్ పరీక్షలు నిర్వహించబడే కేంద్రాల పేర్లను దయచేసి తెలియజేయండి? ఈ పరీక్షకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు ఎచ్చట లభిస్తాయి?

స: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ, గ్రేడ్–1 (లోయరు), గ్రేడ్ - 2 (హయ్యర్) డ్రాయింగ్ పరీక్షలు నిర్వహిస్తుంది. 3వ ఫారం లేక 8వ స్టాండర్డ్ పరీక్షలో ఉత్తీర్ణులైనవారు గ్రేడ్–1(లోయర్) పరీక్షకూ, గ్రేడ్ – 1 (లోయర్) పరీక్షలో కృతార్థులైనవారు గ్రేడ్ – 2 (హయ్యర్) పరీక్షకూ కూర్చోడానికి అర్హులు. ఈ పరీక్షలలో ప్రవేశానికై దాఖలు చేయవలసిన దరఖాస్తు ఫారాలను సాంకేతిక విద్యాశాఖ కార్యాలయం, దరఖాస్తులను కోరుతూ ప్రకటన జారీ చేయబడిన తరువాత, జారీ చేస్తుంది. ఫారం ఖరీదుక్రింద 25 పైసలను, "XXII విద్య డి. ప్రత్యేక సాంకేతిక పాఠశాలలు, ప్రభుత్వ సాంకేతిక పరీక్షలు - దరఖాస్తు ఫారం సరఫరా నిమిత్తం ఫీజు," అనే పద్దుకు చెల్లించు చలాను పొందవలసి వుంటుంది. పరీక్షలు సాధారణంగా దిగువ కేంద్రాలలో జరుగుతాయి:

1. శ్రీకాకుళం, 2. రాజమండ్రి, 3. విజయవాడ, 4. నెల్లూరు, 5. అనంతపురం, 6. కడప 7. విశాఖపట్నం, 8. ఏలూరు, 9. గుంటూరు, 10. చిత్తూరు, 11. కర్నూలు, 12. హైద్రబాదు.

శ్రీ ఆర్. ప్రభాకరరెడ్డి, ఈసామీయా బజారు, హైదాబాదు

ప్ర: నేపాల్ ఖట్మండులోని త్రిభువన్ విశ్వవిద్యాలయం నిర్వహించే ఎం. ఏ. పరీక్షను ఉద్యోగ నియామకాల నిమిత్తం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పరిగణించినదా?

స: పరిగణించలేదు.

శ్రీ జి. కె. రామ్‌రెడ్డి సోమరని, (వయా) ఆలేరు, భువనగిరి తాలూకా

ప్ర: హైద్రాబాదులో ద్రాక్ష పెంపకందార్లకు ఆర్థిక సహాయం చేయడానికి సంబంధించిన వివరాలను దయచేసి తెలపండి.

స: హైద్రాబాదు నగరంలోనూ, ఆ చుట్టుప్రక్కల ప్రదేశాలలోను ద్రాక్షతోటల పెంపకానికై, పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం చేయడానికి కానీ సబ్సిడీలు ఇవ్వడానికి కానీ పథకమేదీ లేదు. అయితే ఇంటి పెరటి తోటలలో ద్రాక్షతీగెల పెంపకాన్ని ప్రోత్సహించడానికి హైద్రాబాదు, సికింద్రాబాదు నగరాలలో ద్రాక్ష తీగెల పెంపకం అభివృద్ధి పథకాన్ని అమలు పరుస్తున్నారు. ఈ పథకం క్రింద రూ. 20లు మొదలు రూ. 100ల గరిష్టపరిమితి వరకు సబ్సిడీ ఇవ్వబడుతుంది. (ద్రాక్షతీగె పందిరి దశకు వచ్చినప్పుడు తీగ ఒక్కొటికి రూ. 10ల చొప్పున) ఈ పథకంలో, పైన పేర్కొన్న సబ్సిడీ మినహా కుళాయిల ద్వారాకానీ, బావుల ద్వారాకానీ నీరు ఇవ్వడానికి అవకాశమేమీ లేదు ద్రాక్షతీగెకు కుళాయిల ద్వారాకానీ, బావులద్వారా త్రాగే మంచినీటిని పోయటం మంచిది.

శ్రీ ఎస్. పుల్లారెడ్డి. పెడబల్లె–(పోస్టు) కదిరి తాలూకా, అనంతపురం జిల్లా

ప్ర: అనంతపురం జిల్లా కదిరి తాలూకాలో పాపాగ్ని ప్రాజెక్టు పనులను ఎప్పుడు చేపడతారు?

స: **ఈ పథకాన్ని మొదట మూడవ ప్రణాళికలో చేర్చి తరువాత ధనాభావంవల్ల, మరికొన్ని ఇతర పథకాలతోపాటు, దీనిని మూడవ ప్రణాళిక నుంచి తీసివేశారు. ఈ పథకం లాభసాటియైనది కాదనికూడా భావించడం జరిగింది.**

శ్రీ కె. ఎస్. శివరామశర్మ, కె. సి. పర్వ్స, గుంటూరు జిల్లా.

ప్ర: నేను ఎస్. ఎస్. ఎల్. సి. ప్యాసయ్యాను. నాకు "ఫ్లోర్ మిల్స్ టెక్నాలజీ" చదువాలని వుంది. ఈ కోర్సు కాలపరిమితి ఎంతో దయచేసి తెలపండి.

స: **ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ అధీనంలో వున్న ఏ సంస్థలోకూడా ఫ్లోర్‌మిల్స్ టెక్నాలజీ కోర్సు బోధించరు.**

శ్రీ బి. రామ్‌రెడ్డి, కల్వపల్లి, భువనగిరి తాలూకా, నల్గొండ జిల్లా.

ప్ర: భువనగిరిలో సిమెంటు ఫ్యాక్టరీని తెరిచే ప్రతిపాదన వుందా?

స. భువనగిరిలో సిమెంటు ఫ్యాక్టరీని నెలకొల్పుకోవడానికి హైద్రాబాదుకు చెందిన మెసర్స్ ఎ. కె. సిమెంట్స్ లిమిటెడ్ వారు లైసెన్సు పొందారు.

★

హరి, గిరిజనుల సంక్షేమ చర్చ

—కె. రంగారావు

వెలుగు బాటలు

భారతదేశపు రాజ్యాంగ చట్టము యొక్క 46ఎ నిబంధన ననుసరించి ప్రభుత్వము గత 12 సంవత్సరముల నుండి వెనుకబడిన జాతుల, ముఖ్యముగా హరి, గిరిజనుల సంక్షేమమునకు కృషి చేయుచున్నది. పంచవర్ష ప్రణాళికల ద్వారా ఈ తరగతుల సర్వతోముఖాభివృద్ధికై వివిధములగు నేర్పాట్లు ప్రత్యేకశ్రద్ధతో చేయబడుట కుద్దేశింప బడినవి. ప్రభుత్వోద్యోగములలో హరిజనులకు 12½%. గిరిజనులకు 5% స్థానములు కేటాయించబడుటయే గాక వీరికై వయః పరిమితికూడ హెచ్చింపబడినది హరిజనులు మన సమాజములో అస్పృశ్యులుగా తరతరాల నుండి ఎంచబడుచున్నారు గావున యట్టి దురవస్థను దూరముచేసి పరిపూర్ణ సమానత్వము కల్పించు నుద్దేశ్యముతో రాజ్యాంగ చట్టపు 17వ నిబంధన, అస్పృశ్యతాచారమును శిక్షార్హ నేరముగా నిర్ణయించినది ఇన్ని ప్రయత్నములు చేసినను హరిజనుల, గిరిజనుల యొక్క సాంఘిక, ఆర్థికాభివృద్ధి అనుకున్నంతగా జరుగక పోవటము గమనించదగిన విషయము. ఇందుకుగల కారణములు పునరాలోచించి యీయీ జాతుల తక్షణాభివృద్ధికి తోడ్పడు నుద్దేశ్యముతో యీమధ్య కేంద్ర ప్రణాళికా సంఘము (Planning Commission) ఒక చర్చ నేర్పాటు చేసినది. ఇట్టి గోష్ఠిలో వివిధశాఖలనుండి అందజేసిన సమాచారములను బట్టి ఈ హరి, గిరిజనుల ప్రస్తుత పరిస్థితులు ఈ క్రింది విధముగ నున్నట్లు తెలియుచున్నవి.

1961 జనాభా లెక్కల ప్రకారము భారతదేశమునందు నివసించు హరిజనుల, ఆదిమవాసుల సంఖ్య క్రమముగా 6.45, మరియు 2.92 కోట్లు. అనగా ఈ రెండు జాతుల జనాభా పూర్తిదేశపు జనాభాలో 21 శాతమున్నట్లు తెలియుచున్నది. దేశము యొక్క మొత్తము జనాభాలో 17.8% పట్టణవాసులుకాగా, హరిజనులనుండి 10.7% గిరిజనులనుండి 2.6% మాత్రమే పట్టణవాసులు. కావున ఈ రెండు తరగతులవారి జీవితము సంపూర్ణముగ గ్రామాభివృద్ధి పైననే ఆధారపడి యున్నదనుట నిర్వివాదాంశము ఈ రెండుజాతులనుండి 80% పైగా ప్రజలు వ్యవసాయముపై నాధారపడినవారే. ఇట్టివారిలో ప్రత్యేకముగ హరిజనులలో నెక్కువభాగము వ్యవసాయ కూలీలుగా మాత్రమే యున్నారు. దేశము యొక్క మొత్తము జనాభాలో 27% విద్యావంతులు కాగా, హరిజనులనుండి 10% గిరిజనుల నుండి 8.5% మాత్రమే విద్యావంతులు. అనగా ఆర్థికరంగంలోను, విద్యారంగంలోను, సాంఘికరంగంలో వలెనే యీ యీ జాతుల ప్రజలు చాలా వెనుకబడియున్నారు. ఉద్యోగరంగంలో కూడ యీ యీ జాతుల పరిస్థితంత తృప్తికరముగలేదు. ఈ క్రింద నుదహరించిన *పట్టిక పరిశీలించినచో యీ ప్రజలు మొదటి మూడు తరగతులకుచెందిన ఉద్యోగములలో అతితక్కువగ నుండి, నాల్గవతరగతి యుద్యోగములలో మాత్రమే కొంత స్థానమును కల్గియున్నటుల కన్పించుచున్నది. నాల్గవతరగతి యుద్యోగుల మొత్తములో ప్రభుత్వ కార్యాలయములు రోడ్లు శుభ్రపరచు వృత్తులలో హరిజనులు అధిక సంఖ్యాకులుగ నుండుట గమనించదగిన విషయము. దీనికి కారణము జగద్విదితము. తరతరాలనుండి హరిజనులు నీచవృత్తుల నవలంబించునట్లు చేయుటచే

*ప్రభుత్వోద్యోగములలో హరి, గిరిజనుల స్థానము.

ఉద్యోగతరగతి	గిరిజనులు	హరిజనులు	హరి, గిరిజనుల
	(శాతములో)	(శాతములో)	మొత్తము (శాతములో)
మొదటి తరగతి	0 2	1.3	1.5
రెండవ తరగతి	0.5	2.8	3.3
మూడవ తరగతి	0.9	7.7	8.6
నాల్గవ తరగతి (వీధులు ఊడ్చేవారుకాక)	3 0	17 0	20.0
వీధులు శుభ్రపరచువారు.	0.7	77.9	78.6
మొత్తము	1.9	14.7	16.6

యింకను అట్టి వృత్తులు వారినే అంటిపెట్టుకొనియున్నవి. కావున మొత్తము ప్రభుత్వోద్యోగములలో 14.7% హరిజను లున్నట్లు తెలియుచున్నను; వారు నీచ వృత్తులలోనే ఉద్యోగింపబడుచు, ఉన్నతి ఉద్యోగములలో తగిన స్థాయిని పొందలేకున్నారు ఇట్టి పరిస్థితికి గల ముఖ్యకారణ మేమన; ఉద్యోగముల కొఱకు దరఖాస్తులు పెట్టుకొన్న హరిజనుల, మరియు గిరిజనులలో 65% ఎనిమిదవ తరగతిలోగా విద్య నభ్యసించిన వారేనై యుండుట. అందులోనూ సాంకేతిక విద్యనభ్యసించిన వారు చాలాయరుదు. ఇందు మూలముగా యీయా ప్రజలకై ప్రత్యేకముగ కేటాయించబడిన ఉద్యోగ స్థానములలో, ముఖ్యముగ యున్నతోద్యోగములలో, యితర జాతులవారిని తీసుకొనవలసిన పరిస్థితేర్పడు చున్నది. మొత్తముపై పరిస్థితు లెట్టు లున్నను భారత ప్రభుత్వ సేవ (I. A. S) కు మరియు, కేంద్రప్రభుత్వమునకు సంబంధించిన ఇతర యుద్యోగములలో గత రెండు, మూడు సంవత్సరములనుండి ఈ జాతుల యభివృద్ధి కొంత కనబడు చున్నది. ఈ మధ్య కేంద్రప్రభుత్వముచే దేశమునందు రెండు ప్రదేశములలో ఈ జాతులవారికి ప్రత్యేక కేంద్రప్రభుత్వోద్యోగములకొఱకు శిక్షణావకాశములు కల్పింపబడుట ముదావహము.

గత 12 సంవత్సరములనుండి విద్యాభివృద్ధికొఱకై వివిధ సౌకర్యములు కల్పింపబడినను ఈ హరి, గిరిజనులకు చెందినవారు హెచ్చుగ విద్యావంతులు కాకపోవుటకు కారణములు; చాలీచాలని విద్యావేతనములు, వేతనములు విద్యార్థుల కందజేయుటలోని దీర్ఘాలస్యము, మరియు విద్యార్థి వసతిగృహముల కొఱత అని తెలియుచున్నవి. ఇంతే కాక యీ జాతులకు చెందినవారు నిరుపేదలు కావున వారికి సక్రమముగ విద్య నభ్యసించుటకు కావలసిన వాతావరణము, యితర సదుపాయములు లేకపోవుట మరియొక ముఖ్యకారణము. ప్రత్యేకముగ గిరిజనులలో తక్కువ విద్యాశాతమునకు, వారి మాతృభాషలో శిక్షణ నేర్పాటు చేయునిమిత్తము కనీసము ప్రాథమిక పుస్తకములు వారి వారి భాషలలో లేకపోవుట చాల ముఖ్య కారణము.

పై నుదహరించినవి కాక గిరిజనులకు కొన్ని ప్రత్యేక సమస్యలు గలవు. వీరు అనాదిగ పర్వత - అటవీ ప్రాంతములలో స్వేచ్ఛగ తిరుగుచూ, అటవీ సంపద ననుభవించుచు, నచటి భూములపై వ్యవసాయము చేసుకొనుచుండెడివారు. నేటి ప్రభుత్వశాసనములు వారి సాంప్రదాయ సిద్ధమగు పనులలో వివిధములగు నడ్డంకులు కల్పించుచున్నవి. వివిధ రాష్ట్రప్రభుత్వములు ఈ ఆదిమవాసుల భూములను యితరులచే కొనబడుటకు వీలులేదని శాసనములు చేసినను ఏదో విధముగ గిరిజనులు కానివారుకూడ యట్టి భూములను సంగ్రహించుచునే యున్నారు. దీనికితోడు వివిధ కారణములవలన గిరిజనులు తమ సాంప్రదాయపరంగా వచ్చుచున్న కుటీరపరిశ్రమలను వదలివేయవలసిన పరిస్థితేర్పడుటచే పూర్తిగా నిరుద్యోగులగుట సంభవించుచున్నది. ఇదే పరిస్థితి కొంతవఱకు చర్మపనిచేయు హరిజనులలో కూడ సంభవించినందున వారుకూడ తప్పనిసరిగ నిరుద్యోగులు కావలసి వచ్చినది.

ఈ విధముగ హరి, గిరిజనులు వివిధ కారణములచే నిరుద్యోగము, నిరక్షరాస్యతతో బాధపడుచు తమ జీవన ప్రమాణముల నభివృద్ధి చేసుకొనలేనిపరిస్థితిలో యున్నారు. దేశము మొత్తపు జనాభాలో 21% కు పైగా యున్న యీ జాతులవారి సత్వరాభివృద్ధికి శాయశక్తుల ప్రయత్నము చేయనిచో పూర్తి భారతదేశపు యభివృద్ధియే నిస్సందేహముగ కుంటువడి పోవునుగాన ఈ గోష్ఠిలో యీ జాతులవారి సత్వరాభివృద్ధికై వివిధములగు సూచనలు చేయబడెను. అందులోని ముఖ్యాంశములు ఈ క్రింద పొందుపరుపబడినవి.

(1) సత్వర ప్రాథమిక విద్యావ్యాప్తి కొఱకై ప్రాథమిక, మాధ్యమిక ఉన్నత పాఠశాలలు ఆయాప్రాంతపు పరిస్థితులను బట్టి తగు విధములైన పనివేళలు, పనిరోజులతో నేర్పాటు చేయవలయును. ఎందుకనగా బీదకుటుంబమునకు సంబంధించిన పిల్లలు తల్లిదండ్రులతోపాటు వివిధవృత్తులలో పాల్గొను కారణముగ వారు అన్ని కాలములందు ప్రత్యేకముగ వ్యవసాయక పనులకు సంబంధించిన ఋతువులలో పాఠశాలలకు రాజాలకున్నారు

(2) హరి, గిరిజన బాలబాలిక లందలకు మధ్యాహ్నపు భోజనముతోబాటు వలయు దుస్తులు, పుస్తకములు వగైరా యుచితముగ నందజేయవలయును.

(3) గిరిజన ప్రాంతములలో ఆయా ప్రాంతీయభాషలలో ప్రాథమిక పాఠ్యగ్రంథములను తయారుచేసి ముద్రించవలయును

(4) గిరిజన ప్రాంతములలో ఆయా భాషలువచ్చినవారినే ప్రాథమిక మాధ్యమిక యుపాధ్యాయులుగ నియమించవలయును. అట్టివారిని అధిక వేతనములద్వారా ప్రోత్సహించుట మంచిది.

(5) మాధ్యమిక, ఉన్నత విద్యాస్థాయిలో హరి, గిరిజన విద్యార్థులసంఖ్య తక్కువగ నున్నకారణమున వీరికి వుచిత విద్యార్థివేతనము లధికసంఖ్యలో యీయవలయును. ఇట్టి విద్యార్థివేతనములు వారి

ఆయా అవసరములకు సరిపోవునట్లుగ యుండవలయును

(6) సాంకేతిక విద్యాభివృద్ధి కొఱకు ప్రస్తుతముకన్న హెచ్చువేతనము లిచ్చి ఈ జాతుల బాలబాలికలను ఎక్కువ సంఖ్యలో ఆకర్షించవలయును. దీనిగురించి ప్రతి సామాజికాభివృద్ధి కార్యాలయము, మరియు పాఠశాలలద్వారా అధిక ప్రచారము జరుపుటెంతయునవసరము.

(7) విద్యార్థుల కివ్వబడు వుచిత యుపకార వేతనములు సకాలములో, ననగా, వారు పాఠశాలను లేక కళాశాలలలో చేరిన తక్షణమే నందజేయు ప్రయత్నము చేయవలయును.

(8) విద్యార్థి వసతిగృహముల సంఖ్య నెక్కువజేయుచు ప్రతి వసతిగృహములో ఈ జాతుల విద్యార్థులకు ప్రత్యేకబోధనావకాశములను కల్పించవలయును. ఇట్టి అవకాశములు కల్పించినచో వీరు ఎక్కువ సంఖ్యలో, ఎక్కువమార్కులతో నుత్తీర్ణులగుటయేగాక పెద్దపెద్ద యుద్యోగములకు పోటీ చేయుట కర్హు లగుదురు.

(9) ఉద్యోగావకాశములను పెంపొందించునుద్దేశముతో ఏయే సాంకేతిక వృత్తులలో నెక్కువ యుద్యోగావకాశములు కలవో అట్టివానిలో ఈ జాతుల బాలబాలికలకు శిక్షణ నిచ్చు ప్రయత్నములు హెచ్చుగా చేయవలయును.

(10) ప్రస్తుతము ఈ జాతులలో వివిధ కుటీరపరిశ్రమలలో, చేతివృత్తులలో పని చేయుచున్నవారికి వారి నైపుణ్యాభివృద్ధి కొఱకు కొంతకాలముచిత సాంకేతిక విద్యావకాశములు కల్పించి సరియగు నుపాధి యవకాశము లొనగూర్చవలయును.

(11) కేవలము ప్రభుత్వసంస్థలకు సంబంధించినంతవరకేగాక ప్రభుత్వ యాజమాన్యమున నడుపఁబడుచున్న ప్రతిసంస్థనందును హరిజనులకు 12½%, గిరిజనులకు 5% ఉద్యోగములు కేటాయించవలయును.

(12) వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగముల పోటీపరీక్షలకు ఎక్కువసంఖ్యలో తయారు చేయుటకు ఎక్కువగా ప్రత్యేక శిక్షణావకాశములు కల్పించవలయును.

(13) భూమిలేనివారికి భూమి పంపిణీ చేయునపుడు హరి, గిరిజనులకు ప్రథమస్థాన మీయవలయును. అట్టివారికి భూములతో పాటు వ్యవసాయమునకు కావలయు పనిముట్లు, పశువులు మొదలగువాని నందఁజేయుట యెంతయు నవసరము.

(14) గిరిజన ప్రాంతములలో, గిరిజనుల భూములు యితరులచే సంగ్రహింపబడకుండ చూచుచూ, వారికి అటవీ ప్రాంతములో సరియగు హక్కుల సంరక్షణ జరుగునట్లు చేయవలయును.

(15) ఒకవేళ కొన్ని ప్రాంతములలో తప్పనిసరిగ గిరిజన భూములను ప్రభుత్వము సేకరించవలసిన అవసరము కలిగినచో నట్టి వారికి సాధ్యమైనంతవరకు యింకొకచోట భూమిని చూపించుచూ సరియైన నష్టపరిహారము కూడ నివ్వ ప్రయత్నించవలయును.

(16) ప్రతి గ్రామములో ఈ జాతులవారి ప్రతి కుటుంబ గృహ నిర్మాణమునకు కావలయు భూమి నుచితముగ నీయవలయును.


(17) సాధ్యమైనంత తొందరలో వ్యవసాయ సంబంధమైన పరిశ్రమల నభివృద్ధి పరచి ఈ జాతులవారికి ఆయా ప్రాంతములలో ఉపాధి కల్పించవలయును.

(18) వివిధ ప్రాంతములలో వివిధ శాఖలద్వారా ఈ జాతుల సంక్షేమమునకై ప్రస్తుతము జరుగుచున్న కృషిని సమన్వయ పరుచవలయును. ఇందుకు కావలసిన పరిపాలనా యంత్రాంగము స్థాపించుట కూడ నెంతయో అవుసరము.


(19) అన్ని ప్రాంతములలో ప్రభుత్వము అనధికార సంస్థలను ప్రోత్సహించి వాటి ద్వారా అస్పృశ్యతా నివారణ, మరితరము లగు సాంఘిక సంక్షేమ కార్యము లభివృద్ధి పరచి తద్వారా ఈ జాతులవారి యభివృద్ధి కొఱకు తీవ్ర ప్రయత్నము చేయవలయును.

(20) ఈ హరి, గిరిజనులు తమకు గల రాజ్యాంగ హక్కులు మరియు, యితరములైన వివిధ అవకాశములు తెలిసికొని తమ జీవన ప్రమాణములను అభివృద్ధి చేసికొనుటకు వీలుగ సాధ్యమైనంత యెక్కువగ ప్రచారము చేయవలసిన బాధ్యత ప్రభుత్వము వారిపై నున్నది.

పై నుదహరించిన సూచనలు యింతకు పూర్వ మెన్నిసారులో వివిధ ప్రదేశములలో, వివిధ సమయములలో, వివిధ రూపాలలో చేయబడినవే నైనను, వివిధకారణములచే తగు ఫలితములు కలుగవయ్యెను, ప్రప్రథమంగా కేంద్ర ప్రణాళికా సంఘముచే నేర్పాటు చేయబడిన యీ గోష్ఠిలో కేంద్ర మరియు వివిధ రాష్ట్రమంత్రుల సమక్షములో వారి సహకారముతో చేయబడిన పై సూచనలు పూర్వమువలె కాక కార్యరూపములను ధరించగలవని ఆశించ తగియున్నది.



సమాచార కేంద్రం ముందు భాగం దృశ్యం.



సమాచార మంత్రి కేంద్రానికి ప్రారంభోత్సవం జరిపారు.

విజయవాడలో రాష్ట్ర సమాచార కేంద్రం ప్రారంభం

రాష్ట్రం మొత్తంలోకీ రెండవదిగా విజయవాడలో నెలకొల్పబడిన రాష్ట్ర సమాచార కేంద్రానికి సమాచార, రవాణా, కార్మిక శాఖల మంత్రి శ్రీ బి.వి. గురుమూర్తి '64 సెప్టెంబరు 8 వ తేదీన ప్రారంభోత్సవం చేశారు. కృష్ణాజిల్లా కలెక్టరు ప్రారంభోత్సవ సభకు అధ్యక్షత వహించారు. ఈ సమాచార కేంద్రం ఖర్చులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరిస్తాయి.

ప్రజాస్వామిక విద్యారంగంలో సమాచార కేంద్రాలను నూత్న ప్రయోగాలుగా వర్ణిస్తూ, నేటి ప్రణాళికా యుగంలో, ప్రజలు పంచవర్ష ప్రణాళికల అమలులో ప్రభుత్వానికి తోడ్పడగల స్థితిలో వుండటానికి వీలుగా వారివిధులు బాధ్యతలనుగురించి ప్రజలకు సంపూర్ణంగా తెలియజెప్పాలని మంత్రి తమ ఉపన్యాసంలో పేర్కొన్నారు. ఇందునిమిత్తం శక్తివంతమైన ప్రచార సాధనాలుగా ఉపయోగ పడడానికి సమాచార కేంద్రాలు ఉద్దేశించబడినవి.


రాష్ట్ర, దేశ పరిస్థితులు, ప్రణాళికా పథకాల పురోగతి మనకు అందుబాటులోవున్న వనరులు, అభివృద్ధి పరచదగిన వనరులు, దర్శనీయమైన యాత్రా స్థలాలు మొదలైనవాటికి సంబంధించిన యదార్థ విషయాలను, అంకెలను, సాధారణ సమాచారాన్ని ఇవి అందజేస్తాయి. సాధారణ పాఠకులకు ఈ సమాచార కేంద్రాలు అనేక




ప్రజాస్వామిక విద్యారంగంలో నూతన ప్రయోగం.



సమాచారశాఖ డైరెక్టరు అతిథులకు స్వాగతం చెప్పారు.



అధ్యక్షోపన్యాసం చేస్తున్న జిల్లా కలెక్టరు.



కేంద్రంలో పత్రికలు చదువుకుంటున్న మహిళలు.

రకాల పత్రికలు, సంచికలు, సూచీ గ్రంథాలనుకూడా లభింపజేస్తాయి. వీటిలో చిత్రాలు, ఫోటోలు, ఛార్టులు, నమూనాల ద్వారా స్థానిక పరిశ్రమల ఉత్పత్తులు, ప్రసిద్ధ స్థలాలను రమణీయంగా ప్రదర్శిస్తారు. సమాచార కేంద్రాలు, మధ్యమధ్య వర్తమాన పరిస్థితులకు సంబంధించిన ఆసక్తికరమైన వివిధ విషయాలపై ఉపన్యాసాలు, గోష్ఠులు, వక్తృత్వ కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థి విద్యార్థినులు తదితరులలో ఆలోచన, విజ్ఞాన పరిధులను పెంపొందించడానికి దోహదం చేస్తాయి. సమాచార కేంద్రాల అధ్వర్యంలో చలనచిత్ర ప్రదర్శనలుకూడా జరుగుతాయి. ఇవి స్థానిక కార్యక్రమాలకు ఆకర్షణ చేకూర్చుతాయి. ప్రజలకు వినోద విజ్ఞానాలు కలిగిస్తాయి.


విజయవాడ పౌరులు ఈ కేంద్రంనుంచి పూర్తి ప్రయోజనాలు పొందగలరని మంత్రి ఆశాభావం ప్రకటించారు.

ప్రభుత్వం, ప్రజలకు మధ్య అనుసంధానకర్తగా సమాచార, పౌర సంబంధాల శాఖ నిర్వర్తించే ముఖ్యవిధులను సమాచారమంత్రి వివరించారు.


పత్రికలు, ఫిల్ములు, రేడియో మొదలైన వివిధ ప్రచారసాధనాలకు సంబంధించిన దాని యితర కార్యక్రమాలనుగూర్చి ప్రస్తావిస్తూ, రాష్ట్ర రాజధానిలోను ఇతర ప్రదేశాలలోను పత్రికా ప్రతినిధులకు, అదేవిధంగా చిత్ర నిర్మాణంలోని వ్యాపారస్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను గూర్చి ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో యాత్రికులకు గలిగించే సౌకర్యాలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.


విజయవాడ దాని పరిసర ప్రాంతాలలో యాత్రికులు చూడదగిన అనేక ప్రదేశాలు ఉన్న దృష్ట్యాను, పెద్ద సంఖ్యలో వచ్చే సందర్శకుల సౌకర్యార్థం విజయవాడలో యాత్రికుల అతిథి గృహాన్ని నిర్మించాలని కలెక్టరు తమ





ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులు.





కేంద్రంలో ఆకర్షణీయంగా ప్రదర్శించబడిన పత్రికలు......

......చిత్రాలను ఆసక్తితో తిలకిస్తున్న మంత్రి.

అధ్యక్షోపన్యాస సందర్భంలో కోరారు. మచిలీపట్నం ప్రత్యేకంగా అక్కడి రేవును అభివృద్ధి చేయడంలో శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని గూర్చి ఆయన నొక్కి చెప్పారు.

సభారంభంలో సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టరు సదస్యులకు స్వాగతం చెప్పారు. భౌగోళిక, చారిత్రక, వ్యాపార, సాంస్కృతిక ప్రాముఖ్యం మరియు 2,30,000 జనాభా ఉన్న దృష్ట్యా విజయవాడలో ప్రత్యేక సమాచార కేంద్రం ఉండడం దాని న్యాయ సమ్మతమైన హక్కు అని ఆయన అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను, యాత్రీకులు చూడదగిన స్థలాలను గూర్చిన వివరాలను, సమాచారాన్ని యీ సమాచార కేంద్రం అందజేస్తుందని ఆయన అన్నారు.

గాంధీ నగరంలోని కేంద్రస్థానంలో యీ సమాచార కేంద్రాన్ని నెలకొల్పారు. ప్రతిరోజు అధికసంఖ్యలో ప్రజలు దీనిని సందర్శిస్తున్నారు.





కుమారి అన్నపూర్ణ నాట్యం ప్రదర్శించారు.



తాజా టీ
పరిమళమైన టీ
ఉత్తమ టీ

టాటా-ఫిన్లే
టీ

సాటిలేని టీ!


* తాజాగా వుంచుటకు టాటా-ఫిన్లే టీని ప్రత్యేకమైన ప్యాకింగ్‌లో సురక్షితముగా భద్రపరచుతారు.

* అతి సున్నితమైన పరిమళమిచ్చుటకు కావలసిన కోమలమైన ఆకులను మొగ్గలనే టాటా-ఫిన్లే టీలో ఉపయోగిస్తారు.

* టాటా-ఫిన్లే టీ మిశ్రణ (బ్లెండింగ్) అతి నిపుణతతో చేస్తారు. కనుకనే ఈ టీ చిక్కగా రుచికరంగా వుంటుంది.

టాటా-ఫిన్లే *టీ త్రాగండి; ఆనందము అందుకోండి!*

ఈ క్రింది రకాలలోను,
ప్యాకింగ్స్‌లోను టాటా-ఫిన్లే
టీ దొరుకుతుంది:-
ప్రెస్టిజ్ డార్జిలింగ్, లలిత్ లీఫ్ టీ,
మిలాప్ లీఫ్ టీ, బహదూర్ డస్ట్ టీ,
షాన్ డస్ట్ టీ



స్వరాజ్యప్రశంసా

శ్రీ విక్రాల శేషాచార్యులు

స్వరాజ్యభాస్వా నుదియాయ సమ్య
గార్యావనౌ దాస్యనిశాం నిరస్య
మనోంబుజాని స్ఫుటయన్ జనానాం
ద్రా గుచ్చగస్త్రాస త్పరదుర్నిరీక్ష్యః ॥

ఆదౌ గృహీతః కిల లోకమాన్యై
ర్మహాత్మభి శ్శాంతగుణావనద్ధః
నీతోఽధునా పండితదేశబంధు
ముఖై స్స్వరాజ్యాఖ్యరథ స్స్వదేశమ్॥

శ్రీ బాలగంగాధరత స్సముత్థః
పుష్టశ్చ గాంధి ప్రవరేరణ బాఢం
నెహ్రూముఖై ర్దోహద కర్మణాఽలం
స్వరాజ్య కల్ప ద్రురయం ఫలింధే ॥

జయతు జయతు దాదాభాయి నోరోజి రాదౌ
జయతు జయతు మాహాదేవ గోవింద పాదః
జయతు జయతు గోపాల్ కృష్ణగోక్లే చతద్వ
జ్జయతు జయతు ధీమా న్బాలగంగాధరశ్చ ॥

జయతు జయతు గాంధి శ్శాంతమూర్తి ర్మహాత్మా
జయతు జయతు జవ్హార్లాల నెహ్రూశ్చ తద్వత్
అపి భరతభువ స్స్వాతంత్ర్య సంపాదనాఖ్యా
ధ్వరవరకృత నిష్ఠా యేచ తేతే జయంతు ॥

మనసి పరశురామం స్మారయన్ శౌర్యలక్ష్మ్యా
కురుకుల గురువర్యం ద్రోణ మప్యుచ్చ ధైర్యం
నిశితమతి బలేన స్మారయ న్విష్ణుగుప్తం
జయతు జయతు జేతా శ్రీ సుభాశ్చంద్రనేతా ॥

శ్వేతాస్యభూపాల బలేః ప్రపేదే
నెహ్రూహరి ర్భారతరాజ్యలక్ష్మీమ్
అఖండ సద్భారత దేశగోప్తా
ప్రవర్ధతాం సిద్ధమనోరథస్సన్ ॥

గోకర్ణాకార చుళుకస్థితాంభ స్సన్నివేశవత్
అఖండో భారతదేశో దర్శనీయోఽభి వర్ధతామ్ ॥

కమ్యూనిటీ రేడియో సెట్లు

1964 జూన్‌లో, రాష్ట్రంలోని దిగువ పేర్కొన్న గ్రామాలలో కమ్యూనిటీ రేడియో సెట్లను నెలకొల్పారు :

శ్రీకాకుళం జిల్లా : నాగూరు; కృష్ణాజిల్లా: అప్పికట్ల; నెల్లూరుజిల్లా : అమ్మవారి పాలెం, కలవలపూడి; చిత్తూరుజిల్లా : చింతలగుంట, పెద్దసెట్టిపల్లి, నాయనిచెరువు, బాలకృష్ణాపురం, కోటలం, గుడ్లనయనపల్లి, కలవగుంట, అముదూరు, కామినయనిపల్లి, తిరుమర్యనం, సదాశివపురం, తిమ్మసముట్: సూర్‌మాల, పెద్ద ఏటివాకం, పెద్దపాలెం; కడపజిల్లా: చికులూరు, దుంపలగట్ట, కొలములవారిపల్లి, కర్నూలు జిల్లా : తమ్మడపల్లి; మహబూబ్‌నగర్ జిల్లా : యేదుల, పెద్దమదునూరు, కోమటికుంట, వనపట్ల, గౌరారం, లింగాల, బాలన్‌పల్లి, సిడ్డింట, పెద్దమందడి, నెట్వల్లి, పెద్దపౌర్ల, అల్లమాయ్‌పల్లి, కిస్టంపల్లి, ఇప్పటూరు, పుల్లూరు, బ్రాహ్మణపల్లి.

సంగ్రహ ప్రకటనలు

జిల్లా సంయుక్త సిబ్బంది మండలులు

ప్రభుత్వం, దాని నాన్ గజిటెడ్ సిబ్బందిల మధ్య సన్నిహిత సహకారాన్ని పెంపొందింపజేయడానికి పనిచేస్తున్న సంయుక్త సిబ్బంది మండలి సిఫారసు చేసిన విధంగా జిల్లా సంయుక్త సిబ్బంది మండలి అని వ్యవహరింపబడే జిల్లా మండలులను ఏర్పాటుచేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిశ్చయించింది. 1964 సెప్టెంబర్ 1వ తేదీనుంచిగానీ, ఆతర్వాత వెంటనే గానీ వీటిని ఏర్పాటు చేయడం జరుగుతుంది. యీ మండలుల ఏర్పాటు, వాటి విధులను వివరంగా దిగువ ఇవ్వడం జరిగింది.

ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో సంయుక్త సిబ్బంది మండలి ఉంటుంది. దీనిని జిల్లా సంయుక్త సిబ్బంది మండలి అని వ్యవహరిస్తారు. యీ మండలికి కలెక్టరు ఎక్స్ అఫీషియో అధ్యక్షులుగాను, కలెక్టరు పర్సనల్ అసిస్టెంటు, మెంబరు కార్యదర్శిగాను ఉంటారు.

జిల్లా మండలిలో 12 మంది సభ్యులు ఉంటారు. ఇందులో ప్రభుత్వం తరపున 6 గురుసభ్యులు ఉంటారు. వీరిని కలెక్టరు నామినేటు చేస్తారు. మిగతా ఆరుగురు సిబ్బంది తరపున ఉంటారు. గుర్తింపబడిన జిల్లా సంఘాలనుండి వీరిని నామినేటు చేయడం జరుగుతుంది.

ఆశయాలు

జిల్లా మండలి ఆశయాలు దిగువ ఇవ్వడం జరిగింది :

1. సిబ్బంది అనుభవాలను, భావాలను వినియోగించుకోవడానికి వీలుగా అధికారులు, సిబ్బంది మధ్య సన్నిహిత సంబంధాలను ఏర్పాటు చేయడానికి పటిష్టమైన మార్గాలను కలిపించడం.

2. అధికార యంత్రాంగాన్నీ, సంస్థనూ అభివృద్ధి చేయడం, యీ విషయంలో సిబ్బంది సూచనలను పూర్తిగా పరిశీలించడానికి అవకాశాలు కల్పించడం.

3. సిబ్బంది సంక్షేమం.

విధులు

జిల్లాలో ఉన్న జిల్లా ప్రాంతీయ అధికారులు నిర్వహించదగిన సిబ్బంది ప్రయోజనాలకు వర్తించే అన్ని సాధారణ సమస్యల పరిశీలనతో పాటు దిగువ తెల్పిన అంశాలు కూడా జిల్లా మండలి పరిధిలోకి వస్తాయి.

1. ప్రభుత్వ ఉత్తర్వులు, నియమాలు, నిబంధనలను తప్పుడు విధంగా వ్యాఖ్యానించడంవల్ల పనివారలకు కలిగిన యిబ్బందులను వారించడం.

2. క్రమశిక్షణ ప్రామోషన్‌కు సంబంధించి ప్రభుత్వం ఆమోదించిన సిద్ధాంతాలను అతిక్రమించినట్టు సిబ్బంది తరుపున సభ్యులు పేర్కొన్న కేసులను పరిశీలించి యీ సిద్ధాంతాలను, నియమనిబంధనలను కచ్చితంగా అనుసరించడానికి తగిన చర్యలు తీసుకునేందుకు కూడా యీ మండలికి అధికారం ఉంది. అయితే యీ సాధారణ సిద్ధాంతాలను అతిక్రమించకుండా ఉండిన సందర్భంలో వ్యక్తిగత ఇబ్బందులను, కేసులను యీ మండలి పరిశీలించదు.

యోగ్యతగల బీద విద్యార్థులకు విద్యా రాయతీలు

పాఠశాలల్లో, కళాశాలల్లో అంతిమపరీక్ష తరగతిలో చదువుకునే యోగ్యత గల బీద విద్యార్థులకు విద్యారాయతీలను మంజూరు చేసే పథకాన్ని 1964–65 సం. లో కూడా కొనసాగించడానికిగాను రూ. 5,00,000 లు వెచ్చించడానికి విద్యాశాఖ డైరెక్టరుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

ఈ పథకంలోని నియమ నిబంధనలు

ఆర్థికంగా వెనుకబడిన కులాలకు సంబంధించిన విద్యార్థులకు యీ పథకం క్రింద యీ సౌకర్యాలు ఉద్దేశించబడ్డాయి.

ఈ రాయితీ సౌకర్యాలకు దరఖాస్తులను ఆయా ప్రాంతాలకు సంబంధించిన ప్రాంతీయ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టరుకు పంపించాలి. ఈ విద్యారాయతీలు లభించని యెడల చదువు ఆగిపోయే ప్రమాదం ఉన్నట్టు ధృవీకరించబడిన ఆర్థికదుస్థితి గల విద్యార్థులకు మాత్రమే యీ రాయతీలు మంజూరు చేయబడతాయి.

ఈ పథకం ప్రకారం ఎస్.ఎస్.ఎల్.సి., ఒ.ఎస్.ఎస్.ఎల్.సి., ఎస్.ఎస్.ఎల్.సి. బేసిక్; హెచ్.ఎస్.సి; హయ్యర్ సెకండరీ బహూళార్థ సాధక పాఠశాలల్లోని XII తరగతి. పి.యు.సి; బేచలర్, ఆనర్స్

డిగ్రీ తరగతుల్లోని ఆఖరి సంవత్సరపు తరగతులు; పోలిటెక్నిక్కుల్లోని ఆఖరి సంవత్సరపు తరగతులు, వ్యవసాయంలోని ఆఖరి సంవత్సరపు తరగతి చదివే విద్యార్థులకు (బాలురు, బాలికలు) — వారు ఏ కులానికి సంబంధించినవారైనా సరే — ట్యూషన్ ఫీజు, పబ్లిక్ పరీక్ష ఫీజులతో సహా వారి ఖర్చులకుగాను యీ విద్యారాయతీలు మంజూరు చేయబడతాయి.

రాష్ట్ర హజ్ కమిటి

ప్రభుత్వం రాష్ట్ర హజ్ కమిటీని ఏర్పాటు చేసింది. దీని కార్యస్థానం హైద్రాబాదులో ఉంటుంది. యీకమిటీలో 12మంది సభ్యులు ఉంటారు. రాష్ట్ర హోంమంత్రి గానీ, ఆయన గైర్‌హాజరులో ప్రభుత్వ హోంశాఖలోని రెండవ కార్యదర్శిగానీ యీ కమిటీ అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. హైద్రాబాదు పోలీసు కమీషనరు యీ కమిటీకి కార్యదర్శిగా ఉంటారు.

వేతనాల చెల్లింపు చట్టం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పారిశ్రామిక సంస్థలలో యజమానులు ప్రారంభించిన చౌక దుకాణాలలో ఆయా పారిశ్రామిక సంస్థల పనివారలకు అరువుగా ఇచ్చిన వస్తువుల ఖరీదును పనివారల వేతనాలనుండి దిగువ షరతులకు లోబడి మినహాయించుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారం ఇచ్చింది.

1. పనివారలు ఇటువంటి మినహాయింపుకు అంగీకరిస్తూ వ్రాతమూలంగా అందజేయనిదే యీ మినహాయింపులు చేయకూడదు. యీ ఆమోదం సాధారణంగా ఒకసారి తెల్పిన తర్వాత ప్రతిసారి జరిగే మినహాయింపులకు పనివారి ఆమోదం అవసరం ఉండదు. 2. వేతనం చట్టం 7వ సెక్షన్‌క్రింద జరిగిన అన్ని మినహాయింపులతో సహా వేతనం కాలంలో ఆ వ్యక్తి పొందే వేతనంలో సగటు మినహాయింపులు 75 శాతానికి మించరాదు.

మార్కాపురం మునిసిపాలిటి

కర్నూలు జిల్లాలోని మార్కాపురం పంచాయతీని స్థానిక ప్రాంతంతో కలిపి మునిసిపాలిటీగా ప్రభుత్వం ప్రకటించింది. 1964 అక్టోబరు 15 తేదీనుంచి యిది అమలుజరుగుతుంది.

ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల కార్పొరేషన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్‌కు 1964 ఆగస్టు 5వ తేదీనుంచి మూడుసంవత్సరాలవరకు దిగువ తెల్పిన వ్యక్తులను డైరెక్టర్లుగా ప్రభుత్వం నామినేటు చేసింది:

శ్రీ కె. విజయభాస్కర రెడ్డి, నరసింగరావుపేట, కర్నూలు; ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆహార, వ్యవసాయశాఖ కార్యదర్శి ఆహారశాఖ డైరెక్టరు, సహకార సంఘాల రిజిస్ట్రార్, చీఫ్ ఇంజనీర్ (హైవేస్) (ఎక్స్ అఫీషియో)

రాష్ట్ర ప్రణాళికా సలహా సంఘం

రాష్ట్ర ప్రణాళికా సలహా సంఘాన్ని ప్రభుత్వం పునర్నిర్మించింది. ముఖ్యమంత్రి యీ సంఘం అధ్యక్షులుగా ఉంటారు. మిగతా సభ్యులు వీరు :

రాష్ట్ర మంత్రు లందరూ, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ కె. ఎల్. రావు, కేంద్ర ఉపమంత్రి శ్రీ అహమద్ మొహియుద్దీన్, ప్రధాన కార్యదర్శి, ప్రణాళికా శాఖ కార్యదర్శి (సభ్యుడు — కన్వీనరు). శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, ఎం. ఎల్. ఎ, శ్రీ పి. రాజగోపాలనాయుడు, ఎం. ఎల్. ఎ, శ్రీ తెన్నేటి విశ్వనాథం, ఎం. ఎల్. ఎ, శ్రీ వి. పి. రాఘవాచారి, ఎం. ఎల్. సి, శ్రీ పి. సుందరయ్య, ఎం. ఎల్. ఎ, శ్రీ కె. వి. నారాయణ రెడ్డి, ఎం. ఎల్. ఎ, శ్రీ జలగం వెంగళరావు, ఎం. ఎల్. ఎ, శ్రీ మఖ్దూమ్ మొహియొద్దీన్, ఎం. ఎల్. సి, శ్రీ ఎం. ఆనందం, ఎం. ఎల్. సి, ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఉపాధ్యక్షులు, శ్రీ ఖాట్టం శ్రీరామమూర్తి, ఎం. ఎల్. ఎ, శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, ఎం. ఎల్. ఎ, శ్రీ ఎస్. రామాచార్, హైద్రాబాదు రాష్ట్ర వాణిజ్య మండలి అధ్యక్షులు, శ్రీ మాచర్ల రామారావు, లఘుపరిశ్రమల మండలి అధ్యక్షులు, ప్రొఫెసర్ ఎస్. వి. అయ్యర్, డైరెక్టరు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనమిక్స్, శ్రీ ఎం. బి. రావు, అధ్యక్షులు, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్, హైద్రాబాద్, శ్రీమతి శ్యామలాదేవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ మండలి అధ్యక్షురాలు, శ్రీ జె. రఘోత్తమ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు, శ్రీ కాసిన బసవరాజు, చేనేత పనివారల సహకార సంఘం (లిమిటెడ్) (విజయవాడ) అధ్యక్షులు, శ్రీ ఎ. భగవంతరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి అధ్యక్షులు. జిల్లా పరిషత్తులకు జరగవలసివున్న ఎన్నికలు ముగిసిన తర్వాత ఒక జిల్లా పరిషత్తు అధ్యక్షుని ఎన్నుకోవలసి ఉంది. ఆర్మూర్ పంచాయతీ సమితి బ్లాకు అధ్యక్షులు (నిజామాబాదు జిల్లా), బ్రాహ్మణ కొట్కూరు గ్రామ పంచాయతీ అధ్యక్షులు (కర్నూలు జిల్లా), శ్రీ ముప్పన రామారావు, పురపాలక సంఘాధ్యక్షుల మండలి అధ్యక్షులు. తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం మునిసిపాలిటి అధ్యక్షులు, ఉస్మానియా విశ్వ

(మిగతా 78 వ పేజీలో)

గ్రామాలకు విద్యుచ్ఛక్తి సౌకర్యం

ఉద్యోగావకాశాలను విస్తృత పరచేందుకూ, ఆదాయాలను, జీవనస్థాయిని మెరుగు పరచేందుకూ, మరింత క్రమబద్ధంగా, బహుముఖంగా ఆర్థిక స్వరూపాన్ని ఆచరణలోకి తెచ్చేందుకూ వీలుగా చిన్నచిన్న ఊళ్ళలోనూ, గ్రామాలలోనూ సమర్థవంతమైన లఘుపరిశ్రమలను అభివృద్ధిపరచడం అనేది పంచవర్ష ప్రణాళిక ధ్యేయాల్లో ఒకటి. ఈ లక్ష్యసాధనకు పెద్ద అంతరాయం విద్యుచ్ఛక్తి కొరత. విద్యుచ్ఛక్తి లభించినచోట్ల, పెరుగుతోన్న గ్రామీణ ఆర్థికవ్యవస్థ కొత్త అవసరాలను తీర్చగల లఘు పరిశ్రమలను మెల్లమెల్లగా ఆధునిక పద్ధతులమీద నెలకొల్పడానికీ, సాంప్రదాయక పరిశ్రమలను పునరుద్ధరించడానికీ అవకాశం వుంది. దేశంలో అనేక చోట్ల నీటిపారుదల పంపింగుల విషయంలో విద్యుచ్ఛక్తి విరివిగా వాడబడుతున్నది. అధికోత్పత్తికి అనుగుణంగా విద్యుచ్ఛక్తిని వాడవలసిన అవసరం ఏర్పడడమే బహుశా యిందుకు కారణం అనొచ్చు. ఈ విధంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థా ప్రగతికి గ్రామాల్లోని విదుచ్ఛక్తి కీలకపాత్ర వహిస్తోంది.

అఖిలభారత స్వరూపం

ఈ సందర్భంలో దేశమంతటా గల గ్రామీణ విద్యుచ్ఛక్తి స్వరూపాన్నిగూర్చి యిక్కడ ప్రస్తావించడం అప్రస్తుతంకాదనుకుంటాను. తొలి పంచవర్ష ప్రణాళికాంతానికి భారతదేశంలో విద్యుచ్ఛక్తి సౌకర్యం గల పట్టణాలు, పల్లెలు మొత్తం 7,400 వున్నాయి. ద్వితీయ పంచవర్ష ప్రణాళికాంతానికి యీ సంఖ్య 23,000 కు పెరిగింది. తృతీయ పంచవర్ష ప్రణాళికాంతానికి బహుశా యీ సంఖ్య 43,000 లకు పెరగవచ్చు. 500 జనాభా మించిన భారతదేశంలోని ప్రతిగ్రామానికీ, పట్టణానికీ తృతీయ పంచవర్ష ప్రణాళికాంతానికి విద్యుచ్ఛక్తి సౌకర్యం కల్పించబడుతుంది.

అఖిలభారత స్థాయిలో పరిశీలిస్తే, 1959–60 లో ఆంధ్రప్రదేశ్‌లో విదుచ్ఛక్తి సౌకర్యంగల గ్రామాలు, పట్టణాలు అధిక సంఖ్యలో వున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం యివి 595 వున్నాయి. మద్రాసులో 576, బీహారులో 429, పంజాబులో 317 వున్నాయి. 1960–61 లో మద్రాసురాష్ట్రం యీ విషయంలో ముందంజ వేసినట్టు ప్రకటించుకొంది. ఆ సంవత్సరంలో ఆ రాష్ట్రంలోని విద్యుచ్ఛక్తి సౌకర్యం గల పల్లెలు, పట్టణాలు మొత్తం 5961. మద్రాసు, ఉత్తర ప్రదేశ్ (4500)ల తర్వాత యీ విషయంలో ఆంధ్రప్రదేశ్ వస్తుంది. అప్పటికి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుచ్ఛక్తి సౌకర్యం గల పల్లెలు, పట్టణాలు మొత్త 3241 వున్నాయి. ఈ వ్యాసాంతంలోని పట్టికలో ఆ వివరాలు యివ్వడం జరిగింది.

మన రాష్ట్రంలో అభివృద్ధి

తొలి పంచవర్ష ప్రణాళిక ఆరంభమయ్యే నాటికి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుచ్ఛక్తి సౌకర్యం గల పల్లెలు, పట్టణాలు 205 వుండగా ఆ ప్రణాళికాంతానికి 685 కు పెరిగాయి. ద్వితీయ పంచవర్ష ప్రణాళికాకాలంలో అదనంగా 2535 గ్రామాలకు, పట్టణాలకు విద్యుచ్ఛక్తి సౌకర్యం కల్పించబడింది. ద్వితీయ పంచవర్ష ప్రణాళికాంతానికి మొత్తం 3238 గ్రామాలకు, పట్టణాలకు యీ సౌకర్యం వుంది. తృతీయప్రణాళిక మొదటిరెండేళ్ళలోనూ విద్యుచ్ఛక్తి సౌకర్యం కల్పించబడిన గ్రామాలు 1077 (844 ఆంధ్రప్రాంతంలో, 233 తెలంగాణా ప్రాంతంలో) దీనితో 1962–63 సంవత్సరాంతానికి 4315 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సౌకర్యం వుంది. 1963–64 లో మొత్తం 291 గ్రామాలకు విద్యుచ్ఛక్తిని అందజేయాలని లక్ష్యం. 1964 జనవరినాటికి అప్పుడే 114 గ్రామాలకు యీ సౌకర్యం కల్పించబడింది.

గ్రామాలకు విద్యుచ్ఛక్తిని కల్పించడం చాలా ఖర్చుతో కూడుకున్నపని అని తేలుతున్నది. దీనిమీద గ్రామాలనుంచి వచ్చే ఆదాయం ఏ విధంగానూ దీనికయినఖర్చుకు సరిపోలడం లేదు. మొత్తం ఆదాయంలో వ్యవసాయక పనులకు ఉపయోగించే విద్యుచ్ఛక్తిద్వారా లభించిన ఆదాయం 5–6 శాతం మాత్రమే వుంటున్నది.

ఈ సందర్భంలో ఒకవిషయం ప్రస్తావించవలసివుంది. ఆంధ్ర ప్రదేశ్‌లోకన్నా మద్రాసురాష్ట్రంలో గ్రామాలకు విద్యుచ్ఛక్తి సౌకర్యం కల్పించడం చవుక. ఇందుకు కారణం యీ రంగంలో అనేక సంవత్సరాలనుండీ యీ రాష్ట్రం పనిచేస్తున్నది. అదీగాక సుమారు 60 శాతం గ్రామాలకు అప్పుడే విద్యుచ్ఛక్తి సౌకర్యం వుండనే వుంది. ఇందువల్ల చాలాచోట్ల మూలమూలల్లోకి కూడా గ్రిడ్ లైనులు పడ్డాయి.

ఆకారణంచేత యీ రాష్ట్రంలో గ్రామాలకు విద్యుచ్ఛక్తిని పంపడం అట్టే ఖర్చుతో కూడిన పనికాదు. ఆంధ్రప్రదేశ్‌లో 12 శాతం గ్రామాలకు మాత్రమే విద్యుచ్ఛక్తి సౌకర్యంవుంది. అందుచేత జిల్లాల్లోని మూల మూలల్లోని గ్రామాలకు విద్యుచ్ఛక్తిని పంపించాలంటే ఎక్కువదూరం లైనులు వెయ్యవలసివుంటుంది.

విద్యుచ్ఛక్తి మండలి

1948 వ సం. పు విద్యుచ్ఛక్తి సరఫరా చట్టంలోని సెక్షన్ 5 (1) ప్రకారం 1959 ఏప్రెలు 1 వ తేదీనుంచి ఏర్పాటు చేయబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుచ్ఛక్తి మండలి అధ్వర్యంక్రింద యీ రాష్ట్రంలో గ్రామాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేసే పథకం వుంది. విద్యుచ్ఛక్తి సరఫరా, పంపిణీలకు సంబంధించిన పనులనిర్మాణం, నిర్వహణ కొనసాగింపూ, ప్రధాన విద్యుదుత్పాదక కేంద్రాలలో అంతర్భాగంగా లేని డీసెల్ స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ, కొనసాగింపు – యివి యీ మండలి బాధ్యతలు. కొత్తవిద్యుచ్ఛక్తి ప్రాజెక్టులకై పరిశోధన చెయ్యడం, విద్యుచ్ఛక్తిని ఉత్పత్తిచేయడం, ప్రధాన విద్యుద్వాహక లైనులను నిర్వహించడం – యీ విషయాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధ్వర్యం వహిస్తుంది.


5వ పట్టీ
ఆయా రాష్ట్రాలు విద్యుచ్ఛక్తిని సరఫరా చేసిన గ్రామాలు, పట్టణాలు
1959 - 60 & 1960 - 61

రాష్ట్రాలు	1959–60లో	అఖిలభారత స్థాయి (1959–60)	1960–61 లో	అఖిలభారత స్థాయి (1960–61)	మొత్తం గ్రామాలు, పట్టణాలు (1961)
1 ఆంధ్రప్రదేశ్	595	1	3241	3	28,296
2 అస్సాం	7	13	59	15	25,355
3 బీహారు	429	3	1850	6	68,078
4 బొంబాయి	140	8	—	—	54.435
5 గుజరాతు	—	—	797	9	18,584
6 జమ్మూ, కాశ్మీర్	30	11	101	14	7,000
7 కేరళ	159	6	1508	7	4,685
8 మధ్యప్రదేశ్	43	9	434	11	70,236
9 మద్రాసు	576	2	5961	1	18,616
10 మహారాష్ట్ర	—	—	924	8	35,851
11 మైసూరు	203	5	1650	6	26,167
12 ఒరిస్సా	16	12	140	13	48,437
13 పంజాబు	317	4	2030	4	21 049
14 రాజస్థాన్	5	14	140	12	31,931
15 ఉత్తర ప్రదేశ్	156	7	4500	2	1,12,208
16 పశ్చిమ బెంగాలు	37	10	467	10	38 591

6వ పట్టీ
ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ విద్యుచ్ఛక్తి సరఫరా విషయంలో మూడు పంచవర్ష ప్రణాళికల కాలంలోనూ మొత్తం కేటాయింపు, ఖర్చు.

తొలిపంచవర్ష ప్రణాళిక		ద్వితీయ పంచవర్ష ప్రణాళిక		తృతీయ పంచవర్ష ప్రణాళిక	
ఖర్చు (లక్షల రూ. లలో)	ఫలితాలు (విద్యుచ్ఛక్తి సరఫరా అయిన గ్రామాలు)	ఖర్చు (లక్షల రూ. లలో)	ఫలితాలు (విద్యుచ్ఛక్తి సరఫరా అయిన గ్రామాలు)	కేటాయింపు (రూ. లక్షలలో)	ధ్యేయం విద్యుచ్ఛక్తి సరఫరా చేయవలసిన గ్రామాలు
128.00	480	1778.01	2553	925.00	957

మీ ఉత్తరాలపై చిరునామాను సరిగా వ్రాయండి



పూర్తి చిరునామా వ్రాయడంవలన ఉత్తరాలు ఆలస్యం లేకుండా, సరియైనవారికి చేరుతాయి.



తంతి, తపాలా శాఖ

DA 64/250

వానరింద జాతకము

వాజపేయయాజుల రామ సుబ్బారాయుడు

చాలకాలము క్రిందట వారణాసి పట్టణమును బ్రహ్మదత్తుఁడను రాజు పాలించుచుండగా నొక కపి గర్భమున బోధిసత్త్వుండు జన్మించెను. శుక్లపక్ష చంద్రునివలె దినదిన ప్రవర్ధమానుండై యశ్వమువలెఁ బిక్కబలము కలిగి గంగానదితీరమం దాతఁడు వాస మొనరించుచుండెను. ఒకనాఁ డాతఁ డొంటరిగఁ దిరుగుచుండ నానదీ మధ్యభాగమున నొక ద్వీపమును గాంచెను. అట చూపున కింపు నింపు ఫలవృక్షము లెన్నియో కలవు. ముఖ్యముగ ననేకరకముల మామిడిచెట్లు, పనసచెట్లు విరివిగ నుండెను. నది మధ్య నున్న ద్వీపమునకును ఆవలివరికిని మధ్య నొకరాయి యమర్చిన ట్లుండెను. మర్కటములకు నీరన్న భయము. అందుచేత నాగబలుఁడైన యీ బుద్ధకపి యీవలియొడ్డు నుండి యొక్క యెగురున రాయిపై నిలిచి యటులనే మరియొక యెగురున ద్వీపమును జేరు నభ్యాసపాటవమును గాంచెను. అట శాఖాగ్రములయందుఁ దిరుగుచుఁ దనివిఁదీర నానాపక్వ ఫలములను గడుపార మెక్కి సాయంసమయమున నదేప్రకారముగ రెండు గంతులలోఁ దన వాసస్థానమున సుఖముగ నుండెను. ఆ సమయమున నానదియం దొక మొసలి తనభార్యతో వసించుచుండెను. బోధిసత్త్వుఁ డటు నిటు తిరుగుచుండుట జూచి దాని హృదయమాంసమును దినుకోరిక యా మొసలిభార్య కుదయించెను. గాఢతర మగు కోర్కెను తన భర్తతోఁ చెప్పినదే తడవుగ భార్యయందు మోహము కలవాడై మంచిచెడ్డలను గుర్తింపక, యానాఁటి మాయోపాయమున దానినిఁ బట్టుకొని తన కిత్తు నని మొసలి చెప్పె. అట్లు చెప్పి యా రాతిదిగువ భాగమున పొంచి కనురెప్ప మూయక బుద్ధకపి కొరకుఁ గాచుకొని యుండెను. ఒకనాఁడు యథాప్రకారముగ బుద్ధకపి తన పనిని నిర్వర్తించుకొని ద్వీపముపై నిలచి యా పాషాణముపై దృష్టినిలిపెను. ఆ రాయి నీటి పై భాగమున నుండుట గమనించినంతనే అసాధారణ ధీశాలి యగు బుద్ధ మర్కటమునకు వెంటనే యనుమాన ముదయించి ఇట్లని తర్కించెను. 'ఔరా రాయి నీటిపై దేలుటెట్లు? నదిలోని నీటి పరిమాణముగాని రాతి పరిమాణముగాని పెరిగినట్లు కానరాదు. నేఁడు నదిలోని యుదకము హెచ్చుటకాని తగ్గుటకాని కనబడదు. అట్టిపట్టున రాయి నీటిపైకి వచ్చుట సాధ్యమా? రాయి పెరుగుటకు జీవముకలది కాదుగదా?' అని పెద్దయుం బ్రొద్దు తనలోఁ దాను వితర్కించి యొక నిర్ణయమునకు వచ్చి యిట్లూహించె.

తనను వంచింపనెంచి రాతి పైభాగమున నొక మొసలియుండవచ్చును. అందుచే రాయి పైకి లేచినట్లుగఁ గనవయ్యె. బుద్ధిబలము చేతనే యీ మాయను జయింప నిశ్చయించి యెత్తునకెత్తువేసి రాతిని సంబోధించి "పాషాణమా, అహో నేఁడు నీవు పెద్దగఁ గనఁబడుచున్నావు. నిచ్చలు నీపై నాయడుగుందమ్ములు మోపియదేచ్చగ నావలి యొడ్డునకు వెడలుచుండెడిదానను. నేఁడు కదలక మొదలక యెప్పటివలెనే యుండు" మని యెలుగెత్తి పలికె. ఆ వచనంబులకు పాషాణము సమాధాన మీయకుండుటంజేసి మరొక్కసారి గొంతెత్తి "పాషాణమా నేఁడు ఎప్పటివలెఁ బలుకకుంటివేల? ఏల బదులీయకుంటి" వని బిగ్గరగ నరచెను. అంతట మొసలి రాయివలె మొద్దగుటంజేసి ప్రతిదినము పాషాణము సమాధాన మిచ్చుచుండెఁగాఁబోలని భ్రమించి దానును నిత్తెరంగున సమాధాన మిచ్చె. నేనొక మొసలిని. నీ హృదయమాంసమును గోరి యిందు దాగియుంటినని సమాధానమొసఁగె. అంతట వేరొక మార్గము కానకరాదనియుఁ దనను మొసలి వంచించు ననియు బుద్ధ మర్కటము చింతించె. తటాలున నొక యూహ స్ఫురించినంత "ఓ మొసలి స్నేహితుఁడా ఇంతదానికై చింతింపనేల? నీ యాకలిబాధను మాన్పఁజాలునంతటి పుణ్యంబునకంటె వేరొకండు లేదని నచ్చంబలికి తాను వచ్చుసరికి నోరును బూర్తిగా దెరచియుండుమని చెప్పె. అంతట తన కోర్కె నెరవేరినట్లుగ సంతసించి తన విశాల ముఖమును తెరచి కనిపెట్టుకొని యుండెను. మొసలి తన నోరు తెరచినంతనే కన్నులు మూతబడునన్న సంగతి మరచిపోయి యట్టులనే యుండెను. పాషాణమే సమాధానము చెప్పె నని బుద్ధమర్కటము నమ్మెననియు నాతఁడు తెలివితక్కువ

(మిగతా 74 వ పేజీలో)

ఎవరు గొప్ప

'మసూనా'

అనగా అనగా ఆకాశంలో
అంచక్కని ఓ మెరపులలోకం
అక్కడ ఒక గమ్మత్తు జరిగినది
ఆ కథ మీరు వింటారా! 1

మెరపులలోకంలో ఓ రోజున
పిల్లలందరును ఆటలాడుకొని
అలసి ఒక్కచో చేరేరు
అవీ యివీ చర్చించేరు. 2

ఏవో సంగతు లేవో వింతలు
ఎన్నో కబుర్లు చెప్పుకొనుటలో
పిల్లల కొక సందేహం కల్గెను
"ఎల్ల జీవులను గొప్ప ఎవ్వ"రని. 3

ఆ మాటకు ఓ మెరపుల పాప
ఆనందంగా ముందుకు వచ్చి
లోకమ్ములలో గొప్ప ఎవ్వరో
నికరంగా నే చెప్తా నంది. 4

అంతట పాప తళుక్ తళుక్ మని
అన్ని లోకముల సంచరించుతూ
ఎన్నో చూచెను కాని వృథాయే
ఎట్టి విశేషం కనరాదాయెను. 5

ఏ లోకమ్మున ఏదీ నచ్చక
భూలోకమునకు పయనమయింది
రాగానే ఎదురుగ కన్పించిన
రమ్యమైన 'ప్రకృతి' నడిగింది. 6

"ప్రకృతి మాతా! నీకిదె జోత!
నాకొక సందేహం వచ్చెను
అఖిల భువనముల జీవులలోన
అన్నిటి కంటే గొప్ప ఎవ్వరని?" 7

అపుడు ప్రకృతి యిట్లు పలికెను
"గొప్ప యెవ్వరో తెలిసికొందువ?
జలచరం బగు చేప నడుగుము."
అల్లె పాప చేప నడిగెను. 8

'చేపా! చేపా! లోకమ్ములలో
గొప్ప ఎవ్వరే అన్నిటి కంటే?'
'నాకంటే భూజల చరమైన
తాబేలును అడిగితివా చెప్పును'. 9

'తాబేలా! గొప్పెవరో చెప్తా?'
'తగవే ఎట్లా చెప్ప గలమ్!
అయినా జంతువు నొకదా న్నడుగు
అన్నిట గొప్పను పోలుస్తుంది.' 10

గునగున మెరసే బాలిక నడచీ
కొంటెకోతిని చేరి అడిగెను
కోతీ! కోతీ; గొప్ప ఎవ్వరే!'
"నేనే నేనే హ్హహ్హ హ్హహ్హ." 11

మరలా యిట్లా కిచ కిచ మన్నది
'మనిషి నెరుగవా ప్రపంచమందున
మహాఘనుడు ఆ మనుష్యుడేనే'
మనిషిని చేరెను మెరెసే పాప! 12

మెరపు పాపను మనిషి చూచెను
సంబరముపడి పాప నడిగెను
'ఎవరవమ్మా? చిట్టితల్లీ!
ఎచట నివసించేటి దానవు?' 13

మెరపుల లోకం మాది, నే
మెరపుల పాపను మనిషీ!
ఆ ఆకాశం అవలి లోకం
నాదు నివాసం తెలుసా!' 14

'మంచి సంగ తొకటడుగవ స్తిని
మనుష్యుడా అన్నిటిలో గొప్ప?'
'ఏమిటి మనుజుని గొప్పసంగతా
ఏలను మా ఘనతను చెప్పేదేమిటి?' 15

"అదికాదయ్యా! నీవే ఘనుడని
అంతా పలికిరి, అందున, వీనుల
విందుగ నీ కీర్తిని ఆలింపగ
విన్నపంబు లివె" అన మనజుండనె: 16

'ఇదిగో టూకీగా చెప్తా విను
ఈ ప్రకృతిలో కెల్లను, మాకు
జ్ఞానం యిచ్చే మెదడున్నాది'
పాప వెంటనే ప్రశ్నించింది: 17

'జ్ఞానం అంటే ఏమిటి మనిషీ?
జ్ఞానం ఉంటే లాభం ఏమిటి?'
'మంచీ చెడ్డా భేదం తెలిసీ
బ్రతికే శక్తియె జ్ఞానం పాపా!' 18

'జ్ఞానంతో మీ రేమి చేయుదురు?'
'మనుష్యులం మా చుట్టూ వుండే
మహిమలు కలిగిన ప్రకృతి నంతను
మార్చుకొనుచు ఉపయోగిస్తాము'. 19

'అంటే చక్కగ చెప్పవ నేస్తం!
వింటా మీ ఘనకార్యం ఏమో!'
'ప్రకృతిలో అన్నిటినీ మాకై
బాగుగ వినియోగించి సుఖిస్తాం'. 20

'అనగా స్వార్థం అంతా మీదే
అన్నమాట అంతేనా మనిషీ!'
'కాదు కాదు లోకంలో అన్నీ
వృథా చేయకను అనుభవించుతాం.' 21

నీటిమీద ఓడలు నడిపించేమ్
నేలను రైళ్లు పరుగెత్తించేమ్
వినువీధిని విమాన మెగిరించేమ్
విద్యుత్కాంతుల వవళ్ళు చేసేమ్. 22

వేలాదిగ మైళ్ల దూరంలో
వెలువడు మధురస్వనాల వీనుల
విందుగ విని ఆనందిస్తాము
వింతలు కన్నుల ముందుగచూస్తాం 23

మనుజుల గొప్పకు కారణ మేదో
విన్నావా ఓ మెరపుల పాపా!'
''అదియేనా – మీమనుజుల గొప్ప ?''
'అంతేకాదు యింకా విందువ ? 24

అందం అంటే యెంతో యిష్టం
చందురు డంటే సాగరు డంటే
చుక్కలు అంటే సూర్యుం డంటే
మిక్కిలి మక్కువ పడతామ్ పాపా! 25

సెలయేరుల పాటలు విన్నావా ?
జలాల నెన్నడు రుచి చూసేవా ?
కొండలు కోనలు గుహలు తరువులు
పంటచేలు మా నేస్తులు పాపా ! 26

మా కథలన్నీ మా వ్యథలన్నీ
మా విజ్ఞాన విశేషా లన్నీ
మరువక తరుగక భద్రం చేసి
తర తరాల వెలయించు సాధనం 27

తయారు చేసేం అదే పుస్తకం
దయాధర్మముల బోధించేటి
మంచి పుస్తకం మహత్తు ఎంతో
ఎంచి చెప్పగా మాటలు చాలవు. 28

క్రొత్త లోకముల చూచే కోరిక
క్రొత్త యంత్రముల చేసే ఓపిక
మానవ సౌఖ్యం కోసం ఎన్నో
మహిమల నెరిగే యత్నం మాది. 29

సృష్టి నెచ్చుటను లేనివానిని
సృష్టించేము సుందరమైనవి
మామేడలు మీ ఆకాశాన్నే
అందుకొనే ఎత్తైనవి తెలుసా ? 30

వాసన లొలికే రంగులపూలూ
మధుర ఫలాలూ యిష్టం మాకు
మేము ధరించే వస్త్రము లన్నీ
మా మనస్సులను చెప్తాయ్ పాపా !' 31

''అట్లానా ! మరి 'మనస్సు' అంటే''
'ఆలోచించే అంగం మనస్సు
జరిగి పోయిన చిత్రా లన్నీ
జరుగబోవు విచిత్రా లన్నీ 32

మరి మరీ ఆలోచిస్తుంది
మనస్సు. అంతకు మించిన అంగం
హృదయం వుందీ. మెరపుల పాప !'
''హృదయం అంటే నాకు తెలుపవా?'' 33

'హృదయం అంటే మంచిని మెచ్చే
విశాల తత్వం, సకల జీవులను
అభిమానించే దయాపరత్వం
ఆనందించే అమృత తత్వం 34

దేశాన్ని దేశాన్ని కలిపి
విశ్వమ్మును మేల్కొల్పి, నిత్యం
ముందుకు పోయే మహా సాహసం
ఉందీ మా యీ హృదయంలోను 35

విశ్వసృష్టి కారకుడౌ దేవుని
విభూతులను తెలియగనగు విజ్ఞత
మా హృదయాంతరమున వెల్గొందును
మానవజన్మకు సార్థక మదికద !' 36

'అద్భుత మైనది నీదు చరిత్రం
అవును నిజముగా నీకే గొప్ప
అన్ని లోకముల తెలిసి చూడగా
ఎన్నగ నీవే గొప్పవు సుమ్మా ! 37

మానవుడా ఓ మానవుడా !
మహాత్ముడా ! ఓ మహాత్ముడా !'
అంటూ చేరువగా వచ్చింది
అతని కన్నులలో నవ్వింది. 38

ముద్దూ మురిపము చూసే మనిషి
ముచ్చట వేసి మెరపుల పాప
చిన్న బుగ్గ ముద్దాడెను గోముగ
చెంగున దుమికి చిరునగ వొలికి. 39

అంతలోనసే మెరపు కిశోరి
అంతర్ధాన మ్మయ్యిందీ
మనుష్యు లన్నిట గొప్ప వారుఅని
తన వారలతో చెప్పింది, 40

ఇంతే కథ ఓ పాపల్లారా !
ఎట్లున్నది ఓ నేస్తుల్లారా !
మానవ జాతియె గొప్పజాతి అని
మెరపుల పాప చాటింది. 41

నిజమంటారా ? బాలల్లారా !
మీరీఘనతను నిలబెడతారా !
మనిషీ మనిషీ నేస్తం కట్టి
మంచివారుగా సుఖయిస్తారా ! 42

(72 వ పేజీ తరువాయి)

వాఁడనియుఁదలంచి నవ్వుకొని తప్పక తన నోటిలో బుద్ధమర్కటము చిక్కు నని కొండంత యాశతో నతనిని నొకగ్రుక్కలో మ్రింగవచ్చు నని కోతివైపునకే నోరును తెరచి యుండెను. బుద్ధుఁడీ రహస్య మెరింగినవాఁడగుటచే తటాలున నొకగంతు వేసి మొసలివీపుపై వ్రాలి యంతలో నెగిరి యావలి యొడ్డునకుం జేరె. కన్నులు మూత పడి యుండుటచేఁ గోతిని చూచుటకు గాని పట్టుకొనుటకుగాని మొసలికి నవకాశము చిక్కలేదు. తన వీపుపై వ్రాలిన కోతిని పట్టుకొనలేని తన యసమర్థతకు, తెలివి తక్కువ భావనమునకుఁ దనలోఁదానె సిగ్గు పడి తల యెత్త లేక బుద్ధమర్కటముతో నిట్లు పలుకఁదొడంగె. వానరోత్తమా నీ ధీబల మవార్యము. బుద్ధికిం దగిన చతుర తయుఁగలదు. నీవు పన్నిన యుక్తికి సాటి లేదు. నిన్నువంచింపతలంచి నేనే వంచింప బడితి. తాను త్రవ్విన గోతిలో దానేపడినట్లు నేను గావించిన మోసము నన్నే యవమాన పరచినది. పరులను వంచించువాడు తానే వంచింపఁబడునన్న నీతి నీ వద్ద నేర్చు కొంటిని. దయా సత్య ధర్మ త్యాగంబు లెవనివద్ద యుండునో వాని కెన్నం డెట్టి యపజయము రాదు. వానరేంద్రా చతుర్విధ పురుషార్థము లనబడు యీ నాలుగు గుణ ములు నీయం దున్నవి. అని శ్లాఘించి మొసలి తన నివాసస్థలమున కరిగెను.

గీ. సత్య ధర్మ త్యాగ ధృతి లక్షణ లెవని
యందు శోభాయమానమై యతిశయించు
నట్టి వాఁ డెల్ల వేళల నందఁగలఁ డ
ఖండ సామ్రాజ్యవైభవ కాండమెల్ల. ★

ముఖ్యవార్తలు

రాష్ట్రంలో

ఆగస్టు 2 : శ్రీకాకుళంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ భవనానికి ముఖ్యమంత్రి పునాది రాయి వేశారు.

ఆగస్టు 4 : శ్రీ యం. ఆర్. శ్యామరావు, హైద్రాబాదు మేయరుగా ఎన్నిక అయ్యారు.

ఆగస్టు 6 : 1964వ సం॥ ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీల (సవరణ) చట్టాన్ని గవర్నరు ఆమోదించారు.

ఆగస్టు 14 : రు 40.10కోట్ల అంచనా ఖర్చుతో పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రణాళికా సంఘం ఆమోదించింది.

ఆగస్టు 20 : రాష్ట్ర ఆర్థికమంత్రి, హైద్రాబాదులో ట్రజరీ ఆఫీసర్ల సమావేశానికి ప్రారంభోత్సవం చేశారు.

ఆగస్టు 28 : కేంద్ర ఆర్థికమంత్రి ఒకరోజు పర్యటనపై హైద్రాబాదు వచ్చారు.

సెప్టెంబరు 5 : ముఖ్యమంత్రి, సంగారెడ్డిలో పారిశ్రామిక శిక్షణ సంస్థ శాశ్వత భవనాలకు పునాదిరాయి వేశారు.

భారత దేశంలో

ఆగస్టు 3 : డచ్ విదేశాంగ మంత్రి డాక్టర్ జోసఫ్ లన్స్ 4 రోజుల పర్యటనపై ఢిల్లీ వచ్చారు.

ఆగస్టు 16 : వస్త్ర పరిశ్రమకు సంబంధించి రెండవ వేతన సంఘాన్ని భారత ప్రభుత్వం నియమించింది. శ్రీ కె. భీమ శంకరం యీ సంఘం అధ్యక్షులు.

ఆగస్టు 17 : జవాహర్ లాల్ నెహ్రూ స్మారకనిధి జాతీయమండలి ప్రథమ సమావేశం న్యూఢిల్లీలో జరిగింది.

ఆగస్టు 18 : బొకారో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పే విషయంలో సాంకేతిక చర్చలు జరిపే నిమిత్తం 21 మంది సభ్యులు గల రష్యా ఉక్కు ప్రతినిధి వర్గంవారు న్యూఢిల్లీ వచ్చారు.

ఆగస్టు 21 : బెంగళూరులో వ్యవసాయ విజ్ఞానశాస్త్ర విశ్వవిద్యాలయం భవనానికి ఉపాధ్యక్షులు పునాదిరాయి వేశారు.

ఆగస్టు 28 : రాష్ట్రపతి, గయాలో మగదలా విశ్వవిద్యాలయం భవనాలకు పునాదిరాయి వేశారు.

సెప్టెంబరు 1 : ప్రధానమంత్రి, న్యూఢిల్లీలో పునర్నిర్మించబడిన జాతీయ షిప్పింగ్‌బోర్డు సమావేశానికి ప్రారంభోత్సవం చేశారు.

సెప్టెంబరు 7 : లోకసభ వర్షాకాల సమావేశం ప్రారంభమయింది.

అణు పరిశోధనా రంగంలో ఇతోధిక సహకారం అందజేసే ఒప్పందంపై భారతదేశం, యు. ఎ. ఆర్. సంతకాలు చేశాయి.

సెప్టెంబరు 8 : కేరళలో శ్రీ ఆర్. శంకర్ నాయకత్వానగల కాంగ్రెసు మంత్రివర్గం ఓడింపబడింది.

విదేశాలలో

ఆగస్టు 7 : దక్షిణ వియత్నాంలో అత్యవసర పరిస్థితి ఏర్పడినట్టు ప్రకటించారు. పోలెండ్ అధ్యక్షులు శ్రీ అలగ్జాండర్ జవాఢ్కి వార్సాలో మరణించారు.

ఆగస్టు 18 : శ్రీ చార్లెస్ హెలావ్, లెబనాన్ అధ్యక్షులుగా ఎన్నిక అయ్యారు.

ఆగస్టు 21 : మూడవ కామన్‌వెల్త్ విద్యా సమావేశం అటావాలో ప్రారంభమయింది.

సెప్టెంబరు 1 : కామన్‌వెల్త్ ఆర్థిక మంత్రుల సమావేశం కౌలాలంపూర్‌లో ప్రారంభమయింది.

సెప్టెంబరు 3 : మలయేసియా అంతటా అత్యవసర పరిస్థితి ఏర్పడినట్టు ప్రకటించారు.

సెప్టెంబరు 5 : రెండవ అరబ్ జాతీయుల సమితి సమావేశం అలెగ్జాండ్రియాలో ప్రారంభమయింది.

సెప్టెంబరు 11 : భారతదేశానికి సోవియట్ రక్షణ పరికరాల సరఫరాలకు సంబంధించిన ఒప్పందంపై భారతదేశం, సోవియట్ యూనియన్ సంతకాలు చేశాయి.

రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్, 9 రోజుల అధికార పర్యటనపై మాస్కో విచ్చేశారు.

చిన్నారి పాటలు

(గేయ సంకలనం)

సంపాదకులు. శ్రీయుతులు కవుల ఆంజనేయశర్మ, అలపర్తి వెంకట సుబ్బారావు: ప్రచురణ: రామా బాలానంద సంఘ ప్రచురణలు, శాఖ వీధి, అనకాపల్లి (విశాఖజిల్లా); వెల: 60 పైసలు.

తెలుగు సాహిత్యంలో ఆధునిక గ్రంథాలలో వివిధ దృక్పథాలు కల కవితా సంకలనాలు వెలువడినాయి కాని బాల సాహిత్యానికి సంబంధించి నగేయసంకలనాలు చాలా అరుదు. ఈకృషికి దోహదంచేసిన యీ సంకలన సంపాదకులు అభినందనీయులు.

ఇందులో 20 గేయాలు ఉన్నాయి. ఆంధ్రదేశంలో వివిధ ప్రాంతాల నున్న రచయితల గేయాలు యిందులో ముద్రించబడినాయి. ఉన్నత తరగతి సాహిత్య సృష్టి కంటె, భావి పౌరులైన పిల్లల మనస్తత్వం క్షుణ్ణంగా అర్థంచేసుకుని వారిని తీర్చిదిద్దగల సాహిత్యానికి ప్రత్యేక విలువ వుంటుంది. సర్వకాలాల్లో ఇటువంటి మానసిక తత్వం దృష్టిలో పెట్టుకుని సంపాదకులు వివిధ రచయితల గేయాలు ఎన్నికచేసి యిందులో ముద్రించారు.

ఈ గేయ సంకలనం శారదాస్తుతితో ప్రారంభమయింది. అక్షరాభ్యాసం పొందిన బాలలు మొదట శారదాస్తుతి నేర్చుకుంటారు. ఆ స్తుతి వారి హృదయాలలో నాటుకున్న వైఖరి ననుసరించి వారి భావి చదువు సంధ్యలు వెల్లివిరుస్తాయి. కవుల ఆంజనేయ శర్మగారి ఈ గేయం రమణీయంగా వుంది.

సమస్యలు, చిట్కాలు, నీతులు, సూక్తులు, దేశభక్తి వచనాలు నిండిన యీ గేయాలు బాలలందరూ చదివి ఆచరణలో పెట్టవలసిన భావాలతో నిండి ఉన్నాయి. వివిధ రచయితల రచన, శైలి, సులభంగా సున్నితంగా ఉన్నాయి. అన్ని గేయాలతో పాటు దేశభక్తి ప్రపూరితమైన గేయాలు విరివిగా యిందులో చేర్చడంవల్ల యీ బాల గేయసంపుటి నేటి పరిస్థితుల్లో విద్యార్థి లోకానికి ఎంతో ప్రయోజనకారి కాగలదు.

— *పోతుకూచి సాంబశివరావు*

'జీవనజ్యోతి'

[గ్రంథకర్త "భాషా ప్రవీణ" శ్రీ కడెము వేంకటసుబ్బారావు, తెలుగు పండితుడు, బండ్లమూడి బాపయ్య హిందూ హైయ్యర్ సెకండరీ స్కూల్, వేటపాలెము — బాపట్ల తాలూకా. వెల రూ. 1—00]

గ్రంథకర్త 1960 నాటికే తామప్పుడప్పుడు వ్రాయుచు వచ్చిన పద్య, గేయాలను క్రోడీకరించి 'జీవనజ్యోతి' పేరిడిరి. 'శివైక్యమందిన తమ పితృపాదుల స్మృత్యర్థము సచ్చిదానందమయుఁడైన పరమేశ్వరునకు భక్తితో సమర్పింప బడిన' దని వ్రాసికొనినారు.

రచయిత ఆదిలో ఈ విధంగా చెప్పుకొన్నారు.

ఈ జగము ప్రేమమయము నిర్వ్యాజమైన
భావశబలతనుండి ఉప్పతిలు రసము,
అదియె దొరలి గుమంగుమలాడు కాన
రాగము జనించు శుద్ధ విరాగికైన.'
'క్రౌంచమిధున వియోగశోక ప్రవృత్తి
మౌనికి రసోదయము కావ్యగానమయ్యె,
సన్నివేశ సందర్భనోజ్జ్వలుని వాక్కు
ప్రభ లొలుకు జపాసన్నిధి స్ఫటికమట్లు'

గ్రంథ సమీక్ష

ఇంకా ఈ ప్రపంచ రంగస్థలానికి నేను ప్రేక్షకుఁడ ననీ, పాత్రనై అభినయ భావ చిత్రగతులను అర్థము చేసికొనే విద్యార్థి ననియు, నా తెలుఁగుతల్లి చేతి రత్నాల కడెము (ఇంటిపేరు కడెమువారు) అని వ్యంగ్యవాసనా విలసితంగా చెప్పారు. ఇంకా ఈ కావ్య కన్యకకు తల్లిదండ్రులు పెట్టని భూషణమైన కబరీభరంలాగా శ్రీజొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారి నాతిదీర్ఘమూ, నాతిహ్రస్వమూ అయిన పీఠిక మధుర మంజులమై, గుణోత్తరమై అంతరశోభా, లావణ్యాలను వెలారుస్తూ ఉంది.

నైసర్గికమైన ప్రతిభ, బహువిశ్రుతమైన శ్రుతమూ, (వ్యుత్పత్తి) అమందమైన అభియోగమూ (అభ్యాసము) ఆకళించుకొన్న కవిశేఖరుని కలంనుండి జాలువాఱిన దీ కవితా స్రవంతి. 'ఆత్మకు రూప,వయో, లింగములు లేవు. అయినను సాధకులు దానిని గుర్తించి రూపాదిక మేర్పరచుకొనుచునే యున్నారు' అని కవి ఆత్మతత్త్వాన్ని ప్రియసఖిగా భావించి:

'ఓ సకియ నీ కొరకు చేసెదను జపము

ఫలసిద్ధి యగువఱకు వదల నీ తపము.

అని గేయాలలో వివిధ వృత్తాలలో కవి పరమాత్మ తత్త్వాన్ని సంబోధిస్తాడు, వేడుకొంటాడు, మ్రొక్కుతాడు. అనేకవిధాల భావించి మురిపించాడు. 'పరితోష భరితోద్వేగముతో గూడిన దీక్ష మహత్తర శిల్పమును సృజించును. ఈ శక్తి నందినవాడు తన శబ్దములలో 'జీవన జ్యోతిని' తేజరిల్ల జేయును— అని శ్రీ సత్యనారాయణమూర్తిగారన్నట్లు ఈ కవికుమారుని భావనగరిమ మహోదాత్తమైంది. ప్రకృతికి కవి భాష్య ప్రణేత కదా! సముచిత రస భావాలంకార సృష్టికి, అపూర్వ భావ శబలితమైన శైలికి కొన్ని ముచ్చుటునకలు.

నేను పుష్పం బైన నీవు గంధమవు
నేను శబ్దం బైన నీవు నర్థమవు
దేహాదికము నేను తెలివియే నీవు
జల దఖండము నేను చంచలవు నీవు
రంగు రంగుల పూలరాసిని నేను
దండ గ్రుచ్చెడి పట్టుదారంబు నీవు

ఈలా పూవు, తావి; శబ్దము, అర్థము; దేహము, జ్ఞానము; మేఘము, మెఱుపుతీవ; స్వ, పర తత్త్వాలకు చక్కగా రూపణం చేయబడింది.

ఎల్లప్పుడూ వ్యధాపన్నమైన బ్రతుకు మొక్కకు దయామృతాంబుధి యేతమెత్తినావు. ఇక హృదయ కోరకాన్నిగూడ వికసింపఁజేసి లోక మంతట దానిని గుబాళింప నిమ్మను పద్యఖండికను పరికించండి.

సతతమును వ్యధా పన్నమౌ బ్రతుకు మొక్కకిటు దయామృతాంబుధి యేతమెత్తినావు
హృదయకోరక మిక వికసింపఁజేసి
లీల లోక మంతట గుబాళింపనిమ్ము.

యతి ప్రాసలకై పొల్లుపదాలను వాడని యీ రచయిత శైలి కెన్నో యుదాహరణాలను చూపించవచ్చును.

నను మాణిక్యవిపంచి చేసికొనుచున్
నా సప్త ధాతూత్కరం
బును హస్తాంగుళి మీటు
చున్ మధురతాం
భోరాశి సృష్టింతువే? (8 వ పేజీ)

మొలక నవ్వొలయు వెన్నెలగాయు కనులతో
తలపున వలపు క్రొందరగలెత్త (9 వ పేజీ)

ఈ భావ మెంత వినూత్నమో తిలకించండి.

ఆకసంబొక గడియార మయ్యెనీకు
అందు ద్వాదశరాసులే అంకెలయ్యె
చంద్రుఁ డను పెద్దముల్లు మాసమ్ము దెలుపు
అరుణుఁ డను చిన్నముల్లు వత్సరము దెలుపు

దీనిలోని సుమసౌరభంవలె గుబాళించెడి భావవిశేషాన్ని ఆలకించండి.

ఎప్పటిదానవో అయిన,
నిప్పటి దానవె; ముద్దరాలివై
ఎప్పటికప్పుడున్ నవ న
వైక రసోజ్జ్వల దివ్య భావనల్
కప్పురమట్లు గుప్పెదవు;
కాల వయోగతు లేమిలేని నీ
వొప్పుల కుప్పవే, అమృత
మొల్లెడి చక్కెరలప్పవే, ప్రియా? (19వ పేజీ)

తత్త్వఝురి కవితాఝురి తరగలెత్తి
నా హృదయపాత్ర నింపు ననారతంబు
నేను కవినః తాత్త్వికుఁడనా? యెవరినైన
నా చిర నవీనవాంఛ ఆనందసీమ (23వ పేజీ)
....

స్థిరతర నంద నైక జగ
తిన్ నవతా కవితాసుధా పరి
స్ఫురితా మనోజ్ఞజీవనము
పూచి గుమంగుమలాడ నుందమే! (25వ పేజీ)

కవితా కల్పనావిజ్ఞానికి ప్రతీక లనదగినవి.

కొండరా యొక్కటి గండకీ నదిలోన
అరిగి సాలగ్రామ మైన యట్లు, (25 వ పేజీ)

మెరుగులు తురంగలించెడి మేలి మయ్యొ 33 వ పేజీలోని 1. తీయని దానవై. 2. ఏలకి గుత్తు లూగు. 3. వేకువ గాలి యీల 4. చీకటి ఆకుదీవియలు అను నాలుగు పద్యాలు సానబట్టిన రతనపు శలాకలే. పరతత్త్వమును—

'ఐదువరాలివై జగమునందున రాగ రసోదయక్రియన్ ప్రోది యొనర్చుచుందు' వని మధురాతి మధురంగా విశ్లేషించి చెప్పాడు.

వేమనాదుల యడుగులవెంట చనుచు
సాధ్యమును సహచరి యంటి సరసులార!
జిలుగు కైత చక్కెరచిల్క జేసినాడ
ఎచట రుచి చూడగలరొ! మీ యిష్ట మింక.'

అని కవి నుడివి

'జగము మొక్కైన పూచురోజాను నేను
అందచందాలు—ఇంక నన్నడుగనేల?
జ్ఞానసౌరభ మొక కొంత గలుగువాడ.
నని చెప్పుకొనివాఁడు,

రచయిత 'భాషా శాస్త్రమునుబట్టి భాషా పరిణామదశలు పరికించినకొలది పట్టుదల సడలిదానికి తోడు పూర్వకవుల ప్రయోగ రీతులగ మనించి కవితావేశముచే అందందు దొరలిన తత్సమ సంధులను దిద్దలే'దనిరి. నిలకడ వలసిన కృతి సలక్షణ మైననే సర్వథా రాణ కెక్కునుగదా?

ముగ్ధ మోహన కళా ముగ్ధ భావము వీడు
చున్న యీ శతపత్ర సుంద రెవరు
హేమాద్రి చక్కెరశృంగ మైనావు.

అందీ అందని (అఖండయతులు)

పౌనః, పున్య వికాస మందుచును
ప్రాయుంటి మీనాటికిన్
ద్రే గంట పాలు పొంగించినావు
.............................వి
భ్రాజిత దక్షిణా నిలమవై
మూగ గొంతుకన్
లే జిగురాకు బోధ మధురించితివే
మధు నించితివే కావచ్చునేమో?

మొత్తానికి 'జీవనజ్యోతి' తేనెసోనలు పారిన రీతి సరళ శైలిలో జాలు వారిన గేయాలు నేటి మన నవ సమాజ వ్యవస్థకు అమృతపు గుళికలు

14 వ గేయం

జననము చేతను జగతీధాత్రికి
జను లందఱును సమానులు గారా?
మరణము చేతను శ్మశానవాటికి
మనుజులందరు సమానులు గారా?
ద్రాక్షా చర్వణ రసికులు వాని బీజముల నెవ్వరు నిష్ఠీవనము చేయుదురు?

ప్రతి పద్యమూ పౌనః పున్యముగా చదివి యానందింపదగిన దీ 'జీవన జ్యోతి'.


పెరవలి లింగయ్యశాస్త్రి

(68 వ పేజీ తరువాయి)

విద్యాలయం ఉపాధ్యాయులు, శ్రీ జి. సంజీవ రెడ్డి, ఐ. ఎన్. టి. యు. సి. అధ్యక్షులు, హైద్రాబాదు, ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి వ్యవహారాల మండలి అధ్యక్షులు, శ్రీ జనంపల్లి రామేశ్వరరావు, ఎం.పి, శ్రీ వల్లూరి బసవరాజు (మాజీమంత్రి), శ్రీ వేముల కూర్మయ్య (మాజీమంత్రి).

వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలులో అనధికార సంస్థలకుగల పాత్ర, ప్రణాళికను, అమలు పరచవలసిన ఘట్టాలు మొదలైన ప్రణాళికా సంబంధమైన ప్రధాన అంశాల విషయాలలో ప్రభుత్వానికి సలహా లివ్వ దానికి యీ సంఘం ప్రధాన సలహా సంస్థగా వ్యవహరిస్తుంది. ముఖ్యంగా ప్రణాళికా కార్యక్రమాలలో ప్రజలు పాల్గొనడం, సహకారాన్నివ్వడానికి సంబంధించి తీసుకోవలసిన చర్యలను యీ సంఘం సిఫార్సు చేస్తుంది. పురోగతిని సమీక్షిస్తుంది. రాష్ట్ర ప్రణాళికలు, జిల్లా ప్రణాళికలు, బ్లాకు ప్రణాళికల స్థాపనకు సాధారణ విధానాలను గురించి కూడా ఇది ప్రభుత్వానికి సూచనలు చేయవచ్చు.

ఈ సంఘం గడుపు, అలాగే సభ్యుల పదవీకాలం 1964 ఆగస్టు మొదటి తేది నుంచి రెండు సంవత్సరాలు.



"అవును సుమా ! యిప్పుడు జ్ఞాపకానికొచ్చింది — ముక్కు పొడుం డబ్బా మర్చిపోయానని."



"వారే మా కొత్త డాన్సు మాస్టారు."

(కార్టూన్లు : అబ్బూరి గోపాలకృష్ణ)

క్రొత్త ఆకర్షణలు

ఈ నెలనుంచి "ఆంధ్రప్రదేశ్," క్రొత్త ఆకర్షణలు, అదనపు శీర్షికలతో వస్తూంది.

"జీవితహాసలేశాలు" అనే క్రొత్తశీర్షిక త్వరలో పరిచయం చేస్తున్నాం. నిత్య జీవితంలో హాస్యాన్ని, ఆసక్తిని కలిగించే సంఘటనలు ఇందులో ప్రచురించబడ్తాయి. ఈ విధమైన రచనలను ఆహ్వానిస్తున్నాం. ప్రచురితమయ్యే రచనలకు పారితోషికం ఇవ్వబడుతుంది. ఒక్కొక్క రచన 200 పదాలకు మించిఉండరాదు.

(8వ పేజీ తరువాయి)

స్ఫూర్తిశ్రీ వంటివారు కనిపిస్తారు. వారు చారిత్రక, పౌరాణిక కథావస్తువులను ఆధునిక జీవిత విధానానికి అనుగుణంగా వ్యాఖ్యానిస్తున్నారు.

'కరుణశ్రీ' తన తేనెలూరించేశైలి, పదలాలిత్యం, దయార్ద్ర భావాలతో తనకొక ప్రత్యేకస్థానం ఏర్పరచుకున్నారు. స్వాతంత్ర్య ఉద్యమం రోజుల్లో నిష్కామ కర్మను ప్రోత్సహించే విధంగా గీతా సందేశాన్ని తన "విజయశ్రీ" లో వ్యాఖ్యానించారు. సానుభూతి, విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని అలవర్చుకోవడమే జీవితంలోని లొసుగులకు తగిన మందని ఆయన ప్రబోధించారు.

వచన రచయితలు

ఆంధ్రదేశంలో సగానికి సగం మంది కవులని తరచుగా అంటుంటారు. ఒక విధంగా ఇది యథార్థమే. ఎందుచేతనంటే బెంగాలీలవలెనే ఆంధ్రులుకూడా ఉద్రేక స్వభావులు. అగ్గిలాంటివారు. అయితే ఆధునిక తెలుగు సాహిత్యంలో చెప్పుకోదగిన విశేషం వచన ప్రక్రియల అభివృద్ధి. వీరేశలింగం పంతులుగారు ప్రయోజనాత్మక వచన రచనను అభివృద్ధిపరచి అనేక వచన సాహితీ ప్రక్రియల వికాసానికి మార్గదర్శకమైన కృషి జరిపారు. గురజాడ అప్పారావుగారు వ్రాసిన "దిద్దుబాటు" అనే కథానికలో ఆధునిక కథానికా లక్షణాలన్నీ కనిపిస్తాయి. గిడుగు రామమూర్తిగారి అవిరళ కృషి ఫలితంగా ఒక కొత్త రచనాపద్ధతి ప్రచారంలోకివచ్చి నిలద్రొక్కుకుంది. పత్రికలు, సభావేదికలు, రేడియోలలో వ్యావహారిక భాషకు ప్రాధాన్యం వచ్చింది. వచనంలో స్వాభావికమైన రచనల అభివృద్ధికి ప్రతిబంధకమైన కృత్రిమత్వం, పాండితీ ప్రకర్షల స్థానాన్ని శక్తివంతమైన, సుసంపన్నమైన, సజీవమైన వ్యావహారిక భాష ఆక్రమించింది.

వ్యావహారిక భాషలో చక్కని, నాటకం వ్రాయవచ్చుననే విషయాన్ని గురజాడ అప్పారావుగారి 'కన్యాశుల్కం' నిస్సంశయంగా ఋజువుచేసింది. భమిడిపాటి కామేశ్వరరావుగారి ప్రహసనాలు రంగస్థలంపై అద్భుత విజయాలు సాధించాయి. మనలను మనమే హేళనచేసుకునే సంప్రదాయాన్ని ఏర్పరచి, తద్వారా మనలోని లోపాలను సరిదిద్దుకునే పద్ధతికి అవి అంకురార్పణ చేశాయి. తిరుపతి వేంకట కవుల "పాండవోద్యోగ విజయాలు," చిలకమర్తివారి "గయోపాఖ్యానం" వంటి పౌరాణిక రంగస్థల నాటకాల ప్రదర్శనం విరివిగా ప్రచారంలో వున్నప్పటికీ ఆధునిక యుగంలో సాంఘిక నాటకాల అభివృద్ధికూడా జరిగింది. ఆత్రేయ "ఎన్. జీ. ఓ." బహుళ ప్రచారం పొందింది. జీవితంతో పోరాడుతున్న మధ్య తరగతి గుమాస్తా ఇక్కట్లను సహజంగా, హృద్యంగమంగా చిత్రించడమే ఈ నాటకం విజయానికి కారణం. కె. గంగాధరరావు, భమిడిపాటి రాధాకృష్ణగార్ల నాటికలు ఆంధ్రనాటక రంగానికి అనువైనవి కావడంవల్లా, ఔత్సాహిక నటకులు ప్రదర్శించడానికి అందుబాటులో వుండడంవల్లా చాలా ప్రశస్తి పొందాయి. వేదం వెంకటరాయ శాస్త్రిగారి "ప్రతాపరుద్రీయం" శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి 'బొబ్బిలియుద్ధం' వంటి చారిత్రక నాటకాలు ఇప్పటికీ ప్రదర్శించబడుతూ వున్నాయి. వెలూరి చంద్రశేఖరంగారి "కాంచనమాల" గ్రీకు విషాదాంత నాటకాల ఫక్కీలో వ్రాసిన అద్వితీయమైన నాటకం. బౌద్ధమత సంబంధమైన గాథ, యీ నాటకంలో చక్కగా నిరూపించబడింది.

కథానికలు

కథానికా ప్రక్రియ క్రమక్రమంగా అభివృద్ధిపొంది ఆశ్చర్యకరమైన విజయం సాధించింది, పాలగుమ్మి పద్మరాజుగారి "గాలివాన" అంతర్జాతీయ బహుమతి పొందింది. బుచ్చిబాబు, గోపీచంద్, కుటుంబరావునంటి ప్రసిద్ధ రచయితల చేతుల్లో ఈ ప్రక్రియ కొత్త రూపురేఖలు దిద్దుకున్నది. పాఠకులను ఏమాత్రం అవస్థపెట్టకుండానే, గేయాలలో కలిగే ఆనందానుభూతినీ, నాటకంవల్ల కలిగే పులకరింపును కథానిక కలిగిస్తుంది. సహృదయతను విస్తృతీకరింపజేయగల అంతర్దృష్టిని కూడా కథానిక పెంపొందిస్తుంది. ఈ కారణంవల్లనే ఈ ప్రక్రియ పత్రికా ప్రపంచంలో ప్రధాన స్థానం వహించి అధికాధికంగా పఠితలను ఆకర్షిస్తున్నది. కథానికా ప్రక్రియ వికాసానికి వేలూరి శివరామశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, 'కరుణాకుమార', మునిమాణిక్యం, దీక్షితులు, చలం మొదలైన ప్రముఖులంతా తమ తమ ప్రత్యేక కృషి ద్వారా దోహదం చేశారు. కథానిక పాఠకులను విశేషంగా ఆకర్షించడానికి వస్తువు, శైలిలోగలవైవిధ్యమే కారణం. యువతరంలో మంచి కథకులుగా ప్రత్యేకంగా పేర్కొనదగినవారు రాచకొండ విశ్వనాథశాస్త్రి, మధురాంతకం రాజారాం, అవసరాల రామకృష్ణారావు, హితశ్రీ ప్రభృతులు. మామూలు పద్ధతిలో అమ్మాయిలు, అబ్బాయిల కలయికల కథలను వదలి కొత్త పంథాలో, కొత్త వస్తువుతో కథలు వ్రాయడమే వీరు ఉత్తమ కథకుల జాతిలో చేరడానికి కారణం.

సాహిత్య విమర్శ

సాహిత్య విమర్శలో కట్టమంచి రామలింగారెడ్డిగారు తులనాత్మక విధానాలను ప్రవేశపెట్టారు. అపురూపమైన విమర్శనాత్మక, రసాస్వాదక, సౌందర్యోపాసక దృష్టితో ఆయన పింగళి సూరనకృత "కళాపూర్ణోదయం," కవిత్రయం వారి "మహాభారతంలోని సొగసులను ఎత్తి చూపించారు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు వేమనపై వ్రాసిన విమర్శక గ్రంథం, ఆధునిక విమర్శా సాహిత్యంలో అనుపమానమైనది. పింగళి లక్ష్మీకాంతం, ముట్నూరి కృష్ణారావుగార్లు వ్రాసిన వ్యాసాలు సాహిత్యవిమర్శను సుసంపన్నంచేశాయి. కురుగంటిసీతారామయ్య, పిల్లలమర్రి వేంకట హనుమంతరావుగార్లు వ్రాసిన "నవ్యాంధ్ర సాహిత్యవీధులు" మార్గదర్శకమైన సాహితీ కృషి. ఇది ఆధునిక రచయితకూ, సాంఘిక పరిస్థితులకూ మధ్యగల పరస్పర సంబంధాన్ని గురించి చర్చించింది. ఆధునిక యుగంలోని ప్రసిద్ధ రచయితల కృషిని యీ గ్రంథం నిష్పాక్షిక దృష్టితో పరిశీలించింది. "శ్రీవాత్సవ" విమర్శనా వ్యాసాలతో ప్రపంచంలో ప్రకటించబడుతున్న వివిధ ఆలోచనా రీతులను ప్రచారం చేయడం, రసపిపాసను పెంపొందించడం

పట్ల ఆయనకుగల ఉత్సాహం ప్రదర్శితమవుతుంది. అయితే ఆయన అప్పుడప్పుడు పరుషంగా, ఘాటుగా విమర్శిస్తుంటారు. పత్రికా రచయితల రచనా పద్ధతి శీఘ్రంగా అభివృద్ధి జెందింది. వివిధ విషయాలు, అంశాలపై వ్యాసాలు వ్యాప్తిలోకి వచ్చాయి. నార్ల వెంకటేశ్వరరావుగారు ఆకర్షణీయమైన నూతన శైలిని అవలంభించి ప్రసిద్ధి జెందారు. సూటిగా, స్పష్టంగా చెప్పడం ఆయన రచనలోని ప్రత్యేకతలు. ఆయన వ్యాసాలలో ప్రసిద్ధ ఆంగ్ల వ్యాసకర్తల రచనల్లో వుండే సొంపులన్నీ కనిపిస్తాయి. ముట్నూరి కృష్ణారావుగారి వ్యాసాలవలెనే నార్ల వ్రాసిన వ్యాసాలుకూడా ప్రజాభిప్రాయాన్ని మలచడంలో గొప్ప ప్రభావం కనబరిచాయి.

పరిశోధన

ఆంధ్రప్రదేశ్‌లోని మూడు విశ్వవిద్యాలయాలు పరిశోధనకు పూర్తి ప్రోత్సాహాన్ని యిస్తున్నవి. దివాకర్ల వెంకటావధానిగారు నన్నయ పూర్వయుగంగురించి గొప్ప పరిశోధనచేశారు. జి. వి. కృష్ణారావుగారు కళాపూర్ణోదయ కావ్యాన్ని నూతన దృక్పథంతో పరిశీలించారు. ఎస్. వి. జోగారావుగారు యక్షగానాలనుగురించి ప్రయోజనాత్మకమైన పరిశీలన జరిపారు. చిరకాలంగా ఉపేక్షించబడివున్న జానపద సాహిత్యం గురించి బి. రామరాజుగారు అమూల్యమైన పరిశోధన గ్రంథంవ్రాశారు. కె వీరభద్రరావు, సి. నారాయణరెడ్డిగార్లు ఆధునికాంధ్ర రచయితల రచనలలోని సాంప్రదాయకమైన, ప్రయోగాత్మకమైన అంశాలను పరిశోధించి, వీళ్లపైగల ఇంగ్లీషు సాహిత్య ప్రభావాన్ని గురించి కూడా చర్చించారు. తెలుగు సామెతలను గురించిన ఉద్గ్రంథం వెలువరించినందుకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీని అభినందించవలసి వుంటుంది. పరిశోధన జరిపే వారికి ఈ సూచీ గ్రంథాలు ఎంతో ఉపయోగపడతాయి. ఈ విషయంలో భద్రిరాజుగారు జరిపిన కృషి గణనీయమైనది. అక్షరాస్యత పెంపొందడంవల్ల వచనంలో అనేక రకాల రచనలు వేగంగా వృద్ధిజెందాయి. మల్లంపల్లి సోమశేఖరశర్మగారి చారిత్రక వ్యాసాలు సాధారణ విజ్ఞానశాస్త్రంపై వసంతరావు వెంకటరావు, కొడవటిగంటి కుటుంబరావుగార్లు వ్రాసిన వ్యాసాలు, ప్లాటో తదితరులపై జి. వి కృష్ణారావుగారు లిఖించిన తత్వశాస్త్ర వ్యాసాలు, వావిలాల గోపాలకృష్ణయ్యగారి రాజకీయ వ్యాసాలు వచన సాహిత్యం యొక్క వైవిధ్యాన్ని వెల్లడి చేస్తున్నాయి.

రచయిత్రులు

సాహిత్యరంగంలో అనేకమంది స్త్రీలు ప్రవేశించడం ఆధునిక కాల సాహిత్యాభివృద్ధిలోని మరొక విశిష్టత.

వ్యాసరచయిత్రిగా మాలతీచందూర్ గణనీయమైన విజయం సాధించారు. అన్ని రకాల విషయాలపై ఆమె ఆసక్తి జనకంగా ఆత్మీయత వెల్లివిరుస్తున్నట్లుగా వ్రాస్తారు. ఆచంట శారదాదేవి, సరళాదేవి, సులోచనారాణి, జానకీరాణి, వాసిరెడ్డి సీతాదేవి, రామలక్ష్మి ఆరుద్ర, వి. యస్. రమాదేవి, ఇల్లిందల సరస్వతీదేవి, కనుపర్తి వరలక్ష్మమ్మ ప్రభుతులవల్ల కథానికా సాహిత్యానికి పరిపుష్టి చేకూరింది. అదేవిధంగా లక్ష్మీరఘురామ్, అద్దేపల్లి వివేకానందదేవి, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మగార్లు వచన సాహిత్యవికాసానికి తమ రచనల ద్వారా ఎంతో సేవచేశారు. యువతరం రచయిత్రులలో కవిత్వంలో కృషిచేసిన వారెవ్వరూ లేకపోవడం గమనార్హం. కాంచనపల్లి కనకాంబ, ఇందుమతీదేవి, స్థానాపతి రుక్మిణమ్మ, చావలి బంగారమ్మ, సౌదామినివంటి సుప్రసిద్ధ కవయిత్రులు వెలిగించిన కవితా జ్యోతిని కొనసాగించడానికియువతులైన కవయిత్రులు ఎవ్వరూ కూడా వీరి స్థానాల నాక్రమించలేదు.

జీవిత చరిత్రలు


జీవిత చరిత్రలు, స్వీయచరిత్రలను గురించి ఒకటి రెండుమాటలు చెప్పడం అవసరం. గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారు అనేకమంది రచయితల, రాజకీయ నాయకుల జీవిత చరిత్రలను చక్కగా వ్రాసి పుస్తకాలుగా ప్రకటించారు; ఆచంటజానకీరామ్ స్వీయచరిత్ర వ్యాసాలు కవితా ధోరణిలో సాగిపోతాయి. ఇవి సుబోధకమైన, సరళమైన శైలిలో వుంటాయి. ఆంధ్రకేసరి ప్రకాశం స్వీయచరిత్ర దానికదేసాటి. రామకృష్ణ పరమహంస, శారదాదేవి, వివేకానందుల జీవితాలపై స్వామి చిరంతనానంద వ్రాసిన గ్రంథాలు ఉత్తమ జీవిత చరిత్రలు.

ఈవిధంగా ఆధునిక తెలుగు సాహిత్యం మహా ప్రవాహంవలె జీవితపు శోభా వైవిధ్యాన్ని తనలో ప్రతిఫలింపజేసుకుంటూ నిరాటంకంగా ప్రవహిస్తున్నది. ఆధునిక జీవితానికి దర్పణప్రాయంగా రూపొందుతున్నది. అంతేకాక మన సంప్రదాయంలోని ఆరోగ్యకరమైన విశేషాలతో తెగని సంబంధాన్ని కూడా నెలకొల్పుకొంటున్నది. 'గతాన్ని తెలుసుకొని, వర్తమానాన్ని మథించి భవిష్యత్తుకు భయపడకుండా సాగిపోవాలని" డాక్టర్ రాధాకృష్ణన్ అన్నట్లుగా, తెలుగులో ఆధునిక సాహిత్యం తన వ్యక్తిత్వాన్ని, ప్రత్యేకతను పరిరక్షిస్తూ విశాలదృష్టితో శాశ్వత విలువలను సృష్టించుకుంటూ తన పరిధిని విస్తృతీకరించుకుంటున్నది. ఆధునిక రచయిత ఆశావాద దృక్పథంతో మానవ హృదయానికీ హృదయానికీ మధ్య అగోచరమైన స్నేహసేతువులనునిర్మిస్తూ తద్వారా పురా వైభవాన్ని పునరుద్ధరించడానికి, ఆత్మానందాన్ని అందించడానికి, మానవ వ్యక్తిత్వ పునర్నిర్మాణానికి అవసరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాడు. నేటి స్వప్నాలు రేపు ఫలించి జీవితాన్ని సంపూర్ణంగా శోభాయమానం చేస్తాయనడంలో అతనికి అకుంఠిత విశ్వాసం వుంది.

Edited & Published by the Director of Information and Public Relations, Andhra Pradesh, Hyderabad-1
Printed at YUVA PRESS, Public Garden Road, Hyderabad.

క్రిషి

భారత వ్యవసాయరంగంలో అమోఘమైన సేవ చేస్తున్న క్రిషి పంపుసెట్లు - తక్కావీ పథకాల క్రింద అనేక రాష్ట్రప్రభుత్వాలు అనుమతించాయి.



తయ్యారుచేశేవారు :- క్రిషి ఇంజన్స్ (ప్రై) లి. సనత్‌నగర్. హైదరాబాద్. ఏ.పి.

అన్ని జిల్లాలలోనూ మా డీలర్లు విక్రయానికి, సర్వీసులకు లభ్యమౌతారు.

ఇతర వివరాలకు సంప్రదించండి :

క్రిషి ఇంజన్స్ ప్రైవేటు లిమిటెడ్

నెం. 2. దుర్గాభవన్, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్ (ఆం.ప్ర.)